ఆంధ్ర ప్రదేశ్

నవంబర్ - డిశంబర్ 1973

50 పైసలు

ముఖ్యాంశాలు

షెడ్యూలు కులాల ప్రగతి

ఆంధ్రప్రదేశ్ ఐదవ ప్లాను రెండువేల కోట్లుండాలి

సాయుధ విప్లవం సత్వర ఫలితాల నిస్తుందా ?

వెంకట పార్వతీశ్వర కవుల సాహిత్యసేవ

ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2,75,109 చ. కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశ జనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తం మీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961 లో 24.03 శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1 కి 157 మంది. హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1 కి 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. ఆదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నిటికంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281 లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306 లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగులలోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బొరైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బొరైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్ ది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 18

నవంబరు-డిసెంబరు 1973
కార్తీక—మార్గశిర, 1895 శా. శ.

సంచిక : 1-2

ప్రధాన సంపాదకులు .
పెండ్యాల వామనరావు

సంపాదకులు :
ఈరంకి వెంకట సుబ్బారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

చివరి అట్ట : యాదగిరి గుట్ట మీద నృసింహాలయం

మూడవ అట్ట : తిరుపతి దేవాలయం

సాలు చందా: ఆరు రూపాయలు

వెల: 50 పైసలు

రిజిస్టరు నెం : 133

సంచికలో

పేజీ

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించ నక్కరలేదు

PRINTED BY THE DIRECTOR OF PRINTING GOVT OF ANDHRA PRADESH, AT THE GOVT, CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION PUBLIC RELATIONS & TOURISM ANDHRA PRADESH, HYDERABAD.
22–1

ఫలప్రదమౌతున్న ప్రణాళికా ఫలితాలు

ఆంధ్రప్రాంతం తీవ్రమైన ఆందోళనలో అట్టుడికిపోతున్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతిపాలన ప్రవేశ పెట్టబడింది. 1973 జనవరి 18 వ తేదీన రాష్ట్రపాలనా నిర్వహణ బాధ్యతలను చేపట్టిన వెనువెంటనే గవర్నరు శ్రీ ఖండూ భాయ్ దేశాయ్, ఆకాశవాణి ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ—రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పడివున్న క్లిష్ట పరిస్థితులు సడలిపోగలవనీ, స్వేచ్ఛగానూ, నిర్మాణాత్మకంగానూ అభిప్రాయాలను ప్రకటించడానికి అనువైన శాంతియుత, ప్రశాంత వాతావరణంలోనే రాష్ట్ర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యమనీ హృదయపూర్వకంగా విశ్వసించినందువనే తన సలహా మేరకు రాష్ట్రపతి యీ చర్య తీసుకున్నారని తెలియజేశారు. ఇప్పుడు ప్రశాంత వాతావరణం నెలకొనడమే కాక రాష్ట్రం మళ్ళీ ప్రగతి పథంలో అడుగుపెట్టి, ప్రజాస్వామిక ప్రభుత్వ పునరుద్ధరణ లక్ష్యం సిద్ధించే సమయం ఆసన్నమైనదని నిష్పాక్షికంగా పరిశీలించే వారెవరికైనా అర్థంకాక మానదు.

ఆంధ్రప్రదేశ్ చాలా పెద్ద రాష్ట్రం. దీనికొక విస్పష్టమైన చరిత్రవుంది. ఇక్కడ అపారమైన ఖనిజసంపదవుంది. దీనిని సక్రమంగానూ, సంపూర్ణంగానూ ఉపయోగించుకోవడమే గాని జరిగితే రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తగినంతగా యివి దోహదం చేస్తాయనే చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్‌కు నదులరాష్ట్రం అనిపేరు. దక్షిణాది ధాన్యాగారంగా యిది ప్రసిద్ధికెక్కింది మనరాష్ట్ర అవసరాలను తీర్చుకోవడమే గాక ఆకలిగొన్న యితర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు కూడా మనం మన వ్యవసాయోత్పత్తులను ఎక్కువ చేయాలి. మన రాష్ట్రం ఆదినుంచీ యిలానేచేస్తూవుంది కూడా. పారిశ్రామిక వాతావరణం క్రమక్రమంగా రాష్ట్రాన్ని అల్లుకుంటోంది. లోగడకన్నా యీనాడు చాలా పరిశ్రమలు యిక్కడ తలెత్తాయి. ఇలా తలెత్తిన పరిశ్రమల్లో మన ఆర్థిక వ్యవస్థకు ప్రాణభూతమైనవి కూడా వున్నాయి మనకువున్న పరిమితమైన నిధులతోనే సాంఘిక సేవా రంగంలోకూడా మనం పురోగమించాం. నాగార్జునసాగర్ వంటి భారీ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించ వలసివున్నందున యితర కార్యకలాపాలకు నిధులు పరిమితమై పోయాయి చతుర్థ పంచవర్ష ప్రణాళికలో పెట్టిన పెట్టుబడుల ఫలితాలు యిప్పుడిప్పుడే ప్రజలకు అందడం ప్రారంభించాయి. ఒకవైపున పెట్టుబడులు పెడుతూండగానే మరోవైపున దాని ఫలితాలు వస్తాయనుకోరాదు. ఏ పథకానికైనా అది ఫలప్రదం కావడానికి కొంత వ్యవధి కావాలి.

అయిదవ పంచవర్ష ప్రణాళిక ఆరంభించేందుకు సమాయత్తమౌతున్నాం మనం. ప్రణాళికా రచన మనం నమ్ముకొన్న ధర్మ సూత్రంగా పరిణమించిందీనాడు. మన ఆర్థిక ప్రగతికి ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి యీనాడు తప్పనిసరి. ప్రజాస్వామ్యం, ప్రణాళికా పథకం, మతాతీత విధానం—యివి మూడూ మూడు స్తంభాలు. వివిధ రంగాలలో అభివృద్ధిని త్వరత్వరగా సాధించేందుకు వీలుగా వీటి మీదే మన జాతీయ సౌధం నిర్మితమౌతోంది. ఆర్థికమైన యిబ్బందులను ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ మనం అమలు పరిచిన నాలుగు పంచవర్ష ప్రణాళికల్లోనూ మూడు యుద్ధాలు, తరచుగా సంభవించిన కరువుకాటకాలూ, వరదల ప్రభావం మన దేశాభివృద్ధి పైనా—ముఖ్యంగా వ్యవసాయ, పరిశ్రమల రంగాలపైనా తమ ప్రభావాన్ని ప్రసరింప చేసాయన్న సత్యాన్ని కాదనలేం. ఐదవ పంచవర్ష ప్రణాళిక మన దేశానికి చాలా క్లిష్టమైంది వనరులను సమీకరించుకొని, అనవసరపు దుబారా ఖర్చులను పరిమితం చేసుకొని అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నప్పుడే యీ ప్రణాళిక విజయవంతం కాగలదు. ఐదవ పంచవర్ష ప్రణాళిక చేపట్టేరీతిని గురించి తెలియపరచడానికీ, సాంఘికన్యాయం చేకూరుస్తూ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించడంపై మన విశ్వాసాన్ని పునరుద్ఘాటించడానికీ మిగతా దేశంతోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా "ప్రణాళికా వారోత్సవాల్ని" జరుపుతున్నది.

రాష్ట్ర గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు రాష్ట్ర రాజధానీ నగరంలో ప్రణాళికా వారోత్సవాలకు ప్రారంభోత్సవం చేస్తూ అన్నమాటల్లోనూ, యీ సందర్భంగా రేడియోలో చేసిన ప్రసంగంలోనూ చెప్పిన విషయాలు ఎంతైనా సమంజసమైనవి. జాతీయ ప్రణాళికల్లో అధిక ప్రాముఖ్యమివ్వబడిన ప్రాంతీయ అసమానతల తొలగింపు అనే విషయం మన రాష్ట్రానికి ప్రత్యేకంగా వర్తిస్తుందని ఆయన చెప్పినది అక్షరాలా నిజం.

గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, యిప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మాణంలోవున్న అన్ని భారీ నీటి పారుదలప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తిప్రాజెక్టులు ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పూర్తవుతాయని అన్నారు. కనీస అవసరాలకు సంబంధించిన కార్యక్రమానికి చెప్పుకోదగినంత మొత్తాన్ని కేటాయించడం ఐదవ ప్రణాళికలోని ప్రత్యేకత. ఆంధ్ర ప్రదేశ్ లోని కేంద్ర రంగం పరిశ్రమలను విస్తృత పరిచేందుకుకూడా ఐదవ ప్రణాళికలో ప్రత్యేకంగా కేటాయింపు చేయడం జరిగింది. దీనివల్ల అదనంగా 17,000 మందికి ఉపాధి సౌకర్యం లభిస్తుంది. వచ్చే ఏడాది పనిచేయడం ప్రారంభించనున్న రామగుండంలోని భారీ ఎరువుల కర్మాగారానికి తోడు, ఐదవ పంచవర్ష ప్రణాళికలో మరొక పెద్ద ఎరువుల కర్మాగారం కాకినాడలో నెలకొల్పబడుతుంది

—పి. ఎ. ఆర్

రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి

శ్రీ ఎన్. భగవాన్‌దాస్



భారతదేశంలో ఎక్కువ శాతం సేద్యపు నీటి సౌకర్యముగల రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇక్కడ 32 శాతం మేరకు యీ సౌకర్యాలున్నాయి. కృష్ణా, గోదావరి ఆనకట్టలు, కడప కాలువ మొదలైన ఒక శతాబ్దం నాటి పాతబడిపోయిన నీటి పారుదల ప్రాజెక్టులతోడు నాగార్జునసాగర్, పోచంపాడు వంటి ఆధునికమైన ప్రాజెక్టులుకూడా యిక్కడ వున్నాయి.

అయినా రాష్ట్రంలో అక్కడకూడ తరచు—అనావృష్టికి గురిఅయ్యే ప్రాంతాలు కొన్ని వున్నాయి. గత ఏడాది మన రాష్ట్రం అనుభవించిన కరువునుంచి యిప్పుడిప్పుడే కోలుకుంటున్న సంగతి మనందరికీ తెలిసిన విషయమే.

సంవత్సరం పొడుగునా విస్తారముగా అనేక రకాల పంటల్ని ఇక్కడ పండిస్తున్నారు. ఇందుకు ఒక కారణం—భారతదేశంలో విత్తనాలను ఉత్పత్తి చేసే ముఖ్యమైన కేంద్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. మరొక కారణం—నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులకు సంబంధించి యిక్కడి ఎరువుల వాడకం దేశంలోనే ప్రప్రథమస్థానం వహిస్తుంది. ఇక్కడ హెక్టేరుకు 128 కిలోగ్రాముల ఎరువుల్ని వాడుతున్నారు.

భారతదేశంవంటి దేశంలో వ్యవసాయభివృద్ధి అంటే కేవలం పంటల అభివృద్ధి అనుకోవడం సరిఅయిన ఆలోచన కాదు. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగడం, ఉత్పత్తిచేసే శక్తి పెరగడంతో పాటు యీ వ్యవసాయాభివృద్ధికి కారణమైన భాగస్వాము లందరివీ—ముఖ్యంగా చిన్న రైతులు, మధ్యతరహా రైతులు, వ్యవసాయ కూలీలందరివీ—ఆదాయాలు మెరుగుపడాలి. మొదటినించీకూడ యీ విషయమై తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే సస్య విప్లవంవల్ల గ్రామీణ ప్రజానీకంలోని వివిధ వర్గాలలో ఫలితాలు సమానంగా కాక హెచ్చుతగ్గులుగా పంపిణీ అయ్యే ప్రమాదంవుంది.

వ్యవసాయశాస్త్రవేత్తలు వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించడంలోగడించిన విజయాలవల్ల ప్రభుత్వం మీదా, వ్యవసాయాభివృద్ధి నిర్వహణ యంత్రాంగం మీదా మరిన్ని ఎక్కువ బాధ్యతలు పడ్డాయి. అంటే కేవలం ఋణాలు, ఎరువులు వంటిరైతుల అవసరాలను తీర్చినంత మాత్రంచేత యీ బాధ్యతలు తీరిపోవు. వ్యవసాయ శాస్త్రీయ విజ్ఞానంలో ఎప్పటికప్పుడు సాధించిన విజయాలకు అనుగుణంగా విస్తరణ సిబ్బంది ప్రతిభావ్యుత్పత్తులు. సహాయసహకారాలు సమఉజ్జీలో ముందుకు పురోగమిస్తుండాలి. మార్పు ఒక్కసారి వచ్చేదికాదు. నిదానంగా జరుగుతుంది. ఇందుకు ఎంతో సహనం కావాలి. ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో వస్తోన్న మార్పు—ఉదాహరణకు అధిక దిగుబడి వరి రకాల కార్యక్రమంలో యీ నాడు వస్తోన్న మార్పు—ముఖ్యంగా కొత్తదనం కోసం జరుగుతున్న మార్పే. ఈ కొత్తకోసం జరుగుతోన్న మార్పువల్ల ఉత్పత్తి మెరుగుపడి, వాటి ఫలితాలు సక్రమంగా పంపిణీ అయ్యేట్టు చూడాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం భుజస్కంధాల మీద యీ గురుతరమైన బాధ్యత వుంది.

నిజానికి మనముందు అనేక సమస్యలు వున్నాయి. ముఖ్యంగా చెప్పుకోవలసిన సమస్య—మొత్తంమీద ఎరువుల కొరత. వ్యవసాయదారులు మార్పును అభిలషిస్తోన్న తరుణంలో, అధిక

దిగుబడి రకాలను రైతులు చేపట్టిన సమయంలో తగినంతగా ఎరువులు లభ్యం కావడం లేదు. వ్యవసాయాభివృద్ధికి పరిస్థితులు అన్నీ ఒక్కసారిగా అనుకూలం కావడం -అనేది ఎప్పుడోగాని జరగదు. ఒకవేళ అలా జరిగినా దానివల్ల సాధ్యమైనంత ఎక్కువ ఫలితాలను లభింపజేసేందుకు ప్రభుత్వమూ వ్యవసాయాభివృద్ధి నిర్వహణ విభాగమూ తమ యంత్రాంగాన్ని మరింత చురుకుగా పని చేయించాలి. ఆ బాధ్యత వారిమీద వుంది. మేలు రకాల వంగడాలు నాటిన విస్తారమైన ప్రాంతంలో ఓ మాదిరిగా ఎరువులు వేయడంవల్ల మొత్తం మీద అధిక దిగుబడి లభిస్తుంది. నిజానికి యీనాడు రాష్ట్రంలో అధికదిగుబడి రకాల కార్యక్రమాన్ని చేపట్టామంటే అందులో అంతర్లీనంగా యీ ఎరువుల అభివృద్ధి ప్రయత్నంకూడా యిమిడివుంది. కాని ఆలోచనను, ఆచరణలో పెట్టాలంటే ఎదుర్కోవలసిన యిబ్బందులు, సమస్యలు అనేకం వున్నాయి.

ఆర్థికేతర విషయాలకు సంబంధించిన వనరులను కూడా సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకొనేందుకు వున్న అవకాశాలను వాడుకోవడం జరుగుతున్నది. వ్యవసాయ ప్రయోజనాలను సాధించేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయ పూర్వకంగా వుండే యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేయించడం జరుగుతున్నది. ఉదాహరణకు, వ్యవసాయ నిపుణుల సలహా ప్రకారం గత ఏడాది నల్లరేగడి భూముల్లో రబీ జొన్నను నాటమని రైతులకు చెప్పడం జరిగింది. ముందుగా నాట్లు వేయడంలో వ్యవసాయ సంబంధమైన ప్రయోజనాల మాట అటుంచి మరో ముఖ్యమైన కారణం కూడా వుంది. నిజానికి యీ కారణం చాలా చిన్నదే. కరువు ఏర్పడిన ఏడాది సాధారణంగా నల్లరేగడి భూముల్లో వర్షాలు కురిసినప్పుడు నాట్లు నాటకుండా వర్షకాలం వచ్చేవరకు ఆగుతుండడం కద్దు. నిజానికి వర్షాలు పడ్డప్పుడే రైతులు నాట్లు నాటడం మంచిది. అందుకనే రైతులకు గత ఏడాది వర్షాలు కొద్దిగా పడగానే నాట్లు నాటవలసినదిగా సలహాయివ్వడం జరిగింది. అందువల్ల మనకు ఖరీఫ్ పంట కాలంలో జొన్న పంటలో వచ్చిన నష్టం రబీ కాలంలో పంట ద్వారా భర్తీ అయ్యింది. కరువు ఒక విధంగా అభివృద్ధికి పరోక్షంగా దోహదకారి అనవచ్చునేమో. ఎందుకంటే అధిక దిగుబడి రకాలు వర్షాభావాన్ని తట్టుకోగలవని గుర్తించడమే కాక తక్కువ వ్యవధిలోనే దిగుబడి నిస్తాయనీ అందువల్ల వర్షాభావంవల్ల పెద్దగా నష్టపోయేది వుండదని రైతులు త్వరలోనే గుర్తిస్తారు.

వివిధ శాఖల మధ్య సమన్వయ సహకారానికి తార్కాణంగా ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయాన్ని యిక్కడ ప్రస్తావిస్తాను. సాగునీటి కాలువల్ని మూయించే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. కోస్తా జిల్లాల్లో మార్చి 15 నాటికల్లా కాలువల్ని మూయించడంవల్ల తొందరగా నాటిన రబీ ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చింది. గత ఏడాది ధాన్యం వేసిన మొత్తం పంట భూమిలో 85 శాతం అధిక దిగుబడి వరి వంగడాలను వేశారు. అలాగే మరో దఫా— ఖరీఫ్ పంటకు నవంబరు 15 న సాగు నీటి కాలువల్ని ప్రభుత్వం మూయించింది. ఇందువల్ల ఆ విధంగా నిలువ చేసిన నీటిని ఎక్కువ వ్యవధి తీసుకొనే తక్కువ దిగుబడి వంగడాలకు వుపయోగించే వీలు కల్పించింది.

వ్యవసాయ రంగంలో సాధిస్తోన్న శాస్త్రీయ విజయాలు అభివృద్ధి యంత్రాంగంలోనే మౌలికమైన మార్పుల్ని తీసుకొస్తున్నాయి. పరిస్థితులు యింకా పూర్తిగా స్పష్టమైన స్వరూపాన్ని సంతరించుకోలేదు. కొంత వరకు యిలాటి అవ్యవస్థ ఎప్పుడూ వుంటూనే వుంటుంది. అయితే విధానాలు రూపొందించే స్థాయిలోనూ వాటిని ఆచరణలో పెట్టే స్థాయిలోనూ అభివృద్ధిలోని సాధక బాధకాలను గుర్తించే స్థితి యిప్పటికే సిద్ధించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు

ఏటేటా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తెలుగు సాహిత్యంలో వివిధ శాఖలలో అత్యుత్తమ రచనలకు బహుమతులు ప్రకటిస్తుంది. ఆధునిక కవిత, సాహిత్య విమర్శ, నాటిక, నవల, కథలకు బహుమతులు యిస్తారు. ఇంకా ఉత్తమ రచయిత్రికి, సంస్కృత విద్వాంసునికి కూడా బహుమతులు లభిస్తాయి. 1973 వ సంవత్సరం బహుమతుల వివరాలు యివి:—

ఆధునిక కవిత :

శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి
(ఋతు పవనం)

కథల సంపుటి :

కీర్తిశేషులు శ్రీ బుచ్చిబాబు
(చైతన్య లహరి)

సాహిత్య విమర్శ :

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు
(వసు చరిత్ర : సాహితీ సౌరభాలు)

నాటిక :

డా॥ పి. వి. రాజమన్నార్
(సర్దార్ పాపడు)

నవల :

శ్రీ పాలగుమ్మి పద్మరాజు
(నల్లరేగడి)

ఉత్తమ రచయిత్రి :

శ్రీమతి కులవర్తి కమలాదేవి

సంస్కృత విద్వాంసులు :

శ్రీ పేరి వెంకటేశ్వర శాస్త్రి
(వ్యాకరణ శాస్త్రం)

షెడ్యూలు కులాల ప్రగతి

శ్రీ జె. వీరాస్వామి

బ్రిటిషు ప్రభుత్వ పరిపాలన కాలంలో గూడా, 'షెడ్యూలు కులాలు' అనే పదం వాడబడింది. షెడ్యూలు కులాల, ఆపద్బాంధవుడు బాబాసాహేబ్, అంబేద్కర్, షెడ్యూలు కులాలనే, మొదట్లో "అణగద్రొక్కబడిన వర్గాలు" అని వాడుతూ వచ్చారు. 1928వ సంవత్సరంలో, సైమను కమీషను, భారత దేశంలో పర్యటన చేసినప్పుడు, దానిలో ఒక సభ్యుడైన శ్రీ అటే "అణగద్రొక్కబడిన వర్గాలు" అనే పదానికి సరియైన నిర్వచనం ఏమిటని, డా॥ అంబేద్కరును ప్రశ్నించారు. దానికి డా॥ అంబేద్కరు సూటిగా సమాధానం చెబుతూ, హిందూ సమాజములో ఎవరిని ముట్టుకుంటే మైల పడి పోయామని సవర్ణ హిందువులు భావిస్తున్నారో, వారే అణగద్రొక్కబడిన వర్గాలవారు అని పేర్కొన్నారు. అప్పటినుండి అంటరాని కులాలుగా పరిగణింప బడుతూ వచ్చిన కులాలు, షెడ్యూలు కులాలయ్యాయి. ఆ కులాల వారిని అసహజమైన, అమానుషమైన పద్ధతులలో హింసించేవారు. హిందూ సమాజములో పుట్టిన కుష్టువ్యాధి, అంటరాని తనమని గ్రహించిన, మహాత్మా గాంధీ, అంటరాని వారి పరిస్థితి గమనించారు. స్వ మతస్థులు చూపే నిరాదరణ వల్ల, పెద్ద సంఖ్యలో, ముఖ్యంగా క్రైస్తవ మతంలోనికి తదితర మతాలలోనికి అంటరానివారు మారిపోవడం స్వయంగా చూశారు. పైగా అంటరాని వారు దేశం మొత్తం జనాభాలో ఐదవవంతు వున్నట్లు, అప్పటి అంచనాలు తెలియజేశాయి. అంత పెద్ద జనాభాను, శ్రమ జీవులను, ఇతర మతాలలోనికి వెళ్లి పోనివ్వడం మంచిది కాదని, వారి బాగోగులు చూడవలసిన నైతిక బాధ్యత, సవర్ణ హిందువులపై ఉన్నదని, అంటరాని తనాన్ని నిర్మూలించాలని మహాత్మా గాంధీగారు నొక్కి చెప్పారు. మాల, మాదిగ, మహర్, చమార్, మొదలైన పదాలు అంటరానితనానికి మారుపేరుగా నిలచిపోవడంచేత ఆ పదాలకు న్యూనత భావం అంటకట్టబడడంచేత, "హరిజనులు" అనే గౌరవ పదాన్ని, గాంధీజీ సృష్టించి, వారి యెడల కొంత గౌరవ భావాన్ని కలుగ చేసి, హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే, కాంగ్రెసు లక్ష్యం స్వరాజ్యసిద్ధి కాబట్టి, ఆ వ్యవస్థ పటిష్టం చేసుకోవడమే ముఖ్య ధ్యేయంగా, కాంగ్రెసు అధిష్టాన వర్గం, అప్పటో, భావించవలసి వచ్చింది అందుచేత, హరిజనోద్ధరణ నత్త నడకలా సాగుతూ పోయింది.

స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత భారత రాజ్యాంగము అమలులోనికి వచ్చినప్పటి నుండి, షెడ్యూలు కులాలు అనేవి, రాజ్యాంగములోని 341వ అనుచ్ఛేదము క్రింద, రాష్ట్రపతి ఆయా రాష్ట్రాలకు, జారీ చేసిన ప్రకటనలో ఉన్న కులాలు, వర్గాలు, జాతులు షెడ్యూలు కులాలు, ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్నాయి. చలవాది, మాదిగ, మాలలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోను ఉన్నారు. కొన్ని కులాలు, కొన్ని జిల్లాలకే పరిమితమై ఉన్నాయి. 1971 జనాభా లెక్కల ననుసరించి, ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల జనాభా 57, 74, 548. వీరిలో స్త్రీలు 28, 47, 132. అంటే మొత్తం ఆంధ్రప్రదేశ్ జనాభాలో 13.3 శాతమున్నారు.

భారత రాజ్యాంగ ఉపోద్ఘాతంలో, భారత ప్రజలందరికి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో న్యాయం, సమాన ప్రతిపత్తి అవకాశాలు కల్పించడం వారిలో సౌభ్రాతృత్వం నెలకొల్పడం, రాజ్యాంగ ధ్యేయంగా చెప్పబడింది. మన రాజ్యాంగంలోని 17వ అనుచ్ఛేదంలో అంటరాని తనాన్ని రద్దుపరచారు. అంతే కాకుండా అంటరాని తనాన్ని ప్రచారం చేసే వాళ్ల మీద ఆచరణలో పెట్టే వాళ్ల మీద తగిన చట్టబద్ధమైన చర్యలు తీసుకోడానికి 1955లో పార్లమెంటు ప్రత్యేక శాసనం రూపొందించింది. అంటరానితనం ఏ రూపంలో నైనా అనుసరించే వారిని శిక్షార్హులను చేసింది. 16వ అనుచ్ఛేదంలో, షెడ్యూలు కులాల వారికి ఉద్యోగాలలో, కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించడానికి అవకాశం ఇవ్వబడింది. దీనిననుసరించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, ప్రభుత్వ సర్వీసులలోనూ, ప్రజాహిత సంస్థలలోను 14 శాతం రిజర్వేషను చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. 15వ అనుచ్ఛేదంలో షెడ్యూలు కులాలు తదితర వెనుకబడిన తరగతుల ప్రగతికి ప్రత్యేక నిబంధనలు చేయడానికి అవకాశం ఇవ్వబడింది. 46వ అనుచ్ఛేదం, ఈ విధంగా నిర్దేశిస్తూ ఉంది. ప్రజలలోని బలహీన వర్గాలు, ముఖ్యంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల, విద్యా, ఆర్థిక అభ్యున్నతి కోసం, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సాంఘిక అన్యాయం నుండి, అన్ని రకాల దోపిడీలనుండి, వారిని కాపాడాలి" రాజ్యాంగ ప్రధాన నిర్మాత అయిన డా॥ అంబేద్కరు, రాజ్యాంగ సభకు ముసాయిదా రాజ్యాంగాన్ని సమర్పిస్తూ, ఇలా హెచ్చరించారు. "1930 జనవరి 26వ తేదిన మనకు, రాజకీయాలలో సమానత, సాంఘిక, ఆర్థిక జీవనంలో, అసమానత సిద్ధించబోతున్నది. సాధ్యమైనంత త్వరలో, మనం ఈ వైరుధ్యాన్ని, తొలగించుకోవలసి ఉంటుంది. లేనట్లయితే, ఈ అసమానతకు గురి అయిన వారు, ఈ సభ ద్వారా ఇంత కష్టపడి నిర్మించుకొన్న రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని, కూల్చి వేయగలరు."

గత పాతిక సంవత్సరాలలో, షెడ్యూలు కులాల ప్రగతికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసికొన్న ముఖ్య కార్యక్రమాలలో—

విద్యావ్యాప్తి కార్యక్రమం: షెడ్యూలు కులాల వెనుకబడిన తనాన్ని నిర్మూలించడంలో, విద్య ప్రముఖ పాత్ర వహిస్తుందనటం, అతిశయోక్తిగాదు. షెడ్యూలు కులాల విద్యార్థులు, తమ తల్లిదండ్రులకు ఎట్టి ఆర్థిక భారం లేకుండా, చదువు కొనసాగేందుకు వీలుగా, వారికి విద్యార్థి వేతనాలు, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం గూడా మంజూరు చేస్తున్నాయి. షెడ్యూలు కులాల వారికోసం, 467 రాష్ట్రప్రభుత్వ హాస్టళ్లు, నిర్వహించ బడుతున్నాయి. అందులో, 22,522 మంది విద్యార్థులున్నారు. ఇప్పటివరకు, షెడ్యూలు కులాల విద్యార్థులకొరకు, 784 సబ్సిడీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 30 వేలమంది ఉండడానికి అవకాశముంది. శాసనసభలోను, ఇతరత్రా వచ్చిన విమర్శల దృష్ట్యా, సబ్సిడీ హాస్టళ్ళకు గ్రాంటులిచ్చే పద్ధతి, ఈ విద్యా సంవత్సరమునుండి రద్దుచేసి, రాష్ట్రప్రభుత్వమే, హాస్టళ్లను స్థాపించుటకు ఆర్డర్లు జారీ అయ్యాయి. పాఠశాలల్లో ప్రత్యేక రుసుము చెల్లింపునుండి షెడ్యూలు కులాల విద్యార్థులకు మినహాయింపు ఇవ్వబడుతూ ఉంది. ప్రభుత్వ విశ్వ విద్యాలయ పరీక్షల విషయంలో, పరీక్షా రుసుము చెల్లింపునుండి గూడా షెడ్యూలు కులాల విద్యార్థులకు మినహాయింపు ఇవ్వబడుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో, 1 నుండి 10వ తరగతి వరకు చదివే షెడ్యూలు కులాల విద్యార్థులకు, జాతీయం చేసిన పాఠ్య గ్రంథాలను, ప్రభుత్వం సమకూరుస్తున్నది. సాంఘిక సంక్షేమ పాఠశాలలు, హరిజనవాడలలో నెలకొల్పబడి, 'కేర్' పరిపాలనా పథకం క్రింద, మధ్యాహ్న భోజనాలు సమకూర్చబడుతున్నాయి.

మన రాష్ట్రంలో, 27 శిక్షణ — ఉత్పత్తి కేంద్రాలు, షెడ్యూలు కులాల వారి ప్రగతి కొరకు నెలకొల్పారు. దుస్తుల తయారీ, వడ్రంగం, మేదరి పని, తోళ్లు పదును పెట్టే పని, చర్మ వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ మధ్యనే, తోళ్ల పరిశ్రమను అభివృద్ధి పరచి ఎంతోమంది బీద వారికి పనికల్పించడానికి, తోళ్ల పరిశ్రమ కార్పొరేషను స్థాపించడానికి నిశ్చయించారు.

ఇరుకైన ప్రదేశాలలో, పారిశుద్ధ్యము పూర్తిగా లోపించిన, పరిసరాలలో జీవిస్తున్న, భూమిలేని పేద హరిజనులకు, నివాసం కల్పించడం కోసం. వారికి ఇండ్ల స్థలాలను సమకూర్చే పథకం అమలులో ఉంది. సేకరించిన ఇండ్ల స్థలాలలో, 12 శాతం మేరకు, 1500 రూపాయలలోపు సాలీనా ఆదాయం గల ఇతర కులాల వారికి, ఇవ్వడం ఒక ప్రత్యేకత. అందు మూలంగా, అన్ని కులాలవారు ఒకేచోట కలిసిమెలిసి నివసించడానికి వీలు కలుగుతూ ఉంది. ఈ 12 శాతాన్ని ఈ మధ్య 25 శాతంకు పెంచడం గూడా జరిగింది.

మంచినీటి బావులు త్రవ్వడం, పాతబావుల మరమ్మతు, గ్రామాల్లో, మురికి పేటల్లో, పారిశుధ్య సౌకర్యాల పథకాలు అమలు జరుగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతములలోని, చాలామంది షెడ్యూలు కులాలవారు బ్రతుకు తెరువుకు, వ్యవసాయము మీద ఆధారపడి ఉన్నందున, అట్టి వారికి సహాయపడే నిమిత్తం, నాగలి, ఎద్దులు, వ్యవసాయ పరికరాలు కొనుగోలుకు, 500 రూపాయలు సబ్సిడీగాను, మరొక 500 రూపాయలు వడ్డీలేని ఋణంగాను ఇవ్వడానికి పథకాలు తయారు జేశారు. చిన్న చిన్న పరిశ్రమలు చేయటానికి వీలుగా, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల వరకు వడ్డీలేని ఋణాలు ఇచ్చే పథకం గూడా అమలులో ఉంది.

మన రాజ్యాంగములోని 335వ అనుచ్ఛేదములో, ప్రభుత్వ శాఖలను సమర్థవంతంగా నడపడానికి అడ్డు రాకుండా, షెడ్యూలు కులాల వారికి సర్వీసులలో రక్షణలు కల్పించవలసి ఉంటుందని చెప్పబడింది. కాబట్టి ప్రభుత్వ శాఖలలో సమర్థవంతముగా పని జరుగదనే మిషపైన, షెడ్యూలు కులాలకు చెందవలసిన సహాయం, ఒక్కొక్కప్పుడు అందకుండా పోతూ ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం, షెడ్యూలు కులాలవారు కూడా, చాలా అప్రమత్తతలో ఉండాలి. కొన్ని యుగాలుగా, సాంఘిక రంగములోను విద్యా విషయకంగాను, ఆర్థిక రంగములోను, హీనస్థితి అనుభవించుచున్న కారణాన ఉచ్చస్థితిలో వారితో, పరీక్షలలో సమాన స్థాయికి రాలేని కారణాన, షెడ్యూలు కులాలవారు లిఖిత పరీక్షలో కనీసం మార్కులు తెచ్చుకోలేదని, వారికి రావలసిన నిష్పత్తిలో ఉద్యోగాలు రాకుండా చేస్తే, రాజ్యాంగ రక్షణలను వమ్ము చేయడమే ఔతుంది. విశ్వవిద్యాలయాలు ప్రదానం చేసిన అర్హతలు కలిగియున్నప్పుడు, అవసరమయిన ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించగలిగేటట్లు చేసి ఇవ్వవలసిన నిష్పత్తిలో షెడ్యూలు కులాల వారికి ఉద్యోగాలు ఇచ్చే ఏర్పాటు చేయాలి. ప్రత్యేక శిక్షణ సంస్థలు షెడ్యూలు కులాలవారికి ఏర్పరచినందు వల్లనే, ఈనాడు మనం ఐ. ఏ. యస్., ఐ. పి. యస్. మొదలైన అఖిలభారత సర్వీసులలోనూ, దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలోను కొందరు షెడ్యూలు కులాలవారిని చూడగలుగుతున్నాము. అలాగే డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్న కొద్దిమంది షెడ్యూలు కులాలవారు రక్షణలక్రింద వచ్చినవారే. పోష్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో గూడా వారికి రిజర్వేషను చేయవలసిన అవసరముంది. అప్పుడుగాని, వారు ఉన్నతోద్యోగాలు నిర్వహించుటకు వీలుండదు. సుప్రీము కోర్టువారు, ఉద్యోగస్థుల ప్రమోషన్ల విషయంలోగూడా, దళితజాతులకు రిజర్వేషను చేసికోవచ్చునని తీర్పు చెప్పారు. అటువంటి కేటాయింపు, ఇప్పుడు షెడ్యూలు కులాలవారికి కొన్ని కేంద్ర సర్వీసులలోనే ఉన్నది. కొన్ని రాష్ట్ర సర్వీసు ప్రమోషన్లలో, షెడ్యూలు కులాల రిజర్వేషను అమలుజరిపే, పద్ధతి సాంఘిక న్యాయదృష్ట్యా అవసరమేమో ప్రభుత్వం శ్రద్ధతో ఆలోచించాల్సి ఉంటుంది. ఇప్పుడు initial recruitment కు పరిమితమైన రిజర్వేషన్లుకూడా, సరిగ్గా అమలు జరుగుటలేదని, కొన్ని ఆఫీసులలో షెడ్యూలు కులాలలో వారికి రావలసిన నిష్పత్తిలో, ఉద్యోగస్థులు లేరని, ఒక అభిప్రాయముంది. టెంపరరీ ఉద్యోగాల విషయంలో గూడా ఈ షెడ్యూలు కులాల రిజర్వేషన్లు సరిగ్గా అమలు జరుగుట లేదనిగూడా అభిప్రాయముంది. అనేకమైన ప్రభుత్వ పథకాలు

మంచి ఉద్దేశ్యంతో మొదలు పెట్టినప్పటికీ, దానిని అమలుపరిచే వ్యక్తులు హృదయపూర్వకంగా కృషిచేయనియెడల ప్రభుత్వపథకాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వజాలవు.

332 అనుచ్ఛేదంలో షెడ్యూలు కులాల జనాభా ప్రాతిపదికపై, శాసన సభలలోను పార్లమెంటులోనూ, స్థానాలు కేటాయించబడుతూ ఉన్నాయి. ఇలా ఎన్నికైన ప్రతినిధులు, షెడ్యూలు కులాలవారి సాధక బాధకాలు గమనించుతూ ప్రభుత్వ దృష్టికి లోటుపాట్లు తీసికొని పోయినట్లయితే, షెడ్యూలు కులాల ప్రగతి ఇప్పటికంటె త్వరితగతిని సాధించడానికి వీలౌతుంది.

షెడ్యూలు కులాల వారికి ఇండ్లుకట్టే కార్యక్రమం ముమ్మరంగానే చేపట్టబడింది. అయితే ప్రత్యేకంగా హరిజన కాలనీలుగా నిర్మించడంవల్ల వారి అంటరానితనం, అజ్ఞానం పెరుగుతుందే కాని తరుగదు. మొదటనుండి అగ్రహారాలు, కులాలవారీగా గూడెములు, పేటలు ఉండటంవల్లనే, కులతత్వం, అంటరానితనం మనదేశంలో రూపు మాయడంలేదు. సమాజంలో ఇండ్లు కావలసిన బీదవారు చాలమంది ఉంటారు. వారందరకు వారు ఏ కులంవారైనా ఒకేచోట కాలనీలు నిర్మిస్తే ఒకరి సాధక బాధకాలు ఇంకొకరికి అర్థం ఔతాయి. ఒకరితో ఒకరు కలసి మెలసి ఉండడానికి సహజీవనాన్ని, మానవతను, పెంపొందించుకోడానికి ఉపయోగపడుతుంది.

దేవాలయ ప్రవేశానికి ఇప్పుడు అంటరానితనం అడ్డు రావడం లేదు. ఇది తప్పకుండా గమనించతగ్గ ప్రగతి. కాని వేదాధ్యయనం, మంత్రశాస్త్రం నేర్చుకోవడానికి అడ్డంకులు పూర్తిగా పోలేదు. షెడ్యూలు కులాలలో వారు, ముందుకు వచ్చినట్లయితే, వారికి వేదాధ్యయనం నేర్పి, గుళ్ళలో పూజారులుగా నియమించడం మంచిది. కేరళ రాష్ట్రం ఈ విషయంలో ముందంజ వేసింది. ఇటువంటి విప్లవాత్మకమైన చర్య, కులతత్వ హిందూ సమాజానికి చాల అవసరం.

ప్రభుత్వ పథకాల ద్వారా గత పాతిక సంవత్సరాల నుండి షెడ్యూలు కులాలవారు కొంత ప్రగతి సాధించిన మాట వాస్తవమే. కాని ఇంకా ఎంతో ప్రగతి ఆ కులాలవారు సాధించాల్సి ఉంది. హరిజనులపై అత్యాచారాలు, దౌర్జన్యాలు ఇప్పుడు గూడా ఎదురు మదురుగా జరుగుచున్నట్లు వార్తలు వస్తూనే ఉన్నాయి. హరిజనులపై హింసా చర్యను గర్హిస్తూ, దేశం నలుమూలలనుండి అభిప్రాయాలు వెలుబుచ్చుతూనే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోను, పట్టణ ప్రాంతాల్లోను కొంతమేరకు, అస్పృశ్యత ఇప్పటికీ ఆచరింప బడుతున్నదని, ఇటీవలి సర్వే మూలంగా స్పష్టమయింది, అనిగడచిన సంవత్సరపు Budget Speechలో సాంఘిక సంక్షేమ మంత్రి చెప్పారు. ప్రభుత్వము చేపట్టిన అన్ని సంస్థలలోను అంటే ఆహారమునకు సంబంధించిన సంస్థలు, తదితర పరిశ్రమలన్నింటిలోను, షెడ్యూలు కులాల ఆర్థిక అభ్యున్నతికొరకు వారికి తగిన అవకాశములు సదుపాయములు కల్పించవలసిఉంది. షెడ్యూలు కులాలవారందరు మాల, మాదిగ వంటి కుల వివక్షత పాటించకుండా, తమలోతాము కులాంతర వివాహాలు విరివిగా కొనసాగిస్తే సమైక్యత సాధించగలుగుతారు. కేవలం ఉద్యోగ అవకాశాలవల్ల ప్రత్యేక సదుపాయాలవల్ల షెడ్యూలు కులాలవారు తక్కినవారితో సరిసమాన ప్రగతి సాధించలేరు. షెడ్యూలు కులాలవారు ఎక్కువగా స్వయంకృషితో ప్రభుత్వము చేయు సదుపాయములను సద్వినియోగము చేసికొని విజ్ఞానాన్ని పెంపొందించుకొని పురోగతి సాధించుకోవాలనేది ధ్యేయంగా పెట్టుకోవాలి. 'ప్రారబ్ధ కర్మ' 'నుదిటి వ్రాత' అని హేతుబద్ధంకాని సిద్ధాంతాలకు స్వస్తిచెప్పి, ఎవరి భవిష్యత్తు వారు చేయు కార్యకలాపాలమీదనే ఆధారపడి ఉంటుందని నమ్మి కార్యదీక్షతో ముందుకు పోవాలి. వర్ణాంతర వివాహాలకు, కులాంతర వివాహాలకు, తగిన ప్రోత్సాహము సహాయము ప్రభుత్వము ఇవ్వాలి. అలాంటి చేయూత ప్రభుత్వము ఇచ్చిన పక్షములో అన్ని రంగాలలో అభివృద్ధి నిరోధకంగా పరిణమించిన కులతత్వం అనతి కాలంలో నిర్మూలింపబడుతుంది. అభివృద్ధి సాధించిన వ్యక్తులందరు ఏ కులమునకుగాని ఏ మతమునకుగాని ఏ ప్రాంతమునకుగాని సంబంధించినవారైనా హీనస్థితిలో ఉన్న తమ తోడి సోదరులందరకు సహాయము చేయాలనే ధర్మము మరువకూడదు.

ఆంధ్రప్రదేశ్ ఐదవ ప్లాను రెండు వేల కోట్లుండాలి

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

అయిదవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభం అయింది. భారత దేశంలో అంతర్భాగంగా ఆంధ్రప్రదేశ్ కూడా తమ రాష్ట్రాభివృద్ధికి తగిన ప్రణాళిక వేసుకొని దానిని భారత ప్రణాళికలో అంతర్భాగంగా సంలీనం చేసుకోవాలి కదా! దానిని కేంద్ర ప్రభుత్వం అంతకు ముందు ప్లానింగు కమీషను, అటుపై జాతీయాభివృద్ధి మండలీ అంగీకరించాలి.

భారత ప్రణాళిక నాల్గవప్రణాళికకు రెట్టింపుగా వేస్తున్నామని ప్రణాళికా మంత్రి తన వైఖరిలో చెప్పారు. దానికి సంబంధించిన ముసాయిదాలు కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలు పలుమారులు సంప్రదించినవి. అక్టోబరు ఆఖరుకు పంచవర్ష ప్రణాళిక ముసాయిదా బయటకు రావచ్చునని ఆరవ ఫైనాన్సు కమీషను నివేదిక అప్పటికే బయటపడుతుందనడం వల్ల కాస్త ఆలస్యం అవుతుందేమోనని ఏమైనా నవంబరు నాటికి తప్పక వస్తుందని అంటున్నారు.

అదేమి వైచిత్రమో ఆంధ్రప్రదేశ్ ప్రణాళికల నిర్మాణ సమయంలో ఒక పద్ధతిగా సర్వసమగ్రంగా ప్రభుత్వాధినేతలు. ప్రజాప్రతినిధులు కలసి తయారు చేయడం సర్వసాధారణంగా జరగడం అరుదయింది; మొదటి ప్రణాళిక నాటికి ఆంధ్ర జిల్లాలు మద్రాసు రాజధానిలో తెలంగాణా జిల్లాలు హైదరాబాదు సంయుక్త రాష్ట్రాలలో ఉండి సమగ్ర ఆంధ్ర దేశాభ్యుదయానికి సంబంధించి తయారు చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాలలో భాగంగా రచన నిర్వహణ జరిగిపోయింది. అసలు మొదటి ప్రణాళిక రూపం వచ్చేటప్పటికే దాదాపు రెండు సంవత్సరాలు గడచిపోయినవి. అయితే అటు మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రజలు, ఇటు హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు ప్రజలు, మంత్రులు కలసి కాకపోయినా విడిగానైనా కృషిచేసి నాగార్జున సాగర్ ప్రాజెక్టును మొదటి ప్రణాళికలో చేర్చుకోవడంలో విజయం సాధించారు.

తర్వాత రెండవ ప్రణాళిక ఆంధ్రరాష్ట్రంలో ఒక భాగంగా హైదరాబాదు రాష్ట్రంలో తెలంగాణా కలిసియున్న భాగంగా తయారు చేసుకోవడం జరిగిన అనంతరం సరిగా రెండవ ప్రణాళిక తుది ఘట్టాలు తీర్చిదిద్దే సమయంలో విశాలాంధ్ర యేర్పడింది. రెండు భాగాలను సరిచేసి ఒక ప్రణాళికగా అతికించి రచనపూర్తి చేశారు. రెండవ ప్రణాళిక ఆంధ్రకు సంబంధించినంత వరకు గ్రామాల నుండి జిల్లాల, పణాళికలు తయారు చేసి రాష్ట్ర ప్రణాళికలో కలుపుటకు తగిన వివరాలు సేకరించారు. మళ్ళీ ఆ ప్రయత్నంగాని, ఆ పద్ధతిగాని ఇంత వరకు జరుగలేదు. ఇప్పుడు ప్రాంతీయ ప్రణాళికలంటూ ఆలోచనలు–అప్పటి ఆలోచనయు జ్ఞప్తికి మళ్ళా వచ్చినవా అనిపిస్తుంది.

నాల్గవ ప్రణాళిక తయారు చేస్తుండగనే పాకిస్తాన్ యుద్ధం వచ్చింది. అంతటితో ప్రణాళికలు కాస్త నీరసస్థితిలో పడినవి. యుద్ధంలో వెనుకబడిపోయి వార్షిక ప్రణాళిక క్రింద తయారు చేసి అదే పద్ధతిలో మూడు వార్షిక ప్రణాళికలు తయారై – అమలు జరిగినవి. అంటే అవి ప్రణాళికలు అంటానికి వీలులేదు. ఇక నాల్గవ ప్రణాళిక ఈ వార్షిక ప్రణాళికల రూపంలో వచ్చి పంచవర్ష ప్రణాళికల రూపం దాల్చింది. అయితే 1967 రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితులు రావడంతో ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమై పోయింది. అయితే తెలంగాణా ఆంధ్ర సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం యిచ్చిన 45 కోట్ల రూపాయలు తెలంగాణాలో అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా సాగి నాల్గవప్రణాళిక అయిదవ సంవత్సరంతో పూర్తిగానున్నది, నాల్గవ ప్రణాళిక రాజకీయ, ఆర్థిక అస్తవిస్తులలో రచనలోనూ, అమలులోనూ అసంతృప్తికరంగాపూర్తి ఆలోచనకుగాని సమాలోచనకుగాని అవకాశం లేకుండాపోయినవి. చివరకు ఇప్పుడు అయిదవ ప్రణాళిక రచన సమయంలోనూ దాదాపుగా అంతే పరిస్థితులు ఏర్పడినవి. 1972 ఏప్రిల్ నెలలో శ్రీ సి. సుబ్రహ్మణ్యం తన ప్రణాళిక వైఖరి ప్రకటించారు. ఆ తర్వాత ప్రణాళికా మంత్రిగా వచ్చిన శ్రీ డి. పి. ధార్ అక్టోబరులో తన 'వైఖరి' ప్రకటించారు. అక్టోబరులో అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అసాధారణ పరిస్థితులు అటు రాజకీయంగానూ, ఆర్థికంగానూ అనిశ్చిత పరిస్థితులు వచ్చాయి. మంత్రివర్గాలున్నా ఆలోచన చేసే పద్ధతిలోనే లేరు. ఆరవ ఫైనాన్సు కమీషనులో రాష్ట్రపరిస్థితుల వివరణ తమ వనరులకు కావలసిన ఆర్థిక ఆధారాలు – ప్రజాప్రతినిధుల పక్షంగా అడిగి తెలియజేసుకుండే యోగ్యత లేకుండాపోయింది.

అయిదవ ప్రణాళిక రచన ప్రారంభం అయింది. చర్చలు జరుగుతున్నవి. వివిధ రాష్ట్రాలను వారి వారి అవసరాలు, అవకాశాలు, వనరులు తెలియచేయ వలసిందిగా కోరారు. ఇంత వరకు భారత దేశంలో రచించిన నాల్గు ప్రణాళికలు, మధ్యలో వచ్చిన మూడు వార్షిక ప్రణాళికలలో ఈ క్రింది విధంగా వ్యయంచేశారు.

గత ప్రణాళికలు

(కోట్ల రూపాయలు)	
మొదటి ప్లాను	1,960
రెండవ ప్లాను	4,672
మూడవ ప్లాను	8,577
3 వార్షిక ప్లానులు	6,676
నాల్గవ ప్లాను	14,398

ఇది అఖిల భారత ప్రణాళికా పరిమాణం. ఇప్పుడు అయిదవ ప్రణాళికలో వ్యయం, నాల్గవ ప్రణాళికకు రెట్టింపుగా సర్వసాధారణంగా వుంటుందని అది దాదాపు 51,170 కోట్లు ఉంటుందని అందు ప్రభుత్వ రంగంలో 35,595 కోట్లు ప్రైవేటు రంగంలో 15,575 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. భారత ప్రణాళిక గత ప్రణాళికలు ఐదవ ప్రణాళిక సూక్ష్మ రూపం చూశాం. ఆంధ్ర ప్రదేశ్‌కు గత ప్రణాళికలు సూక్ష్మ రూపంలో ఈ విధంగా ఉన్నవి.

ఆంధ్రప్రదేశ్ ప్రణాళికలు

(కోట్ల రూపాయలలో)	
మొదటి ప్రణాళిక	99.78
రెండవ ప్రణాళిక	188.60
మూడవ ప్రణాళిక	352.42
3వ వార్షిక ప్రణాళిక	231.06
నాల్గవ ప్రణాళిక	427.48
మొత్తం	1,299.34

ఇది సూక్ష్మ రూపంలో అయితే స్థూలంగాఉన్న వివరాలు గమనించినందువల్ల మనరాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో యేయే విభాగాలలో యేయే రంగాలలో ఎంతెంత, ఏయే ప్లానులో వినియోగించారో-మన ప్రాధాన్యతలు, అవసరాలు ఏ విధంగా అంచనా వేశారో దాన్నిబట్టి ఆంధ్ర ప్రదేశ్ ఆర్థికాభ్యుదయం ఏవిధంగా నడిచిందో బోధ పడ గలదు. ఆ వివరాలివి. (వాటితో శాతాలు బ్రాకెట్లులో యివ్వడమైంది.)

ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికలో వ్యయం

(కోట్ల రూపాయలలో)

రంగాలు	1వ ప్లాను	2వ ప్లాను	3వ ప్లాను	3వార్షిక ప్లానులు	4వ ప్లాను	ఇంత వరకు మొత్తము
1. వ్యవసాయం	10.76	18.40	51.48	34.76	47.46	162.86
	(11.1)	(9.8)	(14.6)	(14.8)	(11.1)	(12.5)
2. సహకారం	1.53	18.97	27.41	6.07	18.00	71.98
	(1.6)	(10.1)	(7.8)	(2.6)	(4.2)	(5.5)
3. నీటిపారుదల	21.86	57.43	93.02	59.36	98.18	329.85
	(22.6)	(30.4)	(26.4)	(25.4)	(23.0)	(25.4)
4. విద్యుచ్ఛక్తి	37.84	38.53	93.62	97.96	176.28	444.23
	(39.1)	(20.4)	(26.6)	(41.8)	(41.4)	(34.2)
5. పరిశ్రమలు గనులు	1.15	10.15	15.19	7.11	14.77	48.37
	(1.2)	(5.4)	(4.3)	(3.0)	(3.5)	(3.7)
6. రవాణా, రహదార్లు	3.43	9.52	17.00	7.21	15.50	52.66
	(3.5)	(5.0)	(4.8)	(3.1)	(3.6)	(4.1)
7. సాంఘిక సేవలు	18.40	33.51	58.22	21.45	56.91	183.49
	(19.0)	(17.8)	(15.1)	(9.2)	(13.3)	(14.1)
8. అపిఇవి	1.81	2.09	1.48	0.14	0.38	5.90
	(1.9)	(1.1)	(0.4)	(0.1)	(0.1)	(0.5)
మొత్తం	96.78	188.60	352.42	234.06	427.48	1299.34

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయంపై దాదాపు 9 నుండి 14 శాతం వరకు వ్యయం చేయడం జరిగింది. మూడవ ప్రణాళికలో తర్వాత మూడు వార్షిక ప్రణాళికలలో 14 శాతం వరకు వ్యయం చేయడం జరిగింది. అప్పటికి కాస్త వ్యవసాయ రంగం మొదటి రెండు ప్లానులలో ప్రారంభం అయింది, పుంజుకుంది. నాల్గవ ప్రణాళికలో వెనుకంజ వేసింది. పెట్టుబడులలోను వెనుకంజ వేసింది. కాలమాన పరిస్థితులవల్లనూ వ్యవసాయరంగం వెనుకంజ వేసింది. ఆహార ధాన్యాల కటకట మనం ఈ నాడు అనుభవించ డానికి ఇది కూడా కొంత సహాయ పడింది. బాగా పండిన రైతాంగం తమ పంటను దాచడం-పెద్ద వ్యాపారులు బ్లాకులో నిల్వ చేయడం ప్రభుత్వం జాగ్రత్తపడడం అనేది ఎరుగకుండా అట్లా కండ్లప్పజేసి చూస్తుండడం ఇందుకు కారణాలు కావలనేమో కదా !

నీటిపారుదలకు ప్రాధాన్యత యివ్వడం సహజం. నాగార్జున సాగర్, పోచంపాడు ప్రాజెక్టులు అవసరాన్ని అంతా గుర్తించే ఉన్నాం కదా! అయితే 2వ ప్లానులో జరిగినంత చురుకుగా తర్వాత జరగలేదని ఋజువు అవుతున్నది. అయినా తర్వాత దినబత్తెం ఖర్చుచేసినట్లు వ్యయం చేయడం వల్ల ఈ నాగార్జునసాగర్ ఇంకా ఐదవ ప్లాను మాత్రమేకాక ఆరవ ప్లానుకు కూడా పోతుందేమో ననిపిస్తుంది. దాని క్రింద చేసిన వ్యయంలో అసలు పనులకన్నా పనులు మందగించినా తప్పని సిబ్బంది ఖర్చుశాతము ఎక్కువగా కనిపిస్తుంది. ఇది అసహజం కదా! ఇప్పుడు పోచంపాడు కొంతలో కొంత పని జరిగినా ఇదే పద్ధతిలో వస్తున్నదేమో ననిపిస్తున్నది. ప్రపంచ బ్యాంకు ధనం యిస్తున్నా మధ్య తరగతి, చిన్న తరగతి ప్రాజెక్టులు సాగుతున్నవి. వంశధార, గోదావరి బరాజు నత్తనడకలు నడుస్తున్నవి. సోమశిల, పోలవరం బరాజు, మన్నేరు ప్రాజెక్టులు తీసుకోవలసి ఉంది. అనుకున్న ప్రకారం అనుకున్న వ్యవధిలో అనుకున్న వ్యయింకన్నా కాస్త తక్కువలో జరిగింది. ప్రకాశం బరాజు మాత్రమే. ఆహారం సమస్య పరిష్కారానికి ఈ ప్రాజెక్టులు తప్పవు. అందువల్ల దీనిక్రింద ఖర్చు రెండవ ప్రణాళిక మినహా మిగతా అంతా సమంగానే నడుస్తున్నది.

ఇక విద్యుచ్ఛక్తి విషయంలో ఆంధ్రప్రదేశ్ చాల వెనుకపడి ఉంది. అందుకే ఎపుడూ కోతలు, అసలు ఆపుదలలూ సాగవలసి వచ్చింది. కొత్తగూడెం పనికాస్త ఉత్సాహంగా జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు న్యాయంగా విద్యుచ్ఛక్తి-నీటి పారుదల రెండింటికి కలిసి ఉండాలిసింది. అది కాదని ప్లానింగు కమీషను విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుగా మాత్రమే ఉంచారు. దీనికి దినవెచ్చంయిచ్చినట్లు యిస్తున్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడక పూర్వం తలకు 6 కిలోవాట్లకన్నా సగటున విద్యుచ్ఛక్తి లేదు, ఇప్పుడు 50లో ఉన్నా భారత దేశానికి ఉన్న 80లో 30 తక్కువే గదా. మరి మహారాష్ట్ర 153, పంజాబు 140, గుజరాత్ 124, తమిళనాడు 120, హరియానా 80, పశ్చిమ బెంగాలు 106గా ఉన్నవి. ఇది లేనందున పారిశ్రామికాభి వృద్ధికి ముందంజ వేయలేకుండా ఉంది. తమిళనాడులో విద్యుచ్ఛక్తితో ఆహార సంవృద్ధి పంపుసెట్టుద్వారా సాగిస్తే మనం ధరలు పెంచికూడా పంటలు ఎండబెట్టుకోవలసి వస్తున్నది. దీనికి ఎంత వ్యయం చేసినా తక్కువే.

ఇక పరిశ్రమలు తలచుకొంటే గుండె ఝుల్లుమంటుంది. రెండవ ప్లానులో, మూడవ ప్లానులో 5.4 శాతం ఖర్చు చేసినట్లు అగుపడుతుంది. దీనిని అంచనా వేస్తే అసలు పాలిటెక్నిక్‌లకు ఇతర విద్యాసంస్థల వ్యయమే అది. అసలు పరిశ్రమలకు వ్యయం చేసింది చాల తక్కువే. ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లుకు చేసిన వ్యయం వ్యక్తులకు వప్పచెప్పి లాభం అంతా నిర్వహణ అంతా వారికి వప్పచెప్పాం. నాలుగు ప్రణాళికలలో మనం పరిశ్రమల క్రింద వ్యయం చేసింది 34 కోట్లు. అంటే 3.7 శాతం. సముద్రంలో నీటిబొట్టు మరి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగవకాశాలు లభించలేదంటే ఎట్లా లభిస్తవి. అందువల్లనే విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పోరాటం సాగింది. భారతప్రభుత్వం ప్రభుత్వపరంగా పరిశ్రమలపై 1951 నుండి 1969 వరకు 2879 కోట్ల వ్యయం చేస్తే ఆంధ్ర ప్రదేశ్‌లో 106 కోట్లు విలువగలవి మాత్రమే పెట్టారు. బీహారులో 514, పశ్చిమ బెంగాలులో 466, మధ్య ప్రదేశ్‌లో 498, ఒరిస్సాలో 423 కోట్ల రూపాయల విలువగల ప్రాజెక్టుయి నిర్మించారు. నాల్గవ ప్రణాళికలో ఆంధ్ర ప్రదేశ్‌లో 47 కోట్లు వ్యయం చేస్తే బీహారులో 797, మహారాష్ట్రలో 100, మధ్య ప్రదేశ్‌లో 160, రాజస్థాన్‌లో 93, పశ్చిమ బెంగాలులో 110, ఉత్తరప్రదేశ్‌లో 178, తమిళనాడులో 93 కోట్ల పరిశ్రమలు స్థాపించారు. అంటే నాల్గవ ప్రణాళికాంతానికి ఆంధ్ర ప్రదేశ్‌లో 154 కోట్ల పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బీహారులో 1312 కోట్లు, పశ్చిమ బెంగాలులో 576 కోట్లు, ఉత్తరప్రదేశ్ 225 కోట్లు తమిళనాడు 341 కోట్లు, రాజస్థాన్ 133 కోట్లు, ఒరిస్సా 438 కోట్లు, మధ్యప్రదేశ్ 649 కోట్లు కేంద్రప్రభుత్వ పరిశ్రమలు స్థాపించారు. విద్యుచ్ఛక్తిలో మద్రాసుకు దక్షిణ రాష్ట్రాలన్నింటికి ఉద్దేశించామని నైవెలీ ప్రాజెక్టు, అణు విద్యుత్ప్రాజక్టులు ఆ రాష్ట్రాలకే విద్యుచ్ఛక్తి సరిపోతున్నది. పరిశ్రమలు అభివృద్ధి కాగలుగుచున్నవి. గుజరాత్‌లో అణుశక్తి ఉత్పాదన ప్రాజెక్టు యిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో సోమశిల ఇస్తామన్నారు. ఏమయిందో తెలియదు. పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఆశ చూపించారు. నడక మాత్రం నత్తనడకను మించిపోయింది. ఆరవ ప్లాను చివర భాగంలో-అదే అసలు ప్రారంభించి పనిచేస్తే-ఉద్యోగావకాశాలు కలిపిస్తుంది. అయిదవ ప్లానులో లేదు. అసలు వస్తుందో లేదోననే అనుమానం ప్రతి నిమిషం కలిగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ సమస్య పరికించితే పరిశ్రమలు తప్ప దేనికి తరుణోపాయం కనిపించదు, జులై నెలాఖరు వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజ్‌లు అన్నింటిలో 36,380 మంది ఉద్యోగాలకెదురు చూస్తున్న వారికి, క్రొత్త దరఖాస్తుదారుల 2,777 మందికి ఉద్యోగాలు లభించినవని. ఇంకా 4,40,753 మంది ఉద్యోగాల కెదురు చూస్తున్న వారున్నారు.

(సశేషం)



సాయుధ విప్లవం సత్వర ఫలితాలను యిస్తుందా?

—శ్రీ సురమౌళి

మనం మరొకసారి యిటీవలనే గాంధీ జయంతి జరుపుకున్నాం. ఈనాటి ప్రపంచ సమస్యలన్నిటికీ గాంధీజీ చూపించిన మార్గమే ఏకైక పరిష్కారమార్గమని నమ్మేవారు ఇప్పటికీ మనదేశంలోనే కాదు ప్రపంచమంతటా ఉన్నారు. అలాగే ఇదంతా వట్టి బూటకం, "తుపాకిగొట్టంలో నుండే విప్లవం" అనేవారూ బయలుదేరారు. ఈ రెండవవాదం భారతీయ యువతరాన్ని ఎక్కువగా ఆకర్షిస్తున్నది. గాంధీజీ మరణం తర్వాత పుట్టిన వ్యక్తి ఈనాటికి పాతికేళ్ల పౌరుడైనాడు. స్వతంత్ర భారతదేశంలోనే పుట్టి(అంటే 1947 తర్వాత పుట్టి) పెరిగినవారికందరికీ గాంధీజీ పట్ల, ఆయన సిద్ధాంతాలపట్ల ఏవగింపు ఏర్పడిందని కాదుగాని, ఎక్కువమంది దానికి విముఖంగా ఉంటున్నారు. "తుపాకిగొట్టం" వైపుకు చూస్తున్నారు. గాంధీజీ మార్గంకన్నా 'తుపాకిగొట్టం' వాదం బలమైందా? సత్వర ఫలితాలు సాయుధ పోరాటంలో కలుగుతాయా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడానికి గాంధీజీ సంస్మరణ సందర్భంగా ప్రయత్నించడం, మీమాంస చేయడం అవసరమని నేను భావిస్తున్నాను.

హింసావాదం ఎందుకు వచ్చింది?

రాజకీయ ఉద్దేశాలతో జరిగే గ్రామీణ హింసాచర్యలపై ఇటీవల దేశంలో పెద్ద కలవరం బయలుదేరింది. ఇందులో చాలా వరకు రాజకీయ ప్రయోజనాలకై కల్పించే కట్టుకథలే ఎక్కువ. అయినప్పటికీ—అనంతమైన దారిద్ర్యం, నిరుద్యోగం, విస్తృతమైన సాంఘిక, ఆర్థిక, అసమానతలు మొదలైనవి సృష్టించిన భూమిక మొదటి నుంచే లేకపోయి వున్నట్లయితే, ఈ హింస చాలావరకు తగ్గివుండేది. ప్రస్తుతపు నామమాత్రమైన సంస్కరణాత్మక చట్టాలనైనా ఖచ్చితంగా అమలు జరిపివున్నట్లయితే, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి సాంఘిక విప్లవం వచ్చిఉండేది. గ్రామీణ ప్రాంతాలలో హింసాచర్యలు పెచ్చు పెరిగిపోవడానికి కారణం ఈ చట్టాలను అమలుజరపకుండా ఇంత సుదీర్ఘ కాలం మురగబెట్టి ఉంచడమేనని నా అభిప్రాయం. ఈ హింసాధోరణులు ప్రబలడానికీ, పెచ్చు పెరగడానికీ, నక్సలైట్లు అనబడుతున్న వారి ప్రతిభా ప్రభావాలేమీ కావు. కారణం మరొక చోట వున్నది. రాజకీయనాయకులు, భూస్వాములు, పెట్టుబడిదార్లు, వడ్డీవ్యాపారులు మొదలైన వారి ప్రవర్తనలు ప్రధాన కారణం, బినామీచర్యలు, కృత్రిమ సెటిల్మెంట్ల ద్వారా భూపరిమితి చట్టాలను మోసగించిన పెద్ద భూస్వాములు, రైతులు, ప్రభుత్వ భూములను గ్రామకంఠాలను, బంజరు, పోరంబోకు భూములను స్వంతం చేసుకున్న పెద్దమనుషులు, పంటలో భాగం పొందే హక్కుగల వ్యవసాయకూలీల, కౌలుదార్ల హక్కులను నిరంతరంగా నిరాకరిస్తున్న భూస్వాములు, కౌలుభూముల నుండి కౌలుదార్లను బేదఖలుచేయించే జమీందార్లు, వ్యవసాయకూలీలకు తక్కువ కూలీరేటును చెల్లిస్తున్న రైతులు, రక్షితకౌలుదార్ల చట్టబద్ధమైన హక్కులను నిరాకరించే భూఖామందులు, బలహీనవర్గాల నుండి మోసంచేసిగాని బలప్రయోగంద్వారాగాని వారి భూములను కాజేస్తున్నారు, హరిజన సోదరులను తక్కువచూపుచూసి, వారిని అవమానపరిచి, సాంఘికంగా వారిని దూరంచేస్తున్న అగ్రవర్ణాలవారు, భయంకరమైన పెద్ద మొత్తాలలో వడ్డీలకు అప్పులిచ్చి, పేదల, బలహీనవర్గాల, భూములను కాజేసే వడ్డీవ్యాపారులు, ఈ లోపాలన్నింటినీ, పాపాలన్నింటినీ ప్రోత్సహించి, పెంపొందడానికి దోహదం చేస్తున్న రాజకీయ నాయకులూ, పాలకులూ ఇందుకు కారణం. పేరుకొనిపోయిన అన్యాయాలకూ, చెవిసోకని ఫిర్యాదులకూ, అణగారిన ప్రజానీకం దెబ్బతినడానికీ వీరే ప్రధాన బాధ్యులు, అణగారిన ప్రజానీకం తమ హక్కును ఈనాడు హింసద్వారా సాధించుకొనడానికి సమాయత్తం అవుతున్నదంటే, అందుకు ఈ పెద్దమనుషులదే జవాబుదారీ. అంతేకాదు, న్యాయస్థానాల వ్యవస్థ, న్యాయం పొందడానికి అనుసరించవలసిన బహుదీర్ఘపు ప్రొసీజర్లు, న్యాయంకోసం చెల్లించాల్సిన మూల్యం ఇలాంటివికూడా మన సంఘంలోని బలహీనవర్గాలకు న్యాయం జరగ

కుండా ఉండటంతో తోడ్పడ్డాయి, తప్పుడు విషయాలను బోధిస్తూ అసంతృప్తి, నిరుద్యోగం, నిరాశానిస్పృహలతో నిండుకున్న యువతరం అనే సైన్యాన్ని దినదినం పెంపొందిస్తూ సంఘం మీదికి పంపిస్తున్న మన విద్యావిధానం మన ప్రణాళికాకార్యక్రమాల తీరు తెన్నులు, ఇవన్నీ ఇందుకు జవాబుదారీ వహించాల్సిందే. ఆర్థిక అసమానతలను మరింత పెంపొందించడానికీ, సమాజంలోని విభిన్న వర్గాలు విడివిడిగా సంఘటితపడి వైషమ్యాలను పెంపొందించు కోవడానికి ఇవన్నీ తోడ్పడుతున్నాయి. ప్రజాస్వామ్యాన్నీ, పార్టీ విధానాలనూ, రాజకీయ లక్ష్యాలనూ ఒక నాటకంగా, ఒక తమాషాగా మార్చివేస్తున్న రాజకీయనాయకుల బాధ్యత కూడా లేకపోలేదు.

పరిస్థితులు ఇంత భయంకరంగా వున్నప్పుడు, ప్రజాస్వామ్య ప్రక్రియలు లోపభూయిష్టాలై, లుప్తమైపోతున్నప్పుడు, అసంతృప్తి నిరాశా, నిస్పృహలు, కోపం, కోరిక అవసరాల జ్వాలలు కొంత మంది మనస్సులను — హింసాయుతమార్గమే ఈ పరిస్థితి నుండి విముక్తికి ఏకైకమార్గమని తలంచేట్లు చేయడంలో ఆశ్చర్యం ఏమైనా ఉందా?

మరి, నిజంగానే విముక్తి కలుగుతుందా?

ఈ వ్యవహారాన్నంతా అర్థంచేసుకోవచ్చు. అయితే ఈ పరిస్థితులు నుండి, ఆశించినట్లుగా, హింసవల్ల నిజంగానే విముక్తి కలుగుతుందా అన్న ప్రశ్న ఇక్కడ అప్రస్తుతంకాదు. చరిత్రలో మొట్టమొదటి హింసాయుత విప్లవ అరుణోదయానికై ఈనాడు మనం వేచివున్నామా? పృథ్విపై నున్న దానవత్వాన్ని రూపుమాపి మానవునికి విముక్తిని కలిగించే తొలి ఘడియకోసం నిరీక్షిస్తున్నామా? కాదే. ఇదివరకే అనేక విప్లవాలు వచ్చాయి. ప్రజానీకం హృద యాలలో ఇదివరకే అనేకసార్లు ఆశలు పేరుకొని పూర్తికాక విఫల మైనాయి. ఈ సమస్య పూర్వాపరాలను విపులంగా చర్చించడానికి ఇది స్థానంకాకపోయినా విషయాలను సరైనదృష్టితో అవగాహన చేసుకోవడానికి అవసరమైన కొన్ని అంశాలను ఇక్కడ వివేచించు కోవడం అవసరం.

రాజకీయ హింసాకాండ అటు విప్లవాత్మకమైనదీ కావచ్చు: ఇటు అభివృద్ధి నిరోధకమైనదీ కావచ్చునన్న వాస్తవాన్ని మొట్ట మొదట మనం గుర్తించాలి. హింసాత్మక విప్లవోద్యమం విధిగా సాంఘిక విప్లవానికి దోహదం చేయగలదన్న గ్యారంటీలేదు. ఇం దులోనుండి అభివృద్ధి నిరోధక తత్వంకూడా పుట్టవచ్చు, చివరికది ఫాసిస్టు నియంతృత్వంగా పరిణమించవచ్చు, ప్రతిహింసా చర్యల ప్రేరేపణ జరిగి అరాచకం ప్రబలవచ్చు. నక్సలైట్ల చర్యలు ఇప్ప టికే ప్రతిహింసా చర్యలను ప్రేరేపిస్తున్నాయి. ప్రజలసామూహిక బాధలు, అరాచకం, వేర్పాటు ధోరణుల ప్రాబల్యం, జాతిని బాని సత్వానికి దిగజార్చడం వంటి పరిణామాలలో ఇది అంతమొంద వచ్చు. హింసను ప్రోత్సహించేవారు, ఈ ప్రమాదాలను గురించి పరిశీలించవలసి ఉంటుంది.

విప్లవకారుల సంకల్పాన్నిబట్టి విప్లవాలు రావనేది రెండవ అంశం. విప్లవం విజయవంతం కావాలంటే ముందుగా, సాంఘిక చారిత్రక పరిస్థితులు దానికి అనుకూలంగా పరిపక్వం చెందవలసి ఉంటుంది, చరిత్ర ఇదివరకే అనేకసార్లు రుజువు చేసినట్లు దీనికి గాను శతాబ్దాలు పట్టవచ్చు. 1948 తెలంగాణా పోరాటకాలంనుండీ, భారతదేశంలో సాయుధ విప్లవవాదులు దాన్నిప్రచారం చేస్తూనే వున్నారు. ఈ 22 సంవత్సరాలలో వారు సాధించిన ప్రగతి ఏ మాత్రం ? హింసాయుత విప్లవంద్వారా సత్వరఫలితాలు కలుగతా యన్నంత అవాస్తవమైన మూఢనమ్మకం మరొకటిలేదు.

ఫ్రెంచి, రష్యా విప్లవాలు

మూడవ అంశం. సుదీర్ఘకాలం ప్రయత్నాలు జరిపినతర్వాత చివరికి ఈవిప్లవం విజయవంతం అవుతుందనే అనుకుందాం; 'విజ యం' అంటే ఏమిటి ? పురాతన వ్యవస్థ తునాతునకలై నశించి పోవడం తప్పమరేమీకాదు గద ః విప్లవానికి — ఏ రకమైన విప్ల వానికైనా సరే, 'నాశనం' లక్ష్యంకాదు. లక్ష్యం నూతన సాంఘిక వ్యవస్థ నిర్మాణం, కాని విప్లవ విజయానంతరం వెంటనే అధి కారాన్ని హస్తగతం చేసుకొనడానికి సహచరుల రక్తాన్ని చిందిస్తూ సంఘర్షణపడే విప్లవకారులు, వారు కాంక్షించిన, లేదా కలలుకన్న సాంఘిక వ్యవస్థను స్థాపించడానికి,—కనీసం, సహచరుల రక్త ప్రవాహంలో కొట్టుకొనిపోగా మిగిలిన కలలను సాక్షాత్కరించుకొన డానికి ఎంత కాలం పట్టింది ? ఏ లక్ష్యాలకోసం విప్లవం జరిగిందో ఆ లక్ష్యాలను సాధించడంలో ఏ ఒక విప్లవమైనా విజయం సాధి చిందా ? సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే ఉన్నత లక్ష్యాలతో ప్రారంభం అయిన ఫ్రెంచి విప్లవాన్ని తీసుకోండి. "సోవియట్లకే అన్ని అధికారాలు" అన్న లెనిన్ నినాదాన్నీ రష్యా విప్లవాన్నీ పరిశీలించండి; కార్మికుల సోవియట్లు, కర్షకుల సోవియట్లు ఇత్యాది, రష్యావిప్లవం జరిగి ఇప్పటికి ఏబదిమూడు సంవత్సరాలు దాటింది. ఈ నాటికీ అక్కడ, రష్యాప్రజలమీద, పార్టీ నియంతృ త్వం దృఢంగా పరిపాలన సాగిస్తున్నది. నియంతృత్వం ఎంతకాలం కొనసాగగలదో, సోవియట్లు ఎప్పుడు అధికారంలోకి రాగలరో ఎవరూ చెప్పలేకుండా వున్నారు.

విప్లవానంతరం నియంతృత్వం

నాల్గవ అంశం, ప్రతివిప్లవంలోనూ, కేంద్రబిందువు అధి కారమే అయినప్పటికీ, అన్నివిప్లవాలూ—అధికారాన్ని ప్రజల హస్త గతంచేసే పేరుతోనే కొనసాగినప్పటికీ, చివరికది—మాజీ విప్లవ కారులలోని నీచులైన కొద్దిమంది గుప్పిట్లలోకి అధికారాన్ని చేజిక్కించుకొనడంలో సమాప్తమౌతుంది. తుపాకి గొట్టంనుండి అధికారం బయటపడినప్పుడు కూడా—ఆ తుపాకి సామాన్యుడి చేతిలో కాక, హింసాయుత ఉద్యమాల సంఘటిత ఏజంట్ల చేతుల్లో ఉన్న ప్పుడు, మరోవిధంగా జరగడానికి వీలులేదు, విజయవంతమైన ప్రతి విప్లవంలోనూ, విప్లవ సైనికులు—వారి సహచరుల ఆవిర్భా వం తప్పనిసరి. ఆ సాధనాలనూ, సహచరులనూ, ఏజంట్లనూ ఎవరు అదుపులో పెట్టుకోగలిగితే అధికారం వారికే చేజిక్కుతుంది, అందుకనే హింసాయుత విప్లవానంతరం ఏదో ఒకరకమైన నియం తృత్వం ఏర్పడక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. దీని ఫలితంగా విప్లవానంతరం కొత్తతరహా ఉన్నతవర్గం, కొత్తతరహా దోపిడి వర్గం క్రమంగా పెరుగుతుంది. మరొకసారి సామాన్య ప్రజానీకం ఈ కొత్తరకం దోపిడివర్గాలకు, ఉన్నతవర్గాలకు లొంగిపోక తప్పని పరిస్థితి వస్తుంది.

దోపిడికి గురి అవుతున్న, అణచబడిన సామాన్యుడు ఆశించి నట్లుగా —ఏ రకమైన హింసకూడా విముక్తిమార్గం కాజాలదు పోయింది టాల్‌స్టాయి వ్యాఖ్యను స్వల్పంగా సవరిస్తే—ప్రతివిప్లవ కారుడూ ప్రతిదీ ప్రజలకోసమే చేసి చివరికి ప్రజల పీకులమీద స్వారీచేస్తాడు

హింసావాద పార్టీలు

నక్సలైట్లుగా ప్రచారంపొందిన మార్క్సిస్టు లెనినిస్టులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని పై చర్చ అంతా జరిగిందని భావించ రాదు దేశంలో రక్తపాత విప్లవాన్ని ఉద్బోధించేవారు, లేదా సమర్థించేవారు వారొక్కరేకాదు అనేకమంది ఉన్నారు. వారిలో ఈ దిగువ పేర్కొన్నవారిని జాబితాలో చేర్చవచ్చు: మితవాద కమ్యూనిస్టుపార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ, రెవల్యూషనరీసోషలిస్టుపార్టీ, సోషలిస్టు యూనిటీపార్టీ, విప్లవ కమ్యూనిస్టుపార్టీ, బొల్షివిక్‌పార్టీ, ఫార్వర్డుబ్లాకు మొదలైన పార్టీలు. వీరిమధ్య తేడల్లా— ప్రజల సామూహిక తిరుగుబాటుకు పిలుపును ఇవ్వవలసిన క్షణం గురించీ, మధ్యకాలంలో అనుసరించవలసిన ఎత్తుగడలను గురించీ మాత్రమే నక్సలైట్ల సూత్ర ప్రకారం ఇప్పుడు ఇక్కడే తక్షణం విప్లవోద్యమం ప్రారంభం కావాలి. తదితరుల దృష్టికి ఇది చాలా అనిష్టంగానూ, వామపక్ష దుందుడుకుతనంగానూ కనబడుతుంది ఎత్తుగడల విషయంలో వారిలో వారికి అనేకమైన అంతర్గత వివాదాలు ఉన్నాయి. ఈ వాద వివాదాల క్రమంలో సాంప్రదాయక సూత్రాలకు అనువుగా భాష్యం చెప్పుకోవడం, సవరించుకోవడం కూడా జరిగింది. వారి మధ్యనున్న విభేదాలు స్థిరమైనవికావు; పరుషమైనవి అంతకన్నాకావు. వీరు మారుతూ ఉంటారు. ధోరణులను సవరించుకొంటూ వుంటారు. దృక్పథాలను సరిదిద్దుకుంటూవుంటారు. ఒక్క విషయాన్ని అంతా అంగీకరిస్తారు అంతిమవిజయం సాధించడానికి ముందు సాయుధ తిరుగుబాటు అనివార్యం అనేదే ఆ విషయం.

విమర్శకు ప్రత్యేకంగా నక్సలైట్లను మాత్రమే ఎంచుకొనవలసి వస్తే రెండు కారణాలపై అలాంటి విమర్శ చేయవచ్చు. ఒకటి—వారు అనుసరిస్తున్నపద్ధతి మార్క్సిజం లెనినిజం పరిజ్ఞానం ఉన్నవారెవరైనా, ఆ యా సిద్ధాంతాల నిపుణులు, ప్రవక్తలు, వ్యాఖ్యాతలు ప్రతిపాదించిన దానిప్రకారం పరిశీలించినా, మార్క్సిస్టు లెనినిస్టుపార్టీ వారు అనుసరిస్తున్నపద్ధతి అచ్చమైన టెర్రరిస్టు అరాచకపద్ధతేగాని, విప్లవపద్ధతి కాదని ఇట్టే గ్రహించవచ్చు. వాళ్ళు 'మావో' పేరును ఎంతగా జపం చేస్తున్నప్పటికీ. వారి పద్ధతులు కనీసం 'మావో' పద్ధతులుకూడా కావు బహుశావారిని గువేరాయిస్టులని అనవచ్చునేమో—అయితే గువేరా'ను మార్క్సిస్టు, లెనినిస్టు అని ఎవరూ అంగీకరించలేదు సదా నిరాశా నిస్పృహలనుండి మాత్రమే ఉత్పన్నమయ్యే ఆరాచక, విధ్వంసక టెర్రరిజం—నిరాశ చెందుకొన్న యువతరం, వెనుకబడిన తరగతులు, దెబ్బతిన్న గిరిజనులు, మోసపోయిన గ్రామీణ పేదప్రజానీకం వంటి వర్గాలలో పరిమితమైన సంకుచిత విప్లవభూమికను రూపొందించవచ్చునేమో. అయితే వీరు తమకు తాముగా వాస్తవమైన సాంఘిక విప్లవాన్ని సాధించగలిగినంత బలవంతులైన వర్గాలుకారు. విదేశీ సహాయం అందినా సరే అచ్చంగా ఈ వర్గాలే విప్లవాన్ని సాధించగలిగినంత బలం వీరికిలేదు. ఇదిలా ఉండగా అరాచక హింసా కార్యకలాపాలు సంఘంలోని బలమైన వర్గాలనుండి ప్రతిహింసను ప్రేరేపించడానికి దోహదంచేసి, తద్వారా ఒకరకమైన నియంతృత్వానికి విధిగా దారి తీస్తాయి.

మా ఛైర్‌మన్ మావో !!

మరో కారణం వారి జాతీయతా విరోధం. కొన్ని రకాలైన జాతీయతా భావాలు—ఉదాహరణకు ఆక్రమణ పూర్వకమైన విస్తరణ వాదాన్ని ప్రేరేపించే జాతీయత, నవ సామ్రాజ్యవాద రూపం ధరించే జాతీయత మొదలైనవి—అభ్యంతరకరమైన జాతీయ భావాలే కావచ్చు. కాని భారతి జాతీయత ఈ పై రకాలలో దేనికీ చెందదు అయితే చైనా హాన్ జాతీయ వాదం—సామ్రాజ్యవాద పెకింగ్ అధీనంలో ఏనాడు ఉన్నప్పటికీ—లేదా చరిత్రలో ఏ దశలోనైనాసరే అందులో భాగమైనప్పటికీ ఆ భూభాగం చిరకాలం చైనాలో అంతర్భాగమేనన్న సుస్పష్టమైన ఉద్భావన దృష్ట్యా, కమ్యూనిస్టు చైనా జాతీయతా భావం అభ్యంతరకరమైనదే కాక అత్యంత ప్రమాదకరమైన జాతీయతా వాదం అన్ని రకాల కమ్యూనిస్టులకూ విదేశీ విధేయత కొద్దిగానైనా ఉండక తప్పదు; మార్క్సిస్టులకు ఈనాడిది అత్యంత స్వల్పంగా ఉండవచ్చు. కాని "చైర్మన్ మావోయే మా చైర్మన్ కూడ" అన్న నినాదం అన్నిటినీ తలదన్నిన జాతీయ విద్రోహ భావమే కాక, విదేశీ అధినేతల అడుగులకు మడుగులొత్తే నీచమైన తత్వం, భావాలనూ, సిద్ధాంతాలనూ, పద్ధతులనూ ఇతరుల నుండి అరువు తెచ్చుకోవడం అనేది—ఇది మన సర్వకాల సర్వావస్థలలోనూ చేస్తూనే ఉంటాం—ఒక రకంగా అర్థంచేసుకోవచ్చు; అంతే కాదు; సైద్ధాంతిక రంగంలో విదేశీయుల నాయకత్వాన్ని, అంటే 'గురు'త్వాన్ని స్వీకరించడం కూడా అర్థంచేసుకో తగిందే, కాని ఒక విదేశీ రాజ్యాధి నేతను తమ స్వీయ విప్లవదేశ రాజ్యాధినేతగా అంగీకరించడం అర్థం చేసుకొవడానికి ఏ మాత్రం అవకాశం లేని భిన్నమైన విషయం స్టాలిన్ పరిపాలనా కాలంలో సైతం ఈ ధోరణి కానరాలేదు. లెనిన్, స్టాలిన్లు—వారికి అంతర్జాతీయత ఎంత ప్రగాఢంగా ఉన్నప్పటికీ రష్యన్ జాతీయ వాదులే. అత్యంత ఆసక్తితో తాను నిరీక్షించిన ప్రపంచ విప్లవ సాధనకోసం, రష్యా జాతీయ ప్రయోజనాలను త్యాగం చేయడానికి లెనిన్ సిద్ధపడి ఉండేవాడు కాదని మనం ఊహించడానికి స్వల్పంగా ఆధారాలు లేకపోలేదు స్వయంగా మావో ఉత్తమ చైనా జాతీయవాది. చైనా చరిత్ర సంస్కృతులను తలచుకొని ఉప్పొంగి పోతూవుంటాడు; గర్వపడుతూ ఉంటాడు. పురాతన చైనా సామ్రాజ్యవాద పాలకులు పరిపాలించిన, లేదా అదుపులో ఉంచుకొన్న ప్రపంచ భూభాగాలన్నింటినీ ఆక్రమించుకొని విశాలచైనా సామ్రాజ్య స్థాపనకు కలలు కంటున్నవ్యక్తి మావో.

ఇదీ మన మంచికే!

ఇలాంటి—చావుదెబ్బలవంటి—లోపాలు ఉన్నప్పటికి కూడా వీరిలో ప్రస్తుత వ్యవస్థను మార్చాలని వేగిరపడే తత్వం ఆకర్షణీయమైంది. ఇప్పుడు, ఈ క్షణమే విప్లవాన్ని తీసుకొని రావాలని,

వారు, బలవంతంగా విప్లవ వాతావరణాన్ని సృష్టించడానికి పూను కోవడం వల్ల ఒక మంచి కూడా జరిగింది. సామాన్య జనంలో సర్వ సాధారణంగా సాంఘిక చైతన్యాన్ని ఇది జాగృతం చేసింది. ముఖ్యంగా అధికారంలో ఉన్నవారు, భూ సంస్కరణలనూ, తదితర సాంఘిక ఆర్థిక సంస్కరణలనూ త్వరత్వరగా అమలు జరపడానికి పూనుకునేట్లు చేసింది. దురదృష్ట వశాత్తు మన దేశం లోని రాజకీయ రంగంలో విపరీతమైన వైరుధ్యాలు ప్రవేశించి, శాంతియుత పద్ధతులలో తమకు విశ్వాసం ఉన్నదని గట్టిగా ఢంకా బజాయించి ప్రభుత్వాలు ఒకవైపు చెప్పుతూనే-తమకు వ్యతిరేకంగా హింసాచర్యల బాంబులు ప్రేలిన తర్వాతనే, హింసా జ్వాలలు ప్రజ్వరిల్లిన తర్వాతనే ప్రభుత్వాలు కళ్లు, చెవులూ తెరిచాయి.

ఈ విషయంలో మరొక్క చివరి మాట. నక్సలిజం పేరుతో జరుగుతున్నట్లు ప్రచారం అవుతున్నదంతా నిజం కాదు. నక్సలైటు హింసా చర్యల పేరుతో, అచ్చమైన వృత్తి నేరాలు చేసేవారి నుండి, వ్యక్తిగత, కుటుంబ కక్షలను, పగలను సాధించుకునే వారి కార్య కలాపాల వరకూ పెద్ద ఎత్తున సాగుతూ, నక్సలైటు కార్యకలాపాలలో కలగాపులగంగా కలసిపోతున్నాయి. వృత్తినేరస్థులు నేరాలు జరిపి "మావో జిందాబాద్" అని నినాదం చేస్తూ పారి పోవడం సర్వ సాధారణం అయిపోతున్నది. నక్సలైట్లనుండి వస్తున్నాయని ప్రచారమవుతున్న బెదిరింపు లేఖలన్నీ వాస్తవంగా వారినుండి వస్తున్నవి కావు. అయితే ఈ నేరస్థులకూ, ముఖ్యంగా దారిదోపిడీలు, సామూహిక దోపిడీలు జరిపే నేరస్థులకూ, నక్సలైటు విప్లవ కారులకూ మధ్య సౌకర్యవంతమైన సర్దుబాటు రూపంలో బహుశా కొంత వరకు ఒప్పందాలు కుదిరి ఉన్నట్లు, సంబంధాలు ఉన్నటు కాన వస్తున్నది.

మరి ఏది దారి?

ప్రజా స్వామ్యం సక్రమంగాలేక, హింసా చర్యలు ప్రత్యా మ్నాయం కాకపోయినప్పుడు ఏది దారి? దారికోసం మనం మళ్లీ గాంధీజీ వద్దకు వెళ్లవలసిందే. హింసా కార్యకలాపాలలోని లోపా లనూ, ప్రజా స్వామిక రాజ్యవ్యవస్థలో అంతర్లీనంగా నిహితమై ఉండే లోటుపాట్లనూ, పరిమితులనూ గాంధీజీ ఏనాడో గ్రహించా డని మనకు తెలుస్తుంది. మిగతా జాతీయ నాయకులు జాతి పునర్నిర్మాణానికి, రాజ్యాంగముయొక్క అధికారశక్తి మీద పూర్తిగా ఆధారపడి వున్నప్పటికీ, గాంధీజీ మాత్రం, కేవలం ప్రభుత్వాధికార శక్తిద్వారా తాను కలలుగన్న భారత దేశాన్ని, కనీసం ఆనాటి భారత జాతీయ కాంగ్రెసు కలలుగన్న భారత దేశాన్ని, రూపొం దించుకోవడం సాధ్యపడదని, గ్రహించినట్లు మనకు అర్థమవుతుంది. అయితే ప్రభుత్వ పాత్రను ఆయన ఏనాడూ తక్కువగా అంచనా వేయనూ లేదు; ప్రభుత్వం సక్రమంగా ప్రభావశీలంగా పనిచెయ్య డంలో ఆయన ఆసక్తిని చూపకుండానూ ఉండలేదు. నిజానికి దేశంలో లభ్యంకాగల అత్యంత సమర్థులైనవారి చేతుల్లో అధికారం ఉండి, సరైన విధానాలనూ, కార్యక్రమాలనూ, ప్రణాళికలనూ అనుసరించాలని ఆయన ఆకాంక్షించారు. అయినప్పటికీ, అత్యంత సమర్థులైనవారి చేతుల్లో అధికారం ఉన్నప్పటికీ, అత్యంత ఉత్తమ విధానాలను అది అనుసరించినప్పటికీ, ఒక్క ప్రభుత్వ యంత్రాంగం ద్వారా మాత్రమే మంచి జరుగదని ఆయన స్పష్టంగా గ్రహించాడు.

జనశక్తి

అందుకే ఆయన ప్రభుత్వ శక్తితోపాటు, దానికి సమాంత రంగా జనశక్తినికూడా నిర్మాణం చెయ్యాలని సంకల్పించుకున్నాడు. ప్రజలకు సేవ చెయ్యడానికి, వారిని చైతన్యవంతులనుచేసి, వారిలో మార్పులు తీసుకొని రావడానికి, సంఘటిత పరచి, వారి కాళ్ల మీద వారిని నిలబెట్టడానికి, సాంఘిక మార్పులకోసమూ, సాంఘిక పున ర్నిర్మాణంకోసమూ, వారిని ప్రత్యక్షంగా భాగస్వాములను చెయ్య డానికి, విశాలమైన విప్లవ వాద కార్యకర్తల సమూహంతోపాటు, ఆ కార్యకర్తల సమూహానికి నాయకుడుగా ప్రజలవద్దకు వెళ్ళడానికి ఆయన సిద్ధపడ్డారు. ఇదివరకటివలెనే ఆయన సాధనాలు నిర్మాణ కార్యక్రమాల ద్వారా సేవచేయడం, హృదయ పరివర్తన అవసరమైనప్పుడు, అహింసాయుతమైన సహాయ నిరాకరణ లేదా అహింసాత్మకమైన శాసనోల్లంఘనం.

తన పథకాన్ని అమలు జరపడానికి గాంధీజీ జీవించి లేరు. ఆయన అనంతరం, ఆయన మాజీ సహచరులు, తమచేతికి అందిన ప్రభుత్వాధికారంతో దేశసమస్యలను పరిష్కరించగలమన్న భ్రమలో పడి, ఆయన చూపించిన మార్గాన్నిగురించి పునరాలోచించనైనా లేదు. వారాపని చేసి ఉండినట్లయితే, గాంధీజీ ఆకాంక్షించినట్లు తమ శక్తు లను అటు ప్రభుత్వానికీ, ఇటు ప్రజలకూ సమానంగా పంచి ఉండి నట్లయితే, స్వాతంత్ర్య సాధనానంతర భారత దేశ చరిత్ర మరొక రకంగా ఇప్పుడున్నదానికి పూర్తిగా భిన్నంగా ఉండి ఉండేది. గాంధీజీ సూచించిన చికిత్సాపద్ధతి అత్యంత వినూత్నమైనది కావడం అనూచానంగా వస్తున్న సాంప్రదాయక పద్ధతులు మాత్రమే తెలిసిన వారికి విచిత్రంగా కనపడి, అందులో గొప్పతనాన్ని గానీ, సంగ తత్వాన్నిగానీ, వారు చూడలేక పోవడమే వారి లోపం అని నాకు అనిపిస్తుంటుంది. అందువల్లఅధికారానికి దూరంగావుండి, తమ విప్లవ లక్ష్యాలకు అనుగుణంగా స్వచ్ఛందంగా ప్రజలను సమీకరించి, సంఘటిత పరచడం ద్వారా విప్లవ సాధనకు ప్రయత్నించి విజయు లైనవిప్లవకారులు లేకుండాపోయారు.

హింసా విధానాలు మన అభివృద్ధికి గొడ్డలిపెట్టు

మారని వాడు

—శ్రీ బోయి భీమన్న

వాడా ?
వాడు !
వాడు చచ్చినా మారడు !

మనిషి మారినా
సమాజం మారినా
లోకమే మారినా
వాడు మాత్రం మారడు

అంత మారని ఆత్మారాముడు
ఎవడు అంటున్నారా?
వాడు ఆత్మారాముడు కాడండీ—
హరిజనుడు :
పట్టి అంటరాని వాడు
అడుక్కు బ్రతికే వాడు. :

వాణ్ణి మీ రెప్పుడైనా చూశారా ?
చూసుండరు, వాడు చూడరాని వాడు :
వాడి మూకుట్లో మీరేదైనా వేశారా?
వేసుండరు, వాడు చేరరాని వాడు :

వాడి చేతిలోది—
అదేమి టనుకొంటున్నారు ?
అది మట్టిమూకుడైనా కాదు
పుర్రె : పుర్రె
గొర్రెదో, బర్రెదో అయినా కాదు—
మనిషిది, అది మనిషి పుర్రె :
అబ్బ : ఎంత అసహ్యం :

ఎప్పుడైనా చూశారా, వాడి కాళ్ళు?
ఆ కాళ్ళ కింద ఎంత చండాలం :
అందుకే వాణ్ణి చండాలుడన్నా రేమో
లోకంలోని సమస్త పంకిలాన్నీ
తొక్కేసు కొస్తున్నట్టున్నాడు!

వాడు కట్టిన ఆ మురికితోలు—
ఏ నాడు చచ్చిన ఏ జంతువుదో
ఉండడానికే కాదు, కట్టడానికి కూడా ఏమీ లేని వాడు
కావాలంటే, మన కంపెనీ గోదాంలో
పన్నీట పిండి. అత్తరు అద్దిఅరేసిన
తాజా తోళ్ళెన్ని లేవు ?

ఒక తోలు వాడి ముఖాన పారేసి
హరిజన సేవ చేసి నందుకు
అవార్డు పుచ్చుకోవచ్చు—కాని—
అందుకు, ఒక పదవి గల ప్రెసిడెంటు
ఒక తెలిసిన ఫోటోగ్రాఫరు
సమయానికి దొరికి చావాలి కద ?

లేకపోతే—ఎందుకూ దండగ ?
పబ్లిసిటీ లేని ప్రజాసేవ
పనిలేని మంగలి తనం:

బాబోయ్! పాములు పాములు:
వాడి ఇల్లు శ్మశానం కానూ—
వాటి నిక్కడికే తెచ్చాడేమిటి
ఎప్పుడొచ్చాడు వాడిక్కడికి
ఇదే తన ఇల్లన్నట్లు కూర్చున్నాడు

అబ్బా: వాడి పాములు కన్ను మన్నప్పుడెల్ల
నావెన్ను పాము బుస్సుమంటున్నదే

ఆ జడల్లోదేమిటో తెలుసా?
గంగా తీర్థమా? వాడి శ్రాద్ధం:
అది కల్లండీ, కల్లు!
ఆ పక్కది లేదూ—
అది ఏ శ్రీమంతుడి ఇంటి నుంచో
కొట్టుకొచ్చిన బాపతు:
కాక—ఈ పాదరసం మగసిరిగాడికి
ఆ వెన్నెల వెండి చషకం ఎక్కడిదీ?

బహుశా, అది నెలవంకలా వంచి కట్టిన
కల్లుపాయ కావచ్చు :
మద్యనిషేధం రద్దు చేశారు కాని
వాణ్ణి ఇప్పుడే అరెస్టు చేయించి వుందును :

చూడండి, ఆ ముడులు కట్టిన జడలు
ఆ సుడులు చుట్టిన ఒడలు:
వాటినిండా ఎక్కడెక్కడి ధూ దూగరో:
ఎవళ్ళెవళ్ళ బుగ్గి బూడిదో

ఈ ఒంటెద్దు వ్యవసాయంగాడు
మింగటానికి మెతుకైనా లేనివాడు

కడుపూ, కన్నూ నకనకలాడుతున్నా
ఎదటి దుకాణం నుంచి ఒక్క కబళం
లాక్కు తినదమైనా చేతకానివాడు—
వీడికి వెంట నాలుగు కుక్కలు కూడానా !

అరే— అయి వెళ్ళకండి
కరుస్తై
వాడిలాగే అవికూడ
ఎప్పుడు మత్తెక్కివుంటై

వీడు చచ్చు హరిజనుడేకాదు—
పచ్చి గిరిజనుడు కూడ

వీడు మారక పోతే—పోయె—
మారుతున్న మనిషిని
మారుతున్న సమాజాన్ని కూడ
తనకేసి మార్చుకొంటున్న
పరమ ధూర్తుడు వీడు

ఇప్పటికే మీరు గుర్తించి వుంటారు—
ఈ నాటి నవ నాగరిక
అత్యాధునిక హిప్పీకుంక లందరికి
వీడే ఆది పురుషుడు కాదంటారా?

ఇంతకూ—
ఈ దెసమాలిన దిసమొలవాడు
ఈ అంటరాని అవర్ణ భిక్షాందేహిగాడు
ఈ సంపత్కులీన సవర్ణ వీధి కెందుకొచ్చినట్టు

వీడికెన్ని రిజర్వేషనులు కల్పించినా
ఎంత సానుభూతితో రాసుకు తిరిగినా
ఎన్ని చట్టాల రాజ్యాంగ రథాలపై వీణ్ని
కాస్త ముందుకు తోలుకు పోదా మనుకున్నా
వీడు ఒక్క అడుగైనా
ముందుకు కదలడు

వీడికి—
తనజీర్ణాంధ తమస్సే
పూర్ణేందు శ్రేయస్సు
వీడి గతి ఇంతే—
మీసు పట్టి మారని వాడు:

★

ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ పత్రికకు అంతర్జాతీయబహుమతి

ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్ల సమాఖ్య ఆధ్వర్యాన వెలువడుతున్న "లెన్స్‌లైటు" అనే త్రైమాసిక ఫొటోగ్రాఫిక్ మేగజైనుకు ఈ సంవత్సరం కూడా అమెరికా ఫొటోగ్రాఫిక్ సొసైటీ నిర్వహిస్తున్న అంతరాతీయ పోటీలో రజితపతకం బహుమతిగా లభించింది. ప్రపంచమంతటా ఈ సొసైటీ అనుబంధ ఫొటోగ్రాఫిక్ సంస్థలు, కౌన్సిల్సు, సమాఖ్యలు పాల్గొన్నాయి.

గతంలో కూడా లెన్స్‌లైట్ ప్రారంభమైన మొదటి సంవత్సరం లోనే దానికి "గ్రీన్‌రిబ్బన్" బహుమతిగా లభించింది. వరుసగా గత మూడు సంవత్సరాలుగా అంతర్జాతీయ పోటీలలో "లెన్స్‌లైట్" అగ్రస్థానం వహించి ఈ "రజిత పతకాన్ని" గెలుచుకొంటున్నది. గత సంవత్సరం అగ్రస్థానం ఆక్రమించిన వాటిల్లో దీనికి ప్రప్రథమస్థానం లభించింది. ఈ సంవత్సరం దీనికి తృతీయ స్థానం లభించింది. ప్రథమస్థానాన్ని చికాగో గెలుచుకొంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీ యన్. భగవాన్‌దాస్, ఐ.ఎ.యస్. గారు, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్ల ఫెడరేషన్‌కు అధ్యక్షులుగా వున్నారు. భారతదేశంలో ఫొటోగ్రఫీ అభివృద్ధికి అత్యుత్తమమైన అసాధారణమైన కృషి జరిపి నందుకు గాను అందుకు ప్రతిఫలంగా ఇంటర్నేషనల్ దిలా ఆర్ట్స్ ఫొటోగ్రాఫీకు చెందిన ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ సంస్థవారు శ్రీ భగవాన్‌దాస్‌కు గౌరవ అంతర్జాతీయ ఇ.యన్.ఐ.ఎ.ని బహూకరించి సత్కరించారు. ప్రపంచమంతటా కలిపి ఇంటర్నేషనల్ గౌరవపత్రాన్ని పొందినవారి సంఖ్య 200 లకు మించి వుండదు.

"లెన్స్‌లైట్" మేగజైనులను పరిశీలించి ముగ్గురు న్యాయవేత్తలు వాటి నిలా అభివర్ణించారు. "ఇది అత్యుత్తమమైన ప్రచురణ. ఫొటోగ్రాఫిక్ పద్ధతులను గురించి విశేషమైన సమాచారం అందజేస్తున్న ఈ మేగజైను, ప్రారంభకులైన ఫొటోగ్రాఫర్లకు, ఎంతోపురోగమించిన ఫొటోగ్రాఫరకు చాలా సహాయకారిగా వుంటున్నది."

నెహ్రూ జయంతి

— శ్రీ కర్లపాలెము కుటుంబశాస్త్రి

శ్రీ జవాహరు పుట్టిన రోజు నిలిచె
మనకు "బాలల పండుగ దినము" గాగ
ఇతని సుత, ఇందిరాగాంధియే ప్రధాన
మంత్రిణిగ, మార్గ దర్శిని మనకు నేడు.

"స్ఫటిక మణి నిభ నిర్మల స్పష్ట హృదయు
డీతడు–భయమ్ము, ద్వేషమ్ము నెఱుగడెపుడు
రాజకీయ రంగమున వారసుడు నాకు
శ్రీ జవాహరె" అనెను గాంధీజి మునుపు.

అవనీ ప్రాంతములన్, నియంతలొ, ప్రధానా మాత్యులో, రాజులో,
యెవరో యేలుదురెప్డు భూమి పతులై–యెవ్వారి యందైన, శ్రీ
జవహర్‌లాలు ప్రధానికిన్ గల ప్రజాస్వామ్య ప్రియత్వమ్ము, ధై
ర్య, వివేకాది గుణాళి, దేశహిత కార్యాకాంక్ష యున్నంటిమే!!

నవ తేజః పరిపూర్ణ విగ్రహుడు, నానారాజ్య సందర్శనో
ద్భవదీర్ఘాను భవుండు, సర్వజనతా భాగ్యాభి వృద్ధిక్రియా
ప్రవణో ద్యోగుడు, భారతాభరణ మీప్రాచీసుధాంశుండు, శ్రీ
జవహర్‌లాలుని, గాంధివారసుని, విశ్వం బెల్ల కీర్తింపదే!!

నాల్గు దెసల స్వదేశపు వెల్గు నింపె
ఆ అశోకు ననంతర మంత సాధి
కారముగ నిల్పె భారత గౌరవమ్ము.
పండితుడు నెహ్రూ వంటిఘనుండు గలడె!!

ఇతని కృషివల్లి ప్రసవించి, యిచ్చె ప్రజకు
పంచవర్ష ప్రణాళికా ప్రసవపాళి
సమసమాజ సంస్థాప నాసక్త హృదయు
డాధునిక విధాన విధాత్రయైన నెహ్రూ.

ప్రఖ్యాతిన్ గనె, సామ్యవాదమునకున్, రష్యాకు సన్మిత్రుడై,
సఖ్యమ్మున్ మఱిపెంచెగా అమెరికా సంయుక్త రాష్ట్రాలతో,
వ్యాఖ్యానమ్ముల, నవ్యరీతుల, ప్రజాస్వామ్యాల కందించె, ప్రా
ముఖ్య మ్మొందెను "శాంతిదూత" యని, స రాజ్యుండు,
నెహ్రూగదా!!

మన ఇండియాను కామన్వెల్తు నందుంచి,
ఆంగ్లేయుల ప్రశంస లందినాడు.
సైనిక కూటాలలోన జేరక యుండి,
అఖిల రాజ్య స్నేహ మరసినాడు
మన భారతీయ, పూర్వ, నవీన, సంస్కృతుల్
కలిపెడి సేతువై నిలిచినాడు.
దివ్యప్రణాళికల్ తీర్చి దిద్ది, యొసంగి
దేశాభివృద్ధి సాధించి నాడు.
మనకు నారాధ్య దైవ సమానుడయ్యె
మనెను, మనమధ్య, సామాన్యమానవుడుగ
నవ సమాజ నిర్మాత, శ్రీ జవహరుండు
నడుచుదుముగాత, ఆతని అడుగులందు!!

★

22–5

నిజాంసాగర్ ప్రాజెక్టు

శ్రీ మాధవరావు దేశ్‌పాండే

★

నిజాంసాగర్ ప్రాజెక్టు నిజాం ప్రభుత్వ కాలంలో 1924 లో ప్రారంభమై 1931 లో పూర్తి చేయబడింది. దీనిని మంజీరా నదిమీద నిర్మించారు. మంజీరానది మహారాష్ట్ర మండలమైన బీర్ జిల్లా పటోదా గ్రామం వద్ద జన్మించి, ఉస్మానాబాద్ (మహారాష్ట్ర) బీదర్ (మైసూరు), మెదక్, నిజామాబాద్ (ఆంధ్ర ప్రదేశ్) జిల్లాల నుండి ప్రవహిస్తూ, నిజామాబాద్ జిల్లా కందుకుర్తి గ్రామం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. ఈ ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా అచ్చంపేట గ్రామం దగ్గర రెండుకొండల మధ్య మంజీరా నీటి జలాలను అరికట్టడం ద్వారా నిర్మించ బడింది.

అప్పటి నిజాం ప్రభుత్వ పి.డబ్ల్యు.డి శాఖ కార్యదర్శి, ఛీఫ్ ఇంజనీరు అయిన శ్రీ నవాబ్ అలి నవాజ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణ క్రింద యీ ప్రాజెక్టు రూపొందింది. ప్రాజెక్టు అసలు శక్తి 26 టి ఎం సి. ఈ ప్రాజెక్టు ఆనకట్ట మీద 28 ఫ్లడ్ గేట్లు రెండు చోట్ల నిర్మింప బడినాయి. ఒక చోట 16 మరొకచోట 12 గేట్లు ఉన్నాయి.

ఇవికాక, 9 సిల్టు గేట్లున్నాయి. ఈ ప్రాజెక్టు క్రింద 2,75,000 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం ఉంది. అయితే ఆయకట్టు మొత్తం విస్తీర్ణం యావత్తూ సాగుక్రిందకు రాకపూర్వమే ప్రాజెక్టు నిరుపయోగం అయిపోయింది. నిజాం ద్రవ్య చలామణి ప్రకారం దీని క్రింద అయిన ఖర్చు రు. 4,21,00,000.

నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించనున్నప్పుడు దీనిని రెండు దశలలో పూర్తి చెయ్యడానికి ప్లానులు, ఎస్టిమేట్లు తయారు చెయ్యబడ్డాయి. మొదటి దశ ఇప్పుడు నిజాంసాగర్ అని పిలువబడుతున్న అచ్చన్నపేట దగ్గర రెండవది, మైసూరు రాష్ట్రంలో బీదర్ జిల్లా దేవనూర్ గ్రామం దగ్గర. దేవనూర్ ప్రాజెక్టు నిర్మాణంవల్ల మూడు లక్ష్యాలు సాధింపదలచారు.

మంజీరా నది తీసుకువచ్చే ఒండ్రు మన్నును దేవనూరువద్ద నిలిపివెయ్యడం. వర్షా కాలంలో కురిసిన నీటిని నిలువచేసి వేసవి కాలంలో నిజామ్ సాగర్ ప్రాజెక్టు కు వదలడం.

హైద్రాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు గొట్టాల ద్వారా మంచినీటిని సప్లయి చెయ్యడం.

దేవనూర్ వద్ద విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చెయ్యడం విద్యుదుత్పాదనకు కావలసిన నీటిని మంజీరానదిలోనికి వదలడం.

దేవనూరు ప్రాజెక్టు శక్తి 16 టి.ఎం.సి., ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు దేవనూరు ప్రాజెక్టు ముఖ్యోద్దేశ్యాలలో ఒకటి దేవనూరువద్ద ఒండ్రుమన్నును అటకాయించి. నిజాం సాగర్‌లోకి పోకుండా చేయడం. ఈ ప్రాజెక్టును రెండవ పంచవర్ష ప్రణాళికలో చేర్చి, ప్రాథమిక దశ నిర్వహణ క్రింద లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఈ విషయం రికార్డులను పరిశీలించడాన్ని బట్టి సమాచార సేకరణను బట్టీ గ్రహించవచ్చు అయితే, దురదృష్ట వశాత్తూ, రాష్ట్ర పునర్నిర్మాణానంతరం, దూరదృష్టి లోపించడం వల్లనైతేనేమి విజ్ఞత లేకపోవడం వల్లనేమి రాష్ట్ర ప్రభుత్వం యీ ప్రాజెక్టుకు స్వస్తి చెప్పింది. ముందు ఆలోచన అనేది లేకుండా ప్రణాళిక ప్రోగ్రాంలో దేవనూరు ప్రాజెక్టు పని నిలుపుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వ చర్యకు కేంద్ర ప్రభుత్వం, ఆమోదముద్ర వేసింది.

యీ దిగువ కారణాలవల్ల నిజాం సాగర్ ప్రాజెక్టు ఉపయోగం తగ్గుముఖం పడుతూ వచ్చింది:—

దేవనూరు ప్రాజెక్టు నిలుపు చెయ్యడం వల్ల నిజాం సాగర్‌లో ఒండ్రుమన్ను పేరుకుపోతూ ఉండడం వల్ల ప్రాజెక్టు శక్తి 26 టి.ఎం.సి. నుండి 12 టి ఎం సి.కి పడిపోయింది. చెరువు గర్భం శీతాకాలంలో కూడా ఎండిపోసాగింది. జొన్న, కాయధాన్యాలు, మొదలైన మెట్టపైరులను చెరువు గర్భంలో పండిస్తున్నారు ఇటువంటి దుస్థితి యే బాధ్యతాయుత ప్రభుత్వానికి గర్వకారణం కాదేమో.

నిజాం సాగర్ సిల్టుగేట్లను దాని చరిత్రలోనే ఎన్నడూ వాడిన పాపాన పోనందువల్ల చెరువులో ఒండ్రు అంతకంతకు ఎక్కువై ప్రాజెక్టు నిరుపయోగమై పోయింది.

మైసూరు రాష్ట్ర ప్రభుత్వం, మంజీరాకు ఉపనది యైన కరంజియాకు,కరంజియా వద్ద, మహారాష్ట్ర ప్రభుత్వం మంజీరానది మీదను ప్రాజెక్టులు నిర్మిస్తున్నందువల్ల మంజీరానదినుండి నిజాంసాగర్‌లోకి జలాలు ప్రవహించడం సన్నగిల్లింది.

నిజాంసాగర్ మీద ఆధారపడి మూడు పెద్ద చక్కెర ఫ్యాక్టరీలు పని చేస్తున్నాయి. వీటి చెరకు ఆడేశక్తి రోజింటికి 5000 టన్నులు. ఇవి కాక 15 ఖండసారి ఫ్యాక్టరీలు రోజు 1509 టన్నుల చెరకు ఆడేశక్తిని కలిగిఉన్నాయి. బెల్లం తయారీకి రోజూ 500 టన్నుల చెరకు వాడబడుతూఉంటుంది. నిజాంసాగర్ ఎండిపోవడం వల్ల చెరకు సప్లయి కాక పంచదార ఫ్యాక్టరీలపని ఖండసారిఫ్యాక్టరీలపని బెల్లం వండేపని పూర్తిగా నిలిచిపోయినది.

పంచదార ఖండసారి, బెల్లం పరిశ్రమ నిలిచిపోయింది. పొలాల్లోను, ఫ్యాక్టరిల్లోను పని చేసే లక్షలాది శ్రామికులు—నిపుణులు, కార్మికులు—నిరుద్యోగులైనారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వములు యీ పరిశ్రమలో కోట్ల మీద పెట్టుబడి పెట్టి లాభాలకు బదులు నష్టాలు గడిస్తున్నాయి.

నిజాంసాగర్ ప్రాజెక్టు విషయంలో శ్రద్ధ వహించవలసిందిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్ని విజ్ఞాపనలను పంపుకున్నా వ్యర్థమే అయింది. 1,50,000 ఎకరాలలో పని 50,000 ఎకరాలలో చెరకు 1972–73 లో, నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీరుపారుదల లేని కారణంగా, ఎండిపోయినాయి. ప్రతి సంవత్సరం ఆరు మాసాల కాలం పనిచేసే నిజాం చక్కెర ఫ్యాక్టరీ 1972–73 లో రెండు మాసాలు కూడా పనిచెయ్యలేక పోయింది.

ఫ్లడ్‌గేట్ల ఎత్తు 4½ అడుగులు పెంచవలెననే, ప్రతిపాదన ఒకటి రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలో ఉన్నది. కాని, ఇది శాశ్వత పరిష్కార మార్గం కానేరదు. 1,5 సంవత్సరాల తర్వాత, ఒండ్రు పేరుకు పోయి తిరిగి చెరువు ఎండిపోతుంది.

నిజాంసాగర్ ప్రాజెక్టును వేధిస్తున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి యీ సూచనలు గమనార్హం.

ఆది లో చేసిన డిజైను ప్రాజెక్టును పునరాలోచనలో తీసికొని నిర్వహించాలి

చెరువు నుండి ఒండ్రును తొలగించడానికి డ్రెడ్జర్లను శాశ్వతంగా నిజాంసాగర్ వద్దనే ఉంచాలి. సిల్టుగేట్లు పనిచేసేటట్టు చూస్తూ, మెరుగు పరచాలి.

మూడు రాష్ట్రాల ద్వారా (మహారాష్ట్ర, మైసూరు ఆంధ్ర ప్రదేశ్) ప్రవహించే మంజీరానది మీద నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మింపబడివున్నందున, దీనిని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ఈ నదిమీద, దీని ఉపనదుల మీద మహారాష్ట్ర, మైసూరు ప్రభుత్వాలు చిన్న చిన్న నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా నీటిని అడగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు జిలాలకు సంబంధించిన సరియైన లెక్కలను తయారు చెయ్యడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిజాం సాగర్ ప్రాజెక్టును స్వాధీనం చేసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం మంటూ లేదు.

కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యీ విషయాన్ని సమగ్రంగా శోధించి, పైనచెప్పిన విధంగా నిజాంసాగర్ ప్రాజెక్టు ఉపయోగపడటానికి చర్యలు గైకొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

---

31 మంది టీచర్లకు రాష్ట్రప్రభుత్వం అవార్డులు

విద్యారంగంలో విశిష్టమైన సేవకు గుర్తింపుగా

1973–74 సంవత్సరంలో విద్యారంగంలో విశిష్టమైన సేవలు చేసినందుకు ప్రభుత్వ విద్యాశాఖ ఈ క్రింది ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వాలని నిశ్చయించింది.

హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు—మిస్. టి. ఎస్. ఆర్. మాథ్యూ, హెడ్ మిస్ట్రెస్ స్టాల్ గర్ల్స్' హైస్కూల్ గుంటూరు, శ్రీ కె. నరసింహారావు, మున్సిపల్ హైస్కూల్, కడప, శ్రీ నంజుండయ్య, ఎస్. పి. ఎస్. ఎన్. యం హైస్కూల్ అనంతపురం, శ్రీ జి. జోసెఫ్, జిల్లా పరిషత్ హైస్కూల్, బొల్లారం, శ్రీ పి. అప్పలకొండమాచార్య. ప్రభుత్వ ఉన్నతపాఠశాల, కరీంనగర్.

బి. ఇడి. అసిస్టెంట్లు—మిస్. వి. జానకీదేవి, శ్రీ జి. రాధాకృష్ణ, శ్రీ టి. సంజీవరావు శ్రీమతి ఎం అబ్రహాం, శ్రీ ఎం. శంకరరావు.

తెలుగు పండితులు—శ్రీ వి. కాశీరత్నం, శ్రీ బ్రహ్మానందం, శ్రీ కె. పద్మనాభం.

సెకండరీ గ్రేడ్ హైస్కూల్ టీచర్స్—శ్రీయుతులు డి. ప్రభాకరరావు, జి. వెంకటరావు, జి. వెంకట్రామయ్య, ఎన్. సీతారామారావు, గంగారెడ్డి.

అప్పర్ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు—శ్రీ గోవిందు, శ్రీ నూర్ మహమ్మద్, శ్రీ వెంకట్రాములు, శ్రీ మానిక్‌రావు, శ్రీ కె. చంద్రప్ప.

అసిస్టెంటు టీచర్లు - శ్రీమతి హేమలత సుకుమార్, శ్రీ ఎస్. వెంకటస్వామి, శ్రీమతి రజిత్ మిత్రిన్, శ్రీ ఆదినారాయణ, శ్రీమతి టి. కోమలమ్మ.

సంస్కృతం టీచర్లు—శ్రీ కె. చంద్రసుబ్బయ్య. శ్రీ రామకృష్ణ, ఉర్దూ-సయ్యద్ అజీజుల్లా హుస్సేని, హిందీ-శ్రీ జి సుబ్బయ్య

గత నెల 16వ తేదీ సాయంత్రం 5–15 గంటలకు గన్‌ఫౌండ్రిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన ఉత్సవంలో గవర్నరు సలహాదారు శ్రీ నరీన్ ఈ బహుమతులు అందజేశారు.

రంగుల చెరువు

పంచాయతీల ప్రయోజనకారి పథకం

—శ్రీ సిద్దాని నాగభూషణం

ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధిచెందడానికి తగు బాధ్యతలను నిర్వహించగల ఒక సంస్థ ప్రతిజిల్లాలోనూ వుండడం అవసరమని, దానికి అనుగుణముగా జిల్లా పరిపాలన మార్చదగునని, ప్రభుత్వం 1967 నవంబరు నెలలో ప్రతిజిల్లాకు ఒక అభివృద్ధిమండలిని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. జిల్లా అభివృద్ధిమండలికి ఆ జిల్లా కలెక్టరు అధ్యక్షులు, జిల్లాపరిషత్తు అధ్యక్షులు సభ్యులు. జిల్లాపరిషత్తు కార్యదర్శి మండలికి కూడా కార్యదర్శిగా వుంటారు. జిల్లా ఆర్థిక ప్రగతికి వుద్దేశించిన కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు పరచడమే జిల్లాఅభివృద్ధి మండలి ప్రధాన లక్ష్యము ఇందులో వ్యవసాయిక పారిశ్రామిక ఉత్పత్తి, కార్యక్రమాలకు ప్రాధాన్యత యివ్వబడింది ఈ కార్యక్రమాల్లో నీటివనరులు, పశుసంరక్షణ, చేపల పెంపకము, సహకారం, మార్కెటింగు ముఖ్యముగా ఉంటాయి

జిల్లా అభివృద్ధి మండలి జిల్లా ప్రణాళికను రూపొందించి జిల్లాపరిషత్తు ఆమోదం పొందుతుంది ఆ ప్రణాళికలో పొందుపరచిన ఏ పథకంలోనైననూ.

(1) పథకం అమలుపరచటం ద్వారా వచ్చే అదనపు వ్యవసాయిక, పారిశ్రామిక వుత్పత్తి

(2) పథకాన్ని అమలు పరచటానికి పట్టే కాలము


(3) పథకము అమలు చేయుటవలన ఎన్నాళ్ళలో అదనపు వుత్పత్తి లభిస్తుంది

అనే మూడు అంశాలుంటాయి వీటిని కూలంకషంగా చర్చించి ప్రయోజనకారి అని తలిస్తే పథకాన్ని అమలుపరుస్తుంది.

ఈ పథకాన్ని సమర్థవంతముగా నిర్వహించటానికిగాను రాష్ట్రస్థాయిలో వున్న వ్యవసాయము, సహకారము, పరిశ్రమలు, పంచాయతీరాజ్ యొక్క శాఖాధిపతుల అధికారములను వికేంద్రీకరించి జిల్లాకలెక్టరుకు యిచ్చారు జిల్లాస్థాయిలో ఆయాశాఖలు జిల్లాకలెక్టరు ఆధిపత్యాన పనిచేస్తాయి

ఉత్పత్తి పథకాలను ప్రారంభించడంలో ఉద్దేశం

అధికాహారోత్పత్తి సాధించే వుద్దేశముతో గ్రామపంచాయతీలకు ఆర్థికవనరులు సృష్టించి, స్వయంపోషకమై స్వయం ఉత్పాదన శక్తివంతమైనట్లుగా స్థానిక సంస్థలను రూపొందించాలని తూర్పుగోదావరిజిల్లా అభివృద్ధి మండలి నిర్ణయించుకొంది ఇప్పట్లో గ్రామపంచాయతీలు ఆర్థికదుస్థితిలో వున్నాయి ఒక విధంగా చెప్పాలంటే పౌరసౌకర్యాలు కల్పించే విషయములోకూడా నిస్సహాయంగా వున్నాయి ఒకవేళ పన్నులువేసి ఆర్థికముగా పంచాయతీలను పటిష్ఠవంతం చేద్దామన్నా చాలా పంచాయతీలు గరిష్ఠస్థాయిలో పన్నులు విధించేవున్నాయి. ఇక పన్నులు ఎక్కువచేయటానికి అవకాశంలేదు.



రంగుల చెరువు పథకాన్ని అప్పటి పంచాయతీరాజ్య కమిషనరు శ్రీ ఐ జె. నాయుడుగారు సందర్శించారు

ప్రభుత్వం నుంచి గ్రాంటు రూపేణా పంచాయతీలు పొందే ఆర్థికసహాయం అంతంతమాత్రము ఇంకా ఎక్కువగా పొందేయీ మాత్రం అవకాశాలు కూడా ముందుముందు లేకపోవచ్చును. ఇటువంటి ఆర్థికమాంద్యం నుంచి పంచాయతీలు బయటపడాలంటే పంచాయతీలు స్వయం ఉత్పాదన పథకాలు చేపట్టి నిర్వహించాలి.

ప్రయోగాత్మకంగా మూడు పథకాలు

డెల్టా ప్రాంతంలోవున్న 10 పంచాయతీ సమితుల్లోనున్న పంచాయతీలకు చెరువులలో చేపలపెంపకము, చెరువు గట్లపై కొబ్బరి మొక్కల పెంపకాలకు చాలా అనువైన పరిస్థితులున్నాయి. ఆ పంచాయతీలు తమ అధీనములోనున్న ఖాళీస్థలాలు, పల్లపు ప్రాంతాలు, పనికిరాని మురుగు కాలువలు మొదలైన వనరులను సద్వినియోగము చేసుకొని ఆదాయాన్ని అభివృద్ధిచేసుకొనే విష

యాన్ని తెలియ జెప్పేటందుకు జిల్లా అభివృద్ధి మండలి ప్రయోగాత్మకముగా మూడు పథకాలను నిర్వహించింది. ఈ మూడు పథకాలు మూడు చోట్ల మూడు సమితుల్లో ప్రారంభించబడినవి ఒకటి కపిలేశ్వరపురం సమితిలోని వెంకటాయ పాలెం గ్రామంలో ప్రారంభించబడినది. ఈ పథకం చిన్న పథకం. రెండవ పథకం కొత్త పేట పంచాయతీ సమితిలోని కొత్త పేట గ్రామములోని కౌశిక ప్రాంతీయ అభివృద్ధి పథకము. ఇది మధ్యతరహాకు చెందింది. మూడవది తాళ్ళరేవు సమితిలోని గొల్ల పాలెం గ్రామములో రంగుల చెరువు ప్రాంతీయ అభివృద్ధి పథకము. ఈ పథకం భారీ ఎత్తున నిర్వహించబడినది.

గొల్లపాలెంలో స్థలనిర్ణయం

ఈ ప్రయోగాత్మక పథకాలకు ఆయాస్థలాలు నిర్ణయించటానికి కారణమేమిటి? గొల్లపాలెం తూర్పు గోదావరి జిల్లా ముఖ్యపట్టణమైన కాకినాడకు దగ్గరలో 8 మైళ్ళ దూరములో వున్నది. ప్రయోగాత్మకముగా నిర్వహించటానికి పథకానికి కావలసిన స్థలముకూడ వున్నది.



రంగుల చెరువు గట్లపై ఎదుగుతున్న కొబ్బరిచెట్ల దృశ్యం

ఈ పథకాన్ని ప్రభుత్వమే చేపట్టవచ్చును. కాని పంచాయతీ రాజ్యసంస్థల ఆర్థిక స్తోమతునుబట్టి త్వరిత గతిని ఫలితాలువచ్చే పథకాలను రూపొందించ వలసిన అవసరము ఎంతైనా వుందని జిల్లా అభివృద్ధి మండలి అధ్యక్షులు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు భావించారు. ప్రభుత్వం యిచ్చే ఆర్థిక సహాయముపై ఆధారపడకుండా స్వంత ఆర్థిక వనరులను సమీకరించి పథకాలను నిర్వహించాలని కూడ నిర్ణయించారు.

త్వరగా ఎదిగే చేప పిల్లలను పంచాయతీ చెఱువులలో వేసి పెంచేటందుకు మంచి అవకాశం వుంది. బలభద్రపురంలోను, కడియం లోను ప్రభుత్వం నిర్వహిస్తున్న చేప పిల్లల పెంపకం క్షేత్రాలలో చేపపిల్ల విత్తనాలు చాలలేదు. సరికదా యీ ప్రాంతానికి వాటిని ఆ క్షేత్రాలు సకాలానికి అందివ్వలేక పోతున్నాయి. కట్ల, రోవా, మృగల్ వంటి మంచిరకాల చేపలను పెంచి తద్వారా మత్స్యాహారోత్పత్తి యినుమడింపచేయు కృషి కాకినాడ చుట్టుప్రక్కల ప్రారంభించ వలసిన ఆవశ్యకత ఎంతైనావుంది.

నిరుపయోగముగా పడియున్న రంగుల చెరువు, దాని చుట్టూ ఖాళీగాయున్న 30, 40, ఎకరాల స్థలము ప్రక్కనే వినియోగించుకొంటే లాభించే ఒక కాలువ వున్నందున గొల్లపాలెంలో చేపల పెంపక కార్యక్రమానికే కాక కొబ్బరి మొక్కల పెంపకానికి అనువుగావున్న కారణముగా ఈ ప్రాంతీయ అభివృద్ధి పథకం గొల్లపాలెంలో ప్రారంభింపబడినది.

గొల్లపాలెం పాతకథ

గొల్లపాలెం ఈ నాడు వెలుగులోనికి వచ్చిన గ్రామం కాదు. ఆ గ్రామానికి ఎంతో చరిత్రవుంది. హస్తకళా నైపుణ్యానికి పేరొందిన కలంకారీ అద్దకాలకు ఆలవాలమై విరాజిల్లిన గ్రామములలో గొల్లపాలెం ఒకటి.

గొల్లపాలెం గ్రామం దాదాపు 300 సం॥ల క్రితం సుబ్బమ్మపేటగా వ్యవహరింపబడేది. క్రమేణా ఈ గ్రామం కాలగర్భంలో కలిసిపోయింది. తరువాత కొన్నాళ్ళు గుండవరం గ్రామంగా పేరు పొందింది. $1\frac{1}{2}$ శతాబ్దాలక్రితం బ్రహ్మాండమైన బందరు వుప్పెన వచ్చింది. ఆ వుప్పెనకు ఊళ్ళకు ఊళ్ళే తుడిచి పెట్టుకొని పోయాయి. ఆ సమయములో గుండవరం గ్రామంకూడా వరదలలో కలిసిపోయింది. మనుష్యులు, పశువులు సమస్త జీవరాసులు కొట్టుకొని పోయాయి. ఆ వుప్పెన సమయములో గొల్లపాలెం గ్రామములోవున్న రంగులచెరువు స్వభావికముగా ఏర్పడినదని ప్రతీతి. వుప్పెన తరువాత మేటగాపడ్డ ప్రాంతములో ఈ గ్రామం రూపొందింది.

ఉప్పెన దెబ్బతిన్న తరువాత కొన్నాళ్ళకు ఈ గ్రామంలో యాదవ వంశానికి చెందిన ఒక కుటుంబము నివాసము ఏర్పాటు చేసుకొని సంతతిని అభివృద్ధి చేసుకొన్నట్లు ప్రతీతి. అందువల్లనే ఆ గ్రామము గొల్లపల్లిగా విరాజిల్లేది. తరువాత గొల్లపాలెంగా పిలవబడుతూ వచ్చింది. ఇప్పుడు గొల్లపాలెంగా వ్యవహరించబడుతున్నది.

డచ్చి ప్రభుత్వానికి ఈ గొల్లపాలెం కలంకారీ పరిశ్రమలో పెద్ద వాణిజ్యకేంద్రము. ఈ గ్రామములో ఉత్పత్తి అయిన కలంకారీ అద్దకాలు విదేశ ప్రశస్తికూడ అందుకొన్నవి. ఈ గ్రామములో వుత్పత్తి అయిన అద్దకాల బట్టలు ఇంగ్లాండు వస్తుప్రదర్శనలో ప్రదర్శింపబడి రజితపతకాన్ని సంపాదించుకొన్నట్లు చెప్పారు. పురాతన శోభను స్మృతికితెచ్చే ఆ కలంకారీ పరిశ్రమ యిప్పుడు ఈ గ్రామములో నామమాత్రముగా నిలిచిపోయింది. ఈ పరిశ్రమకు ఆధారభూతమైంది కనుకనే ఇక్కడ చెరువుకు రంగుల చెరువు అని పేరు వచ్చింది. ఈ పరిశ్రమకుగాను ఈ గ్రామప్రజలు హాలెండ్‌లో తయారయ్యే సెను తానులుకొని దిగుమతి చేసుకొని, ఆ సైనుబట్టకు

అద్దకాలువేసే వారు. అద్దకాలు వేయటానికి ముందు వాటిని రంగుల చెరువులో నానబెట్టేవారు. ఈ చెరువులోనాచు, గుఱ్ఱపు దెక్క వుండేవి. ఈ నాచువల్ల మురికి పట్టకుండ బట్టలు తెలుపుగా వచ్చేవి. ఆ రోజులలో బ్లీచింగు పౌడరుగాని, కాస్టిక్ సోడాగాని లేని కారణముగా సైనుతాను తెలుపుచేయడం ఒకసమస్యగా వుండేది. ఈ బట్టలను 4,5 రోజులు నానబెట్టి తర్వాత చౌడును బట్టమీద వేసి శుభ్రముగా నీళ్ళలో తడిపేవారు. బట్టలు బాగుగా తెల్లగా అయ్యేవి. బట్టలు తెలుపువచ్చిన తరువాత కసింకాయ, కరక్కాయ మొదలైన చిమిలేరు రసాయనికములతో తయారైన రంగులలో ముంచిన కుంచెలతో బట్టలపై డిజైనువేసేవారు. ఈ డిజైనులలో శ్రీరామ పట్టాభిషేకచిత్రం ప్రసిద్ధి గాంచినది. ఈ రంగులను ధోవతులకు, చీరలకు, దుప్పట్లకు, చాందినీలకు వేసేవారు. ఆ అద్దకాలు వేసిన తరువాత ఆ బట్టలను విదేశాలకు ఎగుమతి చేసేవారు.

కాలప్రభావమున ఈ కలంకారీ పరిశ్రమ నానాటికీ క్షీణిస్తూ వచ్చింది. గ్రామస్థులకు అత్యంత జీవనోపాధి కల్పించి ప్రసిద్ధి పొందిన రంగులచెరువు నిరుపయోగమైంది. దోమలకు నిలయమై పౌరజీవనానికి కలుషిత వాతావరణాన్ని కలుగజేస్తూ వారిమధ్య ఒక సమస్యగా నిలిచింది.

పాడుబడి దోమలకు ఆలవాలమై, అనారోగ్యానికి కారణభూతమైన రంగులచెరువును పునరుద్ధరించి సర్వాంగ సుందరమైన స్థలముగా రూపొందించడమేగాక ప్రయోగాత్మక వుత్పత్తి క్షేత్రముగా రూపొందించాలని జిల్లా అభివృద్ధి మండలి నిర్ణయించింది.

ఈ రంగులచెఱువు విస్తీర్ణం 35 ఎకరములు. ఈ చెరువులో మట్టి చాలా శ్రేష్ఠమైనది. చెరువులు ఏర్పాటు చేసిన నీటి కొదువలేదు. ఈ చెరువు గర్భములో ఐదు చెరువులు నిర్మించబడినాయి. ఈ చెరువులను ఆనుకొని 28,000 అడుగుల నిడివి, 30 అడుగుల వెడల్పుగల ఒక కాలువ త్రవ్వబడినది. దాదాపు 40 అడుగుల వెడల్పుగల గట్టుకూడ వేయబడినది. ఈ బృహత్కార్యానికి 1,09,800/- రూపాయలు పెట్టుబడి అయినది. దానిలో జిల్లా పరిషత్తు 42,000/- రూపాయలు యివ్వగా మిగిలిన మొత్తాన్ని చుట్టుప్రక్కల నున్న 37 పంచాయతీలు 42,800/- రూపాయలను, తాళ్ళరేవు పంచాయతీసమితి 25 వేల రూపాయలు యిచ్చి పూర్తి చేశాయి.

ఈ పథకానికి ఐదువేల రూపాయల చొప్పున పులుగుర్త పంచాయతీ, రెండువేల రూపాయలు చొప్పున జి. మేడపాడు, రమణయ్యపేట, ద్రాక్షారామం, కొమర్రాజుపాలెం, పెనుమళ్ళ పంచాయతీలు, వెయ్యేసి రూపాయల చొప్పున సెలపాక, ఉప్పంగం, ఆర్యవటం, ఇంజరం, పటకల, జగన్నాథగిరి, పెనుగుదురు, అరట్లకట్ల, కూరాడ, కుయ్యేరు, వేళంగి, ఉండూరు, మాచవరం, వెలంపాలెం, పసలపూడి, వెల్ల, ద్వారపూడి, వెదురుపాక, బిక్కవోలు, వెంకటకృష్ణరాయపురం, నడకుదురు, పసలపాడు, జి. మామిడాడ, తోరంగి పంచాయతీలు, ఐదువందల రూపాయల చొప్పున తర్లంపూడి, బందనపూడి, చేదువాడ, దుగ్గుదుర్రు, గొఱ్ఱిపూడి, గురజనాపల్లి, పెద్దాపురప్పాడు పంచాయతీలు పెట్టుబడి పెట్టాయి.

మొత్తం మూడు పంచాయతీసమితుల్లో పంచాయతీలు 42,800 రూపాయలు.

లాంఛనప్రాయంగా ఈ కార్యక్రమం 1968 సంవత్సరం మే నెలలో ప్రారంభమయినా ఈ పథకానికి 17-8-1968 నాడు ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఖండూభాయ్‌దేశాయ్ ప్రారంభోత్సవం చేసారు. వారి హస్తాలతో ఒక కొబ్బరిమొక్కను నాటుతూ 'ఈ పథకం సామాన్యమైనదిగాక, జిల్లా అభివృద్ధికి కల్పతరువుల కూడలిగా ప్రభవించి రాష్ట్రంలో తలమానికమై భాసిల్లాలని కోరుచున్నాను' అన్నారు.

చెఱువును నిర్మించి చెరువుగట్లను బలం చేసారు. చెరువులలో లక్ష చేపపిల్లలను వదలి, చెరువుగట్లపై సంవత్సరం వయస్సుగల 3 వేల కొబ్బరి మొక్కలను, మూడు సంవత్సరాల వయస్సుగల 420 కుంచంమాను కొబ్బరిమొక్కలను నాటారు. ఇంకా సద్యఃఫలితానికై అరటి మొక్కలను నాటారు. పశువుల మేతకు మేలిరకం పచ్చికను పెంచారు. ఈ పథకం అతి జాగ్రత్తగా నిర్వహించబడింది.

పథక నిర్వహణ

ఈ పథకం నిర్వహణ బాధ్యతను తాళ్ళరేవు సమితి బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరుకు ఒప్పజెప్పడమైనది. మూడు సమితుల్లో ఉన్న పెట్టుబడి పంచాయతీలు పెట్టిన కారణంగా ఈ పథకం పర్యవేక్షణ బాధ్యతలను జిల్లాపరిషత్తు కార్యదర్శి, జిల్లా పంచాయతీ ఆఫీసరు, మత్స్యశాఖ సహాయసంచాలకులు, జిల్లావ్యవసాయశాఖ డిప్యూటీడైరెక్టరు, జిల్లా పశువైద్యశాఖాధికార్లకు ఒప్పజెప్పబడినాయి.

ఈనాడిది సర్వాంగసుందరమైన స్థలం

ఈనాడు రంగుల చెరువుప్రాంతం పరిశీలిస్తే సర్వాంగ సుందరమైన ఉద్యానవనంగా గోచరిస్తుంది. అరటిచెట్లు-మరొక వైపు కొబ్బరిచెట్లు — మిలమిలమెరుస్తున్న జలాలు, జలాలలో అలలను రేకెత్తిస్తున్న మత్స్యాలు, ఈ ప్రాంతరూపురేఖలను పూర్తిగా మార్చివేస్తున్నాయి. ఎదుగుతున్న కొబ్బరిచెట్లు సౌందర్యాన్ని ఒలకబోస్తున్నాయా అన్నట్లుగా ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని రమణీయమైన విహార యాత్రాస్థలంగా రూపొందించాలని ఆదినుంచి ఆశిస్తున్న తూర్పుగోదావరి జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ ఎస్. బి. పి. బి. కె. సత్యనారాయణరావుగారి కృషి కొంతవరకు సఫలీకృతమయింది. అయినా యింకా చేయవలసింది ఎంతో ఉంది. వారి సహాయసహకారాలతో వచ్చే సంవత్సరాలలో ఈ పథకం ఎక్కువ ఆదాయం చేకూర్చుకొనటానికేగాక విహారస్థలంగా రూపొందించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రంగులచెరువు అపూర్వ పథకమని మేధావులు, పంచాయతీ రాజ్య కార్యకర్తలు, ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఈ పథకాన్ని రూపకల్పనచేసిన అప్పటి జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారి "ఊహాబాలికగా" ఒక ఉన్నతాధికారి

(తరువాయి 54వ పుటలో)

తెలుగు వారి ఆభరణాలు

శ్రీమతి వేదవతీదేవి

'కస్తూరీ తిలకం లలాట ఫలకే
వక్షస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం
కరతలే వేణుం కరే కంకణం
సర్వాంగే హరి చందనంచ కలయన్ కంఠేచ ముక్తావళీ'

ఇంత అందముతో, అలంకారంతో, గోపాల చూడామణి న మనో నేత్రాల ముందు భాసిస్తాడు.

ఆ అందగాడికి ఆ ఆభరణాలన్నీ ఇంకా మెరుపూ మెరుగూ తెచ్చి ఉంటాయి. కలియ పూసుకున్న హరిచందనం ఎంత కమ్మని పరిమళాన్ని వెదజల్లుతూ ఉందో!

అసలు ఆ హరికి పసి పిల్ల వాడిగా ఉన్నప్పటి నుంచీ అలంకారాల పైన మోజే! తన అందం చాలదని వెఱపేమో!.

గొల్ల వారి ఇళ్ళల్లో చేయవలసిన హంగామా అంతా చేసి వచ్చి, తల్లి కోప్పడి ప్రశ్నించేసరికి, చిన్న చిన్న అబద్ధాలు ఆడ తాడు పసి గోపాల రత్నం.

"అమ్మా. నేనెక్కడికిని పోలేదే
నేనెవ్వరిండ్లకును పోలేదే!"...అని ఆ అమాయకురాలు నమ్మేట్లు నచ్చచెపుతాడు.

ఆ తల్లి ఆ మాటలకే ఉబ్బిపోయి...
"కృష్ణా, నీవెవ్వరిండ్లకును పోకుంటె
తల దువ్వి శిఖలు వేసేను
కొండీకి పూలు చుట్టేను
సొమ్ములు చాల పెట్టేను
బంగారు వల్లె వేసేను
కస్తూరీ తిలకం దిద్దేను"

అంటూ కొడుక్కి అలంకారాలు చేస్తుంది. ఆభరణాలు ఎన్నెన్నో పెడుతుంది.

అన్ని సొమ్ములు పెట్టుకోవాలని పసివాడైన గోపాలుడికే అంత మోజుగా ఉంటే, సొమ్ములు పెట్టుకోవటం జన్మహక్కుగా సంతరించుకున్న ఆడవాళ్లకు ఇంకా ఎంత ఆశగా ఉంటుంది!

ఆడవాళ్లకు సొమ్ముల మీద మోజు అనాది కాలం నుంచీ ఉంది. హరప్ప, మొహంజదారో కాలం నాటినుంచీ ఉంది. తక్షశిల త్రవ్వ కాలలో చెవులకు పెట్టుకునే పోగులు, గాజులు, నెక్లెసులు, ఉంగరాలు, హారాలు, పతకాలు, ఇవన్నీ బయటపడ్డాయి.

అంటే, మన వాళ్లు అంత పురాతన కాలం నుంచీ ఆభరణాలు ధరించి, రమ సౌందర్య ప్రియత్వాన్ని ప్రదర్శిస్తూ ఉండే వారన్న మాట!

అజంతా చిత్రాలలో

అజంతా చిత్తరువుల్లో ఆ ముగుదల అలంకార ప్రియత్వం గోచరిస్తుంది మనకు. కంఠ హారాలు, మొలనూళ్లు, కంకణాలు, శిరోజాలంకరణలు—ఇవన్నీ ఆ చుక్కల చక్కదనానికి వాసి తెచ్చి పెట్టే అలంకారాలే!

సాంచి, అమరావతి, భువనేశ్వర్, కోణార్క్, నాగార్జున కొండ ప్రాంతాల్లో దొరికిన శిల్ప ప్రతిమలు ఎన్నెన్నో ఆభరణాలు ధరించినట్లు చెక్కబడ్డాయి. ఆ రోజుల్లో ఆభరణాలు అంత ప్రీతితో అలంకరించుకునే వాళ్ళు కాబోలు ఆడవాళ్లు.

హరి చందనంతో, కంఠంలో వ్రేలాడే ముత్యాల సరులతో పరుగు పరుగున వచ్చే బాల గోపాలుడితో ప్రారంభించిన నా భావనా లహరి నా మనస్సును ఎక్కడికో పరుగులు తీయించింది.

మన ముందుకాలంలో ఆడవాళ్లు ఎల్లా ఉండేవారో ఆ నాటి తెలుగు దేశపు ఆడ పడుచులు వండటం, వడ్డించటం, పిల్లల్ని కని పెంచటం—తప్ప అలంకారాలు చేసుకోవటం ఏమిటో ఎరుగరా? వాళ్లకూ నగల మీద మోజు ఉండేదేనా? ఎట్లా ధరించే వాళ్లో ఆ నగల్ని!.

రెండు తరాల క్రిందటి తెలుగు దేశపు తెలివ—ఆ కాలపు కట్టు బాటులలో కట్టు వడిపోయి, అనాటి కట్టూ బొట్టూ జీర్ణించుకు పోయిన మా బామ్మ దగ్గరకు ఒక్క పరుగున వెళ్లాను.

ఆవిడకు జ్ఞాపక శక్తి ఎక్కువ. మేధస్సు ఇప్పటికీ చుర కత్తిలాగా పనిచేస్తుంది. ఎన్నో పాతకాలపు కబుర్లు చెబుతుంది. ఎన్నెన్నో పాత కాలపు పాటలు పాడుతుంది. అందుకే నాకు మా బామ్మ పైన గొప్ప అభిమానం.

ఇన్నేళ్లు వచ్చినా, ఆవిడ కళ్లకు దృష్టిలోపం కలుగలేదు. నేను వెళ్లేప్పటికి బామ్మ తులసి తోట దగ్గర కూర్చుని బియ్యం ఏరుతున్నది. రాగంతో పాడుతూనూ ఉన్నది.

"గాజులొరయగను కంకణములును జార
జాజి కొప్పుల నుండి జలజలని రాల
తేజమలరంగను నందియలు రవళిల్ల
క్రందుగా మొలనూలి గంటలొగి మెరయ
సంది దండల కాంతులందందు మెరయ
జిందులుగ చీరకుచ్చిళ్ళు కడునెరయ
ఇందు ముఖులూచెదరు ఇంపు సొంపరయ"

బాల క్రిష్ణుడినో, చిన్నారి రాముడినో, ఊయెలలోవేసి, ఊపుతూ లాలి పాట పాడుతున్నారు చుట్టూ చేరిన పడతులు. అప్పుడా భామల అలంకారమూ, కంకణాల మొలనూలి గంటల రమ్యమైన రవళులూ వర్ణిస్తూ ఉంది బామ్మ.

నాకు వెదుకబోయిన తీగె ఎదురైనట్లయింది!. సందర్భం చక్కగా కలిసి వచ్చింది. బామ్మ మెడ చుట్టూ చేతులు వేసి గారాబం చేస్తూ అన్నాను.

'బామ్మా, ఎంత అందంగా ఉండే వాళ్లో ఆ భామలు! ఉయ్యాల తొట్లో పడుకున్న బాల కృష్ణుడికి వేరే లాలి పాటలు ఎందుకే! ఆ అందెల రవళుల మ్రోతకూ, బంగారు కంకణాల గల గలకూ వాడికి ఎప్పుడో నిద్ర పట్టేసి ఉంటుంది. ఆటకాయి వేషాల్తో కొంత సేపు ఆ మొలనూలి గంటలు చేతికి అందించుకొని ఆడుకుని ఉంటాడు కూడా...'

బామ్మ నవ్వింది నా మాటలకు. ఆమెకు ఏమి జ్ఞాపకం వచ్చిందో, తలుచుకొని తలుచుకొని ముసి ముసిగా నవ్వుతూ అన్నది.

"బాగా చెప్పావే పిల్లా! మీ నాయన చిన్నప్పుడు అచ్చంగా అట్లాగే చేసేవాడు. భుజాన వేసుకుంటే మెళ్లో గొలుసులన్నీ పిడికిలి బిగించి పట్టుకుని లాగేసేవాడు. ఒకసారి బాగా అరిగిపోయిన కాశికాయల గుండ్ల గొలుసు చేతుల్లోకి ఊడి వచ్చింది కూడా".

నాకు నవ్వు వచ్చింది. నాన్న బామ్మ అంకతలం ఎక్కి చేసిన కోతి చేష్ట తలుచుకుంటుంటే.

"ఇంకా ఏమి చేసేవారు బామ్మా నాన్న!"...అని అడిగాను కుతూహలంగా.

"నల్ల పూసల పేరుల్ని గుప్పిట బిగించి పట్టుకొని గుంజేవాడు. మెరిసే చేతి గాజుల్ని పట్టుకుని పరీక్ష చేసేవాడు. ఎత్తుకుంటే వడ్డాణంలో కాలుదూర్చి ఏడ్చి హంగామా చేసేవాడు. పక్కలో పడుకున్నట్లే పడుకొని పాదాల దగ్గరకు పాకివచ్చి కడియాలూ, పాంజేబులుతో ఆడుతూ కూర్చునే వాడు. ఎత్తుకొనిముద్దుపెట్టుకుంటే ముక్కెర పట్టుకు గుంజేవాడు".

బామ్మ చెప్పుకు పోతోంది మైమరపుగా, బాలక్రిష్ణుడి అల్లరితో విసిగిపోయి చిరుకోపం ప్రదర్శిస్తూ ఉన్న యశోదాదేవిలాగా నాకు ఆవిడ కనిపించింది.

"చాలా ఉన్నాయన్న మాట నాన్నగారి బాల్యక్రీడలు: ఎప్పుడూ చెప్పవేం బామ్మా! అయితే నీకు ఒంటి నిండా అన్ని రకాల నగలు ఉండేవన్నమాట. తాతయ్య నీకు చాలా సొమ్ములు చేయించాడే! ఎంతప్రేమో నీవంటే" అన్నాను కాస్త చిలిపిగా.

తాతయ్యకు బామ్మ మీద కల ప్రేమ కథ మొదలుపెడితే అది చాలా పెద్ద కథే అవుతుంది. అది మరోసారి చెప్పుకుందాం కాని మన ప్రస్తుతావసరం అది కాదు.

బామ్మకు సొమ్ములన్నీ చిన్నప్పుడే వాళ్ల పుట్టింటి వాళ్లు చేయించారట. కాలం జరుగుతూ ఫాషను మారుతున్నప్పుడల్లా అవి చెడ గొట్టించి, ఇంకా కొంత బంగారం వేసి తాతయ్య క్రొత్త నగలు చేయిస్తుండే వాడట, ఫాషన్లు మారినప్పుడల్లా ఈ కాలపు వాళ్లు క్రొత్త వస్తువులు చేయించు కుంటున్నట్లు!

"అయితే దామ్మా మీ పుట్టింటి వాళ్లు భలే భాగ్యవంతులన్న మాట!" అన్నాను సాలోచనగా.

పుట్టింటి పేరు ఎత్తుతే ఏ ఆడపడుచుకు ఆనందం కలగదు. బామ్మ ముఖం క్షణంలో సంతోషంతో వెలిగి పోయింది. ఆమెకు క్రొత్త ఉత్సాహం వచ్చింది.

"అవునే పిల్లా, మావాళ్లు ఆ కాలంలో బాగా ఉన్నవాళ్లే. పిల్లలు పోయి పోయి దక్కానేమో, నన్ను మహా ప్రేమగా పెంచారు. ఒంటినిండా మోయలేనన్ని సొమ్ములు చేయించారు. ఆ రోజుల్లో బస్తా ధాన్యం మూడు రూపాయిలు అమ్ముతుండేది. శవిరీ బంగారం పదమూడురూపాయిల కన్నా ఎక్కువ ఉండేదికాదు! అన్నది బామ్మ.

అప్పుడు శవిరీ పదమూడు రూపాయిలు !

"శవిరీ పదమూడు రూపాయిలా ! నేను కూడా బామ్మతో పాటూ పుట్టి ఉంటే ఎన్ని నగలు చేయించుకోగలిగి ఉండేదాన్నో" గుటకలు మింగుతూ అన్నాను....

"అయితే బామ్మా ! ఏమేమి నగలు ఉండేవి నీకు ? జ్ఞాపకం ఉంటే చెప్పవూ" ప్రాధేయ పడినట్లు అడిగాను.

పుట్టింటి వారి గొప్పతనంతో మైమరచి ఉందేమో వాళ్ల. భాగ్యానికి ప్రతీకగా తమకు చేయించిన సొమ్ములు ఏకరువు పెట్టటం మొదలు పెట్టింది బామ్మ! అందులోనూ క్రమ బద్ధంగా శిరస్సు మీద పెట్టుకునే అలంకారాల వద్ద ఎత్తుకుంది కథనం.

"పాపటి బిందీలు ఉండేవి.పాపట్లోనూ ముంగురుల మీదగానూ వ్రేలాడుతూ ఉండే గొలుసులు, నుదుటి మీదకు కొంచెముగా వ్రేలాడుతూ రాళ్ల పొదిగిన పతకం కూడా ఉండేది"

నాకు లీలగా మనోనేత్రం ముందు ఒక కన్నె ముత్తయిదువ ఆకారం గోచరిస్తూ ఉంది. బామ్మ వయసులో ఉండగా ఎంత శృంగారముగా ఉండేదో ! చక్కని రూపు ఆవిడది.

ముఖానికి మేలిమి పసుపు రాసుకున్న మెరుపు ఛాయతో, కళ్లనిండా కాటుకతో, నుదుట ఎర్రని కుంకుమతో—ఉండే ఆ ముద్దరాలు మెల్లమెల్లగా ఆభరణాలు ఒక్కటొక్కటీ తొడుగు కుంటూ రూపు దిద్దుకుంటూ ఉంది.

"చంప సరాలు ఉండేవి. చెవుల దుద్దులలో నుంచి తీసి వెంట్రుకల చిక్కులలో దూర్చి పెట్టుకునే దానిని" వింటూ మనసులో రూపకల్పన చేసుకుంటున్నాను.

"'కాగితీ, తమలపాకు' ... అని నడినెత్తిన పెట్టుకునే అలంకారాలు" ... అన్నది బామ్మ.

ఇదేమిటో కొత్త పేరే ! నా ఆశ్చర్యాన్ని చూచి బామ్మ ఆ ఆభరణ విశేషాన్ని కాస్త వివరించి చెప్పింది.

"కాగితీ' ... అది నిజంగా 'కా' అనే అక్షరము కాదు. 'కే' కూడా కాదు. ఉచ్చారణలో బహుశా 'క్యా' ను పోలి ఉంటుంది. అర్ధ చంద్రాకారంగా ఉండే ఆభరణం ఇది బంగారపు రేకుతో చేసి మధ్యలో ఎర్రరాయి పొదుగుతారు.

'తమలపాకు' తమలపాకు ఆకారంలోనే ఉంటుంది. చుట్టూ సన్నని గజ్జెలు అతుకుతారు. 'కాగితీ-తమలపాకు' ఈ రెండింటికీ కూడా క్రింద తూములాగ ఉంటుంది. అందులో నుంచి వెంట్రుకలు లాగి బిగించి, ఆభరణాన్ని కదలకుండా అమర్చుతారు.

'రాగిడీ'-కమ్మలు-ఇవి కూడ నడినెత్తిన కాస్త అటూ ఇటూగా పెట్టుకునేవే. 'కాగితీ, తమలపాకు కంటే ఇంకా ఎక్కువది బంగారం పెట్టి చేయించుకునే ఆభరణం ఇది. కనుక దీని ధర ఎక్కువగానే ఉంటుంది. రాగిడీ-కమ్మలు-ఇవి రెండూ ఒకటి పెట్టుకున్నప్పుడు మరొకటి తప్పక పెట్టుకోవాలనే ఆచారం ఉండేదట !

కొన్నాళ్ళకు ఈ నగ, మోటు అయిపోయిందట ! అప్పుడు తాతయ్య దానిని చెడగొట్టించి నాగరంచేయించాడట ! తాతయ్యకు క్రొత్త ఫ్యాషన్లంటే ఎంత మోజో మరి !

బామ్మ కళ్ళుమూసుకుని ఒక్కొక్క వస్తు విశేషమూ పేర్లతో సహాచెప్పుకుపోతూఉంది. నా మనస్సులోని పడుచు పిల్ల ఆకారం ఒక్కొక్క నగా తగిలించు కుంటూఉన్నది. కన్నులు మూసుకుని ఆ మనోహరాకారం దర్శించుతూ ఉన్నాను.

"తిరుగుడు పువ్వు-అని ఉండేది. జడ మధ్యలోనో, కొప్పు మీదనో తిప్పిపెట్టుకునే దానిని."

శిరోజాలంకరణ అది. ఇప్పటి వాళ్ళు పెట్టుకునే జడబిళ్ళ వంటిది అయి ఉండాలి.

"సూటీలు చెవుల పైన జుట్టునుంచి వేలాడుతుండేవి. తెల్ల రాళ్ళూ, కెంపులూ వేసి చేయించారు.'

'ఇంకా చామంతి బిళ్ళ ఉండేది, ఇది కూడా జడలో తగిలించు కునేదే.'

అక్కడికి శిరోజాలంకరణ పూర్తి అయింది. జడవేయటం మొదలు పెట్టి చివరకు వచ్చామన్న మాట.

"జడచివర కుప్పెలు ఉండేవి. బంగారపు పనితనంతో నల్లటి కుప్పెలు వేలాడుతుంటే, తాచుపాము పడగ ఆడించినట్లే ఉండేది.

బామ్మ ఎంత చక్కని వర్ణనచేసిందీ ! నాకనుసన్నలలో రూపు దిద్దు కుంటున్న పడుచుపిల్ల జడవేసుకోవటం పూర్తి అయింది. శిరస్సు నిండా, శిరోజాలనిండా ధగ ధగ లాడే బంగారపు అలంకారాలు అమర్చుకోవడం అయింది.

కోటేరువంటి ముక్కు. ఆ ముక్కుకు రాళ్ళతోచేసిన ముక్కుపుడక, దోసకాడ. మరికాస్త క్రిందకు వేలాడుతూ బులాకీ !

భామా కలాపంలో ముక్కెర

ముక్కెర ముక్కుకు ఎంత అందాన్ని ఇస్తుంది ! భామా కలాపంలో ఒక ఘట్టం, సత్యభామా దేవి ఎన్ని లంచాలు పెట్టినా కృష్ణునివద్దకు రాయబారం వెళ్ళనని బెట్టు చేస్తుంది చెలికత్తె. ఎన్ని నగలు ఇస్తానన్నా మూతీ ముక్కూ విరిచి కదలనంటుంది. ఆఖరుకు ప్రాణం విసిగి, "నీకు ఏంకావాలో విసిగించక చెప్పవే" ... అని సత్యభామ అడగ్గా, చెలికత్తె సత్యభామ ముక్కున ఉన్న ముక్కెర మీద తనకు గల కోరికను వెల్లడి చేస్తుంది. దాన్ని అందుకుని పెన్నిధి దొరికినంత సంతోషంతో రాయబారానికి బయలు దేరుతుంది. ఆహా! ముక్కెర మహిమ!

అక్కడికి ముక్కుకు అందం పూర్తి అయింది. చెవులు మాత్రం ఇంకా బోసిగానే ఉన్నాయి.

"తళతళమను రత్న తాటంకములు మెరయ పసిడి కుండలముల పడతి ఎక్కడికే! " ... అని నేను రాగము తీసేటప్పటికి బామ్మ కర్ణాభరణ విశేషాలు చెప్పటం మొదలు పెట్టింది.

"చెవులకు దుద్దులు విధిగా ఉండేవి ...... సరే, ఇవి ఆకారాలలో ఎన్నోమార్పులు చేసుకుంటూ ఇప్పటికీ ఆడవాళ్ళ చెవులకు విధి గానే ఉంటున్నాయి.

"తాలూకా ... అని తమ్మెకు కాస్త పైన పెట్టుకునే వాళ్ళం" ... అన్నది బామ్మ.

"తాలూకా-ఏమిటమ్మోయి! తాలూకాలూ జిల్లాలూ చెవులకు ఏలా తగిలించుకునే వారూ? " ... అన్నాను నవ్వుతూ.

"అది అంతేలే, చెవికి తగిలించుకునే ఆ బంగారపు వస్తువు పేరు 'తాలూకా' అంటారు. ఇంకా 'పచ్చరాళ్లు' అని ఉండేవి. అది రాళ్లతో పొదిగిన వస్తువు. తాలూకాకు కాస్త పైన పెట్టుకునే వాళ్లం..." అన్నది బామ్మ.

సరిపోయింది. చెవి తమ్మెభాగం నుంచి పైకి పోతున్నది బామ్మ, చెవి పొడుగునా బంగారమే! ఆ చెవి ఎంత షోకుగా ఉండేదో రూపకల్పన చేసుకుంటున్నాను.

"మత్స్యబావిలీలు' — మరి కాస్త పైన ఉండేవి, ఇంకా పైన — అంటే ఇంచుమించు చెవి పై భాగంలో 'కాశీఉట్లు' పెట్టుకునే దానిని, చెవికి ఇటు వైపున గూబకు 'గూబబావిలీలు' ఉండేవి. 'బొగడలు' కూడా కాశీ ఉట్ల దగ్గరలోనే పెట్టుకునే దాన్నని జ్ఞాపకం' ..." అన్నది బామ్మ.

'సాయిబు సంపాదన బీబీ కుట్టు పోగులకే సరి' ! ... అని సామెత చెపుతారు మన వాళ్ల. సాయిబు సంపాదన సంగతి నాకు తెలియదు కాని బీబీల చెవి చుట్టూతా ఉన్న కుట్టుపోగుల్ని చూచినప్పుడల్లా, అన్ని బెజ్జాలు చెవి చుట్టూతా వీళ్లంత ఓపిగ్గా కుట్టించుకుంటారా అని నాకు ఆశ్చర్యంగా ఉండేది.

ఏదో జ్ఞాపకం వచ్చి బామ్మ చెవుల్ని పరీక్షగా చూచాను. కాశీ ఉట్లూ, తాలూకాలూ పెట్టుకున్న చెవులు కదా అవి! చెవి చుట్టూతా, ఆ చిహ్నాలు అలాగే ఉన్నాయి.

చెవుల్ని సింగారించటం పూర్తి అయింది. ఇంతవరకే తలా, ముఖమూ ధగధగలాడుతూ ఉన్నవి.

కన్నె ముత్తయిదువు కంఠ సీమ మీదకు పోయింది నా చూపు. బామ్మ కంఠహారాల పేర్లు చెప్పుకు పోతూ ఉంది.

"పట్టెడ, పులిశేరు నాను, చింతాకు అడ్డిగె, గుళ్ల పేరు, కట్ల కాసుల పేరు, శవిరీలపేరు, అరనవరసుల పేరు, వరహాల పేరు, సిరి భాగాలపేరు, పగడాలదండ, కంటె-ఈ కంటెలో రెండుమూడు రకాలవి ఉండేవి. మొలికల కంటె, నాగబంధం కంటె, గుళ్ల కంటె."

ఓహో! ఏమి పేర్లు ! ఏమి పేర్లు ! ఈ పేర్లు కూడా ఎంత విశేషంగా ఉన్నాయో! నేను వాటిని ప్రత్యక్షంగా ఎరగక పోయినా ఆ పేర్ల పేరుతోనే ఒక్కొక్కటి నగా కళ్లముందు రూపు తెచ్చుకుంటూ ఉంది.

గట్టికంటె సుమారు ముప్పై శవిరీలు ఉండేదట! శవిరీల పేరూ, వరహాల పేరూ, కంటే-పెట్టుకున్న ఆ మెడ మంచి దృఢంగా ఉండి ఉండాలి, ఇంకా కట్ల కాసుల పేరు నలభై శవిరీల ఎత్తూ మోయాలి కదా!

కట్ల కాసుల పేరుల్ని, గట్టి కంటెల్నీ మోసిన బామ్మ మెడ ఇప్పుడు ముడతలు పడి ముడుచుకు పోయింది. కాని అప్పుడు శంఖం వలె అదెంత సుందరంగా ఉండేదో ఊహించుకుంటూ కూర్చుంటే, నా దృష్టి మురుగులు తొడుక్కున్న ఆమె ముంజేతుల మీదకు పోయింది.

"దండ కడియాల సంగతి చెప్పవూ బామ్మా!" అన్నాను. దండ కడియాలూ, వంకీలూ, గజ్జల తాయెతూ, వట్టి తాయెతూ, బాజూ బందులు — ఇవన్నీ దండ చేతులకు పెట్టుకునే దానిని, ముంజేతులకు కంకణాలు, గోట్లు, బోచీలు, మురుగులు, పులిశేరు గొలుసులూ ఉండేవి."

బాహు మూలం నుండి ప్రారంభమైన బంగారు తొడుగు ముంజేతుల వరకు వచ్చింది. దండ కడియాలూ, వంకీలూ పెట్టుకున్న ఆ దండ ఎంత సొంపుగా ఉండేదో! మురిడి గొలుసుల ముంజేయి ఎంత మురిపెంగా ఉండేదో!

అంతవరకూ మనస్సులో రూపకల్పన చేసుకునే సరికి ఆ చేతి వ్రేళ్లు బంగారం లేకపోతే భాసించవేమో అనిపించింది.

చేతి వ్రేళ్లకు మాత్రం తక్కువేమిటి! ఉంగరాలు, టాకులు, కల్యాణపు టుంగరంతో సహా పెట్టుకునేదట బామ్మ. రాళ్లు తాపినవీ, ఉత్త బంగారంతో మలిచినవీ ఆ ఉంగరాలు.

'ముద్దు వేలినున్న ముద్దుటుంగరము' ... అన్నట్లుగా ఆ వేళ్లూ ముద్దుగా ఉండేవే. ఆ ఉంగరాలూ ముద్దుటుంగరాలే. సన్నటి నడుము అలా గాలికి వదిలి వేస్తే ఎలా!

"వడ్డాణం ఉండేది. గజ్జెల వడ్డాణం, పాతిక ముప్ఫై శవిరీలతో చేయించారు మావాళ్లు. అది పెట్టుకోక పోతే పెళ్లి పేరంటం ఏమీ జరగదు" ... అన్నది బామ్మ వడ్డాణపు ప్రాముఖ్యాన్ని వర్ణిస్తూ.

మేఖల, హేమమేఖల, కింకిణి, రశన—ఇన్ని రకాలుగా కాళిదాసు వర్ణించిన వడ్డాణం!

గుడిలో పార్వతీ అమ్మవారి నడుముకు అందంగా ఉండే వడ్డాణం నా మనస్సులో మెదలింది. దానికి గజ్జెలు కూడా ఉంటే ఎంత బాగుండేదో! నడుముకు ఆ గజ్జెల వడ్డాణం పెట్టుకొని నా భావనా సుందరి బామ్మ చిన్ననాటి రూపుతో నడిచి వస్తూంది.

అందెల రవళులు మాత్రం ఇంకా విన రావటం లేదు! ఆ మంజుల రవళి లేకపోతే అసలు ఆ అలంకారాలన్నిటికీ అందమే లేదు !

అందెల రవళి దగ్గరకు వచ్చేప్పటికి నాకు సీతాదేవి పాదాలకు ఉండే అందమైన నూపురాల సంగతి స్ఫురణకు వచ్చింది.

'నాహం జానామి కేయూరే
నాహం జానామి కుండలే
నూపురే త్వభి జానామి
నిత్యం పాదాభి వందనాత్'

ఎంత చక్కని భావనాశిల్పం ఇది ! వినయ వినమిత సంపన్నుడు లక్ష్మణుడికి వదినగారు ధరించే ఆభరణాల సంగతి ఏమీ తెలియదు. ముత్యాల హారాలు కానీ, కర్ణాభరణాలు కానీ ఏమి గుర్తు తెలియదు. వాటిని తానెప్పుడూ చూడలేదు కనుక. కాని ఆమె కాళ్లకు పెట్టుకునే నూపురాలు మాత్రం అతడు బాగా ఎరుగును. నిత్యం పాదాభివందనం చేసేటప్పుడు చూస్తూ ఉండే వాడు కనుక !

ఈ శ్లోకార్థం మననం చేసుకుంటే చాలు, నా హృదయం దివ్య తీర్థాలలో మునిగి వచ్చినట్లు రసార్ద్రమయిపోతూ ఉంటుంది.

ఆ రసానందంలో కాస్త మైమరచి ఉన్నానేమో, బామ్మ మాటలకు ఉలిక్కిపడ్డాను.

"వంకీ కడియాలు, కడ్డీ కడియాలు, ఒక్కొక్కటీ అరవై తులాల వెండితో చేయించారు మా వాళ్లు. గొణ్ణెపు గొలుసులూ, పావడాలూ కూడా పెట్టుకునే దానిని"

"పావడాలు పెట్టుకోవటం ఏమిటే బామ్మా, కట్టుకుంటారు, కానీ !"...అన్నాను అర్థం కాక.

"పిల్లా నీ కన్నీ అనుమానాలేనే! కట్టుకునే పావడాలు వేరూ పెట్టుకునే పావడాలు వేరూను. పాదాలకు పెట్టుకునే వెండి వస్తువ అది".........అన్నది బామ్మ.

"ఘల్లు ఘల్లున పాద గజ్జెలందెలు మ్రోయ
కలహంస నడకల కలికి ఎక్కడికే"
కూనిరాగం తీసేప్పటికి బామ్మనవ్వి అన్నది కదా !

"కలహంస నడకలకు ఇంకా అందం ఇచ్చేవీ, తప్పనిసరిగా పెట్టుకోవలసినవీ ఇంకా ఉన్నాయే పిల్లా !"

"నాకు తెలుసులే ! మట్టెల సంగతి కదూ నీవు చెప్పేది !" అన్నాను బామ్మ కాలి వేళ్ల వంకకు దృష్టి సారిస్తూ.

"ఒక్క పట్టీలే నీకు తెలిసింది ! బొటన వేలికి 'చల్లాలు' ఉండేవి. రెండోవేలికి సరే మట్టెలు. నీ వెరిగినవే ఇవి, పాతిక తులాలకు తక్కువ ఉండేవి కాదు !''...అన్నది బామ్మ.

చల్లా లేమిటో ! పాతిక తులాలవెండి మట్టెలు కాలి వ్రేలికి తొడిగితే, ఇంచుమించు జీవిత కాలమంతా వాటిని అలాగే ఉంచుకుంటే, ఆ వేలు ఏమయి పోయేదో నాకు తెలియదు. బామ్మ కాలి వేలు మాత్రం సురక్షితంగానే ఉంది. కలహంస నడకల కలికి కామాక్షి ఆ మట్టెలతో ఎంత మంజుల రవళి సృష్టించగలదో ఆలోచిస్తున్నాను.

"నాలుగో వేలికి పిల్లేళ్లు ఉండేవి అయిదో వేలికికూడా ఏవో ఉండేవి. ఆ పేరు జ్ఞాపకం రాపటంలేదు"...అన్నది బామ్మ.

పాపం! మూడో వేలు !!

మూడోవేలు ఏమిపాపం చేసుకున్నదో, దానికి ఏ తొడవూ తొడగకుండా ఎందుకు వదిలిపెట్టారో పాపం !

అన్ని ఆభరణాలూ అంత వివరంగా గుర్తు ఉంచుకుని నాకు విశదపరచిన బామ్మ అయిదవవేలి దగ్గరకు వచ్చేప్పటికి పేరు మరచిపోయింది. ఆ పేరుకూడా జ్ఞాపకం తెచ్చుకుని నాకు చెప్పమని ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాను ఆమెను.

"కుప్పె, రాగిడి బిళ, కుంకుమరేఖ, పా
పట బొట్టు, కమ్మలు, బావిలీలు
లలి సూర్య చంద్ర వంకలు, సూసకము, కెంపు
రవల పల్లెరు బూవు, రావిరేక
బుగడలు, నానుదీగె, సొగసైన మెడనూలు
కుత్తికంట్లు, సరిపెణ, గుండ్లపేరు
సరిగె, ముక్కెర, జన్నసరము, ఉత్తుండాలు
కంకణంబులు, తట్లు, కడియములును
సందిదండలు, నొడ్డాణ మందమైన
ముద్రికలు, హంసకంబులు, మ్రోయు గజ్జె
లలరు బొబ్బిలి కాయలు, గిలుకు మెట్టె
లాది యగు సొమ్ము దాల్చి యయ్యబల మెరయ"

అయ్యలరాజు నారాయణ కవి వర్ణన ఇది, నా మనో కల్పనలో సర్వాభరణ భూషితురాలైన కన్నెముత్తయిదువును, వర్ణించాలంటే ఈ పద్యం చాలును.

బామ్మ పెట్టుకున్నానన్న సొమ్ములన్నీ ఇంచుమించుగా ఏకరువు పెట్టాడు కవి. కాని ఇందులో చెప్పిన 'బొబ్బిలికాయలు' ఆ అయిదవ వేలికి పట్టించవచ్చునా అని ఆలోచిస్తున్నాను.

మహా రాణులకూ. అంతటి భాగ్యవంతులకూ ఆ రోజుల్లో ఏడువారాల నగలు-అంటూ ఉండేవట ? వారానికొక రకం పూర్తి పెట్టు ఉండేదన్న మాట. ఆనాటి మహా రాజులకు బహుశా వారం వర్జ్యం తెలుసు కోవాలంటే-అంతఃపురానికి వెళ్ళి దేవినిచూచి, ఆవిడ ఏ వారపు సొమ్ములు పెట్టుకున్నదో చూచి గ్రహిస్తూఉండే వారేమో !

కాని బామ్మ సొమ్ములు, ఏడు వారాల నగలకంటే ఏమి తీసి పోయినాయి ! మహారాణి భోగమంతా అనుభవించిన బామ్మ - సర్వాలంకార భూషితగా తాతయ్యను అలరించిన అందాల పాలవెల్లి బామ్మ !

"ఆణి ముత్యపు హారములు మొలనూలు గజ్జెలు
జోడు అందెలు, రవల పాపట బొట్టు ముంగెర
సమయముగ ధరియించు తల్లికి
హారతి మీరేల ఇవ్వారే"

ఆ తల్లికూడా ఆభరణాలన్నీ సమయంగా ధరిస్తుందట !

కాని ఈ ఆభరణాలు అన్నీ అమర్చుకోవటానికీ, తీసి దాచుకోవటానికీ ఎంత సమయం పట్టేదో ! ఎంత శ్రమపడవలసి వచ్చేదో !

అయినా వాళ్ళ అలంకార ప్రియత్వం అటువంటిది.

కాలం మారిపోయింది. నిముషాలమీద కుక్కరులో అన్నం, పప్పు, కూరా ఉడకేసి, ఆదరా బాదరా ఆఫీసుకు పరుగెత్తుకు వెళ్లవలసిన ఆడవాళ్లు కారు ఆ నాటి మహిళలు.

మళ్లా ఫేషన్లు మారుతున్నవి. మళ్లా పాత నగలు కొన్నిటి పైన మోజు ప్రబలుతూ ఉంది. వెనుకటి నగలన్నీ కొత్త పేర్లతో కొద్ది మార్పులతో మార్కెట్టులోకి వస్తున్నాయి !

ఇవ్వాళ ఆడపిల్లలకు వాణిశ్రీ ధరించిన నానుజిగినీ అంటే కళ్లు జిగేల్‌మనిపించేటంత మోజు. కలెక్టరు జానకి ధరించిన సొమ్ముల మెరుపులంటే మురిపెం.

చరిత్ర పునరావృత మైనట్లు ఈ నగలన్నీ మన ముందు తరాలనుంచీ మార్పులతో చేర్పులతో వస్తూ ఉన్న సంప్రదాయాలే అనక తప్పదు. క్రొత్త నాజూకులూ, తొడుగులూ తొడుక్కున్న తొడవు లివి ! ఈ సంగతి ఇప్పటి వాళ్లకు అంతగా తెలియదు.

బామ్మ మెల్లగా లేచి లోపలకు వెళుతూ ఉంది. కాస్త వంగిన నడుముతో, ముదిమి పైబడ్డ దేహంతో నడుస్తున్న బామ్మను చూస్తూ నాలో నేను మరోవిధంగా రూపకల్పన చేసుకుంటున్నాను.

"అందమైన కాళ్లందెలు మ్రోయగా
చక్కగ సందిటి దండలు గదలా
ఒప్పుగ వేళ్లకు మట్టెలు మెరయా
ఒప్పుగ ముత్యపు గాజుల ముందరా
దత్తుల చీకట్లందము మించా
తీరుగ కస్తూరి తిలకము జారగా
లేత నడుమున నొడ్డాణం బొరయా
అందుపై మొహర్లపే రందము మించా
గుచ్చిన ముత్యపు పేరులు గదలా
గొప్ప ముత్యపు నత్తటు వెలుగా
సీతవచ్చె రాముని సన్నిధికి"
ఇదికూడా బామ్మ పాడే పాటే ! సీత సీమంతపు పాట !

నాకు ఆ సీత, బామ్మలో స్ఫురించింది. ఇప్పటివరకూ ఆవిడ ఏకరువు పెట్టిన సొమ్ముల ఎత్తు ఒకటి ! బామ్మ ఎత్తు ఒకటి. బామ్మ ఎంత పెద్ద సొమ్ము ! తెలుగు వారింటి సొమ్ము ! ×

ప్రముఖ చరిత్ర కారుడు

శ్రీ చిలుకూరి వీరభద్రరావు

—శ్రీ ఎ. పండరీనాథ్

ఆంధ్ర దేశంలో ప్రముఖ చరిత్రకారులుగా పేరొందిన వారిలో శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి పేరు ప్రప్రథమంగా చెప్పుకోవలసి ఉంటుంది. ఆంధ్రజాతి చరిత్రను ఏర్చికూర్చి ఆంధ్ర జాతికి ఒక అపూర్వ అలంకారంగా సంతరించిన ఘనత ఆయనకే దక్కింది. ఆంధ్ర చరిత్ర ప్రవక్తగా ఆ మహా మనీషికి ఆంధ్ర జాతి ఆనాడూ ఈనాడూ నివాళులెత్తుతూనే ఉన్నది. చారిత్రకునికి చరిత్ర సేకరణలో ఎంత సూక్ష్మదృష్టి అవసరమో అర్థగ్రహణంలో కూడా అంతే అవసరముంటుంది. ఈ రెంటికీ వీరభద్రరావు పేరెన్నికగన్న వారే.

1925లో రాజమహేంద్రవరంలో 'ఆంధ్ర ఇతిహాస పరిశోధన మండలి'ని స్థాపించిన ఘనత వీరికే దక్కింది. ఈ మండలి స్థాపనలో వీరికి తోడ్పడ్డ ప్రముఖులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, భావరాజు వెంకట కృష్ణారావు, చిలుకూరి నారాయణరావు గార్లు. ఈ పరిశోధక మండలి ప్రచురించిన తొలి త్రైమాసిక పత్రికలో శ్రీ వీరభద్రరావును గూర్చి ఇలా వ్రాసారు.

"The society owes its inception and existence to inspiring work and guidance of Mr. C. Veerabhadra Rao the premier historian of the Andhras."

జననం : విద్యాభ్యాసం

ఆయన నర్సాపురం తాలూకాలో పెనుమంద అనే గ్రామంలో 1872వ సంవత్సరం అక్టోబరు 17వ తేదీన జన్మించారు. తల్లి సీతామాంబ, తండ్రి వీరరాజు. జన్మించిన కొద్ది కాలానికే ఆయన తండ్రి తమ నివాస స్థానాన్ని రేలంగికి మార్చుకున్నారు. ఆయన తన విద్యాభ్యాసాన్ని కొంతకాలం వరకు తణుకులో కొనసాగించారు. ఆ తరువాత సంస్కృతం, ఆంధ్రభాషల్లో పాండిత్యాన్ని సంపాదించుకున్నారు. కందుకూరి వీరేశలింగం గారి సంఘ సంస్కరణోద్యమం, సాహిత్యోద్యమంతో ఆంధ్రులు ప్రభావితులవుతున్న రోజులవి. కందుకూరి వీరేశలింగంగారి ఆశయం, ఆదర్శం వీరభద్రరావు గారిని కూడా ప్రభావితం చేసింది. వీరేశలింగం గారి పట్ల కృతజ్ఞతగా ఆయన వీరేశలింగం గారి జీవిత చరిత్రను "ఆంధ్ర ప్రకాశిక"లో ప్రచురించారు.

ఆయన గొప్ప దేశాభిమాని, జాతీయాభిమాని. జాతీయాభిమానంవల్ల ఆయన తన ఆస్తినంతా త్యాగంచేసి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు, ధైర్యంతో కష్టాలను ఆహ్వానించాడు.

ప్రథమ శ్రేణికి చెందిన పత్రికా సంపాదకుడు

ఆయన ప్రథమ శ్రేణికి చెందిన పత్రికా సంపాదకులుగా, నిష్పాక్షికమైన సంపాదకులుగా పేరు పొందారు. పదిహేను సంవత్సరాలకు పైగా ఆయన వేరువేరు పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. ఏలూరు నుండి వెలువడే "దేశోపకారి" అనే పత్రికకు ఆయన 1895లో సహాయ సంపాదకులుగా పనిచేశారు. "విబుధ రంజని" అనే పత్రికకు సంపాదకులు. 1897లో తాను స్వంతంగా ఒక ముద్రాలయాన్ని కొని "దేశోపకారి"అనే పత్రికను స్వయంగా నడిపారు. వీరేశలింగం గారి "సత్యవాణి" పత్రికను కొంతకాలం నడిపారు. ఆ తరువాత గున్నేశ్వరరావుగారి "ఆంధ్ర కేసరి" వార పత్రికకు సంపాదకులయ్యారు.

ఆనాడు 'ఆంధ్ర కేసరి' పత్రిక ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించింది. ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శించడంలో, దేశీయులకు జరిగే అన్యాయాలను బయట పెట్టడంలో, సంఘ సంస్కరణ ప్రచారంలో, దేశభక్తిని ప్రబోధించడంలో, సారస్వత రచనలను ప్రచురించడంలో ఆ నాడు ఆ పత్రికకు అదే సాటి. ఆయన లేఖిని నుంచి వెలువడే పదునైన భావాలకు ఆ పత్రిక ఆ నాడు అద్దం పట్టింది. ఆయన నిర్విరామ కృషివల్ల నిరాటంకంగా సాగింది.

ప్రముఖ చరిత్ర కారుడు

ఆయన పత్రికా సంపాదకత్వాన్ని వదిలి అగ్రశ్రేణికి చెందిన చరిత్రకారులయ్యారు. దీనితో ఆయన జీవితంలో ప్రధాన ఘట్టం ఆరంభమయింది. "జీర్ణ కర్ణాటరాజ్య చరిత్ర"ను మొట్టమొదటి సారిగా దేశానికి అందించారు. ఆ తరువాత మద్రాసు చేరుకొని అక్కడి గ్రంథాలయాల నుండి ఎన్నో పుస్తకాలను సేకరించి 1910లో "ఆంధ్రుల చరిత్ర" ప్రథమ భాగాన్ని కూడా వెలువరించారు. వీటిని శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి ద్వారా ప్రచురించారు. ఈ కాలాన్ని మనం ఆంధ్ర జాతి చరిత్రలో మహోత్కృష్టమైన యుగంగా పేర్కొన వచ్చును.

ఆ నాడు ఆంధ్రజాతి చైతన్యవంతమైంది. తమ జాతి చరిత్రను తెలుసుకొని భావావేశంతో ముందుకు సాగింది. ఆ నాటి నుంచి శ్రీ వీరభద్రరావు ఆంధ్రుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆ తరువాత ఆయన ఏర్చికూర్చిన ఆంధ్రుల చరిత్ర మూడవ భాగాన్ని రాజమహేంద్రవరం ఇతిహాస తరంగిణి గ్రంథమాల వారు ప్రకటించారు. కాని విజయ నగరపు సంగమ వంశ రాజుల చరిత్రతో ఆయన రచన ఆగిపోయింది. ఆంధ్రుల

సమగ్ర చరిత్రను ఆయన రచనల్లోనే చూసే భాగ్యం ఆంధ్రులకు లేకపోయింది.

1936లో ఆయన "కాకతీయాంధ్ర రాజయుగ చరిత్ర"ను కూడా ప్రకటించారు. దీనిలో విషయాలను సరియైన ఆధారాలను చూపించి సమర్థించారు. ఆనాడు ఈతనికి అన్నివిధాలా సహకారాన్ని అందించిన వారు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు మరియు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గార్లు.

అభిమాన ద్వయం

ఆయనకు చరిత్రతోపాటు సాహిత్యంపై కూడా అభిమానం మెండు. ఆయన ఆంధ్రజాతి చరిత్రనే కాక భారత వీరుల చరిత్రను కూడా రెండు భాగాలు ప్రకటించారు. తెలుగు కవులలో ఆయనకు తిక్కన, శ్రీనాధులపై ఎక్కువ మక్కువ. తిమ్మరుసు మంత్రి ఆయన ఆదర్శ పాత్రమైన రాజ నీతిజ్ఞుడు. వీరి ముగ్గురిపై మూడు గ్రంథాలను చరిత్ర, సాహిత్యం సమ్మేళనంతో ఆంధ్ర జాతికి కానుకలుగా అందించారు.

ఇంకా ఆయన చరిత్ర గ్రంథాలలో "అళియరామ రాయలు" ప్రసిద్ధి చెందినది. చరిత్ర పరిశోధనకు సంబంధించిన ఎన్నో వ్యాసాలు వివిధ దిన, వార, మాస పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

"ఆంధ్ర చరిత్ర చతురానన" బిరుద ప్రదానం

ఆయన అపార చరిత్ర పరిశోధనకు మెచ్చి నంద్యాలలో ఆంధ్ర మహాసభ వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన "ఆంధ్ర చరిత్ర చతురానన" అనే బిరుదుతో 1928లో ఆయనను సత్కరించారు. చరిత్ర పరిశోధనలో వీరి అడుగుజాడలలో నడిచి పేరు పొందిన వారెందరో ఉన్నారు. వీరిలో మల్లంపల్లి సోమశేఖర శర్మ, కందుకూరి ఈశ్వరదత్తు గార్లు చెప్పుకోదగినవారు.

ధైర్యశాలి

ఆయన తాను నమ్మిన దానిని నిర్మొహమాటంగా చెప్పేవాడు. ఆంధ్రుల చరిత్ర వ్రాసేటప్పుడు, కొన్ని విషయాలను నిరూపించవలసి వచ్చినపుడు ఎదుటివాళ్లను కాదని ధైర్యంగా నిలబడేవాడు. తల ఎగిరి పోతు దనే భయం కలిగినప్పుడు కూడా ఆయన స్వభావంలో మార్పురాలేదు

లోకాన్ని, వ్యక్తులను దృషిలో పెట్టుకోకుండా చరిత్ర చరిత్ర కోసమే అనే నీతితో వర్తించిన మేటి చరిత్రకారుడు ఆయన. ఒక కులానికి చారిత్రకమైన ఆధారాలను బట్టి కొద్దిగా కళంకాన్ని ఆపాదించే మాటలు వ్రాయవలసి వచ్చిందట. అప్పుడు ఆ కులస్థులు ఆయనను బెదిరించారట. అందుకు ఆయన ఎంత మాత్రం చలించలేదు. పైగా ఆయన యదార్థాన్ని పేర్కొని తీరాడు.

ఆనాడు ఆయన ఆంధ్రజాతి చరిత్రను ప్రకటించి ఉండకపోతే ఆంధ్రజాతి చరిత్ర మరుగుపడి అంధ్వత్వాన్ని అనుభవించేదేమో! ఆయన నిర్విరామ కృషి ఫలితంగా మనజాతి చరిత్ర సహేతుకమైన రూపును దిద్దుకొన్నది. పరిశోధన తరువాత పరిశోధనలు జరిపి ఆంధ్రజాతి చరిత్రకు రూపురేఖలను దిద్ది ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అందుకు ఆయన కార్యశూరత, మిత భాషిత్వం, త్యాగ శీలత, నిష్పక్షపాత వైఖరి సాక్ష్యాధారాలు.

మిత భాషి

సత్యం, శీలం చరిత్రకారునికి అత్యంత ఆవశ్యకాలు. ఆయనలో ఈ గుణాలు సమపాళ్లలో కలిసి ఉన్నాయి. ఆయన మితభాషి, ఆయన మాటలు రాక మిత భాషి కాలేదు. సత్యం కోసం ఆయన మితభాషి అయ్యాడు.


ఆంధ్రుల చరిత్ర సంస్కృతులపై అపారమైన పరిశోధన చేసి ఆంధ్ర దేశంలో శాశ్వత కీర్తిని సంపాదించుకున్న కందుకూరి వీరేశలింగం గారి తర్వాత వీరిపేరు చెప్పుకోవచ్చును. ఆ తరువాత ఆంధ్రుల హృదయాలలో సుస్థిరంగా నిలిచిపోయిన వారు కొమర్రాజు లక్ష్మణరావు గారు మరియు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు.

తాను ఎంతో కృషి సలిపి, పరిశోధనలు జరిపి వ్రాసిన దానితో తృప్తిచెందక ఇంకా ఎన్నో కొత్త ఆధారాలను సంపాదించి ఆంధ్రుల చరిత్రను సమగ్ర సుందరంగా తీర్చిదిద్దాలనుకొనే సమయంలోనే ఆంధ్రుల దురదృష్టమా అంటూ ఆయన 1939 మే నెలలో కొవ్వూరులో అస్తమించారు. కాని ఆయన వెలిగించిన చారిత్రిక విజ్ఞాన చైతన్యం దీప్తిమంతమై ఆంధ్ర దేశంలో ప్రకాశిస్తూనే ఉన్నది. ★

ప్రజాస్వామ్యం

మనం ఆకాంక్షించే మన స్వాతంత్ర్య రక్షణ, సాంఘికాభివృద్ధి మనంతట మనం నిర్మించుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సాధించగలమని మన ఉద్దేశ్యము. పార్లమెంటరీ ప్రజాతంత్రాన్నే మనం ఎందుకు ఎంచుకున్నాం. భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలను ఇవ్వగలదని మనం అనుకున్నాం కాబట్టి. అయితే మనం ఆశించే ఆ ఉత్తమ ఫలితాలు ఏమిటి? అవి వారి సంక్షేమ, మన లక్షోపలక్షల ప్రజల ఆనందం.

—నెహ్రూ



2

ఇంద్రకీలాద్రిపై ఒక జమ్మి చెట్టు క్రింద పండరంగుడు కూర్చుని ఉన్నాడు. అనుదినం వస్తున్నట్లే, ఈనాడూ అతగాడిచటికి వచ్చాడు. అయినా, అతగాడీ రోజున అలవాటు ప్రకారం ఎత్తునుండి బెజవాడ శోభను తిలకించి ఆనందించడం లేదు. అర్ధనిమీలిత నేత్రాలతో ఆలోచనా నిమగ్నుడై ఉన్నాడు. పురాణ కథలన్నిటినీ నెమరువేసుకొంటున్నాడు.

ఈ ఇంద్రకీలాద్రిపైననే అర్జునుడు తపస్సు చేశాడు. శివునితో పోరాడి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. ఈ గాథను ఎన్నాళ్ళనుండియో యెందరెందరో బెజవాడ పౌరులు సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ ఇతిహాసాన్ని తాను చిన్నప్పుడే విన్నాడు. ఎన్నిమారులో యీ కొండమీదకు తాను వచ్చాడు గాని యీనాడు వస్తున్న ఆలోచనలు తనకు ఎప్పుడూ రాలేదు. పాశుపతం వంటి దివ్యాస్త్రాన్ని తానుకూడా ఏవిధాన సంపాదించడం అనేదే ఈనాడు అతను గాఢంగా ఆలోచిస్తున్న విషయం. "నేను కూడా ఈ కొండపై అర్జునుడు తపస్సు చేసిన చోటనే ఉగ్రతపస్సు చేస్తే శివుడు కనిపించక పోతాడా? పాశుపతం ప్రసాదించకపోతాడా? అని అతను తర్కించుకొంటున్నాడు.

అంతలోనే అతడు నవ్వుకొన్నాడు. "కలియుగం ప్రవేశించిన నాలుగువేల సంవత్సరాల తరువాత మహాభారతంలో జరిగిన అద్భుతాలు జరుగుతాయా? మానవ మాత్రులకు ఆ మహేశ్వరుడు ప్రత్యక్షం అవుతాడా? కల్ల!" అనుకున్నాడు.

వెనువెంటనే అతడు 'లేదు. లేదు. ఇప్పటికే పరమేశ్వరులెంతమంది లేరు? వారికి సదాశివుడు సాక్షాత్కరించినట్టు చెప్పుకొంటారే.' అని మనస్సులోనే సద్ది చెప్పుకొన్నాడు. పాశుపతం వంటి దివ్యాస్త్రానికి గాండీవం వంటి విల్లు కావాలి. ఈ గాండీవం కూడా అర్జునునికి దేవదత్తమే. సాక్షాత్తూ ఆ అగ్నిదేవుడు ఖాండవదహన కాలంలో ప్రసాదించాడు. ఖాండవదహనం ... అంటూ మనసులోనే అనుకొన్నాడు పండరంగుడు.

వెంటనే అతని అంతర్నేత్రం ముందు కార్చిచ్చు కన్పించింది. చెవుల లోపల ఫెళఫెళార్భటులు విన్పించాయి. మండుతున్న వనాలు, ఎర్రని మంటలు, పసుపు పచ్చని మంటలు, మాడి మరణిస్తున్న జీవాల హాహాకారాలు, అర్జునుని విజయవిహారం అన్నీ కనబడుతున్నాయి. వినబడుతున్నాయి. మనోనేత్రం ముందు జ్వలిస్తున్న ఈ వెలుగు వెల్లువలో అంతకన్నా కోటి రెట్లు కాంతిలో ఒక భావం మెరిసింది. "అదా కీలకం! అదా కీలకం" అనుకున్నాడు పండరంగుడు.

"అర్జునుడు ఖాండవ వనాన్ని దహించాడు. విజయుడయినాడు. ఈ దినాలలో కూడా ఎవరేనా విజయం చేపట్టాలంటే శత్రుదుర్గాలు దహించాలి. అన్నియు దహించి తీరాలి."

ఇదే అతని ముందు మెరిసిన సత్యం. స్ఫురించిన ఈ ఊహతో ఉత్తేజితుడయ్యాడు. రెట్టింపు మనిషిగా మారినట్టయ్యాడు. ప్రపంచమంతటినీ జయించ గలనన్న ధీమా ఏర్పడింది.

అంతవరకూ అంతర్ముఖుడై ప్రపంచాన్ని మరచిపోయిన అతడు మళ్ళీ యీ లోకంలో పడ్డాడు. జమ్మిచెట్టు మీద ఒక కాకి అరుస్తూంది. పండరంగుడు తల యెత్తి చూశాడు. జమ్మి కొమ్మలను చూసి 'శమీ శమయితే పాపం' 'శమీ శత్రు వినాశనీ' అనుకొన్నాడు. శత్రువినాశనం...శత్రువినాశనం ... శత్రువినాశన విద్య తన కొక్కడికే ఇప్పుడు తెలుసు. అంతటిలోనే ప్రపంచమంతా తనను పేరుపెట్టి పిలుస్తున్నట్టు విన్పించింది.

పండరంగా! పండరంగా! పండరంగా! అంటూ మూడు దిశలనుండి ఎవ్వరో పిలుస్తున్నట్టు విన్పించింది.

ఎలుగెత్తి ప్వేశారుతంతో 'ఓయ్' అన్నాడు పండరంగుడు

రాచబిడ్డలు నల్గురూ నాలుగు దిశలనుంచీ వచ్చారు. సాగరాన్ని కలుసుకుందుకు పర్వులిడుతున్న నదీ, నదిని కలుసుకోడానికి ఉవ్విళ్లూరే కడలీ కలుసుకొనే విధాన పండరంగుడూ విజయాదిత్యుడూ కలుసుకున్నారు. రాచబిడ్డ విజయాదిత్యుడు రెండు చేతులూ జాచాడు. పండరంగుడు తన రెండు చేతులతో అతగాణ్ణి తన హృదయానికి చేరువగా తీసుకొన్నాడు.

తృప్తితీర కౌగలించుకొనిన పిదప విజయాదిత్యునిలో చిరుకోపం వచ్చింది. కౌగిలి వీడి కన్నులెర్రచేసి నెచ్చెలిని జూచాడు.

"ఇంతదనుక నిచటనే యుండి ఎంత పిలిచిన పలుకలేదేం" అని అడిగాడు.

"వినబడలేదు" అని బదులిచ్చాడు పండరంగుడు.

"వినబడలేదా? వినిపించుకో లేదా?" అన్నాడు ఎత్తిపొడుస్తూ మల్లపరాజు.

'చాలులే నీ ఎత్తిపొడుపు' అనినట్లు తమ్ముని వంక కొరకొర చూసి పండరంగుని వంక తిరిగి "ఏల వినబడలేదు పండరంగా?" అని సాదరంగా ప్రశ్నించాడు.

"నేటి రాత్రినుండి ఒకటే ఆలోచన. పాశుపతం వంటి దివ్యాస్త్రం, దివ్యశక్తి మనం కూడా ఎలా సంపాదించడమా యని మథన పడుతున్నాను" అనినాడు పండరంగుడు.

'పాశుపతమతాన్ని అవలంబిస్తే అదే దొరుకుతుంది' అన్నాడు మల పరాజు.

'పాశుపతం కాదు, కాలాముఖుల కఠోరసాధన చేస్తేనే అణిమాది అష్టసిద్ధులూ సిద్ధిస్తాయి' అనినాడు నృపకాముడు.

కనిష్ఠులిద్దరూ శైవమతంలోని రెండు తెగల గురించి ప్రస్తావించారు. అంతలోనే విజయాదిత్యుడు పండరంగుని కళ్లలోకి చూస్తూ "ఆ దివ్యాస్త్రాన్ని ఎలా సాధించడమో తెలిసిందా?" అని యడిగాడు. "ఊఁ" అని తలూచాడు పండరంగుడు.

ఒక్క విజయాదిత్యుడు తక్క తక్కిన ముగ్గురూ చిత్రపడ్డారు. చిరుత వయస్సు నుండియు పండరంగుని ప్రజ్ఞలో విజయాదిత్యునికి నమ్మకమున్నది.

"ఈ జమ్మి వృక్షం కిందేమో కూర్చుని అదేపనిగా యోచించాను. తట్టింది" అని బదులు చెప్పినాడు పండరంగుడు.

'మజ్హారే! బుద్ధదేవునికి రావి చెట్టుక్రింద, పండరంగునికీ జమ్మి చెట్టుక్రింద తత్త్వం బోధపడినది' అన్నాడు విక్రమాదిత్యుడు.

"సముచితమే కదా? జ్ఞానులకు రావిచెట్టు, పౌరులకు జమ్మిచెట్టు" అన్నాడు చిరుహాసం చేస్తూ విజయాదిత్యుడు. "మరి చాను, ఎప్పుడొచ్చారు?" అని ప్రశ్నించాడు పండరంగుడు.

రాచబిడ్డలు ముగ్గురూ, తమ మాతృదేవి శీతామహాదేవితో మాతామహుల రాజ్యానికి వెళ్లినారు. ఆమె రాష్ట్రకూటుల ఆడపడుచు, సవతితమ్ముడు నృపకాముణ్ణి విజయాదిత్యుడు తనతో తీసుకొని వెళ్లినాడు.

"పది దినముల క్రిందటనే వేంగి నగరానికి తిరిగి వచ్చాము. ఈ దినముననే బెజవాడకు వచ్చినది" అన్నాడు విజయాదిత్యుడు.

"మాల్యఖేటక నగరం అతివైభవముగా నుండునట?" ప్రశ్నించాడు పండరంగుడు.

"మన వేంగి కంటె వైభవోపేతమేమి కాదు" అన్నాడు విజయాదిత్యుడు.

"కాదన్నయ్యా మాల్యఖేటకంలో వాహ్యాళి ఎంత బాగుంది!" అని మెచ్చుకొన్నాడు మల్లపరాజు. ఆ మాట నెత్తగనే నొచ్చుకున్నాడు విజయాదిత్యుడు.

"మల్లపా?" అంటూ గద్దించాడు.

విజయాదిత్యుడు యేస్థాయిలో గద్దించాడో ఆ స్థాయిలోనే అంతకన్న కోపంగా 'అన్నయ్యా' అన్నాడు మల్లపరాజు.

"ఆ వాహ్యాళి పేరెత్తకు!" ఆజ్ఞాకంఠంతో అన్నాడు విజయాదిత్యుడు.

"ఏమి? నిజమాడ నిష్ఠురమా?" యనినాడు మల్లపరాజు.

"నిజమాడడంలో నిష్ఠురం లేదుగాని అవమానం తల్చుకొనుటలో ఆనందంలేదు కదూ?" అని ఎదురు ప్రశ్న వేశాడు విజయాదిత్యుడు.

"ఎవరికీ అవమానం?" ప్రశ్నించాడు మల్లపరాజు.

"వేంగీ చాళుక్య వంశానికే అవమానం. మన తాతగారి తమ్ముడు ద్రోహి మలఘాతనుడు గౌరవహీనుడు, చాలును. ఆ మాల్యఖేటకంలోని వాహ్యాళిని వెట్టివానిగా కట్టలేదా?"

"కట్టినారు సత్యమే. నన్ను గద్దించినంత మాత్రాన ఈ కళంకం తొలగిపోతుందా?" అన్నాడు మల్లపరాజు.

"పోదు. పోదు. శాశ్వతంగా నిలచిపోయేటట్టు శాసనాలు కూడా వారు చెక్కించారు."

"వారు మన తల్లివంక చుట్టాలేగా!" అని ప్రశ్నించాడు, సమాధానపడుతున్నట్టు, మల్లపరాజు.

"తల్లి వంకవారు తండ్రి వంకవారిని అవమానం చేస్తే సంతోషించాలా?" అని ప్రశ్నించాడు విక్రమాదిత్యుడు కోపంతో.

"ఆ అవమానం జరిగినది ఎప్పుడో కదా?"

"అయితేమాత్రం యేమిటి సోదరా? వారిప్పటికీ చెప్పుకోనుట లేదా?" ఎదురు ప్రశ్నవేసి తలవంచాడు విక్రమాదిత్యుడు.

"వాస్తవానికి ఆ అవమానం ఫలితంగానే కదా మనం పుట్టినది?" నవ్వుతూ అనినాడు మల్లపరాజు.

"ఛీ సిగ్గులేదా? పరాభవం వలన ప్రభవించిన వాళ్ళమా?" చండకోపంతో ప్రశ్నించాడు విజయాదిత్యుడు.

"కాదు. ఒకరి పరాభవం యింకొకరి ప్రతాప ప్రదర్శనకి ఆస్కారం. చిన తాతగారు అంత సిగ్గుచేటుగా ప్రవర్తించబట్టే పెద తాతగారు విజృంభించారు. రాష్ట్రకూటులని ఎదిరించారు. నూటఎనిమిది యుద్ధాలుచేసి వాళ్ళని ఛిన్నా భిన్నం చేశారు. తాతగారి తాకిడికి తట్టుకోలేక ఆ రాష్ట్రకూటులు కాళ్ళబేరానికివచ్చి వాళ్ళ ఆడపడుచును వారికి కోడల్ని చేశారు. మనం పుట్టాం వారికి" అన్నాడు మల్లపరాజు.

ఇదంతా నిజమే. ఏమాత్రం సత్యదూరంకాదు. ఈ చారిత్రిక సత్యాలని ఎవరూ కాదనలేకపోయారు. మల్లపరాజుకి జవాబు చెప్పలేకపోయారు.

"ఆదిలో అటువంటి అవమానం జరిగి యుండకపోయినచో అమ్మగారికీ, నాన్నగారికీ వివాహం జరిగి ఇంతటి చల్లని తల్లి కడుపున మనం పుట్టే అదృష్టం కలిగేదా?" అన్నాడు మల్లపరాజు.

"నిజమే నన్నయ్యా మల్లప చెప్పింది కల్లకాదు" అన్నాడు విక్రమాదిత్యుడు.

"మన వేంగీ రాజులకు అంతటి రాష్ట్రకూటులు వియ్యాలవారవడానికి ఆదిలో జరిగిన అవమానమే కారణం అయింది" అన్నాడు మల్లపరాజు.

విజయాదిత్యుడు యీసడింపుగా 'హుఁ' అని "ఈ వియ్యమందుట యిదియే తొలిసారియా? మన తల్లిగారి బామ్మగారు వేంగీ రాజుల ఆడబడుచేగా. ఆమె స్వయానా మన తాతగారికి చెల్లెలు. మన అమ్మగారి కామెగారి పేరేగా పెట్టినది. మన తండ్రిగారు మేనకోడలనే చేసుకొన్నారు" అన్నాడు విజయాదిత్యుడు.

"అయినను. ఇటువంటి బాంధవ్యం గనుకనే మనం యెంతటి అవమానాన్నైనా మరిచిపోవాలి" సమాధానం యిచ్చి ఊరుకున్నాడు మల్లపరాజు.

"కల్ల. అవమానం అవమానమే. మాల్యఖేటక నగరములో ఆ వాహ్యాళి ఉన్నంతకాలం అది మన వేంగీ చాళుక్యులకు మాయని మచ్చే" అని ఉద్రేకంతో ఊగిపోయాడు విజయాదిత్యుడు.

"అంటే? ఆ వాహ్యాళిని చెరిపి వేయాలనా మీ ఉద్దేశ్యం?" అని యడిగాడు మల్లపరాజు.

"తాతగారూ తండ్రిగారూ అనుమతిస్తే దానిని అవలీలగా రుద్ర భూమిని కావిస్తాను. ఏమంటావు పండరంగా?" యని పండరంగుని వంక తిరిగి ప్రశ్నించాడు విజయాదిత్యుడు.

ఇంతవరకు యన్నదమ్ముల చర్చలో జోక్యం కలిగించుకోని పండరంగుడు 'నిస్సందేహంగా' అన్నాడు గంభీర స్వరంతో. 'కాలానుగతంగా మేం కొలుచుకొనే రాజవంశాని కప్రతిష్ఠ తెచ్చే ఆ చిహ్నమును నేలమట్టం చేయడంలో సందేహం దేనికి?... సెచ్చెవీ, వెంటనే రాష్ట్రకూట రక్కసుల రాజధానిలో యున్న ఆ యవమాన చిహ్నాన్ని ఊడబెరకాలి' ఆ వాహ్యాళిని రుద్ర భూమి చెయ్యాలి. ఆజ్ఞాపించు' అనినాడావేశపూరితుడై.

"ఆజ్ఞాపించడానికి అన్నగారేం అధినేతలుకారే! మీ రాష్ట్రకూట బంధుగులను రక్కసులుగా పేర్కొనడానికి నీ కెన్ని గుండెలున్నాయి? మా తల్లిగారు రాష్ట్రకూటుల ఆడపడుచని మరిచిపోకు. అన్నగారూ, మేనమామలపై మీరు కత్తికట్టారని తెలిస్తే అమ్మగారెంత బాధపడతారో ఊహించలేరా" యని అడిగాడు మల్లపరాజు.

ఈ మాటలు వినగానే విజయాదిత్యుని కోపం చల్లారిపోయింది. పండరంగుని భుజముపై చేయివేసి "తల్లిగారిని బాధ పెట్టే పని నేనేం చేయగలను? పండరంగా బంధుత్వాన్ని చూసి పరాభవం సహించాలి. పద, చేబ్రోలు కుమారస్వామి జాతరకు విజయం చేశాడు. వెళ్ళి సేవించుకుందాము" అని ఆప్యాయంగా స్నేహితుణ్ణి ఆహ్వానించాడు.

(సశేషం)

పురాప్రాభవ చిహ్నాలను కాపాడడం ప్రతిపౌరుని కర్తవ్యం

వందేమాతరం

మదిగొండ వీరభద్రమూర్తి

శౌర్య ఖండము

[ఫాడ్కేను ఆయన సతీమణి మాతృదేశ విముక్తి యజ్ఞము ప్రారంభించుడని ప్రబోధించిన సందర్భంగా జరిగిన సంభాషణములో ఫాడ్కే సతీమణికి ఆంధ్ర వీరుడు ద్వారబంధాల చంద్రయ్య కథ చెప్పిన ఘట్టము.]

తాతియాతోపె తరువాత దారసిల ద్వ
దన్యు డైన ధన్యుడు లేడ యనిన సతికి
మరియు ననె బతి యట్టి రెవ్వరము కాము
నొక్క డున్నాడుసుమి! తెన్ను మొక్కలీడు.

అతడు ద్వారబంధాలవంశాబ్ధి గన్న
చంద్రయాఖ్యుడు సర్కారుసైనికులు వ
ధింప వింటి నాతని పేరు చెప్ప శత్రు
ధైర్యగృహమున ద్వారబంధమ్ము ప్రీలు

పుడమికి హృదయమ్ముపొంగు పచ్చికబీడు
    తొనకు చున్నది ప్రాణఘనము తళుకు
ఇరు తటమ్ముల నేచి తఱ చైన తరువాటి
    కురియుచున్నది పుల్లకుసుమవృష్టి
పలుశాఖల ద్విజాళి బిలబిల కొలకొల
మొరయుచున్నది శ్రుతిముగ్ధరవము
శిలలు ముక్కలుగ గోసి తరంగ సంఘమ్ము
దుముకుచున్నది మహోద్ధురబలమ్ము.

జరుపుకొనుచున్నది ప్రవాహజనితశబ్ద
గానమున శూరవర్ధంతి గౌతమీ స్ర
వంతి యున్నది తన్నదీపార వన్య
సీమలో జంద్రయ నివసించెడి బవంతి.

పులులు వంతుల మార్పు నలవర్చికొని కావ
    లా గాయు దేజీల లాయమునకు
జాంబవంతుని కోవ జామున కొకమారు
    ప్రహరిసాగును గృహప్రాంతమునకు

క్రొత్తక్రొత్తవి చేరి కోడెత్రాసులు రక్ష
గావించు నాయుధాగారమునకు
బవలు డేగలును గూబలు రేయి న్యాయ ని
ర్వహణదక్షులు చారత్వమునకు

ననుచరుల టన్న వారు, చే దై శరమ్ము
తీయ నై మనమ్ము గొబలు కోయదొరలు
గడ్డబానిసమును బాప గౌతమీయ
వనమునకు రామచంద్రయ్య ప్రభువు గాగ.

కోయవా రమాయికు ల నాగరకులు వ
స్త్రములు నిండు తాల్ప శ్రద్ధ సేయ
రైన నేమి వార లధమస్థులా? కారు
నీతియందు జాతి నియమమందు.

ఐన నేమి గొప్ప యధికారి శ్రీమంతు
డైన నేమి చదువ రైన నేమి
మానవత్వమునకు ప్రాణమ్ము నీతి య
దొంటని యల దొగుడు వంటి వాడు.

సద్గుణమ్ము లేక చలువ దుస్తుల మోత
నాగరకత కాగ నడచు నెవడు
రేవునుండి నగరి రే వేలువానింటి
కరుగు ప్రాణి కాత డగ్రభవుడు.

కల దొక పెద్ద యూ రచట గానన సీమ సమీప మందు, సం
కులముగ సంత సాగు నట, గోయలు పూరుష లంగనల్ సము
జ్జ్వల గతి వచ్చి యచ్చటకు వారము వారము దర్పణాది క
మ్ముల కొఱకమ్ము చంద్రు వనభూమి లభించిన వస్తుసంపదల్

22-9

పెట్టు పోగాకు నివ్వి వెదుళ్ల ముత్యాలు
రా: కొల్చికో కూనలమ్మతోడు
కొనర: మామా: మంచి గొంగడి యిచ్చి యీ
చిల్లి లేనిది పెద్దపిల్లితోలు
ఒసగి సెనగ పప్పును సరికిసరి చార
పప్పు నెట్టుకొనరా: కుప్ప కుప్ప
ఇది జుంటితేనె మొన్న దులిపితిమి దొరా!
దీనిని గొని మంచినూనె యిడురా!

యనుచు గొనుకోలు దారుల నామళించి
యాటవిక సంపదను గోయ లమ్ముచుంద్రు
వర్తకులు తడువొంత ప్రవర్తకులు ని
రంతర హిరణ్యరంగ నర్తకులు కాగ

అందు వచ్చె సైనికాధికారి యొకండు
భటులు చిత్రవర్ణపటులు కొలువ
వెదకి వెదకి చూపు వేనినో విసు గొంది
యతడు ముఖ్యుతో రహస్య మాడె

చని యిటునటు నా ముఖ్యుడు
వనవస్తువు లెన్నొ చాపపై బఱచి నితం
బిని యొకల కూరుచొని య
మ్మునెడన్ నిల్వబడె మనసు పులిసినయటు లై

ఈ స్త్రీయే 'స్త్రీ' యనగా
ని స్త్రీ మడత వలె నున్నదే! నలుగక మై
యస్త్రం బిదె యైదవది సు
మా స్త్రీన కని వాడు యువతి నభివర్ణించెన్

ఓ! నా లవలీ! కేలీ!
యీ నీ చాపపయి నున్న వివి యేమి? యనెర్
వాని నెగాదిగ మఱిమఱి
మై నారసి కోయజాతిమణి యోయి! దొరా!

దొర: మువ్వన్నె మెకాల రొమ్ములకు గత్తుల్ గ్రుచ్చిమావారుద
ల్తురు దానర్ వెలివడ్డ యె క్కలివి మేలున్ గూర్చు నాన్
భాగ్యపున్
దొరువుల్ మా కవి కావు నే డివి యు యంచున్ దద్వ
ధూటీకుచో
పరి లాతీకొన మోపి వాడు పొడిచెన్ వ్యాళీఫణంబుంబలెన్

కన్నుల దప్పిక దీర్చిన
యన్నులలో మిన్న మదపుటాకలి దీర్పన్
గ్రన్నన లేవే పున్నెము
కన్నము త్రవ్వినది భాగ్యఖని కనియు ననెన్

అనుడు దదీయసైనిక దురాత్ముని బాహు
వలాబు వట్లు త్రుం
పిన మగవాని పేరు వినుపింపు మటంచడుగంగ భార్యలి
ట్లనె బలవంతు డమ్మి! మదహస్తిని హస్తము చాచి కొట్టు న
య్యనువున గొట్టె న వ్వనచరాంగన గల్లము వాయ
వానినిన్

ఎవ రెటు లైన నేమి మన కేల య టంచును, ధర్మరక్షణ
వ్యవహృతి శక్తు దీశ్వరుడె యంచును మత్కులజాత
కాద యీ
యువిచ యటంచు, నీ ప్రభుత యుండుటచే మనుచున్న
వార మౌ
ట వలదు రాజవిద్వర మ టంచు నుపేక్ష వహించి రందఱున్

ఎవడు మగవా డ టంచు నేడు వచియింత
మున్నచో వాడు స్వర్గమం దుండు లేక
యిందుజెఱనుండు గానమందునుండు
వీడు వాని జాడకొఱకు వెదకుచుండు

పురజనులకంటె శ్రేష్ఠులు
గిరిజనులే వారు కూడి కేక లిడుచు నో
మురికి మనసు మానిసి! నిను
నఱకెద మని వెంటనంటినా రా భటునిన్

తనవద్ద శస్త్రములు కల
వనుస్పృహయే లేక భటుడు పరుగిడె గాలిన్
దృణ మటుల బలము బెండ
య్యను మెండయ్యె వణకుపడి యెనిలన్ పాగా

కోలలు గోళ్లగా నడరు కోయెతచేతుల ధాటి గాయముల్
తోరము గాగ నా భటుడు దూకె నిజాధిపుల చెప్పెవా
డో రయ మొప్ప గ్రోవుల గడున్ తగిలింపగ జేసె సేనచే
గ్రూరత కోర్వజాలక పరుంగిడె నా గిరివారిబృందముల్

పరుగిడి వారు చంద్రయకు బాటును జెప్ప నతండు యోజనా
పరుడు గ్రహించె దన్ను జెఱబట్టగ వచ్చి ప్రభుత్వనేతయే

జరిపెను గ్రంథ మింత లన చక్కియు నుక్కు నెఱుంగ నంచు మం

ధరహాస దానసమ్మున వనస్థల సిద్ధము సేసె బోరికై

దురముల నందు నందు దన తోడుగ బోరిన వారి నస్త్రమం

దిరమున కాత దేగి యరుదెం డన గత్తులు గండ్రగొడ్డళుల్

గరిశవిదిగ్ధకాండములు కార్ముకముల్ గొని కోయవారు ని

ల్చి పగవారి గోయక స్పృశింపడు కేల్కడి నన్న వార లై.

నడినెత్తిన్ ముడిగొన్న జుంజురుకురుల్ నానాలతాబంధముల్

కడెముల్ తాయెతు లొప్ప నేత్రములు గ్రక్కన్ జండ్ర నిప్పున్ వడి

న్నడచెన్ వన్యజనము చంద్రయబడిన్ జై కొండలమ్మా! యటం

చెడమున్ గొల్పని ముండ్లచెట్లకొమ లెందే జీరినన్ గానరై

తెల్లని పాగతోడ మెలిదీరిన మీసము సొగదోడ నా

బల్లిదుడున్ సుదీర్ఘ సమభక్తశరీరుడు ధీరుడున్ మహా

మల్లుడు సాగె జంద్రయసమాఖ్యుడు భారత కేతనమ్ము ప్రా

ణోల్లసితమ్ముగా నడచుచున్నాడొ! జోదుల కగ్రగామి యై.

అని తన్ను చూచి తళతళ

గనులన్ మెఱయించుచున్న కాంతకు ఫాడ్కే

వినిచె నిటు మరియు నా వరి

కనుపించెను దవ్వునుండి కన నొక్కడుగా

పగర గుడారముల్ దరిసి బంట్లను జంద్రయ నాల్గువైపులం

దు గదియ దీర్చి వాలయిన దగ్గరి మిట్టను నిల్చి యగ్నిబా

ణగణముతో సశేషదహనం బొనరించెను కాన యైన బొ

గ్గగు నొకకొంత బూడిది నిరర్థకమం చనుకోగ గోయతల్

పడ్డ తుపాకిగుం డినుము పై బడిన ట్లయి కొంత నొచ్చియున్

గొడ్డము లేని కోయపరి కో! యని తో డెనయంగ గోసినా

డడ్డమునిల్వకోత నహితేషము జంద్రయ ఖడ్గపాణి యై

జిడ్డుగ బాఱె వాని విడి చిందిన గౌతమి రక్తవేణి యై.

తరవళి బరిచి తుపాకీ

గరిడీపై చేయి! గోపికాబాయీ!గ

గ్గురుపఱచు నాంధ్రపౌరుష

చరిత్రఘట్ట మిది వినుము సాకల్యముగా

ఇఱుకున బడి భారత రా

ష్ట్రిరమాజీవనము వోలె సాగు నొకట నం

దిరు గిరుల నడుమ గోదా

వరి చంద్రయ యుండె గొండపై నవనిదరిన్

వానిని బట్టికో బ్రతిన బట్టి యటన్ జనుదెంచి యాంగ్లసే

నాని మరొక్కడిద్దరి వనమ్మున బెబ్బులివేటపొంచె ను

న్నా నని పొంచిపొంచియు రణత్వరమాణచమూసమేతు డై

యా నది దాటి కొండవయి కద్దరి బ్రాక దొడంగె వేగుతో

ఈ నడిమింటికాన దహియింపుడుమందిడి ప్రేల్చి యశ్మముల్

సేనతలల్ బగుల్ప దొరలింపుడు గుబ్బలిగుబ్బనుండి తో

డ్తో నని శత్రుయాత్ర కనుడో!యని చంద్రయ కోయరాదణా

కానతి పెట్టెనో ఫెళఫెళార్భటి పర్వులుబెట్టె మింటిపై

భారతభూమిలో బసిడిపాతరలన్ దెగద్రవ్వి యెత్తి నౌ

భారతమమ్ముగా నెవరు వార్నిధిపై గొనిపోవుచుందు ర

వ్వారలు కూర్కవచ్చు నిక జ్వాలల వెచ్చని కొండ స్వాగతా

చారము తీర్చె నంచు నొక శబ్దము వించె నవాబ్ద నాద మై

కత్తిని బట్టి గెల్చితి మఖండము భారతమండలమ్ము ను

వ్వెత్తుగ, దానిపై నదిమి పెట్టితి మిప్పుడు కత్తి నంచు వా

క్రుత్తురు పేరు వారి చెయి కొంకర తీఱ నిదే శరాగ్రజా

గ్రత్తరళాగ్నిశిఖ యని కంఠము వించె దిశావకుంఠ మై.

భారతమ్మ రోజాపూల పాన్పు టంచు

నెంచినా మగ్నిపర్వత మంచు నెంచ

మైతిమే! యనుకొని రభియాత్యగణము

ప్రకృతికడుపున మంటలు భగ్గు రనగ.

గంధకవాసనా కలిత గాఢవిసారిత భీమధూమ భా

రాంధులు కాననాక్రమణులంత్యము చూపున నొండొకళ్ళ ని

ర్గంధముగా గనుంగొనుటకై సలిపెన్ సహకారమున్ మరు

ద్బంధువు వారి చుట్టుతరువాటము గాటముగా దహించుచున్.

ఆ వనచరాళి రామచంద్రయ్యయండ

చూచుకొని ద్విగుణీకృతస్వాతశక్తి

గండపాషాణముల మార్తు దండుపైని

విడిచె మెద డూడి తల పిప్పిపిప్పి గాగ

కాంత! యిది నిన్న మొన్న సంగతియ సుమ్మి

యతనికిని నాకు దూర మత్యంత మగుట

గలసికొన మైత్రి మెందేని కలయగలము

ప్రక్కలో బల్లె మాతండు ప్రభుత కిపుడు ★

క్షామంపై యువత దండయాత్ర—

తిరుమల యువతుల శిబిరం

శ్రీ ఎం. చంద్రశేఖరయ్య

నిత్యకల్యాణం, పచ్చతోరణంగా లక్షలాది యాత్రీకులను నిత్యము ఆకర్షిస్తున్న శ్రీవెంకటేశ్వర సన్నిధియైన తిరుమలనేడు దేశవ్యాప్తంగా క్షామంపై యువతరం జరుపుతున్న దండయాత్ర శిబిరానికి నిలయమైంది. తిరుమలకు తీర్థయాత్రకో, విహార యాత్రకో చేరిన బృందము కాదిది. ఒక వినూత్న దృక్పథముతో, ఆశయముతో, తిరుమలలో దైవానికి ప్రీతి అయిన సమాజానికి యుపయుక్తమైన సేవా కార్యక్రమ శిబిరమే నేటి ఈ శిబిరముగా గోచరిస్తున్నది. అందుకే దీనిని ప్రగతి యాత్రగా భావించవచ్చును. జాతీయ కార్యక్రమము క్రింద ఏర్పాటు చేయబడిన ఈ శిబిరము మారు మూల పల్లె గ్రామాలలో గాక తిరుమలలో ఏర్పాటు చేసిన జిల్లాకలెక్టరు శ్రీ ఎ. వళ్లియప్పన్‌గారు అభినందనీయులు. ఎందు చేతనంటే దేశములో అన్ని ప్రాంతాలనుంచీ వచ్చే ప్రజలు ఈ ఉత్తమ సంఘసేవా కార్యక్రమాన్ని తిలకించే సదవకాశం కలిగింది.


తిరుమలకు మంచినీటిని సరఫరా చేసే గోగర్భ జలాశయము ఆనకట్ట క్రింద, సుందర ఉద్యానవనాన్ని ఏర్పరచే బృహత్కార్య క్రమములో ఈ శిబిరవాసులు పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో 50 మంది తిరుపతి శ్రీ పద్మావతీ మహిళాకళాశాల, కె. వి. ఆర్. ప్రభుత్వ మహిళాకళాశాలను కర్నూలునుంచి 25 మంది, స్థానికులైన 25 మంది యువతులు పాల్గొంటున్నారు. ఈ శిబిరాన్ని గతవారంలో జర్నలిస్టుల బృందము జిల్లా పౌరసంబంధశాఖాధికారి ఆహ్వానము మీద సందర్శించడం జరిగింది. సేవాభినివేశము, ఉరకలువేసే ఉత్సాహము కల పద్మావతీకళాశాల సోషియాలజీ లెక్చరరు కుమారి. పి. రాజేశ్వరి, శిబిర నిర్వాహకురాలుగా, పత్రికాప్రతి విధుల బృందానికి స్వాగతంచెప్పి, శిబిర విశేషాలను గూర్చి తెలియజేశారు. ఏనాడూ ఎండ ఎరుగని విద్యావంతులైన యువతులు మండుటెండలో హోరుగాలిలో ఆ కఠిన శిలాతలములపై భూమిని చదునుచేసి మొక్కలను నాటడానికి సిద్ధపరుస్తున్న దృశ్యంచూచినపుడు, నేటి యువతీయువకులు సమ్మెలు, సత్యాగ్రహాలు, జాతీయ ఆస్తులకు నష్టం కలిగించే కార్యక్రమాలకు పరిమిత మౌతున్నారు అనినేడు వాడుకలోనున్న దురభిప్రాయం తొలగదు. నిజంగా ఈ శిబిరం యువతులను నిర్మాణాత్మకమైన కార్యక్రమాలవైపు దృష్టిని మరలించి దేశాభ్యుదయానికి కృషిచేసేందుకు వీలుకలిగిస్తున్నది.

శిబిరవాసులైన విద్యార్థినులను పరామర్శించినపుడు, తాము నాలుగుగంటల పాటు చేసే శ్రమదానం ఒక నూతన అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. ఎన్నడూ తమ గృహాలలో సైతము ఏ చిన్న పనిని చేయని కొందరు యువతులు తాము కాయకష్టంలో గల విలువను గుర్తించగలిగామని చెప్పారు. శిబిరదైనందిన కార్యక్రమములో ఉదయం 8గం॥ నుండి 12గం వరకు శ్రమదానము, సాయంత్రం 3గం॥నుండి తిరుమలలో సాంఘిక, ఆర్థికపరిస్థితులసర్వే ప్రధానమైననేటి సమస్యలపైన ఉపన్యాసములు, సాంస్కృతిక కార్యక్రమములు ఏర్పాటుచేయబడినవి. శిబిరనిర్వాహణకు రూ. 11,000/- కేంద్రప్రభుత్వము మంజూరుచేసినది. తలకు రూ. 4/- ల చొప్పున దినమునకు ఆహారవసతులు ఏర్పాటుచేయుటకుగాను ఇవ్వబడుచున్నది. తిరుమల–తిరుపతి దేవస్థానమువారు ఉచిత వసతి వైద్యసౌకర్యమును కలిగించారు. సమాచార పౌరసంబంధయాత్ర శాఖవారు డాక్యుమెంటరీ చిత్రప్రదర్శనలను ఏర్పాటు గావించిరి. శిబిరవాసులు తిరుమల కొండపై వనమహోత్సవ కార్యక్రమంలో భాగముగా మూడువేల యూక లిప్టస్ మొక్కలు నాటడం గమనార్హము.

ఈ శిబిరములో అన్ని మతాలు, కులాలు, భాషల వారు పాల్గొంటున్న విషయము గమనించినప్పుడు సమాజసేవ, సంకుచిత భావాలకు అతీతమైనదని ఋజువగుచున్నది. కొందరు విద్యార్థినులు అతిథి ఉపన్యాసములు తమను ఎంతో విజ్ఞాన వంతులుగా చేయగలిగాయని, విద్యాలయములో నాలుగు గోడలమధ్య సంఘ వాస్తవ పరిస్థితులకు దూరంగా నున్నతమకు చైతన్యం కల్గించాయని, సమాజములోని సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపగలిగాయని చెప్పారు. తాము చేయవల్సిన సాంఘిక ఆర్థిక సర్వే సంఘములో అన్ని వర్గాల వారిజీవన పరిస్థితులను దగ్గర నుంచి చూచే అవకాశము కలిగించినదనే అభిప్రాయము వెలిబుచ్చారు.

శిబిర నిర్వాహణకు నియమింపబడిన అధ్యాపక బృందము వర్క్స్ సూపర్‌వైజరు శ్రీమతి త్రివేణి, కుమారి ఐ. అరుణకుమారి, కుమారి జైనాబీ. మదనపల్లె మండల వికాశాధికారిణి శ్రీమతి యన్. బాలామణి, పద్మావతీ మహిళాకళాశాల ప్రిన్స్‌పాలు శ్రీమతి లక్ష్మీదేవి తమదీక్షా దక్షలతో శిబిరాన్ని క్రమశిక్షణతో నిర్వహిస్తూ రాష్ట్రంలో "ఆదర్శశిబిరము"గా రూపొందించినారని భావించడానికి ఆస్కారము కలిగించారు. ఇటువంటి శిబిరాలు ముమ్ముందు ఎక్కువగా ఏర్పాటుచేసి నేటి యువతరాన్ని జాగృత పరచడం అవసరమనిపించడం సహజము. ★

శ్రీ బొజ్జం నరసింహులు



తెలంగాణా ప్రాంతంలో ముఖ్యంగా జంటనగరాల సాంఘిక, సాంస్కృతిక జీవనంలో బహువిధాల కృషి సల్పిన వయోవృద్ధులైన నాయకులలో శ్రీ బొజ్జం నరసింహులు ప్రముఖులు.

హిందువులలోని అంటరాని తనపు దురాచారాన్ని తొలగించటానికి జంటనగరాలలో 50 ఏళ్ళక్రింద ఆది హిందూసోషల్ సర్వీస్ లీగు స్థాపించబడింది. దానికి భాగ్యరెడ్డి కార్యదర్శి, బొజ్జం కోశాధికారి. ఆయన మున్నూరు కాపులనే సంగతినే మరచిపోయి శ్రీ వామన్నాయక్ 'నర్సింహులుగారు కూడా ఆది హిందువులే' అంటుండేవారు. ఆ రోజుల్లో హిందూ అగ్రజాతుల్లోనే విద్యావంతుల సంఖ్య చాలా తక్కువ. వానికి పాఠశాలలను పెట్టుకొనుటకు కూడా ప్రభుత్వం అనుమతించలేదు. అటువంటి గడ్డు కాలములో ఆది హిందువుల కోసం 22 పాఠశాలలను సవర్ణులకు 7 ఆంధ్ర పాఠశాలలను ఆయన జంటనగరాలలో స్థాపించాడంటే ఆశ్చర్యమే

శ్రీ జి. వెంకటరామారావు

కలుగుతుంది. కులభేదాలుకాని, కులశాఖలు, అంతశ్శాఖలను గాని పాటించే సంకుచిత స్వభావం కాదు బొజ్జంది. ఆయన స్థాపించిన పాఠశాలలో మాల, మాదిగ, వేగారి మొదలైన తరగతులకు చెందిన విద్యార్థులకు నిరాటంకముగా ప్రవేశం లభించేది. 1936, 37లో మహాత్మాగాంధీ హైదరాబాద్ విచ్చేసినప్పుడు తను నిర్వహించే 22 పాఠశాలల విద్యార్థులను, అధ్యాపకులతో మహాత్ముని సమక్షంలో పరేడ్ జరిపించాడు.

సాంస్కృతిక రంగంలో

జంటనగరాల ఆంధ్రుల సాంస్కృతిక రంగంలో బొజ్జం సేవలు నాలుగు కాలాలపాటు నిలిచి ఉండేవాటిలో అంబర్‌పేట శ్మశానవాటిక, మాడపాటి హనుమంతరాయ బాలికల ఉన్నత పాఠశాల, రామకోటిలోని సీతారామాంజనేయ దేవాలయం ముఖ్యమైనవి.

సురవరం ప్రతాపరెడ్డిగారి సంపాదకత్వంలో వెలువడిన గోలకొండ పత్రికకు 12 సం॥రాలు బొజ్జం మేనేజరుగా పనిచేశాడు. ఆంధ్ర మహాసభ కార్యకర్తగా ఉండి, అది స్టేటు కాంగ్రెసులో కలిసి పోయినప్పుడు బొజ్జం హైదరాబాద్ జిల్లా కాంగ్రెసు కార్యదర్శి అయినాడు. 1946లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సల్పినందుకు చెంచల్‌గూడ జెయిల్లో ఆరుమాసాలు నిర్బంధంలో ఉన్నాడు. 1951లో పోటీ లేకుండా కాచీగూడా వార్డునుండి హైదరాబాద్ పురపాలక సంఘం సభ్యుడుగా ఎన్నికైనప్పుడు నిజాం నవాబు ఆస్తిని కూడా ఇతర పౌరుల ఆస్తివలె లెక్కకు తీసుకొని పన్ను నిర్ణయించాలని మొదటిసారిగా వాదించిన ఘనత బొజ్జందే.

మున్నూరు కాపుల అభివృద్ధికై బొజ్జం 1926లో సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతన ఒక మహాసభ జరిపించాడు. దీని ద్వితీయ మహాసభ 1936 లోను తృతీయ మహాసభ 1952 లోను జరిగినవి. 1954 లో హైదరాబాద్ రాష్ట్ర షెడ్యూలు జాతులు, వెనుకపడిన కులాల సమావేశానికి బొజ్జం ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా పనిచేసాడు. కాకాసాహెబు కాలేల్కరు అధ్యక్షతన అఖిలభారత వెనుకబడిన కులాల కమిషన్‌లో అసోసియేటెడు సభ్యుడుగా రాష్ట్రంలో పర్యటించి హరిజనులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన కులాలకు ప్రభుత్వ సహాయం లభించటానికి పాటుబడ్డాడు.

వజ్రోత్సవం

వెనుకబడిన తరగతుల ఉద్ధరణకు ఆయన చేసిన సేవలకు గాను జంటనగరాల ప్రజలు యీ వృద్ధమూర్తికి ఎనభైమూడవ పడిలో గొప్పగా సన్మానం జరిపి వజ్రోత్సవ సంచిక విడుదల చేశారు.

స్వాతంత్ర్య సమరంలో శ్రీ బొజ్జం నరసింహులు గావించిన త్యాగాలకుగాను భారత ప్రభుత్వం ఆయనకు తామ్రపత్రం బహుమతిని ప్రసాదించేసి, నెలనెలా రెండువందల రూ.లు ఉపకార వేతనం యిస్తున్నది. ★



పేదల పాలిట ఊటీ - మదనపల్లె

మద్రాసు-బొంబాయి ట్రంక్ రోడ్డుపై చిత్తూరుకు పడమరగా 90కి మీ దూరములో బాహుదా నది ఒడ్డున సముద్రమట్టానికి 2231 అడుగుల ఎత్తులో ఉండి మదనపల్లె చల్లని వాతావరణానికి, ఆరోగ్యకరమైన గాలికి ప్రసిద్ధి చెందిన మదనపల్లె ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన వేసవి విడిది. ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధిగాంచిన యీ మదనపల్లె చుట్టూ నల్లరాతి కొండలు పెట్టని కోటగోడల్లాగ వున్నవి. పట్టణ వీధులు సువిశాలంగా వుండి వాటి కిరుప్రక్కలా గల చెట్ల వరుసలలో కంటికింపు గొలుపుతూ చల్లని వాతావరణంతో, ప్రకృతి సంపదతో ఆకర్షించును. పందొమ్మిదవ శతాబ్దారంభంనుండి బ్రిటీషు వారు రావడంతో పట్టణము మరింత ప్రాముఖ్యత సంపాదించుకొనింది.

పూర్వ చరిత్ర

మదనపల్లె చాలా పురాతన పట్టణం. పూర్వకాలము యీ పట్టణాన్ని "మాదళ్ల పల్లె" అనే వారు. మర్యాద రామన్న యీ ప్రాంతం వాడని, అందుచే యీ నగరం "మర్యాద రామన్నపురం" లేక "మర్యాద రామన్న క్షేత్రం" అని కూడ పిలువ బడేదని జనవాక్యం. 1873-77 ప్రాంతములో ఇచ్చట సబ్ కలెక్టరుగా పనిచేసిన Mr. G.A.D. గ్రిబిల్ మదనపల్లెను "మధుని పల్లె" అని వ్యాఖ్యానించెను. బ్రిటిష్ అధికార్లు మదనపల్లెను "Muddin Pilly" అని ఆంగ్లంలో వ్రాసేవారు.

విజయనగర రాజుల కాలంలో మదనపల్లె పాళేగారుల పాలనలో యుండేది. ఆ రోజులలో పట్టణం ప్రస్తుతమున్న ప్రదేశములో గాక కొద్దిగా పడమరగా శివాలయమునకు ఎదురుగా నుండి పంట పొలాలున్న ప్రాంతంలో యుండేది. అచ్చట అనేక శిలా శాసనాలు గూడ యుండేవి. ఆ శాసనాలు

శ్రీ కె. ఎస్. ఎస్. శేషన్

ప్రస్తుతం దివ్యజ్ఞాన కళాశాల భవనంలో భద్రపరచబడి యున్నాయి. ఈ శాసనాలను బట్టి ఆ ప్రాంతములో నాడు దొంగల భయం ఎక్కువగా వుండేదనీ, తమ ప్రాణాలను, పశువులను రక్షించుకొనడంలో ఎందరో చని పోయారని కూడ తెలుస్తున్నది. ఆ దొంగల బెడద తప్పించుకొనేందుకు నగరాన్ని కొంత సురక్షిత

మైన స్థలానికి మార్పిడి చేయ నాటి పాళేగారు 'యాదగిరి నాగప్ప నాయని' వారు ఠలపెట్టారు. తన లనుచరులతో సంప్రదించి నగరి గోవును పూజించి వదిలెను. అది బాహుదా నదికి టూర్పుగా వెళ్ళి చుక్కలవర్తి దిన్నె దగ్గర ఆగింది. క్రొత్త నగర నిర్మాణమునకు అదే స్థలంగా నిర్ణయింప బడింది. పింగళ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ దశిమి ఉత్తరా నక్షత్రం ఐదున్నర ఘడియలకు చంద్రముహూర్తంలో పునాది వేయడం జరిగింది. ఇది క్రీ.శ.1618 సం॥లో వెంటనే క్రొత్త నగర నిర్మాణం చేసిరి, ఈ నగరం సకలైశ్వర్యాలతో ఐదువందల సంవత్సరాలు వర్ధిల్లుతుందని జ్యోతిష్కులు చెప్పినారట.

1612 సంవత్సరములో మహా రాష్ట్ర నాయకుడు షాజీ మదనపల్లెను, దానికి దగ్గరలోనే యుండు పుంగనూరును ఆక్రమించుకొన్నాడు. కాని మదనపల్లె పాళేగారు షాజీతో స్నేహం చేసుకొని మదనపల్లెనే గాక పుంగనూరును గూడ తీసికోగలిగెను. పుంగనూరు పాళేగారు హైదరాబాద్ వెళ్ళి నిజాంతో సంధి చేసికొని పుంగనూరును తన కైవసము చేసుకొనెను. ఇంతలో గుఱ్ఱంకొండ మండలము పూర్తిగా గోల్కొండ నవాబుకు చేరడంతో మదనపల్లె పుంగనూరు వైషమ్యములు మాని తమ తమ పాళేగారుల క్రింద స్థిరపడినవి.

కడప నవాబు అబ్దుల్ నబీఖాన్ క్రీ.శ. 1713 సం॥లో సేలం జిల్లాలోని బారామహల్ పైకి దాడి వెళ్ళే సమయంలో మదనపల్లెను, పుంగనూరును ఆక్రమించు కొన్నాడు. నబీఖాన్ యొక్క దివానే శంకర్‌జీ పంత్ మదనపల్లెను మరి కొన్ని గ్రామాలను పాళేగారుకు తిరిగి అప్పజెప్పి ప్రతి ఫలంగా కొంత సొమ్ము తీసికొనెను. 1766 సంవత్సరంలో మదనపల్లె గుఱ్ఱంకొండ మండలముతో సహా మైసూరు పాలకుడైన హైదరాలీకి చెందింది. 1782 సంవత్సరంతో హైదరాలీ చిత్తూరుకు 8 మైళ్ళ దూరంలో గల నరసింగ రాయని పేట వద్ద పుట్టు కురుపు వ్యాధితో మరణించిన పిదప అతని కుమారుడు టిప్పు సుల్తానుకు యీ ప్రాంతమంతా సంక్రమించినది. బ్రిటిషు వారి చేత 1792 యుద్ధంలో ఓడిన కారణంగా టిప్పు గుఱ్ఱంకొండ మండలాన్ని హైదరాబాదు నిజాంకు యిచ్చివేశాడు, మదనపల్లె గుఱ్ఱంకొండలో భాగమైనందున నిజాం పాలన క్రిందికి వచ్చింది.

క్రీ.శ. 1800 సంవత్సరము అక్టోబరు 12వ తేదీ నిజాం, లార్డు వెల్లస్లీ [గవర్నర్ జనరల్] యొక్క సైన్య సహకార పద్ధతిపై ఒడంబడిక చేసికొన్నందువల్ల దత్త మండలాలనబడే కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం జిల్లాలను బ్రిటిషు వారికి యిచ్చెను. కడప జిల్లాలోని మదనపల్లె ఆవిధంగా బ్రిటిషువారి పాలనలోనికి వచ్చింది. (1911 సంవత్సరంలో చిత్తూరు జిల్లా ఏర్పడిన తరువాత మదనపల్లె పుంగనూరు, వాయల్పాడు తాలూకాలు కొత్త జిల్లాలో చేర్చబడినవి). దత్త మండలాలకు మొదటి కలెక్టరుగా నియమింపబడ్డ సర్ థామస్ మన్రో మదనపల్లెకు 1801 సంవత్సరములో రావడం జరిగింది. కడపలోని వేడి భరించలేని మన్రోదొర మదనపల్లెలో ప్రస్తుతం సబ్-కలెక్టరు బంగళా యుండే స్థలంలో ఒక పూరియిల్లు కట్టుకొని వేసవికాలంలో అచ్చట నివసిస్తూ ఉండేవాడు, మన్రో తర్వాత ఎందరో బ్రిటిషు అధికార్లు మదనపల్లె రావడం, ఇచ్చటి చల్లని వాతావరణానికి ఆకర్షింపబడి స్థిరపడటం వల్ల క్రమేణా, యురోపియనుల సంఖ్య, వారితోబాటు నగరంకూడ పెరిగింది.

జాతీయ చరిత్రలో ప్రాముఖ్యత

మదనపల్లెకు అనేకవిధాల జాతీయరంగంలో ప్రాముఖ్యత వుంది, క్రీ.శ. 1889 సంవత్సరములో హిందూదేశంలో కెల్ల మొదటిసారిగా "క్రిస్టియన్ ఎండవర్ సొసైటి" మదనపల్లెలో డబ్ల్యు. ఐ. ఛాంబర్లేను అను నొక క్రైస్తవ మత బోధకుడు స్థాపించెను. 1909 సంవత్సరములో డాక్టరు (కుమారి) హార్టు అను నామె యిచ్చట ఒక శానిటోరియం స్థాపించింది అది ప్రపంచములో మూడవ అత్యున్నతమైనదిగా పరిగణనకెక్కింది. "ఇండియన్ వుమెన్ అసోసియేషన్" మదనపల్లెలోనే మొదట స్థాపింపబడినది. దక్షిణదేశంలో స్కౌటు ఉద్యమం ప్రథమముగా యిక్కడే ప్రారంభమైనది, హిందూదేశంలో ప్రధాన నగరాల్లో చిత్రశాలలు ఏర్పాటు చేయాలనే ప్రచారం మదనపల్లెలోనే ప్రారంభమైంది. మనదేశంలో కెల్ల ప్రథమ మహిళా మేజిస్ట్రేటు మదనపల్లెలో నివసించిన మార్గరేట్ సతి. ఆగ్నేయ ఆసియాలో కెల్ల మొదటిసారిగా మదనపల్లెలో 1949 సంవత్సరములో బి.సి.జి టీకాలు అప్పటి ఆరోగ్య శాఖామాత్యురాలు రాజకుమారి అమృతకేర్ చే ప్రారంభించపడింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వేదాంతి, దివ్యజ్ఞాని, "ప్రపంచగురువు" అనుపేరు బడసిన జిడ్డు కృష్ణమూర్తి జన్మస్థలము మదనపల్లె. డాక్టరు అనీబిసెంటు మదనపల్లెను తన స్వస్థలమువలె భావించి 1915 సంవత్సరములో ఇచ్చట నొక కళాశాలను నెలకొల్పెను. అది రాయలసీమలో కెల్ల ప్రథమ కళాశాల.

గురుదేవుని రాక

ప్రపంచ విఖ్యాత, దేశభక్తుడు, నోబుల్ బహుమతి గ్రహీత విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ మదనపల్లెను 1919 సం లో దర్శించెను. దక్షిణదేశ పర్యటనచేస్తూ అలసి, ఆరోగ్యం దెబ్బతిన్న కారణంగా వారం రోజుల పాటు విశ్రాంతిగైకొన టాగూర్ యిచ్చటికి వచ్చెను తాను ప్రయాణంజేసిన ప్రత్యేక రైలు పెట్టెలో ఫిబ్రవరి 25వ తేదీ 'మదనపల్లె రోడ్డు' స్టేషన్ (సి.టి.యం.) చేరి అచ్చట నుండి కోచ్ మూలంగా మదనపల్లెకు చేరుకొన్నాడు, విశ్వకవి.

బిసెంటు దివ్యజ్ఞాన కళాశాల హాస్టలులో ఒక కుటీరములో గురుదేవుడు ఐదు రోజులపాటు బసచేశాడు. ఆ కుటీరము నేటికీ "ఠాకూరు కాటేజి" అని పిలువబడుతూ ఉంది. రవీంద్రుడు ఆ ఐదు రోజుల్లో కళాశాల విద్యార్థులు అధ్యాపకులతో గలసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాను అంతకు మునుపు (1911 సం,లో) బెంగాలీభాషలో వ్రాసియుండిన "జనగణమణ" (నేటి జాతీయ గీతం)ను సరియైన పద్ధతిలో పాడే విధానాన్ని స్వయంగా నేర్పించాడు. తన బసలో ముందుగదిలో కూర్చుని అర్ధనిమీలిత నేత్రా

లతో తీవ్రంగా ఆంగ్లపదాలను యోచిస్తూ గంభీర ముద్రలో జనగణ మన గీతాన్ని ఆంగ్లానికి అనువదించే విశ్వకవిని దూరంనుండి విద్యార్థులు చూచి ఆనందించేవారు. ఆ ఆంగ్ల అనువాదమే 'ది మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా'. జనగణమనకు స్వరకల్పన గూడ మదనపల్లెలోనే జరిగింది. మార్గరేట్ కజిన్స్‌చేత స్వరము కూర్చబడి కళాశాలలోని "ఆర్టు" రూములో మొదటిసారిగా ఆమె పాడి రవీంద్రునికి వినిపించినది. దేశంలో అనేక ప్రాంతాల్లో అనేకవిధాల పాడబడుతుండిన జాతీయగీతము తర్వాత ఒకే పద్ధతిలో ప్రచారానికి వచ్చిది. ఒకరోజు రవీంద్రుడు తాను రచించిన "అరణ్యాసం దేశము"ను కళాశాల విద్యార్థులకు చదివి వినిపించాడు. అప్పటి వ్యాయామోపాధ్యాయుడు శ్రీ హరికృష్ణ చెట్టి ప్రదర్శించిన కొన్ని వ్యాయామ విన్యాసాలను తిలకించాడు, రవీంద్రుడు. తన దేహానికి ఒక పెద్దగొలుసు బిగించుకొని దానిని తెంపివేశాడట. హరికృష్ణ చెట్టి ! ప్రస్తుతం చాలావయసు మళ్ళిన యీయన మదనపల్లెలోనే విశ్రాంతిలో నున్నారు.

ఐదు రోజులపాటు మదనపల్లెలో యుండి పూర్తిగా తన ఆరోగ్యము పూర్తిగాకోలుకున్న తర్వాత మార్చి 2వ తేదీన బయలుదేరి ఠాకూరు తన దక్షిణదేశ యాత్రను కొనసాగించాడు. వెళ్ళడానికి ముందు మదనపల్లెను గూర్చి ప్రశంసిస్తూ, యిది "దక్షిణదేశపు శాంతి నికేతన" మన్నాడు విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరు.

ఆరోగ్యవరం (శానిటోరియం)

హిందూ దేశమంతటా మదనపల్లె ప్రసిద్ధిగాంచి యుండడానికి ముఖ్యకారణం ఇచ్చట గల శానిటోరియం. 6 కి.మీ. దూరంలో గల యీ శానిటోరియం ఆరోగ్యవరమని పిలువబడుతున్నది. ఇది ప్రపంచములో మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. ఈ శానిటోరియం 1909 సం॥లో మదనపల్లెకు 13 మైళ్ళ దూరములోని పుంగనూరులో స్థాపింప బడినది. అప్పుడు దానికి డాడ్ శానిటోరియం అనిపేరు. మదనపల్లెలో పనిచేయు చుండిన డాక్టరు (కుమారి) హార్టు అనునామె 1912 సం॥లో పుంగనూరు నుండి శానిటోరియంను మదన పల్లెకు మార్చింది. కొంతకాలం మదనపల్లెలో ప్రస్తుతం ఎమ్. ఎల్. ఎల్. వైద్యశాల యుండు స్థలంలో శానిటోరియం కొనసాగింది. క్షయవ్యాధి గ్రస్తుల్ని పట్టణంలో వుంచడం మంచిది కాదని డాక్టరు హార్టు 1915 సం॥లో అప్పటి మద్రాసు ప్రభుత్వము నుండి మూడు వందల ఎకరాల భూమిని సేకరించి ప్రస్తుత స్థలానికి శానిటోరియంను మార్చింది. అప్పటి మద్రాసు గవర్నరు లార్డుపెంట్ లాండ్ 1915 సం॥లో జూలై నెల 19వ తేదీ క్రొత్త శానిటోరియంకు ప్రారంభోత్సవము చేయడం జరిగింది. డెన్మార్కు నుండి వచ్చిన మిషనరీ డాక్టరు ఫ్రీమాంట్ ముల్లర్ ఆరోగ్యవరం శానిటోరియంను అనేక విధాల అభివృద్ధి పరచాడు. ప్రపంచములో కెల్ల మూడవ గొప్ప శానిటోరియంగా యిది గుర్తింపబడి యుంది. (మొదటి రెండు స్విట్జర్లాండులోనివి) ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చట ఒక పరిశోధనా విభాగాన్ని స్థాపించి క్షయ వ్యాధికి సంబంధించిన విషయాలపై పరిశోధనలు జరుపు తున్నది.

హార్సిలీ కొండ

దక్షిణ దేశంలోని విలాస యాత్రా స్థలాలలో మదనపల్లె వద్దనున్న హార్సిలీ కొండ ఒకటి. మదన పల్లెకు 26 కి. మీ. దూరములో నున్న యీ హార్సిలీ కొండ ఆంధ్రప్రదేశ్ గవర్నరుకు అధికార వేసవి విడిది. ఇది సముద్రానికి 4200 అడుగుల ఎత్తులో నుండడం వల్ల ఇచ్చటి వాతావరణం చాలా చల్లగా వుంటుంది. మండు వేసవిలో గూడ యిచ్చట చలిగా ఉంటుంది. ఇది పూర్వం 'ఏనుగు మల్లమ్మ కొండ' అని పిలువ బడేది. 1866_67 తో మదన పల్లె సబ్‌కలెక్టరుగా పనిచేసిన డబ్ల్యు. హెచ్ హార్సిలీ అనునతడు వేసవి కాలంలో నివసించడానికై యీ కొండపై ఒక యిల్లు కట్టించాడు. అతడు అనేక సంవత్సరాలు కడప జిల్లా కలెక్టరుగా కూడ పనిచేసినాడు. ఆ సమయంలో ఈ కొండల నెక్కువ అభివృద్ధి పరచాడు. అతని పేరుతోనే యిది 'హార్సిలీ కొండ' ని పిలువ బడుతుంది. 1953 సం॥లో కఱవు నివారణోపాయ పథకము క్రింద యీ కొండ పైకి అప్పటి జిల్లా బోర్డు ప్రెసిడెంటు శ్రీ ఎన్. పి. చెంగల్రాయనాయుడు రోడ్డు వేయించాడు. ఆంధ్ర రాష్ట్ర యేర్పడిన తరువాత అప్పటి గవర్నరు శ్రీ సి, యం. త్రివేది హార్సిలీ కొండలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు దోహదం చేశాడు. గవర్నరుకు కొత్త నివాసభవనం, విలాస యాత్రికులకు విడిది గృహాలు, ప్రార్థనా మందిరం, స్కౌట్ సెంటర్, మరియు అనేక యితర భవనాలు కట్టబడ్డాయి. భవన నిర్మాణ సహకార సంఘము స్థాపించి యిళ్ళ స్థలాలు విక్రయించినందున కొంతమంది సినీ కళాకారులు ఇళ్ళు కట్టి యున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు కొంత కాలం పాటు యిచ్చట ఒక పబ్లిక్ స్కూలు గూడ నడపిరి కాని గత సంవత్సరము దానిని రద్దు చేసిరి. ఇచ్చటి నేలను, వాతావరణమును పరిశోధన చేసి ఆపిల్ తోటల పెంపకమునకు అనువైనదని తేల్చియున్నారు. త్వరలో హార్సిలీ కొండల్లో ఆపిల్ తోటలు వెలుస్తాయని ఆశించవచ్చు.

ఋషీవేలీ

మదనపల్లెకు 13 కి. మీ. దూరంలో యుండే ఋషీవేలీ జాతీయ ప్రాముఖ్యత గల్గిన మరియొక ముఖ్య ప్రదేశము. ఇచ్చట అధునాతన పద్ధతులలో ఇంగ్లీషు మీడియం పాఠశాల నడప బడుతుంది. "ప్రపంచ గురువ"ని పేరు వడసిన ప్రఖ్యాత వేదాంతి జిడ్డు కృష్ణమూర్తి 1927లో ప్రపంచ దివ్యజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని తలచి సుమారు మూడు వందల ఎకరాలున్న ఋషీవేలీ స్థలాన్ని సంపాదించాడు. మద్రాసు గిండిలో అప్పటి వరకు నడుపబడు తుండిన పాఠశాలను ఋషీవేలీకి తరలించాడు. మదనపల్లెలోని బిసెంటు కళాశాలను గూడ అచ్చటికి మార్చ తలపెట్టాడు. కాని అంతలో జిడ్డు కృష్ణమూర్తి దివ్యజ్ఞాన సమాజం నుండి వైదొలగడం జరిగింది. పాఠశాల మాత్రం ఋషీవేలీలో కొనసాగింది. దివ్యజ్ఞాన విశ్వవిద్యాలయ స్థాపన జరుగ వీలులేక పోయింది. ప్రస్తుతం ఋషీవేలీ పాఠశాల దేశం నలుమూలల నుండి విద్యార్థుల నాకర్షిస్తూంది. విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో కొంతమంది విదేశీయులు గూడా యున్నారు. ×

కవిత :

జీవన సంధ్య


మసక చీకట్లు ముసురుకుంటున్న ఈ మునిమాపు వేళలో
ఎక్కడో దూరాన ఒక మేఘం ఉరిమినట్లు
ఒక తొలకరి మెరుపు మెరిసినట్లు
ఒక భ్రాంతి ! ఒక క్రాంతి !
నా జీవన ప్రాంగణంలో ఏనాడో నాటబడి పెద్దవైన చెంగల్వలు
ఒక్కొక్క మొగ్గా విచ్చుకుంటున్నాయి
ఒక్కొక్క పూవుగా వికసిస్తున్నాయి
నవ్వుతున్నాయి నా ఎదలో హాయిగా
పరిమళిస్తున్నాయి ఒక నవసౌరభాన్ని తీయగా
ఈ జీవన సంధ్యారాగంలో మధురస్మృతులు చేసే మందహాసం
అరవిచ్చిన పారిజాతాలు వెదజల్లే తీయని హంసలా,
సుహాసినీ స్నిగ్ధ కపోలంలా, శాంతి కపోతంలా,
అలా, అలా, అంతటా, నా గుండెల్లో మధురానుభూతుల్ని నింపుతూ
జాలువారుతున్నది ! దూరమౌతున్నది
ఈ జీవన సంధ్యారాగంలో నిశ్శబ్దం ఘనీభవించింది.
ఈ జీవుని ప్రస్థానంతో ఒక జీవనరాగం అస్తమిస్తుంది
కానున్నది మహోదయం !
రానున్నది మహాయుగం !
ప్రకృతినిండా పరచుకొంటున్న ఈ కెంజాయల యొక్క
పుంజీభూతమైన ఈ సంధ్యా జ్యోత్స్నలో
విరుస్తున్నాయి మెల్లమెల్లగా మధురస్మృతుల కమ్మని విరులు !
కురుస్తున్నాయి వర్షపు జల్లులా గతస్మృతుల ఇరులు !
జీవన గాథా ప్రవంతిలో, ఒక బెండులా తేలిపోతూ
పయనిస్తున్న మానవ హృదయంలో
మాయని బాధామయగాథల అరుణారుణ రక్తిమలో
ఈ జీవన సంధ్యాస్వప్నప్రగతమంతా, ఒకకలలా
ఒక అలలా, అలా, అలా !
కరగిపోతున్నది ! విరిగి పోతున్నది!
శరన్మేఘమాలికలా,
వియన్నదీ వీచికలా,
అరుణారుణ కాంతుల్ని మ్రింగి వేయడానికి కాబోలు,
అదిగో ! చీకటి వచ్చేస్తున్నది,
ఇంటా, బయటా, చీకటి,
కొండలో, కోనలో, చీకటి,
దిశాంచలాల్లో పొంచివున్న అంధకాసురుని సైన్యంలా అంతటా
విశాల విశ్వాన్ని చుట్టుముట్టుతున్నది.
అనంతాకాశంలో, అంతరిక్షంలో, అంతటా
విశృంఖలంగా, విజృంభిస్తూ, బయలుదేరింది.
మానవమానస చక్షువు మాత్రం చీకటిని చూడ్డం లేదు
మానవుడు తన మనోనేత్రంతో వెలుగునే చూస్తున్నాడు చీకటో
మానవుని మనో నేత్రానికి కనపడుతోంది, ఏదో మహాకాంతి !
కోటి సూర్యులు ఉదయిస్తున్న మహోదయ ప్రభాకాంతి !
విశాల విశ్వ పరిభ్రమణంలో ఇదొక క్షణం
యుగయుగాల చరిత్రగమనంలో ఇదొక ముహూర్తమాత్రం
సమాంతరరేఖల్లా పయనించే యీ వెలుగు చీకట్ల కవతల
స్పష్టంగా కనిపిస్తోంది మానవ భవిష్యత్తులో కాంతి కిరణం
మరణం ప్రతివానికీ సంభవించే తిరుగులేని సత్యం
మార్పు ప్రపంచంలో అనివార్యం, అది చరిత్ర చెప్పే సత్యం.

శ్రీ యఱ్ఱమిల్లి చలపతిరావు "శ్రీవత్సవ"

చీకటో బ్రతుకుతూ, వెలుగును చూస్తాడు ఆశాజీవి మానవుడు
కష్టాలు సహిస్తూ ముందుకే నడుస్తాడు నూతన ప్రియుడు మానవుడు
సూర్యోదయాస్తమయాలు ఒకరు కోరితే జరిగేవి కావు.
జయాపజయాలు విధి నిర్ణయాలు
న్యాయానికే జయం, అన్యాయానికే అపజయం
అన్యాయం, అధర్మం, ఏ నాడూ జయించలేవు
పరాజయం, తిరోగమనం, తప్పగల్యంతరంలేదు.
అమృత పుత్రుడైన మానవుడు అభివృద్ధి కావలసినవాడు
అభ్యుదయం, శాంతీ, అతని లక్ష్యాలు, వాటిని అతడు సాధిస్తాడు
స్వార్థపరులూ, సంఘ విద్రోహులూ, అభివృద్ధి నిరోధకులూ,
కాలగర్భంలో కలసిపోతారు. కానరాకుండా పోతారు.
ఈ జీవన సంధ్య జాతి జీవితంలో ఒక యుగ సంధ్య
ఈ సంధ్యలో పరిమళిస్తోంది సన్నజాజుల సౌరభం
ఈ సంధ్యలో వినిపిస్తోంది నవయుగ పునరుజ్జీవన
సుప్రభాతకాంతి గీతి
ఈ సంధ్యలో ప్రతిఫలిస్తోంది, జాతి ఉజ్వల భవిష్యత్తు
అదే మనందరకూ రేపటి మహోషస్సు.


★

ఛా యా ★ చి త్రా లు




కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ జగ్జీవనరాం విశాఖపట్నం జిల్లాలోని చినగాది గ్రామంలో షెడ్యూల్ జాతుల హౌసింగ్ కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.

కేంద్ర రక్షణమంత్రి వాల్తేరులో సెప్టెంబర్ 29న ఆంధ్ర విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవంలో ఉపన్యసించారు.



వార్తా ★ చిత్రాలు



గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను సందర్శించారు.

గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో ఎక్సైజు శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సమావేశాన్ని ప్రారంభించారు.



వేంకట పార్వతీశ్వర కవుల సాహిత్య సేవ

శ్రీ కామఋషి సత్యన్నారాయణ వర్మ

అవి 20వ శతాబ్ది ప్రారంభ దినములు. ఆసేతు హిమాచల పర్యంతము జాతీయోద్యమము వెల్లివిరియుచున్న రోజులు. ఆంధ్ర దేశమున సారస్వత సాగర మధనము ముమ్మరముగా సాగుచున్నది. యుగపురుషుడు వీరేశలింగము సాంఘిక సంస్కరణమునకు, సారస్వత సముద్ధరణమునకు నాటిన బీజములు మొలకెత్తి ఆంధ్ర సాహితీ క్షేత్రముల సస్యశ్యామల మొనరించినవి. ఆంగ్ల సారస్వత సంప్రదాయములు భారత సంస్కృతిలో లీనమై ఒకానొక నూతన దృక్పథము నలవరచుకొన్నవి. ఇట్టి వాతావరణమున నవలలు, నాటకములు, ప్రహసనములు, పద్య కావ్యములు, శాస్త్రీయ గ్రంథములు, స్వీయ చరిత్రలు, అలంకార గ్రంథములు, వ్యంగ్య రచనలు, విచిత్ర కల్పనలు పలుముఖముల బయలుదేరి ఆంధ్ర సారస్వతోద్యానమును నవపుష్పశోభిత మొనర్చి అనంత సౌరభముల వెదజల్లుచున్నవి. అవధానముతో నద్భుత మేధాశక్తిని ప్రదర్శింపజాలిన పండిత కవులు కూడా ఆనాడు సన్మానింపబడుచున్నారు. గిడుగు, గురజాడలవంటి ప్రగతి కాములు చూపిన ఆదర్శముల ఫలితముగా వ్యవహారిక భాషా వాదమునకు పలుకుబడి హెచ్చుచున్నది. శ్లేషల చమత్కారమునకు, దీర్ఘ సమాస గుంఫనములకు, నారికేళ పాకకవనమునకు అబ్బురపడుచుండెడి పాఠకుల యభిరుచులు క్రమక్రమముగా మారి సార్వజనీనమైన సులలిత గద్యముపట్ల సుముఖమై ఆదరింపబడుచున్నవి. భాషోద్ధరణమునకు పత్రికలు సాధనములై బహుళ ప్రచారము గావించుచున్నవి. యాపద్భారతోద్యమముగా విస్తరిల్లిన వంగ రాష్ట్ర విభజనతో వంగ భాషా ప్రాభవమును, రవీంద్రుని రచనలును ఆంధ్రావనిలో పలుకుబడి సంపాదించుకొన్నవి.

ఇట్టి బహుళోద్యమ ఝంఝా మారుతముల రొదలో నుండి ఒకానొక కిన్నెర కంఠధ్వని–ఒకానొక కోయిల కుహూ నినాదము వినబడి ఆంధ్ర సాహితీ పరుల నాశ్చర్య చకితులను గావించినది. ఈ మధుర నాదమెక్కడిది? ఈ కల కంఠస్వరమే దివ్యగళమున నిబద్ధమైనది? వ్యక్తులు భిన్నమైనను కంఠధ్వనిలో నైక్యత కన్పట్టుచున్నది! ఈ యనుసంధాన మెవరు కల్పించినారు? ఎట్లు సిద్ధించినది? ఈ స్వర సమ్మేళనము నందొక వింత యసము లూరుచున్నవి ఇందేదో అనిర్వాచ్యమైన ఆనందమున్నది, లోతులు తెలియరాని భావనాబలమున్నది. భాషలోని పద లాలిత్యమునంతను తమ సొత్తు గావించుకొన్నారు. ఈ కవితలో శ్లేషల చమత్కారము లేదు. దీర్ఘ సమాస గుంఫనశ్రమ గాన్పింపదు. ఈ కూర్పులో కఠినపదములే లేవు. అద్భుత మేధా సంపదతో, అలౌకిక ధారణా బలముతో అవధానములు గావించి రాజ సభల రంజింప జేసిన జంట కవుల ఇంద్రజాలిక సమ్మోహన మంత్రకన్న లేదు. ఇది యొక విచిత్ర సమ్మేళనము, పూర్వ సంప్రదాయములకు అనుబద్ధమైనది. నూత్న సంప్రదాయములకు నాందియైనది. సరస్వతీ కటాక్ష పాత్రులై ఆంధ్ర సారస్వతోద్యానము అవ్యక్త మధువుల గురియించు నీ కవి కోకిలలెవరు? వారె కవి కులాలంకారులైన కవి రాజ హంసలు.

"నియత సమభావ గతి కవి ద్వయము నుండి
యేకమైదోచు కవితా రసైక మూర్తి
దలపులో నిల్పి యెన్నగా వలయుగాని
వేఱు సేసి కనుంగొన గోరనేల?"

"గాన మాతనిది, చొక్కంబైన శ్రుతి నాది
సరస మోహన కలస్వనము మాది
రాగ మాతనిది, తోరంబైన కళ నాది
శాంత సుందర విలాసంబు మాది
స్వరమాతనిది, విభాసురమైన లయ నాది
సురుచిరామోద విస్ఫురణ మాది
భావ మాతనిది, జీవంబైన ధ్వని నాది
నవ నవానంద వైభవము మాది (1922)

వారి స్వర సమ్మేళనమునోగల విశిష్టత యిట్టిది. ఈ విధముగా ఆంధ్ర భాషా దేవి కపూర్వకావ్య కుసుమావళులతో నర్చనలు సలుప నారంభించిన కవి ద్వయమే శ్రీ వేంకటపార్వతీశ్వర కవులు రవీంద్రుని కవితా రీతులు తెలుగు నాట ప్రచారముకాక ముందే (1904) వీరి తొలి రచనలు ఆంధ్ర పాఠక లోకము యొక్క మన్ననలు అందుకొన్నవి. 1911 సం॥లో వీరు ఆంధ్ర ప్రచారిణి గ్రంథ నిలయము అనునొక ప్రచురణ సంస్థను నెలకొల్పి, వీరి రచనలను ప్రకటింప నారంభించినారు. ఆ రోజులలో తెలుగునాట సుప్రసిద్ధ విమర్శకులుగా, కవులుగా పేరు వడిన శ్రీ నడకుదిటి వీరరాజు పంతులుగారు వీరిని ప్రౌఢకావ్య నిర్మాతలుగా తీర్చిదిద్దిన గురుపాదులు. శ్రీ పార్వతీశ్వర కవిగారి మనస్సెంత మార్దవమైనదో శ్రీ వెంకట్రావుగారి హృదయమంత గంభీరమైనది. ఈ అమృత హృదయుల ఆరసజ్ఞమూర్తితో కూర్చిన ఘడియలు మిక్కిలి పవిత్రమైనవి. సమ సూత్ర వీణాద్వయమువలె, సమజాతి పుష్ప ద్వయమువలె, సమరూప దీప ద్వయమువలె, ప్రకాశించి నవ్యాంధ్ర సాహితీ క్షేత్రముల వినూత్న కాంతులను–నిరుపమాన సౌరభములను వెదజల్లినారు.

వీరు గ్రంథ రచన కారంభించిన పదునేను సంవత్సరముల పరిమితిలో శతాధిక గ్రంథములను రచించి, ఒక లక్ష గ్రంథములను ప్రచారములోనికి తేగలిగిరి. ఈ విధముగా యింటింట నవలలను, నాటకములను, గేయములను అందించి తెనుగు నుడికారపు తీయదనమును సర్వజనులకు ఆస్వాద యోగ్యము గావించిరి. వీరి రచనలలో బాలగీతములు, బాలసూర్య వాచకములు, నవలలు, నాటకములు, పురాణములు, అనువాదములు మొదలగునవి సెలయేళ్ల వలె నలుదెసల ప్రవహించి సకల జనాభీష్టములను దీర్చినవి. వీరు వంగ భాషనుండి అనువదించిన నవలలలో మాయావి, మనూరము, మాయావిని మొదలగు అపరాధ పరిశోధక నవలలోని 'అరిందము బాబు' 'పూల్ సాహేబ్' వంటి పాత్రలు అద్భుత భయానక రసములతో ఆనాటి పాఠక లోకము నుర్విళ్లూరజేసినవి. వీరు ఆనాటి వంగ సాహిత్య సౌందర్యమును ఆంధ్రులకు పెరటిచెట్టు గావించినారు. వీరు స్వతంత్రముగా రచించిన సాంఘిక చారిత్రిక నవలలలో 'మాతృమందిరము,' 'శ్యామల,' 'వీరపూజ' 'ప్రమదావనము,' 'వసుమతీ వసంతము' మొదలగునవి విచిత్ర కల్పనలతో పఠితుల హృదయములను చూరగొన్నవి. వీరి వచన రచన మిక్కిలి సరళమై లలితపద భూయిష్టమై గంగా ఝరివలె ప్రవహించును. వీరి చారిత్రిక నవలలలోగల కల్పిత పాత్రలు వారి కవితా సరస్వతి యొక్క ప్రత్యక్ష మూర్తి యనదగి యుండును.

వీరి కావ్య రచనా విధానమొక యద్భుత శిల్ప నిర్మాణము వంటిది. ఇతివృత్త కల్పనలో, భావప్రకటనలో ఆంగ్ల సారస్వతము యొక్క పలుకుబడి ప్రాధాన్యత వహించిన వాతావరణంలో ఆంగ్లభాషా పరిచయ మిసుమంతయు లేని వీరి లేఖిని నుండి సమకాలికమైన నూత్న కల్పనలు సహజ ప్రతిభ వల్లనే వికసించినవి వీరి గేయములను చదువునపుడు వర్డ్స్‌వర్త్, కీట్స్ మొదలగు పాశ్చాత్యుల కవిత స్ఫురణకు వచ్చునని కొందరందురు. అవి వీరి సహజ భావనా బల సంపత్తిచే వ్రాసినవేగాని ఆయా కవుల ప్రభావమునకు వీరు లలయొగ్గి కాదు. ఆంగ్ల భాషా పరిచయమే లేని వీరి కట్టిది సంభవమెట్లగును ?

వీరి కావ్య వస్తువులలో ప్రకృతి సౌందర్యమే ప్రధానభూమిక వహించును. ప్రకృతిలోని అందచందములను పరామర్శించుటలో వీరి లేఖిని పరాకాష్టనందుకొన్నది. చివురాకు జొంపములు, సురభిళ కుసుమములు, సురపొన్న గున్నలు, మలయానిలములు, కలువకన్నెలు, జలజ మాలికలు మధుమాస యామినులు, శరచ్చంద్రికలు, తారకా మాలికలు మొదలగు ప్రకృతిలోని ప్రతి రూపము వారిని కదిలించి పులకించి కావ్య వస్తువులయినవి. కోయిలలు, గోరువంకలు, చిలుకలు, రాయంచలు మున్నగు తిర్యగ్జంతు సంతతులు పాత్రలై పఠితలను పలుకరించును,

"అంటియు నంటక యట్టె తూగాడి
కులికెడు పొగడపూ గున్నమాయమ్మ" అంటారు, 'కుసుమ మంజరిలో'

"అంచకు వెగటైన అంబు దాగమము
నెమ్మికి నానంద నిలయ మౌ మందు
సురభిళ కుసుమంబు శుష్క కంటకము
నొక్క గులాబి యందొంద గూర్చినట్లు
గుణమును దోషంబు గూర్చి యొక్కడనె
యతి విచిత్రంబుగా నగపడుచుండు."

నని పరిదృశ్యమాన ప్రపంచరంగమందలి కష్ట సుఖములను గూర్చి చర్చింతురు. వీరి భావమున ప్రకృతిని ప్రబంధముగను, పరమేశ్వరుని ప్రబంధ కర్తగను చిత్రించి—

దేవ దేవ। మహాత్మా! త్వదీయ దివ్య
భావ బోధక విశ్వ ప్రబంధమందు
నెచట శ్రీరాము పుట్టితి? వెచట చిత్త
గింప వలెనని వ్రాసి ముగించినావు ?

అని ప్రశ్నింతురు. ఇట్లు ప్రకృతి రమణీయకమును ప్రదర్శించుటలో ఈ వేంకట పార్వతీశ కవులు పరతత్త్వోపదేశ మొనరించిరి. అంతియే గాదు; ప్రకృతి సౌందర్యోపాసనలోనే పరమేశ్వర సాక్షాత్కారమును బడసిన ధన్యజీవులు.

'చందమామ' యన్న శీర్షికలో —

"కవుల కదియేమి వెఱ్ఱియోగాని చంద
మామ యనెడి ముద్దు పదము మాని దాని
కెన్నొ పర్యాయ పదముల నిడుచు నుందు"రని

ఆ పద మందలి మార్దవమును, అందమును వెల్లడించిరి. ఇంకను చిన్న బిడ్డలు చందమామతో నాడు ముచ్చట లన్నింటిని రమ్యముగా చిత్రించి శిశు హృదయమందలి సహజమైన అమాయకత్వమును ఆతుర భావము నిట్లు వెల్లడించిరి.

"అమ్మ ! ఈ చిన్ని జాబిల్లి కమ్మ యెవరు ?
ఈతనికి బువ్వపెట్టువారెవ్వరమ్మ ?
అక్క నా కుండె ? నీలని కక్కగల దె?
ఇతనితో నాడు కొనకుండు నెచటికేగె ?
పోరు పెట్టదె కొండపై బోవలేక ?
భయమువేయదె క్రిందకు బడునొ యేమొ !"

కథా కథన విధానంలో వీరికి వీరే సాటి. రాజభక్తి గీతములో కర్ణుని వృత్తాంత కథనము గురుభక్తిలో ఏకలవ్యుని గాథ హృద్యముగా వ్రాసిరి. అనంతామాత్యుని భోజ రాజీయము నందలి కథ ననుసరించి వ్రాయబడిన గోగీతము చిన్నతనమున పాఠశాలలో చదువుకొన్నది తలంపునకు తెచ్చుకొనగానే హృదయము ద్రవించి కన్నులు చెమ్మగిల్లును శ్రావణ శుక్రవార కథ చదివిన హైందవ సంప్రదాయముల పట్ల గౌరవమేర్పడును. కపోతము, గోవర్ధనోద్ధరణము మొదలుగాగల ననేక కథలలోని ఔచిత్య ప్రకటనము నిరుపమానమైనది. వీరి గేయగుచ్ఛములలో అత్యున్నత స్థాయికి చెందిన కావ్యము 'ఏకాంత సేవ'. దీనికి పీఠిక వ్రాసిన

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వంగ భాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో ఆంధ్రమున వీరి యేకాంతసేవ యట్టిదని వ్రాసిరి. మధుర ప్రేమను అష్టవిధనాయికా స్ఫురణతో వర్ణించుచు ప్రకృతి యందలి ప్రతి వస్తువును నుపాయనముగా నర్పించి, పరమేశ్వరు నుపాసించిన ఉత్తమోత్తమ కళాఖండము ఏకాంతసేవ యందు భక్తునకు, పరమేశ్వరునకుగల యనుబంధము నిట్లు భావించిరి.

"శాంత రూపానంత జలరాశి వీవు
నవ నవైకానంద నౌకను నేను
సంశుద్ధ మానస సరసిని నేను
ఆనందమయ రాజహంస వీవు
సత్కళా సంపూర్ణ చంద్రుడ వీవు
సదమల చిద్రూప చంద్రిక నేను
లావణ్యమయ పల్లవలతను నేను
రాగ రంజిత భృంగ రాజంబ వీవు
సకల జీవామోద జలజంబ వీవు
నిర్మల సౌదామినీ రేఖ నేను
వరనందనోద్యాన వనలక్ష్మి నేను
తరుణ శృంగార మాధవుడ వీవు"

ఇట్లు ప్రకృత్యుపాసనలోనే దివ్య సాక్షాత్కారము బొందిన వీరు

ఈ మొగ్గ విరియించి యిన్నాళ్లదాక
దండ గూర్చుట కింత తడయుటయేల ?-ననీ
ఈ గీతిక రచించి యిన్నాళ్లదాక
సరిగ బాడుట కింత జాలంబదేల ?-ననీ ప్రశ్నించి
ఈ మల్లె విరిదండ యెండి పోకుండ
అమృతమూర్తి వహించెనంతియేచాలు!-నని తృప్తిచెంది
సర్వలోకేశ ఈ సాల భంజికను
నీకేళి గృహములో నిలువగా నిమ్ము

అని ప్రార్థించి ద్వైత భావమును మధురముగా చిత్రించిరి. ఇంకను వీరి రచనలలో జాతీయోద్యమ ప్రభావము, ఆంధ్రాభిమానము కొల్లలుగా వెల్లడియగును.

మఱువగా రాని ప్రియురాలి మఱచుగాక !
మాతృ దేశంబు మఱువకుమీ ! కుమార !
మాతృ భాషను మఱువకుమీ ! కుమార !

అని యుద్బోధించిరి.

'ఆంధ్ర భారతి'లో వారి కావ్య లక్ష్యముల నీ విధముగా వివరించిరి.

"కేవల శ్లేషయే కావలయును, గావ్య
మాధురికను బుద్ధి మాను దాక
ఘన నారికేళ పాకమున గ్రంధము వ్రాయు
కవి ప్రౌఢుడను వాదు కడచు దాక
దీర్ఘ సమాసముల్ తెగి వ్రాయ కుండిన
తేలిక యను వెఱ్ఱి తీరుదాక
నొక శబ్దమగు పల్కులుండు పద్యంబులే
హృద్యంబులను నుడులేగు దాక
తలచినప్పుడె యెన్నొ పద్యములు వ్రాయ
దగినను కవుల్ జనించుట తగుదాక
నెంత చదివించినను నీకు నెప్పటి వలె
వెలయు భాగ్యంబు గలుగదో తెలుగు బాస."

అని యీ విధముగా భాషా బంధనములు సడలినగాని తెలుగు నుడికారమందలి తియ్యదనము తెలియదని నిష్కర్షముగా తెల్పి వైచిరి.

అనంతర మొక మహా సంకల్పము గావింప బడినది. వాల్మీకి రామాయణమును తమ సులలిత మృదువాక్కులతో ననువదింపుడని పిఠాపురం రాజా శ్రీ గంగాధర రామారావుగారు వీరిని కోరిరి. ఇదివరలోనే తమ కావ్య కుసుమావళికి కృతిభర్తయైన శ్రీ రాజావారి కోర్కెననుసరించి 1943 లో అని రామాయణ రచన ప్రారంభించిరి. పావన పాదగయా క్షేత్రంలో ఈ కవిరాజ హంసలు రామాయణ రచన గావించుట ఒంటిమెట్టలో పోతన భాగవత రచనను స్ఫురణకు దెచ్చుచుండెడిది. కాని ఇంతలో పార్వతీశ్వర కవిగారికి చిరకాల గతమైన శారీరక అనారోగ్యము ప్రబలమైనది. రామాయణ రచనలో సుందర కాండమున హనుమకు సీతా సందర్శనమైనది. వేంకటపార్వతీశ్వర కవి ద్వితయా విభాజ్య ద్వితీయ మూర్తి కన్నుమూసినాడు, శరత్కాల చంద్రికా వర్ణనతో నన్నయ గారి గంట మాగినట్లె

"తెలి గలువ గుత్తివలె ని
ర్మలు డగు శశి యపుడు గగన మధ్యగతుండై
వెలుగుచు నీరోదకమగు
చెఱువ కొలని నడుమ హంస చాడ్పున దోచెన్"

అన్న పద్యములో వీరి కలమాగినది. ఏబదేండ్లకు పైబడిన నిరంతర సాహచర్యములో ఐక్య కంఠమున కవితాగానము చేసిన ఈ కవి కోకిల కెడబాటు కలిగినది. ఈ వియోగభారం చేత శ్రీ వెంకట్రావుగారు ఇంచుమించుగా మరల తమ లేఖిని ముట్టలేక పోయినారు. వీరు అరువదేండ్లు పైబడిన నిర్విరామ సాహిత్యోపాసన చేసినారు.

"నూరిన సస్యఫలంబులు
ప్రాత పొలాల్పండఁబడను పఱచిన మా వి
ద్యాల కవితా సరస్వతి
చేరమ విడకొన్న వారలెందరొ సుకవుల్."

అన్న ప్రఖ్యాతి వీరికి స్థిరమైపోయినది. 20వ శతాబ్దారంభపు సాహితీ ప్రియులలో సామాన్యుని మొదలు సామ్రాట్టు వరకు అందరును వీరి రచనలను ఆస్వాదించి, ఆనందించి ప్రత్యక్షంగానో పరోక్షంగానో వారి ప్రభావానికి, పలుకుబడికి లోనైన వారనిన అతిశయోక్తి కాజాలదు.

★

26

ఏళ్లు నాకు

శ్రీ బండి సుదర్శనం

నేను హరిజనుణ్ణీ కాదు
గిరిజనుణ్ణీ కాదు
కేవలం భారతీయుణ్ణి
మానవులో మానవుడిని
మనసున్న మనిషిని
మనసెరిగిన మనిషిని.

ఇప్పుడు నాకు
ఇరవై ఆరేళ్ళు

తెల్లవాడు
వెళ్ళిపోక ముందే
ఆవిర్భవించాను నేను
" వందేమాతరం" ఉద్యమంలో
"స్వదేశి" సంరంభంలో ......

మా తాతలు
వేదకాలపు వాళ్ళు
పురాణాలు ప్రాణం వాళ్ళకు

రాజుల
కా రోజులు
కనకాభిషేకాలు.
నేను పుట్టాను
స్వాతంత్ర్యయుగారంభంలో.

నవభారత జగత్తులో
హాలికుడనై నా
శ్రామికుడనై నా
చైతన్యపు సెలయేటి అంచున
స్వేచ్ఛా వాయువులు పీల్చాను
సమత మధువు నాస్వాదించి
స్వాతంత్ర్య సందీప్త, యోగినై
సామాజిక సంగీత రసభోగినై.

సత్యమే వ జయతే
అని ఆలాపించాను
అంతరంగంలో

ముందంజ వేశాను
ప్రగతి పథంలో

మృత వీరులకివే నా జోహార్లు—
మాటలతో మాత్రం కాదు ...
తరతరాలు నిలిచే చేతలలో
సంకెళ్లు త్రెంచేసిన చేతులతో
మృతవీరులకివే నా జోహార్లు.

★

సీరియల్

ఎవరికోసం

కోటకమలాదేవి

2

డ్రామా డైలాగ్సు చెవులలో గింగిరులు ఎత్తుతున్నాయి. ఆరోజు డ్రామాలో నీల పాట పాడింది. కేశవ హృదయంలో విశ్వవీణ మ్రోగింది. హృదయాన్ని రంజింపజేసింది. అవన్నీ తలుస్తుంటే నీల ఎలుగెత్తి పిలుస్తున్నట్టనిపించింది. తను చేయరాని తప్పు చేస్తున్నట్లు అపరాధిలా బాధపడ్డాడు. అయినా తను వివాహానికి ఒప్పుకుంటున్నట్లు మాటమాత్రానికైనా నీలతో అనలేదు. ఆమె అభిప్రాయాన్ని తెలుసుకోలేదు. తెలుసుకున్నా ప్రయోజనం లేదనిపించింది. ఇలా ఈ విధంగా నీలని తలచుకోవడం కూడా తనకు కాబోయే తన అర్ధాంగి స్వర్ణలతకి కూడా ద్రోహం తలపెడుతున్నానేమో అని బాధ పడ్డాడు. తొలిచూపులోనే ఆమె చూపులు తనని ఆకర్షించాయి. తనకు, తన ఆదర్శాలకు తగిన పిల్ల అనుకున్నాడు. ఇటు తల్లిదండ్రులను ధిక్కరించలేక పోతున్నాడు. అటు నీలకి దూరం అవుతున్నాననే బాధ హృదయాన్ని కలచివేస్తోంది. ఏమయినా తనకు వివాహం స్వర్ణలతతో తప్పదనుకున్నాడు. నీలకి దూరం కాక తప్పదు. ఆలోచనలతో బరువెక్కిన శరీరాన్ని అటు నుండి ఇటు త్రిప్పి తలక్రింద దిండు సవరించుకుని పడుకొని, నిద్ర పట్టించుకుందుకు ప్రయత్నించసాగాడు. ప్రయోజనం శూన్యం అయింది.

ఎలాగయినా ఈ ఒక్కసారి, మీరు కథానాయకుడిగా నాతో నటించమని కోరుతున్నాను. ఇలా మిమ్మల్ని నిర్బంధిస్తుందుకు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను, అని వ్రాసిన నీల ఉత్తరం మళ్ళీ ప్రత్యక్షమయింది. అసలు తను మొదటిసారి నాటకంలో పాత్ర ధరిస్తానన్ననాడే, అమ్మా నాన్నా వద్దని నిర్బంధించి ఉంటే తనకు ఈనాడు ఈ గతి పట్టేదికాదు అని తన నేరానికి తల్లిదండ్రులు బాధ్యులైనట్లు నేరం వారిమీద మోపి, హృదయాన్ని తేలిక చేసుకోవాలని వూహించాడు. కేశవ పదిహేను సంవత్సరాల బాలుడిగా ఉండి అమ్మాయి వేషం వేసి ఆడియన్సు నందర్ని మెప్పించిననాడు, మెచ్చుకున్ననాడు సావిత్రమ్మ, ఆమె భర్త తమ కుమారుని నేర్పరితనానికి పొంగిపోయారు. మురిసారు. క్రమంగా తొండముదిరి ఊసరవిల్లయి కూర్చొంది. కేశవ చదువుకి కూడ ఆటంకం కలిగించింది, ఈ నాడు వివాహాన్ని కూడా వద్దని ఆటంకపరుసున్నట్లు అనిపించింది. నీల తన వివాహం, సంగతి తెలిస్తే ఏమనుకుంటుందో? కేశవ ద్రోహి, మోసకారి, దగాఖోర్ అని తనను ఎన్ని నిందలాపాలతో సన్మానిస్తుందో ; పోనీ, తనని ఏమన్నా బాధలేదు. కాని ఆమె ఏమైపోతుందో! ఇలాంటి ఆలోచనా పరంపరలతో నలిగి సతమతమవుతున్నాడు కేశవ.

సరిగ్గా వివాహానికి వ్యవధి ఒక్క నెలకన్నా ఎక్కువ లేదు. డ్రామా కాంపిటీషను కూడా అప్పటికి చాలా దగ్గరలోనే వుంది. పోనీ ఈ ఒక్కసారి వేసి మానేస్తానంటే తనకు కాబోయే భార్య స్వర్ణ ఏమనుకుంటుందో! ఈసారి పోటీలలో నెగ్గినవారిని తప్పక సినిమాలలోకి బుక్ చేసుకుంటారట. నీల ఆశకూడ పాపం అదేను! ఈ ఒక్క కోరికైనా ఆమెది నెరవేర్పగలిగే అదృష్టం తనకివుందో లేదో! అగ్నిసాక్షిగా వివాహమాడదలచినభార్య మనస్సు నొప్పించడం తన అభిమతం గాదు! ఇటువంటి తుఫాను కేశవ హృదయంలో చెలరేగింది. ఆ రాత్రంతా ఇద్దరి యువతుల హృదయాల అభిమతాలు ఆశయాలు మధ్య నలిగిపోయాడు.

అసలు ఈ నీల ఎవరు? తనకు ఎలా పరిచయం సంభవించింది? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. నీల తనకు మొదటిసారి కాలేజీలో పరిచయమయింది. తర్వాత కొద్ది రోజులకి కాలేజీ వార్షికోత్సవంనాడు స్టేజిపై నృత్యం చేసిననాడు చూశాడు. అసలు ఆ అమ్మాయి మంచి నాట్యం చేస్తుందని, చేయగలదని మొదటి పరిచయంలోనే అతడు వూహించాడు. ఆ రోజు నాట్య ప్రదర్శనంతో అతని హృదయంలో నీల పీఠం వేసుకొని కూర్చుంది. మిగతా వారందరూ ఆమె నాట్యాన్ని చూసి మురిసి ముగ్ధులయ్యారు.

ఆమె ప్రేక్షకలోకాన్ని బాగా ఆకర్షించింది. ఆమె నాట్యాన్ని మెచ్చుకున్నా మరునాటికి వెంటనే మరిచిపోగలిగారు కాని కేశవ అలా మరిచిపోలేక పోయాడు. ఆమె అతనిని వదలలేదు మంత్రముగ్ధుడైనాడు. క్రమంగా ఆమెతో స్నేహం, పరిచయం పెంచుకున్నాడు. ఆమె అవసరం తనకి వుంటుందని వూహించాడు. తన నాటకంలో కథా నాయిక పాత్రకి చాలా బాగుంటుందని నిశ్చయించుకున్నాడు. నాట్యం చేయాలని అభిరుచే వున్నవారికి డ్రామాలో పాల్గొనాలనే ఇష్టం కూడా వుంటుందని అతనికి తెలుసు. కొందరు జలసీతో అనేక పన్నాగాలు ఎన్ని మాటులాడినా, ఆకోరికలు తమలో లేక పోలేదు. పైకిమాత్రం అందని ద్రాక్షపండ్లు పుల్లనఅన్నట్లు వెగటుగా మాట్లాడే వారు, ఆత్మ సంతృప్తి కొరకు. మనస్సులో మనసు పడేవారు.

ఆ మద్దిల సుబ్బయ్యే పెంచాడట దీన్ని మద్దిల సుబ్బయ్య ఎవరు? పెంచడం ఏమిటి? అనేప్రశ్నలు బయలుదేరేవి వారిలో.

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే అంచనా కబుర్లు చెప్పుకునేవారు.

సుబ్బయ్య మద్దిల వాయిస్తాడన్నమాట నిజం. హరిదాసుల దగ్గరనుండి పెద్దసంగీత పాఠకుల దాకా సుబ్బయ్య మద్దిల చక్కగా వాయించగలడు. అతనికి నిజం చెప్పాలంటే నిముషం తీరుబడి ఉండేది కాదట. ఒక రోజు సుబ్బయ్య రాత్రి రెండు గంటల వేళ హరికథా కాలక్షేపంలో మద్దెల వాయించి వస్తున్నాడు. నీలాటి రేవు ప్రక్కనుండి ఇంటికి దగ్గర మార్గాన నడచి పోదామని వస్తున్నాడు. ఆకాశంలో వెన్నెల విరియ కాస్తోంది. వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. చెరువుగట్టున చెట్లు వత్తుగా పెరిగి వున్నాయి. ఎంత వెన్నెల కాస్తున్నా చెట్ల నీడలు చీకటులు క్రమ్ముకున్నాయి. సుబ్బయ్య నడక సాగిస్తున్నాడు. భుజాన మద్దెల బరువుగా వేలాడుతోంది. అప్పటి వరకు వాయించి అలసిన సుబ్బయ్య ఉస్సురని నీరసంగా నిద్ర కళ్ళతో నడుస్తున్నాడు. అంతలో అతనికి కళ్ళకు ఒక దృశ్యం కనపడింది. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆతురతగా నడుస్తున్నారు. ఎవరి నోటంట ఏ విధమైన మాటలు లేవు. ఎలాగో అక్కడనుండి దాటి బయట పడితే చాలని అన్నట్లుంది వారి నడక ధోరణికు సుబ్బయ్య కూడా కొంచెం భయమనిపించింది. దొంగలేమో అనుకున్నాడు. చెట్టుప్రక్కగా నక్కాడు. తన జీవనాధారమైన ఆ మద్దిల కాస్త దొంగల పాలవు తుందేమో అని భయంతో.

ఇంతలో అతనికి ఒక విచిత్ర మైన వస్తువు కనబడింది. ఆస్థమా రోగి గొంతు లోంచి వినబడే పిల్లి కూతలాంటి శబ్దం చెవుల పడింది. వెనక్కి తిరిగి చూశాడు, చటుక్కున చేతిలో మద్దెలక్రింద పెట్టి నాలు గడుగులు ముందుకు వేశాడు. అతని కండ్లను అతనే నమ్మలేక పోయాడు. ఆతురతగా క్రిందకు వంగి చూశాడు. గుడ్డలమూట లాగవుంది త్వరగా వాటిని విడదీసినాడు. రక్తపుకందు, నోటికి అడ్డంగా గుడ్డలు చిక్కగా కప్పివున్నాయి. ఆ బట్టలను తొలగించినాడు. పసిపాప మినమిన లాడుతూంది. వెంటనే అతని కండ్లలో సంతోషం మెరిసింది. హృదయంలో శకుంతల కణ్వముని మెరిశారు. ఆక్షణంలో తనని కణ్వమునితో పోల్చుకున్నాడు. తన అదృష్టాన్ని కొని ఆడుకున్నాడు. నల్లని వొత్తైన ఉంగరాల జుట్టు, తెల్లని చందమామను మరిపించే పసిపాపను లేవదీసి భుజాన వేసుకున్నాడు. పాపాత్ములు ఎవరో. నయం, చంపకుండా వదిలారు. నీలాంటి పాపని ఇలాంటి నీలాటి రేవున వదలడానికి చేతులెలా వచ్చాయమ్మా......నీలా...—' అని అనుకున్నాడు. ఇంటికి పరమానందంగా వచ్చాడు.

ఆతురతతో భార్యను పిలిచి తలుపు తట్టాడు. అలవాటుగా అతడు రోజూ కూడా నడిరేయి రావడం అలవాటయిన ఆమె నిదానంగా వచ్చి తలుపు తెరిచింది. మనకు బంగారుగని దొరికిందే... అన్నాడు ఆనందం ధ్వనించేలా.

భుజాన తగిలించుకున్న మద్దిల తీసి దించాడు... చేతుల్లో వెచ్చగా నిద్రిస్తున్న పసి కందును, ఇదిగో...చూడు... దేముడిచ్చిన ప్రసాదం...వరం... బంగారు...పాప... అంటూ పాపని ముందుకు చూపించాడు పట్టరాని సంబరంతో. గాఢ నిద్రలో ఉన్న పాప నిద్రాభంగం కలిగి కేరు కేరున ఏడవసాగింది.

సుబ్బయ్య భార్య అతననుకున్నంత ఆనందాన్ని కనబర్చలేదు...అతని హృదయం చివుక్కుమంది.

ఆ పసికందుకు ముందు కాసిన్ని పాలు పొయ్యి. పిల్లముఖం చూసైనా పాలు పొయ్యి... అని బ్రతిమాలినట్లు చెప్పాడు.

ఎలాగో సుబ్బయ్య భార్య సహనాన్ని కొని తెచ్చుకొని పిల్లని చేతుల్లోకి తీసుకుంది. పాలకోసం వెతికింది. ఇంట్లో పాలు లేవు. ఇంతలో మెరుపులా ఆలోచన కలిగింది. అలమారులో ఉన్న తేనె సీసా అందుకోమంది సుబ్బయ్యను.

సుబ్బయ్య బ్రతుకు జీవుడా అని తేనె సీసా. చెంచా తెచ్చి ఆమె ముందు పెట్టాడు. ఆమె పసి పిల్లకు తేనె కుడిపింది. పాప తేనెను గుట గుటా కుడిచి మళ్ళా హాయిగా నిద్రపోయింది.

క్రమంగా సుబ్బయ్య భార్యలో మాతృత్వం మేల్కొంది. ప్రేమ, వాత్సల్యం ఉదయించాయి. పిల్లలులేని తమ జీవితానికి పసిపాప ఒక వెలుగుగా, జీవన జ్యోతిగా భావించి పెంచసాగింది. నీల అనే పేరు ఆమెకు సార్థకమయిపోయింది. నీల క్రమంగా పెరిగి నెలల పిల్ల అయింది. లక్కపండు లాంటి బోసి నోటి చిరు పెదవుల మీద పసిడి నవ్వులు, బొద్దుగా, తెల్లగా ఒత్తైన వుంగరాల ముంగురులతో కన్నుల పండువగా వుంది. వారిద్దరి హృదయాలకు ఆనంద పర్వంగా వించేది.

సుబ్బయ్య భార్య, భర్త ఎక్కడకు వెళ్ళినా ఆ పిల్లతో ఆనందంగా కాలం గడపసాగింది. నీల ఒక సంవత్సరం పాప అయింది. పుట్టుకతోనే తల్లి ప్రేమకు నోచుకోని నీలకి ఇక్కడ కూడ తల్లికి కరువే అయింది.

సుబ్బయ్య భార్య అకస్మాత్తుగా నాలుగు రోజులు తీవ్రమైన జ్వరంతో బాధపడి మరణించింది, అప్పటినుండి నీల పెంపకం

బాధ్యత పూర్తిగా సుబ్బయ్య మీదే పడింది. సుబ్బయ్య ఆడదిక్కు లేక, నీలని తనతో కూడ ఎక్కడికైనా తీసికొని పోవలసి వచ్చింది. క్రమంగా నీల పెద్దదయింది; తండ్రితో కూడ హరికథలు, గాన సభలకు వెళ్లేది. ఆ ప్రభావం అంతా ఆమె మీద పడింది. ఇంటికి వచ్చి తను అక్కడ చూచిన హరికథల్లోని నృత్య భంగిమలు చేసి తండ్రిని మురిపించేది. చిన్న చిన్న పాటలు వరుసలు తప్పకుండా శృతి తప్పకుండా పాడి వినిపించేది. సుబ్బయ్య తన బిడ్డ ఆట పాటలను అందచందాలను చూచి మురిసేవాడు. క్రమంగా నీల సభలలో చిన్న చిన్న అభినయ నృత్యాలు చేయడం నేర్చింది. ప్రజలను మురిపించి ముగ్ధులను చేసేది. సుబ్బయ్య తన పెంపుడు బిడ్డను అంతటితో పూరుకోక చదువులో పెట్టాడు. శాస్త్రీయ సంగీతం, నృత్యం, నేర్పించాడు. తన సర్వస్వం నీలగానే భావించాడు. నీలమీద కలిగిన మమకారంతో సంపాదించిన డబ్బు దుర్వినియోగం చేయకుండా కాలం గడిపేవాడు నిలవచేసేవాడు.

కేశవ హృదయంలో అన్నీ సినిమా రీల్సులా, కాల చక్రంలా తిరిగి పోతున్నాయి. కంటికి నిద్ర దూరమై పోయింది. ఏమయినా నీలకు తనహృదయం విప్పి, ఉత్తరం వ్రాయాలని నిశ్చయించుకున్నాడు.

లేచి లైటు వేసాడు. పెన్ను తీసి కాగితం తెరిచాడు. నీలకి లెటర్ వ్రాయలని. కాని మనస్సు పరిగెత్తినంత వేగంగా వ్రాయలేక పోయాడు. మళ్ళీ ఆలోచించి, యదార్థాలు లెటర్‌లో వ్రాసేకంటె స్వయంగా చెప్పడమే మంచిదిగా తోచింది. వెంటనే ఆమె అభిమతాన్ని కూడ తెలుసుకోవాలను కున్నాడు.

నీలా!

నీవు వ్రాసిన లెటర్ అందింది. మీ ఊరి ప్రకృతి సౌందర్యానికి నిలయంగా ఉంది. చాలా చల్లగా వుందని, ఈసారి మామిడి తోట విరగ బూసిందని సువాసనలు వెదజల్లుతూ... అని యేదో కవిత్వం కూడా వ్రాసావు. నీవు కవయిత్రివయి పోతే, నేను మూల కూర్చోవాలి అని భయంగా ఉంది. కనుక ... సరేలే ఇంతకీ నీ ఆదేశ ప్రకారం నేను బయలుదేరి వస్తున్నాను.

కేశవరావు.

అని ఉత్తరం ముగించి ముడిచి కవరులో పెట్టి ఎడ్రసు వ్రాస్తున్నాడు. ఇంతలో తల్లి "కేశీ! ఇంకా పడుకోలేదురా ... పగలంతా స్నేహితులతో కబుర్లు రాత్రి పుస్తకాలు చదవడమూను ఇంక లైటు ఆర్పిపడుకో" అంటూ కేక వేసింది.

కొంత సేపటికి కేశవకూడ లైటు ఆర్పి పడుకున్నాడు. నీలకు లెటరు వ్రాసాక కొంతవరకు హృదయ భారం తీరినట్లనిపించింది. నీలతో తనకు పరిచయం అయినప్పటి నుండి, మొదటిసారి ఆమెతో డ్రామాలో నటించిన నాటి మధురానుభూతులు, నాటినుండి నేటి వరకు, వారిద్దరి మధ్యనిర్మించుకున్న ఆశాసౌధాలను అనుభూతులను తలపోసుకుంటూ నిద్రపోయాడు.

మర్నాటి సాయంకాలం కేశవ శుభ్రమైన దుస్తులు ధరించి ఎక్కడికో బయలు దేరాడు. మేడ మెట్లు దిగబోతుంటే వాసు ఎదురుగా వచ్చాడు 'ఒరేయి, మావయ్యా నీకోసం ఎవరో వచ్చారు' అన్నాడు.

వెధవా... ఎన్నిసార్లు చెప్పాను, అలా ఒరేయ్ మావయ్య అని పిలువొద్దని! ఈ సారి అలా పిలిచావంటె చెంపమీద వాయిస్తా తెలిసిందా...అన్నాడు.

సరేలేరా! మరి చాక్లెట్లు తెచ్చి పెడతావా! అన్నాడు వాసు.

మళ్ళీఅదేమాట, 'రా' అన్న అక్షరం ఉపయోగించవద్దని చెప్పానా... అన్నాడు రెట్టించి.

ఇంతలో ఆ వచ్చినవారు నలుగురు బిలబిల మేడ మీదికి వచ్చారు. బహుశః తనమాటలు వినే వుంటారను కున్నాడు. అందరూ కేశవకి నమస్కారం అన్నారు సభ్యత కోసం.

తిరిగి నమస్కారం అన్నాడు కేశవ. రండి కూర్చోండి, అని కేశవ తన గదిలోకి ఆహ్వానించాడు.

ఏమిటి ఇలా వచ్చారు! అని కుశలప్రశ్న వేసాడు.

వచ్చిన వారందరూ, కేశవకు ఇదివరకు క్లాసుమేట్స్ ఏంలేదు! నిన్ను చూద్దామని అన్నాడు ఒకతను.

'ఊరకరారు మహానుభావులు' అన్నాడు కేశవ. ఏంలేదు... మేమందరము కలసి ఒక నాటక సంస్థ స్థాపించాము... దానికి నీవు సెక్రటరిగా ఉండాలని మా కోరిక' అన్నాడు.

'మీరు నాటక సంస్థ ప్రారంభించినందుకు సంతోషమే కాని నన్ను సెక్రటరిగా వుండమంటే ఎలాగో చెప్పండి!'

'నువ్వే ఉండాలిరా! నీవు తప్పితే దానికి అర్హులు మరి ఎవ్వరు పనికిరారు.'

'అసలు నాటక కళ అంటే ఏమిటో తెలియనివారు ఎలా పనికి వస్తారు చెప్పు ఆ పదవికి...అన్నాడొకడు.

'ఆ! దానికేముంది...నేను కావలిస్తే సలహాలిస్తాను. మీలో ఎవరినైనా సెక్రటరిగా నియమించండి' అన్నాడు కేశవ.

అలాక్కాదని బలవంతం చేసారు. కేశవ నాటక కళ్ళప్రతిభ అంతనీ వారికి చేతనయినంత పదజాలం ఉపయోగించి ప్రశంసించారు.

కేశవ కొంచెం వారి పొగడ్తలకు పొంగి లొంగక పోలేదు.

'మా నాన్నగారు పూరుకోరయ్యా; ఇక...ఉద్యోగం చేయక పోతే ఇంట్లోంచి వెళ్ళకొడతారు... పైగా కొద్ది రోజుల్లో నన్ను సంసారిని కూడ చెయ్యబోతున్నారు.

అయినా ఈ ఆనరరీ సెక్రటరీ లంటే చివాట్లు, తిట్లు లేని పోని నిందలు చాలా తినాలి.

అందులో నాటకం అంటే చాలా డబ్బు ఖర్చుచేస్తేనే రక్తి కడుతుంది. అలాటి ఖర్చులకు డబ్బుకావాలి!'

లదింతా షేమ చూసుకుంటాం నీకెంద ు...అన్నారు.

ఏమో చూద్దాం ! ఆలోచిద్దాం లెండి...' న్నాడు

ఇంటిలో మళ్ళీ వాసు ఒరేయ్ మావ న్యా అన్న పిలుపు వినిపించడం ఆ పిలుపు వెనక్కాలే వాడు రావడం జరిగింది

కేశవ, వాసుని ఒక చేయి పట్టుకొని' ఁ రా పిలవద్దన్నానా... వెధవా...ఇప్పుడేగా చెప్పేను' అని బెదిరించి నట్టు అన్నాడు

వాసు బిక్క మొహం వేసినట్లు చూ ్ నిలబడి పోయాడు.

వీడు ఏదో డాక్టరు చంద్రశేఖరం, డాక్టరు నారాయణరావు అన్నట్లు నన్ను వీడు 'ఒరేయ్' అని సంబో స్తాడు అన్నాడు.

అందరూ పక పక నవ్వారు

అయినా బెదరకుండా వాసు, 'అ మ్మ ఒరేయ్ రమ్మండూ అంటుంది అమ్మమ్మ 'ఒరేయ్ కేశీ' అ ంది, అందుకే నేను ఒరేయ్ మామయ్యా లంటాను'..,అన్నాడ .

ఏడిశావులే పో... అన్నాడు కేశవ, నవ్వుకుంటూ

వాసు అసలు వచ్చిన పని మర్చిపో యి వెళ్ళిపోయాడు.

'ఇంటికీ ఏమిటీ సంగతి ?' అన్నాడ 'అమ్మమ్మ పిలుస్తోంది' అని తుర్రున పరుగు తీశాడు అ క్కడ ఎవకు ఏదో పదిమందిలో పరాభవం జరిగినట్లు

వచ్చిన కేశవ మిత్రుయ కూడ కొంచెం సేపటికి వెళ్ళి పోయారు.

అసలు ఎవకు ఈ నాటకాల పిశాచ ం వదిలేటట్లు కనపడటం లేదు అని అనుకొని క్రిందికి దిగి వచ్చాడ కేశవ.

శ్యామల ఎదురుగా వచ్చింది. 'ఏ రురా కేశీ ఆ మిత్రులు ! ఎందుకొచ్చారు ?' అని ప్రశ్నించింది.

'ఆ ! ఏమిలేదు ! ఊరికే చ చిపోదామని వచ్చారు' అన్నాడు !

'ఏమ్రా అలా ఏదడిగినా సరిగ్గా చెప్పవు ! నాకు వినిపించిందిలే.. అలా అన్ని అద్దుడు పే ్ సలోపలే దాచుకుంటావేం, అడుగుతే చెప్పకుండా...మళ్ళీ ఏదైనా ు ఒకం ప్రారంభిస్తున్నారా ఏమిటి ?' అంది.

'నీవు విన్నావుగా...ప్రశ్న లెందు ు అనుమానమెందుకు...' అన్నాడు కేశవ.

'సరేకాని ! కా స్త ఈ పెళ్ళి హడావిడి అవనీ అపుడు ప్రారంభించ వచ్చు...'

'అప్పుడు ఒకరికి ఇద్దరు, ు గ్గురు తోడు అవుతారు, నన్ను దిగ తీయడానికి శ్రీమతి కూ ా వస్తుందిగా, కడవంత గుమ్మడికాయ క త్తిపీటకి లోకువన్నట్లు ంతవాడినీ ఆవిడకు లొంగు తాననేగా, మీ అభిప్రాయం' అన్నాడు.

ఎక్కడికి వెళుతున్నావు...ఇష ను మీ బావమరిది వస్తాడట'

'రానీ వస్తే మీరు మాట్లాడండి'

'దాగుంటుందా...కాస్త ఇంట ి వుండి మర్యాద చేయక పోతే...'

'ఉన్నారుగా యిు ..ఇంటి పెద్దలుయి కూడా వస్తాడుగా... అంటూ ఇక వెనుక వాక్య మాటలు వినకుండా ముందుకు వెళ్ళి పోయాడు.

మెట్లు దిగుతుండగానే ఎదురింటి వారి అమ్మాయి వాణి ఎదురుగా వచ్చి ది.

'మీ కోసమే వస్తున్నా' అంది మీ దగ్గర ఏవో మంచి నవలలు వున్నాయని మా అన్నయ్య చెప్పాడు అవి తీసుకుందా మని'

'దానికి నీవు రావాలా వాడు అడిగటాడదూ...'

'నేను వస్తే తప్పా...'

'అబ్బే తప్పు కాదు...వాడైతే ఏవికావాలో చూసి తీసుకుంటాడని...సరే రాఘవనే పంపు ఇర్వాడ ! నేను ఇప్పుడు అర్జంటు పనిమీద వెడుతున్నాను.. పనిమీద వెళ్ళేటప్పుడు వెనక్కి తిరిగి వెళ్ళడం మంచిది కాదు'.. అన్నాడు

'సరేలే ..అసలు ఇష్టం లేని మాటేమో' అంటూ రుస రుసా వెళ్ళిపోయింది.

అసలు వాణికేదేమి గుణమో కాని కేశవతో అనవసరంగా కలగజేసుకుంటూ మాట్లాడుతుంది కేశవ తలిదండ్రులు ఇంట్లో లేని సమయం చూచి వచ్చి కేశవతో అనవసరపు బాతాఖాని మొదలు పెడుతుంది. ఆమె అ ప్యాయ్యకొరకు కేశవ ఎప్పుడైనా వాళ్ళ యింటికి వెడితే తనే ఎదురుగా తిష వేస్తుంది. ఇదంతా కేశవకు ఎంత మాత్రం కిట్టక పోయినా విధిలేక వదుల్చుకునేందుకు ప్రయత్నిస్తాడు

కేశవ విగ్రహం ఆకర్షణీయమైంది కావడంవల్లా కన్యాలోకం అతనితో పరిచయం కల్పించుకొని మాట్లాడాలని అతని అభిమానా నికి పాత్రులు కావాలని చూచేవారు కాలేజీలో. అతనితో కథానాయిక పాత్ర ధరించాలని కోరుకునేవారు.

కేశవ తండ్రి వాడి అందానికి తగిన పిల్ల యెక్కడ కనపడ దేదు'...అన్నారు ఏదో మాటల సందర్భములో.

ఆ మాట కేశవ విని 'పోనీ నాన్నా ! అలాంటి పిల్ల దొరికిన చోట చేసుకోకూడదూ' అన్నాడు సగం ప్రాణం బిగపట్టి.

'అదిరా నీ కోరికా... అందుకా ... ఆ కులం గోత్రం లేని ఆ...మద్దిలగాడి కూతుర్ని చేసుకోవాలనా నీ అభిప్రాయం...అలా జరిగితే ఇంక నేను ... ఈ ఇంట్లోంచి జంధ్యం తెంపుకొని పోతారా...అని అన్నారు ఆగ్రహావేశంతో.

అసలు సత్యనారాయణగారు రమ శాఖలో పిల్లనే ముడి పెట్టుకోవాలనే అతి చాదస్తుడు.

అసలు కేశవమీద ఇంట్లో వాళ్ళకు బైటవాళ్ళకు బంధువులకు కూడ బలమైన అనుమానం వివాహం అయినా, ఆ పిల్లతో సరిగ్గా కాపురం చేస్తాడా. ఏలుకుంటాడా! ఇలా నాటకాలని అయిన పిల్లల్ని

హాని పిల్లల్ని వెంటవేసుకు తిరుగుతాడు. ఎంత గొప్ప నటుడైనా, కేశవలో ఒక నీతి నిజాయితీలు వున్నాయని హద్దులు మీరి నడిచే స్వభావం కాదని తల్లికి బాగా తెలుసు.

కేశవ విషయంలో తల్లిదండ్రులిరువురికీ అప్పుడప్పుడు ఇదేవాదన ప్రబలంగా జరుగుతుండేది. ఎంత ఫేలవుతూ బి. ఎ. పాసైనా...అతనిలో మంచి వాక్చాతుర్యం, మాట నేర్పు, ఓరిమి, సరళమైన భాష వున్నాయి. ఇంగ్లీషులో మంచి పాండిత్యం వుంది. ఎవరైనా ఇంతమంచి తెలివుంది ఎందుకురా ఇలా ఫేలవుతావు కేశవా అంటే, అందుకే ఇంత పునాది గట్టిగా ఉంది. దీని మీద పదిహేను అంతస్థుల మేడ కట్టినా యేమీ భయంలేదు...మీలా ముక్కుని పట్టించుకుని పరీక్ష పేపర్లో చీదేసి రానుగా మరి, నా చదువు నా దగ్గరే వుంది. మీది పేపర్లోకి వెళ్ళిపోతుంది అనే వాడు, ఆ మాట విన్నవాళ్ళకి నిజమని ఒప్పుకోక తప్పేది కాదు.

కేశవ ఇంటి గడప దగ్గర వంచిన తల తిరిగి బజారులో ఎత్తాడు. కావలసిన సామానులు కొన్నాడు, అలాగే తను చూడ దలచిన వారిని చూసి ఇంటికి చేరాడు.

సత్యనారాయణ గారు ... ఇంకా మేలుకువగానే ఉన్నారు. ఇంత రాత్రి వరకు ఎక్కడికి వెళ్ళావురా ... అని ప్రశ్నిస్తారని, నెమ్మదిగా కేశవ మేడ మెట్లెక్కుతున్నాడు దొంగలా అడుగులేస్తూ.

తల్లి సావిత్రి ఇంకా వంట ఇంట్లో పనులు చక్క బెట్టు కుంటోంది.

'కేశవ ఇంకా రాలేదు, అన్నం వేపుడు కూడా ఆరిపో తున్నాయి ... వేళకు తిండికిరాడు' అనుకు టోంది.

'ఆ ... ఇంకెన్నాళ్ళులే ... ఓరిమి పట్టు పెళ్ళాం వచ్చి నిలేసి అడుగుతుంది ఇంత పొద్దుపోయిన దాకా తిరిగి వస్తే అదే జాగ్రత్త పడుతుంది. అంతదాకా' ... ఇలా ఆల్ రౌండు బస్సులా తిరిగివస్తాడు.

తల్లి తండ్రుల మాటలు విన్నా విననట్లు కేశవ మేడ మీదకు వెళ్ళిపోయాడు.

(సశేషం)

రంగుల చెరువు పథకం

(22 వ పుటనుండి)

అన్నారు. కేవలం ఈ పథకం ప్రశంసలు అందుకొనడమేగాక ఎన్నో పంచాయతీలకు ఉత్పత్తి పథకాలను చేపట్టే విషయంలో మార్గదర్శక మయింది.

మార్గదర్శక పథకం

ఈ పథకం ఎన్నో పంచాయతీలను ఉత్తేజపరచింది. ప్రభుత్వ దృష్టిని ఆకర్షించింది. ఇతర జిల్లాలలోకూడా ఇటువంటి పథకాలను చేపట్టవలసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకంపట్ల ప్రభావితులై బెండ మూర్లంక, కోలంక, పొన్న మండ, బెల్లంపూడి, అంతర్వేది, మోరి, నడపవల్లి, కొమనపల్లి, భీమనపల్లి, అనాతవరం, బినాపురం, పలివెల గ్రామ పంచాయతీలు ఉత్పత్తి కార్యక్రమాలు ఈ పథకం ప్రాతిపదికపై చేపట్టాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఈ పంచాయతీలు అమలుపరచే ఉత్పత్తి కార్యక్రమాలకు పెట్టుబడి పెట్టడానికి గాను ముందుకు వచ్చారు. రాష్ట్రప్రభుత్వం స్టేట్ బ్యాంకు ఇచ్చే అప్పుకు హామీగా పంచాయతీల తరపున ప్రభుత్వం హామీగా నిలబడుతుంది. ఈ పథకంద్వారా తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ రాజ్యసంస్థలు ప్రభుత్వ విశ్వాసాన్ని చూరగొన్నాయనటంలో ఏ విధమైన సందేహంలేదు.

రంగులచెరువు విహారయాత్రా కేంద్రంగా మార్పు

రంగులచెరువు ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపం, ఈ ప్రాంతాన్ని విహార యాత్రాస్థలంగా రూపొందించాలని జిల్లా పరిషత్తు అధ్యక్షుల ఆకాంక్ష. పట్టణాలలో, రణగొణధ్వనులతో సతమవుతూ, శుభ్రమైన గాలికి, ప్రకృతి సౌందర్యానికి కరువైన పౌరులకు ఇదొక విహార యాత్రాస్థలంగా, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కొలువుపరుస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని మాధ్యమిక, ప్రాథమిక కళాశాల విద్యార్థులకు ఒక విహారకేంద్రంగా ఉంటుంది. కాకినాడ నుంచి ఇక్కడకు బస్సుసౌకర్యం ఉంది. ఈ పథకానికి ఆనుకొని ఉన్న మైలుపొడవు కాలువ పడవ షికారుకు ఉపయోగపడుతుంది. అన్ని వసతులు ఏర్పాటు చేయటానికిగాను రంగులచెరువు పథకాన్ని అమలుపరచిన స్థలానికి ఆనుకొనిఉన్న మూడు ఎకరాల భూమిని కూడా జిల్లా అభివృద్ధి మండలి కొంది. ఆ స్థలంలో విశ్రాంతి గృహాన్ని విస్తృత ప్రాతిపదికపై వ్యవసాయ కార్యక్రమాలను నిర్వహించటానికి వీలుంటుంది.

రంగులచెరువు పథకం ద్వారా లాభాలు

పెట్టుబడి పెట్టిన పంచాయతీల, సమితుల జిల్లాపరిషత్తు ఈ పథకం ద్వారా అప్పుడే లాభాన్ని పొందాయి. ఇప్పుడు 25 వేల రూపాయలు లాభాలను డివిడెండ్ల రూపంలో ప్రాజెక్టు నిర్వాహక మండలి 1970 సంవత్సరంలో అక్టోబరునెలలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎమ్. టి. రాజుగారిచే ఇప్పించింది. ఇంకా లాభాలనుంచి 21 వేల రూపాయలకు మూడుఎకరాల భూమినికొంది. 7,500 రూపాయలఖర్చుతో చేపపిల్లల పెంపకానికి ఇటుక, సిమ్మెంటుతో ప్రత్యేక జలాశయాన్ని నిర్మించటం జరిగింది. ఇంత స్వల్ప వ్యవధిలో వచ్చిన ఆదాయం పంచాయతీలకు ప్రోత్సాహకరంగా ఉన్నదనటంలో ఏ విధమైన సందేహంలేదు.

చోటు చాలని ఇల్లు

శ్రీ ఎ. సూర్యప్రకాశ్

నిండుగాపుల్లలున్న కొత్త అగ్గిపెట్టెలా
క్రిక్కిరిసివున్న ఇల్లు
ఇంటినిండా కన్నాలు
కన్నాలనిండా ఎలుకలు
ఇంటినిండా పిల్లిపిల్లలు
క్షణక్షణాభివృద్ధి చెందుతున్న నల్లులు
దుప్పటినిండా మరకలు
జోలలు పాడుతున్న దోమలు
బెల్లం చుట్టూ చీమలు
బెల్లం తక్కువ చీమలు ఎక్కువ

కుత్సితపు వలలల్లి
ఆకలిగా ఆబగా
పురుగుల కోసం
పొంచి చూస్తున్న సాలీళ్లు—
వంట చెరుకుల కింద
బొగ్గుల సంచి కింద
నవ్వుతూ తుళ్ళుతూ
తీయగా హాయిగా
కాపురం వెలిగిస్తున్న తేళ్లు—
పాతపుస్తకాలను
నిశ్శబ్దంగా చదివేసి
ఉన్నమతులూ పోగొట్టుకొని
మస్తకాలను కాకుండా
ఉదరాలను నింపుకొంటున్న
చెదపురుగులు—
చుట్టపు చూపులా అప్పుడప్పుడు
వచ్చిపోయే కప్పలు

వాకిలినిండా చకచక తిరిగే
పుంజూపెట్టా కోడిపిల్లలు
జారి కింద పడిన
పిచ్చుక పిల్లల మూగరోదన—

అక్వేరియంలో
అందంగా కన్పించే చేపల
కడుపులలో
కన్పించని ఆకలి—
పంజరము లోపలి పచ్చని చిలుకల
ఆకలి పలుకులు ముద్దొస్తాయా!

రంగు తుడిచేసుకుంటున్న ముఖంలా
సున్నం పెళ్లలు పెళ్లలుగా రాలుతున్న గోడలు
ఆకలితో నోళ్లు తెరచినట్లున్న కిటికీలు
కనుకొలకుల్లోని దైన్యం ముద్దకట్టినట్లున్న బూజు
పగిలిన అద్దం పదారు ప్రక్కలు
ప్రక్కలనిండా ప్రతిబింబాలు

ఇంటినిండా మనుషులు
ఒంటి మీదా గుండెలోన
అంతుతెలియని రోగాలు
లోతుతెలియని గాయాలు
చమురు వాసన ఎరుగని తలనిండా పేలు
కంటినిండా చక్రవడ్డీల మాలల ఉచ్చులు
వంటినిండా పాములు జెర్రులు జరజర ప్రాకుతున్న
అనుభూతులు జలదరింతలు
గోడకు అతుక్కుపోయిన బల్లిలా
కడుపును అంటిపెట్టుకున్న ఆకలి
ఎన్నోఏళ్లగా ఎడతెరిపి లేకుండా
ఊగుతున్న ఊయల
రాత్రిపేరిన చిక్కటి చీకటిపంచి దోమతెర
దోమతెరను చీల్చుకొని
లోనికి వద్దామని ప్రయత్నించి
నాలుక కరచుకొని బయటే ఆగిపోయిన కాలం

జంతు ప్రదర్శన శాల వంటి ఇల్లు
ఇంటినిండా కొత్తప్రాణులు
ఇలాగే ఇంకా ఇల్లు నిండితే
నిలబడదానికే చోటుండదు!

స్త్రీల పాటలు

శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు

(గత సంచిక తరువాయి)

వివాహానంతరం నూతన వధూవరులను వాకిలికి ఇరువైపుల నిలువబెట్టి ముత్తైదువలందరూ తలుపుదగ్గర పాటలు ఎంతో వినోదముగా పాడుచుందురు. వీటిలో ముఖ్యముగా ఆంధ్రప్రదేశము నాలుగు చెరగులలో ప్రతి చోట వినిపించినట్టి ఈ ప్రశస్తమైన పాటను తిలకించండి.

"చిటపట చినుకులు దుప్పటి తడిసెను తలుపు తీయవే భామా! నీవు తలుపు తీయవే భామా!" అని పాడుతూ వధూ వరుల చేతవరుసైన ముత్తైదువలు వారి వారి పేర్లను చెప్పించుచుండుట ఒక ఆచారము. వివాహానంతరం నాలుగవ రోజు ఉదయము రోకళ్ల పోటుతో, సువ్వి పాటలు పాడతారు.

ద్విపద ది అక్షర ఛందస్సు. ఈ రకపు పాటలది మాత్రా ఛందస్సు.

ఇకపోతే సమర్త పాటలు, సీమంతపు పాటలు. వేవిళ్ల పాటలు, మొదలైనవి ఎన్నో రకపు పాటలున్నవి.

ఈ మధుర జీవన స్రవంతిలో అనుదినము సంభవించు ప్రతి చిన్న సంఘటన, ప్రతి చిన్న సన్నివేశము గృహిణుల దృష్టిలో యెంతయో ప్రాముఖ్యతను కలిగి వుంటుంది.

వివిధ రకములైన ఈ పాటలన్నియు శుభ ప్రదమైన, ఆనందదాయకమైన, వినోదాత్మకమైన ఏదో ఒకానొక మంగళ సన్నివేశమును దృష్టియందుంచుకొని వ్రాయబడినవే, గనుకనే ఈ రకమైన మంగళ ప్రదమైన సాహిత్యము బహుజనాదరణకు పాత్రమై గృహ సీమలలో కలకాలము వర్ధిల్ల గలిగి వుంటున్నది.

స్త్రీల కథా గేయములు

సభలలో పండితుల చేత వెలివేయబడిన ఈ స్త్రీల పాటలు గృహ సీమలలోను, గ్రామ సీమలలోను బహుజనాదరణకు పాత్రమై వర్ధిల్లుచున్నవి. ఈ రకపు పాటలు స్త్రీల సహజ సంస్కృతిని, వారి నాగరికతను విస్తరింప జేసి అవి మధురమైన కథా గేయములై వర్ధిల్లినవి. ఈ పాటలలో వారి నైసర్గిక పరిస్థితుల వర్ణనలు విరివిగా వుండగలవు. పురుష కవులు వర్ణించునట్టి కృత్రిమ వాతావరణము, అతిశయోక్తులు వీటిలో మచ్చుకైనను కానరావు. కనుకనే అవి ఆనందప్రదముగను, ఆహ్లాదజనకముగను, మనోరంజకముగను, వుండి మనకు ఉత్సాహమును సమకూర్చుచుండగలవు. ఈ పాటలు మాత్రాఛందోబద్ధమై యుండి, ఒక నిర్ణీత పరిమితిలో మాత్రమే నడుచుచుండును. వీనిలో సార్వజనీన భావము అడుగడుగున మనకు గోచరించుచుండగలదు. అవి మన మనస్సును, హృదయమును ఒక్కసారి కదలించివేసి మరొక లోకమునకు గొంపోవునట్టి శక్తి సంపన్నములై వర్ధిల్లుచుండును. మనకు తెలియని అనిర్వచనీయమైన ఆనందమును అవి ప్రసాదించుచున్నవి.

అవిభక్త కుటుంబములలో ఇంటి పెద్దల కుండే పెద్దరికము, గౌరవమర్యాదలు ఈ పాటలలో మనకు ఎంతో చక్కగా గోచరిస్తవి.

ఒక ఇంటి కోడలు బియ్యము కడవలో పోసి కడుగు చుండగా ఆమె అన్న వస్తాడు అన్నకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్ళు అందించి ఆమె కంట తడి పెడుతుంది, అన్న ఆప్యాయతను వొలకబోస్తూ—"ఎందుకూ కన్నీరు ఏమి కష్టములు, తుడుచుకో చెల్లెలా! ముడుచుకో కురులు, ఎత్తుకో బిడ్డను ఎక్కు అందలము, మీ అత్త మామలకు చెప్పిరావమ్మా" అంటాడు అన్న.

ఇక్కడ అన్న పాటించిన ఔచిత్యము, మర్యాద ఎంతో ఉదాత్తతతో నిండినది. అత్త మామల ఆజ్ఞను తీసుకోవలసిందని చెల్లెలిని ఆదేశిస్తాడు. ఇక్కడ ఆమె పొందవలసింది భర్త ఆజ్ఞకాదు. అత్తమామల ఆజ్ఞే ముఖ్యమైనది బిడ్డలగన్న తల్లి అయినా, అవిభక్త కుటుంబములో ఆ రోజులలో అత్తమామలకున్న హోదా, అధికారము దీనివల్ల చక్కగా విశదమౌతున్నది.

అప్పుడు ఆమె అత్తతో "మా అన్న లొచ్చారు మమ్మంపుతారా" అని అడుగుతుంది. ఆమె తాను స్వతంత్రించి పొమ్మనదు. "నేనెరుగ నేనెరుగ మీ మామ నడుగు అంటుంది." ఆ ఇల్లాలు మామవద్దకు పోయినది. అతడు తనకు తెలియదంటాడు. బావలను ఆడబిడ్డలను అందరిని అడిగి, చివరకు భర్త దగ్గరికిపోయి సంగతి చెపుతుంది. అప్పుడు అయన "పెట్టుకో సొమ్ములు—కట్టుకో చీర పోయిరా సుఖముగా పుట్టినింటికిని" అంటూ ఆజ్ఞాపిస్తాడు. ఇందులో ఎంత కథ ఎంత విచిత్రముగా జరిగి ముగిసినదో చూడండి. దీనివల్ల ఆ నాటి గృహసంబంధమైన ఆచారము, ఇంటి పెద్దలకుండే ఘనత మనకు ద్యోతకమౌతున్నవి.

వివాహ సమయాలలో స్త్రీలు పడే సరదా, వారు చేసే హంగామ, పొందే ఆనందమూ వర్ణించి చెప్పటం కష్టము—పెత్తనమంతా వారిదే. పెళ్లిళ్లకు సంబంధించిన పాటలు, మనదేశంలో కోకొల్లలుగా ప్రచారంలో వున్నవి శాంతకళ్యాణము, సీతాకళ్యాణముకు సంబంధించిన పాటలు ప్రతి ఇంటా, ప్రతి స్త్రీనోట వినబడుతూ వుంటవి.

సీతారాముల కల్యాణమునకు స్త్రీలనందరిని బయలుదేరి రమ్మని ఆహ్వానించే ఈ పాటను గమనించండి ఎంత అందముగా ఉన్నదో!

రావమ్మ యీ వేళ రాము పెండ్లికినీ
పట్టంచు చీరతో పడతి రావమ్మా
మట్టెలా పిల్లేళ్ల మగువ రావమ్మా
నీలంచు చీరతో నెలత రావమ్మా
చెరుకాకు చీరతో చెలియ రావమ్మా
పరికించు చీరతో కలికి రావమ్మా!
మల్లె పూల చీరె మగువ రావమ్మా
ఉల్లి పొర్ల చీరె యువిద రావమ్మా

పెండ్లికిముందు పసుపు దంచటము, పుట్టింట్లో ఆచారము. అది ముగిసిన పిమ్మట ఒక్కొక్క పనులన్నీ పూర్తి చేస్తారు. వివిధ రకాలైన ధాన్యాలను దంచటమూ, వివిధరకాలైన చీరలను ధరించిన ముత్తైదువలు, వారు ఉపయోగించిన రోళ్లను, రోకళ్లను వర్ణించటమూ, ఈ పాటలలో మనకు గోచరిస్తాయి.

శ్రీ లింగుపల్లి గోపయ్య రచించిన "వరద రాజు పెండ్లి"— అను పాట అతిరమణీయ మైనది. పెరుందేవి చేసుకున్న అలంకరణలు వర్ణనాతీతమైనవి. ఇక వరదరాజ స్వామికి జరిగిన వివాహవర్ణనము చదువుతూవుంటే హృదయము ఆనందముతో పరవళ్లు తొక్కుతుంది.

పండితులు వర్ణించు వివాహ సంబంధమైన కావ్యాలు వివాహము ముగిసిపోవటముతో అవీ ముగిసిపోతవి. కాని స్త్రీల ఈ మధురమైన పాటలు అంతటితో ఆగవు. వారి వివిధ రకములైన వినోదములు, ఆచార వ్యవహారములు, అచ్చట ముచ్చట్లూ వీటిలో ప్రతిబింబిస్తూ వుంటవి. అది వీటిల్లో గల విశేషము.

లోకారాధ్యులైన సీతారాముల కళ్యాణము ముగిసినది. ఆ తరువాత శ్రీరామ చంద్రుడు అలిగి విడిది ఇంటికి వస్తాడు. అల్లుణ్ణి తీసుకురావడానికి జనక మహారాజు వస్తాడు. ఆ పిమ్మట సీతమ్మ సర్వ భూషణములు ధరించి, సర్వ సంభారములతో అక్కడికి వచ్చేస్తుంది. ముత్యాలగద్దె పైన ఆసీనుడైయున్న శ్రీరామ చంద్రుడు ఎదుట రత్నాల గద్దెపైన సీతమ్మనుంచి బ్రతిమాలుతూ వున్న ఈ పాటయందలి సొగసు, సహజ సౌందర్యమును తిలకించండి

గుర్రమ్ము ఎక్కి యీ కొమ్మ వచ్చినదీ
గోత్ర చింతామణి లేచి రావయ్యా!
అందలము ఎక్కి యీ అతివ వచ్చినదీ
అందమైన పెండ్లికొడుక లేచి రావయ్యా!"

అంటూ.

అప్పుడు శ్రీరామచంద్రమూర్తి ప్రసన్నుడౌతాడు.

"ధర్మసరుకులు రెండు జారిచెంబులనూ
అరణమిస్తే కాని లేచి రాననెనూ—"

అంతట అధిక సంపన్నుడైన జనకమహారాజు కోరినవన్నీ ఇచ్చి అల్లుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకుంటాడు.

ఈ మధ్యలో ఎంతో అల్లరి జరుగుతుంది. స్త్రీలు శ్రీరామ చంద్రుణ్ణి—

"పత్తిగింజల కుదితి పాచియున్నాది
పాచారు మంచంపు పంపి రావయ్యా!
చేబియ్యమన్నమూ చెల్లుతున్నాది
పదినె మరదిపిల్లసు చెల్లించ మనుము"—

ఇలా ఎన్నో విధాలుగా ఎగతాళిచేస్తారు.

సీతాదేవి ఇంటికి శ్రీరామచంద్రమహారాజును తీసుకెళ్ళటముతో ఈ పంతు ముగుస్తుంది.

పెళ్ళిళ్లల్లో జరిగే ప్రతి చిన్న విషయమూ స్త్రీలపాటలకు కథావస్తువౌతుంది. గృహజీవనములో ప్రతినిత్యమూ వారు అనుభవించే మధుర సన్నివేశములన్నియు ఈ పాటలకు సుందర ఇతివృత్తములై శోభిల్లుతుంటవి. గృహజీవనము నందలి సొగసు, ఇంపు సొంపులు స్త్రీల పాటలకు ముఖ్యాధారములై ప్రాణ భూతములగుచవి. సీతమ్మను అప్పగిస్తూవున్నప్పుడు పాడిన ఈ పాటను చూడండి.

నెయికావనేరదు నెలత ఓ వదిన! నేర్పుతో
పనులెల్ల నేరు పావమ్మా! మీ బాలలలో ఒక్క
బాలగా చూడు! బుద్ధెరుగదు మంచిబుద్ధులేగాని!
బుద్ధి వచ్చినదాక దిద్దుకోవమ్మా!

ఇక అత్తవారింటికి వెళ్ళే లక్ష్మీదేవికి చెప్పునట్టి బుద్ధులు చూడండి— ఎంత సహజముగా ఆమె శీలమును తీర్చిదిద్దు చున్నవో.

చెలగి మీ అత్తింట్లో బుద్ధిగ నుండమ్మా!
యెవ్వరేమాడినా యెదురాడకమ్మా!
పలుమారు పలుదెరచి నవ్వబోకమ్మా
నాలోటి చేసినా మంకు పోరెల్ల యెరుగని అత్తింట్లో
చేయబోకమ్మా!...... నీవు యేమన్నాను మేము అత్తవారింట యేమనబోకమ్మా!—" అని

ఇక అల్లుడితో చెప్పే మాటలు చూడండి.

"అల్లుడవూ, చెలికాడవు, తల్లివి తండ్రివి నీవే" అని అతనికి అప్పగిస్తారు.

ఇంతవరకు ఆ పిల్ల జీవించిన ప్రపంచము వేరు. పరిసరాలు వేరు. పరిస్థితులువేరు. ఇకముందు ఆమె జీవించబోయే ప్రపంచము వేరు. అందులో ఏమాత్రము ఒడుదుడుకులు సంభవించినా, ఇక ఆ పిల్ల జీవితము యథాయథలై పోతుంది. కత్తిమీద సాములాంటి ఆ జీవితమును తీర్చి దిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉన్నది. గనుకనే వారు పేరు పేరు వరుసలతో ఆ ముగ్ధబాలికను కొత్తగా కలిసిన వియ్యాలవారికి అప్పగిస్తారు. ప్రతిమాటలో ప్రతి చేష్టలో ఎంతో ఔచిత్యము ఇమిడి వున్నది. ప్రేమ, అభిమానము, వాత్సల్యము పొంగిపొర్లుతున్నాయి. కన్నకడుపు తీపి అటువంటిది. అందుకే అంత బాధ—ఆవేదన.

పలు రకాలైన వస్తు సామగ్రితో సీతమ్మకు సారెలు పెట్టి అత్తవారింటికి పంపిస్తారు.

పిల్లను అత్తవారింటికి పంపేటప్పుడు అప్పగింతలుచేయటం మనదేశములో ఆచారము. ఆ దృశ్యము చూచినప్పుడు ఎంత కఠిన హృదయుడికైనను గుండె కరిగి పోవలసినదే. కంట తడి బెట్టక తప్పదు. మిగిలిన వివాహతంతు అంతా ఒక ఎత్తు. ఈ ఒక్క సన్నివేశము ఒక ఎత్తు.

తల్లిదండ్రులు, చుట్టపక్కములు, ఇరుగు పొరిగింటి అమ్మ లక్కలూ ఈ వివాహతంతునంతటినీ తిలకిస్తూ పొందునట్టి ఆనందము, మధురానుభూతి ప్రతి పాటలోను, ప్రతి మాటలోను హారములో దారమువలె ఇమిడి వుండి ఒక దివ్యానుభూతిని కలిగిస్తుంది.

సీత రాకకు వేచివేచి విసుగుజెందిన శ్రీరామచంద్రమూర్తి విరహ వేదనతో పడకటింటిలో తలుపు బిగించుకొని పడుకుంటాడు. ఇక సీతమ్మ అత్తమామలకు సపర్యలు చేసి చాల రాత్రికి భర్త పడుకొనివున్న గదికి వెళుతుంది. తలుపును తట్టుతుంది — సమాధానం రాదు.

"తలుపేయ కోపమును తాళనూ గలనా!" అని ఇక వరుస వరుసలుగా బ్రతిమాలుతుంది. కాని ప్రభువులవారికి కనికరం కలుగ లేదు

అప్పుడు తల్లి కౌసల్య వచ్చినది—
"దశరథుల పుత్రుడవు — జనకులల్లుడవు
సీత జేసిన తప్పు శీఘ్రాన జెప్పు—" అంటుంది.

ఇక శ్రీరామచంద్రుడు తల్లి కంఠమును విని మారుమాటాడకుండా తలుపు తీస్తాడు. ఇవన్నీ సామాన్యుల ఇండ్లల్లో క్రొత్తగా ఆడపిల్ల కాపురానికి వచ్చిన రోజుల్లో జరిగే సంఘటనలే. అయినను వీటిని ఎంతో రసవత్తరముగా, సహజసుందరముగా భాసించేట్లు చిత్రించి మనముందుంచాడు కవి. శ్రీరాముణ్ణి సీతా మహాలక్ష్మిని నాయకా నాయికలనుజేసి, ఇది చదువుతూవుంటే ప్రతివారికి తమ గత జీవితపు మధురస్మృతులు గుర్తుకు రాక తప్పవు—అది ఈ పాటల లోని సహజత—సుందరత—రెండూను.

అయితే ఈ పాటలలో కథాసౌందర్యము యెంత చక్కగా ఇమిడివుంటుందో, అంత చక్కగా రచనా శిల్పము గోచరించదు. అంతమాత్రము చేత వీటిని నిరసించటానికి వీలులేదు.

ఈ దేశ సారస్వతములో చిపరన ఫలశ్రుతి తప్పకుండా వుంటుంది. అది ఈ పాటల ప్రత్యేకత.

శ్రీరామచంద్రమూర్తి కోపమువలెనే, సీతమ్మ అలుకను గూడ కవి ఎంతో చక్కగా వర్ణించాడు మరొక పాటలో.

ఈ పాటలలో సీతా, రాముడూ, పేటలూ, కోటలూ, వర్ణింపబడినా, ప్రతిపాట జీవితము నందలి వొడుదుడుకులను; సుఖదుఃఖములను వర్ణించి చూపెడతాయి.

ఈ స్త్రీల పాటలలో వర్ణింపబడిన సీత యెంతటి మహోజ్వలమైనదో, ఎంతటి ఉదాత్త శక్తిసంపన్నయో నిశితంగా పరికించి చూస్తే తెలుస్తుంది, మాటలలో చెప్పేకన్న.

సీతాదేవి వామన గుంట లాడుపాట, లక్ష్మీదేవి సొగతాలాట, సీతాదేవి అనవాళ్ళు మొదలైన పాటలను విని ఆనందించవలసినదే, వర్ణించి చూపటం శక్తికి మించిన పని.

ఉషా స్వప్నములో గుడిగుడి గుంజము, దాగుడుమూతలు, ఈగుటుయ్యాల, దాడివిళ్ళ, రట్టి ఆట, కన్నెఆట మొదలైనవెన్నో బాలబాలికలకు సంబంధించిన వివిధ రకములైన ఆటలు వర్ణింపబడినవి.

ఉషాస్వప్నము, శ్రీకృష్ణుని జననము, లక్ష్మీదేవి సొగతాలాట, సీతమ్మవారి అలక, గంగాగౌరి సంవాదము, ధర్మరాజు జూదము, సత్యభామ సరసము, ఊర్మిళాదేవి నిద్ర మొదలైన పన్నియు మనస్సును రంజింప జేస్తుంటవి, వీటిలో కవి వీలున్న చోటనల్లా అన్ని అవతారాలు, నగలూ, ధాన్యాలు, సేసలూ, పువ్వులూ లాంఛనాలు, ఆటలు ఒకటేమిటి ప్రతీదీ ఎంతో సమర్థవంతముగా వర్ణిస్తాడు.

ఈ పాటలలో స్త్రీలకు విద్యతోపాటు, విజ్ఞానము, వినోదములూ సమృద్ధిగా లభిస్తవి.

రుక్మిణీదేవి శ్రీమంతములో శ్రీకృష్ణుడు రుక్మిణితో, 'నాతిరో నీకేమైనా మనసు కలిగున్నాను — నాగలోకమంతా సాధించి తెచ్చేనే—' అంటాడు. అందుకు లక్ష్మీదేవి "ముందు రామావతారములో మునుపడిగిన కోరికకూ తమ్ముని యడవుల కిచ్చి చంప బంపితిరి" మీరనెను.

ఈ స్త్రీల పాటలకు గల ఛందస్సు మిక్కిలి సరళమైనది. సామాన్యముగా "తకకిటతక" అను అక్షరముల ఆవృతములు నాలుగేసి వుంటాయి ప్రతి పాదమునకు ఇకభాషఎంతో మధురంగా వుంటుంది. ప్రతి గృహములోను నిత్యకృత్యము లందు వాడుకునే సజీవభాష ఇందులో ప్రతి పదంలోను మనకు ద్యోతక మౌతుంది.

స్త్రీల గేయకథలు

వ్రతముల పాటలు. వ్రతములుఆచరించటము వలన కలుగు ఫలితమును ఈ పాటలు వ్యక్తం చేస్తాయి. శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారు "స్త్రీల వ్రతకథలు" అను పేరుతో నూరు కథలను సేకరించి ప్రచురించిరి. కామేశ్వరీ వ్రతమునకు సంబంధించిన పాట, శ్రావణ శుక్రవారములకు సంబంధించిన పాటల వంటివి, అందులో చాల వున్నవి. పెండ్లి గుమ్మడి గౌరినోములోని ఈ పాటను చూడండి—

"పెండ్లి గుమ్మడి గౌరి పేరక్క పట్టింది.
ఇండ్లు వాకిండ్లలో నెప్పుడు కళ్యాణాలె"

"తకటతక"అను ఎనిమిది ఆవృతాలలో ఈ పాట నడుస్తుంది. వీటిలో యతులు, ప్రాసలు తప్పకుండా వుంటవి. స్వభావోక్తితో యివి వినడానికి, పాడు కోవడానికి, అనువుగాను అందంగాను మలచబడి వుంటవి.

శ్రావణ మంగళ వారపు పాటలోని
"ఈశ్వర పుత్రునీ గజావతారునీ
పార్వతీ తనయుని భక్తితోను—"ఈపాటను తిలకిస్తే శైవ

వాతావరణమూ, శైవ సంప్రదాయమూ, బ్రాహ్మణపూజలు చక్కగా గోచరిస్తవి చాతుర్వర్ణ్యముల వారుఈ వ్రతములను చేసుకొనుటకు అనుకూలముగా వుండేట్లు ఈ పాటలు వ్రాయబడినవి.

గోవింద నామముల ప్రతిపాటను చూడండి. వీటిలో "కిట తకిట" అను రెండు ఆవృతాల పిమ్మట "గోవిందరామ" లేక "గోవిందా" అని విధిగా వచ్చి తీరుతుంది.

ఈ రామాయణ కథలను ప్రజలలో విరివిగా ప్రచారము చేయించటమే గోవిందనామముల ముఖ్యోద్దేశము

శాంతా గోవిందనామములు, శాంతాదేవి కథ, శ్రీ గోవింద నామములు, శ్రీ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల వివాహములను వర్ణించుతాయి.

ఈ రామాయణ కథలన్నిటి యందును సాధారణముగా మన గృహములలో వివాహ సందర్భముగా జరిగే తంతు నంతటినీ వర్ణించు చుంటవి. గనుక ఈ పాటలన్నియు స్త్రీలే రచియించి వుంటారని పెద్దలు ఊహిస్తున్నారు.

ఈ స్త్రీల పాటలన్నింటి యందును, చివరన విధిగా ఫలశ్రుతి ఉంటుందని ముందే చెప్పిఉన్న సంగతి గుర్తించనుకుంటాను.

పారిజాత పల్లవీ, గజేంద్ర మోక్ష కథా గీతము, వామన చరిత్రము, తులసీ దళము అను పేరుగల నాలుగు పాటలు గోవింద నామములకన్న కల్పనములోను, రచనా సంవిధానములోను కొంత ఉన్నత స్థాయి గల పురాణగాథలతో నిండిఉన్న మధురమైన పాటలు.

వస్తుకల్పనతో పాటు, భావకల్పనములో, శిల్పరచనా రీతిలో ఉన్నత స్థాయినందుకొన్న కథా కావ్యములు స్త్రీలపాటలలో ఎన్నియో గలవు. ఇవి రామాయణ గాథలతోను, శ్రీకృష్ణగాథలతోను, తదితర పెక్కు పురాణగాథలతోను నిండి యుండి హృదయాన్ని కదిలించ వేయగలవు.

ఈ స్త్రీల పాటలలో మన గృహ కృత్యములలో వుండే సామాన్యమైన కష్టసుఖములు, పోడుపోడుకులు మాత్రమే అధికముగా వర్ణింపబడినవి జీవితము నందలి క్లిష్టగ్రంథులను విడదీసి చెప్పటము ఈ పాటల ఉద్దేశ్యము కాదు ఆ క్లిష్ట సమస్యలు వారి మనస్సునకు అంతగా పట్టవు. గనుకనే సుకుమార హృదయులైన రచయిత్రులు భారత కథలకన్నను, రామాయణ కథల వైపే మొగ్గుచూపి, ఆయా ఘట్టముల నన్నింటిని పాటలుగా మలిచి మన కందించిరి. రామాయణము నందలి ప్రతి సన్నివేశమును, ప్రతి ఘట్టమును, పాటలుగా మలిచి ఆనందించిన ఆ రచయిత్రులే, భారతగాథ యందలి, ధర్మరాజు జూదమును ద్రౌపదీ మాన సంరక్షణమును కీచక వధ అనుమూడు సంఘటనలను మాత్రమే పాటలుగా మలిచి మనకందించి తృప్తినందిరి.

శ్రీకృష్ణలీలను, మహిమలను వర్ణించు పాటలు చాలగున్నవి. ఈ పాటలన్నింటి యందును శ్రీకృష్ణుడు మానవాతీతుడు. ప్రతిపాటలోను ఆ మహామహుని లీలావిహారములు అతివిచిత్రముగా వర్ణించబడినవి శ్రీకృష్ణపరమాత్మ బాలక్రీడలు, గోపికాస్త్రీల జలక్రీడలు వానిలోపేర్కొనదగినవి.

శ్రీకృష్ణుని జననము, శ్రీకృష్ణునిచల్దులు, కాళింది మడుగు, మొదలైన పాటలన్నియు ఆంధ్రదేశములో ఆబాలగోపాలము గానము చేస్తూనే వుంటారు.

ఆంధ్ర దేశములో వీరశైవమతము అధికముగా వ్యాపించిన పిమ్మట ఆ మత ప్రాశస్త్యమును ఉగ్గడిస్తూ రచయితలూ, రచయిత్రులూ, కోకొల్లలుగా పాటలను వ్రాసిరి.. వీరశైవమత విజృంభణమునకు ముందుగూడ మనదేశములో శైవపరమైన పాటలు, అధిక సంఖ్యలో వెలువడి ఎంతయో ప్రచారము నందుకొన్నవి. ఆ మత వ్యాప్తితో ఆ పాటల ప్రచారము తారస్థాయి నందినది.

నేడు మన ఆడపిల్లలు నోచుకొను నోములలో నూటికితొంభై పాళ్లు 'గౌరీ' నోములే "నోచిననోములకు గౌరితాకర్త"—దీనిని బట్టి ఈ పాటలు వీరశైవ మత ప్రచారముతో యెంత విరివిగా ప్రచారము నందుకొని అభివృద్ధి చెందాయో అర్థమవుతుంది.

పండితకవులు రచియించు నట్టిప్రబంధములలో నుండునట్టి అనవసరపు వర్ణనలుగాని, అతిశయోక్తులుగాని ఉండక ఈ స్త్రీల పాటలు, సహజ సుందరము గాను, ఆత్మానంద దాయకము గాను ఆహ్లాదజనకముగాను వుంటవి గనుకనే అవి దేశి సారస్వతమునకు మకుటాయమానములై వెలుగొందుచున్నవి.

స్త్రీల గేయ కావ్యములు

స్త్రీలపాటలలో కథాగేయములూ, గేయకథలూ మాత్రమేగాక, గేయ కావ్యములు గూడ కొన్ని గలవు.

కథా గేయములలో కథ ప్రబలగా వుంటుంది గేయ కథలలో పాట ప్రబలగా వుంటుంది. ఈ గేయ కావ్యములలో కథ పాటరెండు విడివిడిగా వుండక, ఒక దానితో మరొకటి పెన వేసుకొని వుండి మొత్తమురచనకు కావ్యత్వపు సిద్ధిని సమకూర్చిఆహ్లాదమును ఆనందమును ప్రసాదిస్తవి


సురాభాండేశ్వరము, అంబరీషుని చరిత్రము, రుక్మిణీదేవి పేవిళ్లు, దారుకావన విహారలీల మార్కండేయ చరిత్ర, కన్యకామ్మవారిపాట మున్నగుస్త్రీల గేయ కావ్యములు పరికించి చూచినచో మనకు ఈ సత్యము గోచరించును

అంబరీషచరిత్రములోని ఈ క్రింది పాటను చూడండి తెలుస్తుంది.

"బంగారుమేడలూ, పసిడికోటలునూ, పారేటికాలువలు
పద్మాల వరుసలు, అత్యంత అరియెడు హంసలూ, బలుకా,
గోవిందయని యెపుడు కోవిలలు బలుకా—" ఈ పాట చదువుతూ వుంటే అందమైన వైకుంఠపురము మనకు మనోగోచరమౌతుంది.

(సశేషం)

వార్తా ★ చిత్రాలు




రాష్ట్రపతి సెప్టెంబరు 25వ తేదీన
సాలార్ జంగ్ III విగ్రహాన్ని ఆవిష

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ అధ్యక్షులు శ్రీ ఎన్. భగవాన్‌దాస్, అంబికామిల్స్ మేనేజింగ్ డైరెక్టరు అక్టోబరు 3న, సంయుక్తంగా చేపట్టనున్న పరిశ్రమకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేస్తున్న చిత్రం.




వార్తా ★ చిత్రాలు



గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ అక్టోబరు 1వ తేదీన హైదరాబాదులోని జూబ్లీహాలులో పరిశ్రమల శాఖ అధికారుల సమావేశంలో ప్రసంగించినప్పటి చిత్రం

గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ సతీమణి సెప్టెంబరు 3వ తేదీన హైదరాబాదులోని సమకాలీన చిత్రకళా ప్రదర్శన మందిరంలో అమెరికాకు చెందిన వెల్లింగ్టన్‌లీ తీసిన ఛాయాచిత్రాల ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసినప్పటి దృశ్యం.



అమ్మ ఏడుస్తుంది

— జ్యోతిర్మయి

ఇది పదహారేళ్ళ క్రిందటిమాట
ఎక్కడో దూరాన చుక్క మెరిసింది
ఆశయాలను కాంతి కిరణాలతో నింపి
ఎక్కడో జయనాద ముద్భవించింది
ఐక్యతా భావనకు నాంది పలకాలంటు
ఎక్కడో యింపైన రాగముదయించింది
ప్రగతి పరచాలంటు కబురు చేసింది.
ఎప్పుడో......ఎక్కడో గురుతులేదన్నాను
ఎవ్వరో అన్నారు
ఎక్కడో కాదు... ఆ తోటలోనే
ఆ తెలుగు సీమలోనే
" ఒక్క కొమ్మకు రెండు పూలు విరిసాయి
ఒక అమ్మకు కవల పాపలు జనించారు
కొమ్మ వనమంతటికి విందు చేసింది
అమ్మ ఆనంద బాష్పాలు రాల్చింది.
అవును గుర్తొచ్చింది,
విన్నాను నేను—

ఒక్క కొమ్మకు రెండు పూలు విరిసాయి
ఒక్క అమ్మకు కవల పాపలు జనించారు
పల్లె, వీధి, వాడ పట్టణాలన్నీ
జయ నినాదాలతో మారు మ్రోగాయి
విజయ శంఖ ధ్వనులు మిన్ను ముట్టాయి
"పుట్టినప్పుడు పూల పరిమళం ఒక్కటే
తల్లి పంచిచ్చినది నెత్తురూ ఒక్కటే—
అప్పటికి జాతి భేదం వారు ఎరుగరు
కులమొకటి మతమొకటి అనుమాట లెరుగరు
తెలుపు నలుపుల తారతమ్యాలు లేవు
భాష వేర్వేరనే భావనే లేదు—
ఒకే పుట్టుక
కలిసి కట్టుగ
ఒకే జట్టున ఆడిపాడి
ఒకే నాదం, ఒకే గీతం, ఒకే జెండా ఎగురవేసి
పెరుగుతున్న ఉమ్మడి కుటుంబం,
పూర్తిగా పెరగనైనా లేదు
పసితనపు ఛాయలు, వదలనూ లేదు
అప్పుడే—పగ పడగ ఎత్తింది
పౌరుష జ్వాలలే నాల్కలు చాచాయి
కొమ్మ వసివాడుతూ వాలిపోయింది
అమ్మ కన్నీరు సెలయేరుగా పారింది
ఉసిగొల్పి బుసకొట్టు స్వార్థమో
లేక తామొకరి కన్నా ఒకరు ఎక్కువన్న భావమో
'సహ పొడను సహించలేని ద్వేషాలు పెరిగాయి '
భేదాభిప్రాయాల నీడలో
బ్రతుకు లిక సాగలే మంటాయి
" ఇక మాకొద్దు.........
మా జీవితాలిక వేరు—జెండాలు వేరు
బాటలే వేరు—ఇక భాషలూ వేరే
విడగొట్టు మమ్మలను వేరుపడి పోతాం"
—కొమ్మ వాడింది—అమ్మ ఏడ్చింది
' ఎక్కడో దూరాన చుక్క రాలింది
ఎక్కడో ఎందుకో కుక్క ఏడ్చింది
ఐక్యతా వీణ అపశ్రుతి పలికింది
కొమ్మ వాడుతున్నది
అమ్మ ఏడుస్తున్నది.

★

మహాభారతము

తెంపెగంటుల లక్ష్మణశాస్త్రి

సైంధవుడు ద్రౌపదిని మోహించుట

" ఈ విధముగా పాండవులు కామ్యకమునందు విహరించుచు నొకనాడు అయిదుగురు గూడ నాలుగు దిక్కులకు వేటకై వెడలి పోవుచు ఆశ్రమమునందు ద్రౌపది నొక్కదానినే విడిచి ఆ యాశ్రమమునకు అధిపతియైన 'తృణబంధు' మహామునికి, తమ పురోహితాచార్యుడైన ధౌమ్యునకును ద్రౌపదిని ఒప్పజెప్పి వేటకై బయలుదేరిరి.

ఆ సమయమునందే సింధు దేశమునకు రాజు వృద్ధ క్షత్రునకు పుత్రుడునైన జయద్రథుడు (సైంధవుడు) తన వివాహము కొరకు శాల్వ దేశము వైపు పోవుచుండెను. అనేక రాజుల పరివారముతో పోవుచున్న అతడు పాండవులున్న కామ్యక వనమునకు చేరెను. అచ్చట పాండవుల ప్రియ పత్నియైన ద్రౌపదిని చూచెను. ఆమె అతి సౌందర్యముతోను, అనుపమ కాంతితోను ప్రకాశించుచుండెను. ఆమె కాంతిచేత ఆ వనము మెరుపుచేత మేఘమువలె మెరయుచుండెను. అట్లు దేదీప్యమానముగా వెలుగుచున్న ఆమెనుచూచి ఆవచ్చినవారందరు " ఆహా! ఈమె అప్సరసయో, దేవకన్యయో లేక దేవతలు కల్పించిన ఒక మాయయో " అని ఆశ్చర్యపడి చేతులు జోడించుకొని ఆమెవైపే చూచుచుండిరి. అప్పుడు సైంధవుడు 'కోటికాస్యుడు' అను రాజుతో నిట్లనెను — " నీవు అక్కడికి పోయి ఈమె ఎవరి భార్యయో, మనుష్య స్త్రీ అవునో కాదో తెలిసికొనుము. ఈమెను నేను పొందగలిగినచో నాకు మరి ఏ స్త్రీతోను వివాహము చేసికొనుటకు ఇచ్ఛ ఉండదు. ఇంకనెవరు నాకు అక్కర లేదు. ఈమెనే తీసికొని నా యింటికి పోయెదను. ఈమె ఎవరి భార్యయో, ఎందులకు ఈ ఘోరమైన అడవికి వచ్చెనో తెలుసుకొని రమ్ము. కోటికా! ఈమె నాకు లభించిన యెడల నా కోర్కెలన్నియు తీరిపోవును." అది విని కోటికాస్యుడు వెంటనే రథమునుండి దిగి, వ్యాఘ్ర స్త్రీని నక్కవలె సమీపించి యిట్లు అడిగెను:—

" సుందరీ! ఈ యాశ్రమము నందు కడిమి చెట్టు కొమ్మను పట్టుకొని ఏకాకినివిగా నిలచియున్న నీ వెవతవు? రాత్రి అగ్నిశిఖ వాయువుచేత కంపింపబడినట్లు ఊగుచు వెలుగుచున్నావు. ఈ యడవిలో నీకు క్రూర మృగముల భయము లేదా? నీవు యక్ష కన్యవా? దానవ కన్యవా? అప్సరసవా? లేక మానవాకారముతో నున్న నాగ కన్యవా? దేవజాతికో ఎవతెవు? దేవలోకమునుండి భూలోకమునకు దిగిన దేవాంగనవలె ప్రకాశించుచున్నావు. మేము నీ పతినిగూర్చి, తండ్రిని గూర్చి ఆదరపూర్వకముగా తెలిసికొన గోరుచున్నాము. ఇక్కడేమి చేయుచున్నావు? నిక్కముగా చెప్పుము. నేను 'సురథుడు' అను రాజుయొక్క కుమారుడను. నా పేరు కోటికాస్యుడు. ఇదిగో! ఇక్కడ బంగారు రథమునందు కూర్చొని, హోమముచేత జ్వలించున్న అగ్నివలె వెలుగుచున్నవాడు 'క్షేమంకరుడు' అను పేరుగల త్రిగర్తదేశపు రాజు. అతని ప్రక్కగా గొప్ప ధనుస్సు, సుందర పుష్పమాలను ధరించి, నిన్ను ప్రేమతో చూచుచున్న వ్యక్తి పులిందరాజు పుత్రుడు. ఇచ్చట పుష్కరిణి సమీపమున శ్యామ వర్ణముగల నవయువకుడు ఇక్ష్వాకు వంశపు రాజైన 'సుబలుని' పుత్రుడు. ఇతడు ఏకాకిగానే శత్రువులందరిని సంహరించగల శక్తి గలవాడు. అదిగో అచ్చట ఎఱ్ఱటి గుఱ్ఱములను కట్టిన రథమునందు యజ్ఞాగ్నులవలె ప్రకాశించుచున్నవారు 'సౌవీర' దేశీయులైన పన్నెండుగురు రాజకుమారులు. రథము పైన ఒక చేతిలో ధ్వజము పట్టుకొని అనేక సైన్యములు అనుసరించగా వచ్చువాడు 'సౌవీర' దేశరాజు జయద్రథుడు (సైంధవుడు) ఆయన పేరు నీవు వినియుందువు. అతని సోదరులు గూడ అచ్చటనే యున్నారు. వీరితో కలిసి ఈ జయద్రథుడు దేవతలతో గూడిన ఇంద్రునివలె పోవుచున్నాడు చూడుము. నిన్ను గూర్చి కూడ మాకు చెప్పుము." ఆ మాటలు విని ద్రౌపది కడిమిచెట్టు శాఖను విడిచి తన ఉత్తరీయమును సవరించుకొని యిట్లు చెప్పెను :—

" రాజకుమారా! నావంటి పతివ్రత పరపురుషునితో మాట్లాడకూడదు కాని నావైపునుండి నీకు బదులుచెప్పుటకు ఇక్కడ మరియెవరు లేరు కాబట్టి విధిలేక నీకు చెప్పవలసి వచ్చినది. నేను ధర్మతత్పరురాలను, ఒంటరిగా ఇప్పుడు ఇక్కడ ఉన్నాను. నీవును ఒంటరివాడవే. కనుక ఇట్టి పరిస్థితిలో నీతో నేను ఎట్లు మాట్లాడగల్గుదును? నీవు సురథుని పుత్రుడయిన కోటికాస్యుడవని నాకు తెలియును. ఇప్పుడు నన్నుగూర్చి నా బంధుజనులగూర్చి నీకు తెలిపెదను. వినుము. నేను ద్రుపదపుత్రిని, నాపేరు 'కృష్ణ' అందురు. ఖాండవ ప్రస్థమునను౦డిన పంచపాండవులను పతులనుగా నేను వరించినాను. వారు ధర్మజ—భీమ—అర్జున—నకుల—సహదేవులు అను పేర్లు గలవారు. మొదటి ముగ్గురు కుంతీ పుత్రులు. తరువాతి యిద్దరు మాద్రీపుత్రులు.

నన్ను వారిక్కడ విడిచి వేటకై నలుదిక్కులకు పోయిరి. ధర్మరాజు తూర్పునకు, భీమసేనుడు దక్షిణమునకు, అర్జునుడు పడమటికి, నకుల సహదేవులు ఉత్తరమునకు వెడలినారు. ఇంతలోనే వారు తిరిగివచ్చెదరు. మీరు సపరివారముగ ఇక్కడ విడిదిచేయుడు. నా పతులు వచ్చి మీకు అతిథి సత్కారము చేసిన తరువాత వెడలి పోవచ్చును. మహాత్ముడైన ధర్మరాజు అతిథుల యెడల చాల ప్రేమ గలవాడు, మిమ్ము చూచి చాల సంతోషించగలడు." ఇట్లు చెప్పి ద్రౌపది పర్ణశాలలోనికి పోయెను వీరు తమకు అతిథులు, అని వారిపై విశ్వాసము ఉంచి ఆతిథ్యము కొరకు ద్రౌపది ఏర్పాట్లు చేయుచుండెను.

కోటికాస్యుడు తిరిగి పోయి సైంధవునకు ఆ సంగతి అంతయు చెప్పెను. అప్పుడతడు ఇట్లనెను "ఆ యువతి నీతో మాట్లాడుచున్నంతసేపు నా మనస్సు ఆమెయందే లగ్నమై యుండెను ఆమెను ఎందుకు తోడుకొనిరాలేదు, ఆమెను చూచిన తరువాత నాకు ఇతర స్త్రీలందరు కోతులవలె వికారముగా కనపడు చున్నారు. దర్శనమాత్రముతోనే ఆమె నా హృదయమును హరిం చెను. ఆమె మనుష్య స్త్రీ యేనా?" అని అడిగెను

కోటికాస్యుడు ఆమెను గూర్చి ఆమె పతులను గూర్చి వివరముగా తెలిపి 'ఆమెను నీవు హరించుకొని నీ దేశమునకు పొమ్ము' అని చెప్పెను. వెంటనే జయద్రథుడు తన ఆరుగురు తమ్ములతో పాటు సింహముయొక్క గుహలో తోడేలు వలె ఆమె యాశ్రమములో దూరెను 'సుందరీ! నీకు నీ పతులకు కుశలమా?' అని అడిగెను. ద్రౌపది కూడ అతనిని కుశల ప్రశ్నలు చేసి తమ కుశలమును తెలిపెను. 'ఈ పాద్యము స్వీకరించి ఈ ఆసనము నందు కూర్చొనుము' అని చెప్పెను. అది విని సైంధవుడు, "రమ్ము నా రథముపైన కూర్చొనుము. నీకు సర్వదా సుఖము కల్గును. రాజ్య భ్రష్టులై, దరిద్రులై అడవులలో తిరుగుచున్న పాండవులను. అనుసరించియుండుట నీకు తగదు. తెలివిగల స్త్రీలు ఎవరుగూడ సంపదపోగొట్టుకొనియున్న భర్తను అనుసరించియుండరు. భర్త దగ్గర ధనమున్నంతవరకే ఆతనితో కలిసియుండవలెను. అతడు నిర్ధనుడైన వెంటనే విడిచిపెట్టవలెను. పాండవులు శాశ్వతముగా రాజ్యభ్రష్టులై ధనహీనులైనారు. అట్టి వారిని భక్తి పూర్వకముగ ఉపాసించుచు నీవు కష్టములు అనుభవించవలసిన అవసరములేదు నాకు భార్యవు కమ్ము. నాతో గూడ సమస్త సుఖములు అనుభవించుము. సింధు, సౌవీరదేశములకు రాణివి కమ్ము" అని చెప్పెను ఆ మాటలు విని ద్రౌపది హృదయము కంపించి అచటి నుండి వెడలిపోవుచు 'ఈ విధముగా మాట్లాడుటకు నీకు సిగ్గులేదా?' అని అతనిని గర్హించెను. ఆమె ఏవో మాటలు చెప్పుచు కొంత కాలయాపన చేసి తన భర్తలు వచ్చువరకు వారిని అచ్చట నిలుపదలచి ఇట్లనుచు.

"ఓ వీరుడా! పాపపు మాటలను మాట్లాడకుము ఏ కార్యము ధర్మసంగతమో, న్యాయసమ్మతమో నీవు తెలిసికొనవలెను. నీవు పాండవులకు, దుర్యోధనాదులకు చెల్లెలైన దుశ్శలకు పతివి. రాజకుమారా! ఈ సంబంధము ద్వారా నీవు నాకు సోదరుడవు. కనుక నేను సంకటములలో చిక్కినప్పుడు సోదరుడవు నీవు నన్ను రక్షించుట మాని ఇట్లు పలుకుట నీకు తగదు నీవు ధర్మాత్ముల వంశములో పుట్టినావేకాని నీ దృష్టి ధర్మమువైపు లేదు." ఆ మాటలు విని సింధురాజు "ద్రౌపదీ! నీవు రాజధర్మమును ఎరుగవు. ఈ ప్రపంచమునందు స్త్రీలు, రత్నములు సాధారణముగ అందరకు అనుభవించదగిన వస్తువులు అని చెప్పెను"

ద్రౌపది నీతి బోధ

సైంధవుని మాటలు విని ద్రౌపది యొక్క ముఖము కన్నులు క్రోధముచే ఎఱ్ఱబడెను. కనుబొమలు ముడిపెట్టి అతనిని తిరస్కరించుచు మరల నిట్లనెను. "మూర్ఖుడా! నా పతులైన పాండవులు మహా యశస్సంపన్నులు. ఎప్పుడును ధర్మమునందే స్థిరముగా నిలిచియుందురు, ఇంద్రునితో సమానులు. యక్ష రాక్షసులనుగూడ క్షణములో నిర్జించగలవారు వారి క్రోధము విషసర్పమువలె అతి భయంకరము, అట్టి వారిని తిరస్కరించి మాట్లాడుటకు నీకు సిగ్గు గలుగదా? మంచివారెవరును, తపస్సంపన్నులు, విద్వాంసులు నయిన వారిని గూర్చి, వారు వనములో నున్నను గృహస్థులైనను: అనుచితముగా మాట్లాడరు. జయద్రథా! మనుష్యులలో కుక్కల వలె ఉన్న నీవంటి వారే ఈ విధముగా మాట్లాడెదరు. పాతాళమునందు పడిపోవుచున్న నిన్ను ఉద్ధరించగలవాడు క్షత్రియులలో నెవడును లేడు. మూర్ఖా! హిమాలయమునందు విహరించుచు పర్వత శిఖరము వలె ఉన్నతముగా నున్న మదగజమును చిన్న కఱ్ఱ పట్టుకొని గజ యూథము నుండి వేరు పరచుటకు ప్రయత్నించుచున్న మూర్ఖునివలె నీవిప్పుడు ధర్మరాజును జయించ గోరుచున్నావు ఇంతకన్న తెలివి తక్కువ వాడు ఎవడు ఉండును? నిద్రబోయిన మహా సింహమును తన్ని దాని ముఖము నుండి వెంట్రుకలను ఊడబెఱుకు చున్నావు, ఇది నీ వినాశమునకు హేతువు. కోప పూరితుడైన భీమసేనుని నీవు చూచినచో వెంటనే పారిపోయెదవు. భయంకరముగా యుద్ధము చేయు అర్జునునితో నీవు పోరాడ దలచుట, పర్వతగుహలలో పుట్టి పెరిగి అచట నిద్రించుచున్న క్రూర భయంకర సింహమును కాలితో తన్నుట. నీవు నకుల సహదేవులతో యుద్ధము చేయ తలచుట కోరలలో ఘోరవిషమును ధరించి రెండు నాలుకలతో బుసకొట్టుచున్న రెండు భయంకర సర్పముల తోక త్రొక్కు నట్లున్నది. అరే మూర్ఖుడా! వెదురు, అరటి చెట్టు, 'నలము' (కీకసపు గడ్డి) అనెడు తృణవిశేషము తన వినాశము కొరకె ఫలించును. అభివృద్ధికొరకు కాదు. ఎండ్రకాయ గర్భము ధరించుట దాని వినాశమునకే యైనట్లు నీ నాశము కొరకే నీ హృదయములో పాండవులచే రక్షింప బడుచున్న నన్ను అపహరించు తలంపు కలిగి యున్నావు". ఆ మాటలు విని జయద్రథుడు ఇట్లనెను.

'ద్రౌపదీ! నీ పతులు వీరులైన పాండవులని నాకు తెలియును. ఈ విధముగా నన్ను బెదరించ జాలవు. మేము పదియేడు గుణములచే పరిపూర్ణమైన ఉత్తమ కులము నందు జన్మించిన వారము. ఆ గుణములు, "కృషికర్మ, వాణిజ్యము, కోటలు, వంతెనలు నిర్మిం

చుట, గజ బంధనము, గనుల రక్షణము, పన్నులు తీసికొనుట, నిర్జన ప్రదేశములను జన పదములుగా మార్చుట, వేరు పడిన వారిని కలుపుట, ప్రభుశక్తి, మంత్ర శక్తి, ఉత్సాహ శక్తి, ప్రభుసిద్ధి, మంత్రసిద్ధి, ఉత్సాహసిద్ధి, ప్రభుఉత్పత్తి, మంత్రోత్పత్తి, ఉత్సాహోత్పత్తి, అనునవి" ఈ పదునేడు గుణములే కాక మరి ఆరు ఇతర గుణములను కూడా పొంది యున్నాము, అవి, శౌర్యము, తేజస్సు ధైర్యము, దాక్షిణ్యము, దానము, ఐశ్వర్యము", అనునవి. ఈ ఇరువది మూడు గుణముల చేత మేము పాండవులకన్న ఎన్నియో రెట్లు అధికులము. అందుచేత మేము వారిని హీనులనుగా తలంచెదము.

ద్రౌపదీ! గొప్ప గొప్ప మాటలు కల్పించి చెప్పి మమ్ము మా కార్యము నుండి ఆపజాలవు. ఇప్పుడు నీకు రెండే మార్గములు ఉన్నవి. "వెంటనే సరళముగా నీవు పోయి నా రథము నందు కూర్చొనుము. లేదా! పాండవులు నాచేత ఓడిపోయిన తరువాత దీనురాలవై దుఃఖించుచు ఈ జయద్రథుని దయా భిక్షనైనను వేడుకొనుము".

ఈ మాటలు విని ద్రౌపది యిట్లనెను. "మూర్ఖుడా! నేను మహా శక్తి సంపన్నురాలను. నీ దృష్టిలో దుర్బలురాలనుగా కన బడుచున్నాను, నాకు భగవంతునిపై విశ్వాసము కలదు. నీవు నిర్బంధించి నంత మాత్రమున నీ యెదుట ఎప్పుడు కూడా దైన్యము వహించను. కృష్ణార్జునులు రథముపైన కూర్చుని నన్ను అన్వేషించుటకు వెడలినపుడు, ఇంద్రుడు గూడ నన్ను అపహరించు కొని పోజాలడన్నగా మనుష్య మాత్రుడవైన నీవంటితుచ్ఛుని మాట ఎంత? అర్జునుడు క్రోధాగ్నితో నీ సేనలో దూరినపుడు నీవు నీ సేన ఎండు గడ్డివలె ఆ యగ్ని చేత భస్మము కాగలరు. అంధక-వృష్ణి వీరులతో శ్రీ కృష్ణుడు నాకు రక్షకుడుగ నున్నాడు. వారందరు నన్ను వెదకుటకు బయలు దేరెదరు. అర్జునుడు గాండీవము ధరించి నీపైన పడినప్పుడు గాని నీవు పశ్చాత్తాప పడవు. అప్పుడు గాని నీ మనస్సు క్షోభ జెందదు. భీముడు, నకుల-సహదేవులు నిన్ను తరిమి కొట్టుచున్నప్పుడు గాని నీవు సంతాపము జెందవు. పాండవులు నిన్ను పట్టుకొని భూమిపైన ఈడ్చుకొని రాగలరు. నీవు క్రూరుడవు. నన్ను బలాత్కారముగా లాగుకొని పోయెదవు. అంతమాత్రము చేత నేను భయపడను. నన్ను నా పతులు తిరిగి ఇచ్చటికి తోడ్కొని వచ్చెదరని నాకు పూర్తి విశ్వాసము గలదు."

ఇట్లు ద్రౌపది చెప్పుచుండగనే సైంధవుని యనుచరులు ఆశ్రమములో ప్రవేశించి ద్రౌపదిని పట్టుకొని తీసికొని పోదలచుచుండిరి. అప్పుడు ద్రౌపది "జాగ్రత్త సుమా! నన్ను ఎవరును తాకకూడదు" అని చెప్పి బిగ్గరగా అరచుచు తన పురోహితుడైన ధౌమ్యాచార్యులను పిలిచెను. ఇంతలోనే జయద్రథుడు ముందుకు వచ్చి ద్రౌపది కొంగు పట్టుకొనెను. ఆమె అతనిని దృఢముగా కొట్టి నెట్టెను. అంతతో ఆపాపిష్టుని శరీరము తూలి క్రిందపడెను. అతడు లేచి మరల ఆమెనుపట్టుకొనెను. అప్పుడు నిట్టూర్చుచూఆమె ధౌమ్యుని చరణములకు నమస్కరించెను. కాని అగతికురాలై జయద్రథుడు ఈడ్వగా అతని రథముపైగూర్చుండెను. అప్పుడు ధౌమ్యుడు "జయద్రథా! నీవు పాండవులను జయించక యీామెను తీసికొని పోవు అధికారము నీకులేదు. పాండవులు నీ యెదుట పడిన ప్పుడు నీ దుష్కార్యఫలమును అనుభవించ గలవు. ఇందులో సందేహము లేదు. అని చెప్పి అపహరింప బడుచున్న రాజపుత్రిని కొంత దూరము అనుసరించిపోయెను.

తరువాత పాండవులు అడవియందు అనేక మృగములను వేటాడి తిరుగుచు ఐదుగురు ఒక చోట చేరిరి. అప్పుడు వన్య మృగములు మిక్కిలి భయభ్రాంతములై ఆర్త నాదములు చేయుచుండెను. అదివిని ధర్మరాజు తన తమ్ములతో నిట్లనెను.

"తమ్ములారా! ఈ మృగములన్నియు తూర్పు దిక్కునకు పరుగెత్తుచు కఠోరముగా శబ్దించుచున్నవి. ఈ ధ్వని అతిభయంకరమైన ఉత్పాతమును సూచించుచున్నది. ఈ విశాలమైన వనము మన శత్రువుల చేత పీడింపబడుచున్నట్లు తెలియుచున్నది. కాబట్టి అతి శీఘ్రముగా మనము ఆశ్రమమునకు పోవలెను. నామనస్సు వికలమగుచున్నది. చింత హృదయమును దహించుచున్నది. నాకు భయముగుచున్నది. గరుడ పక్షి సరస్సులో నున్న మహా సర్పమును పట్టుకొని పోగా సరస్సుక్షోభించినట్లు, రాజులేని రాజ్యము కాంతిహీనమైనట్లు, త్రాగుబోతులు మద్యరసము నంతయు పానము చేసిన తర్వాత వట్టిపోయిన కడవవలె, శత్రువులచేత నశింపజేయబడిన కామ్యక వనము కూడ దురవస్థకు పాల్పడియున్నది"

తర్వాత పాండవులు వాయువేగముతో పరుగెత్తి పోవుచున్న గుఱ్ఱములు గల రథమునందు తమ ఆశ్రమము వైపు పోవుచుండిరి. అప్పుడు ఒకనక్క ఏడ్చుచు వారికి యెడమ భాగముగా ఉరుకుచు పోయెను. ఈ అపశకునమును చూచి యుధిష్ఠిరుడు భీమార్జునులతో నిట్లనెను :—

"ఈ నక్క మన వామ భాగముగా పరుగెత్తుచు అరుచుటను బట్టి పాపిష్ఠులైన కౌరవులు ఇక్కడికివచ్చి మనను అవమానపరచి హఠాత్కారముతో గొప్ప హింసకు తలపెట్టినట్లు నాకు తోచుచున్నది" ఇట్లు అనుకొనుచు వారు ఆశ్రమమునకు రాగానే ద్రౌపది దాసి యేడ్చుచుండుటను చూచిరి. అది చూచి సారథియైన 'ఇంద్రసేనుడు' వెంటనే రథమునుండి దూకి ఆ దాసి దగ్గరకుపోయి యిట్లనెను :—

నీవు ఎందుకు ఏడ్చుచున్నావు ? ఎవరైన క్రూరులువచ్చి ద్రౌపదిని తిరస్కరించిరా ఏమి ? ఇప్పుడే ధర్మరాజు మహాకోపముతో తమ్ములతోపాటు ఆమెను వెదకుటకు పోవదలచినాడు. ఆమె భూమిలోగాని, స్వర్గమునుండిగాని, సముద్రములోగాని కొనిపోబడినప్పటికిగాని పాండవులు తప్పక ఆమెను వెదకి తెచ్చెదరు. శత్రువుల మానమును మర్దించువారును, ఎవరికిగూడ ఓడిపోవని వారును అన్ని విధములైన క్లేశములను సహించువారును నైన పాండవుల ప్రాణ సమానమైన ఉత్తమ స్త్రీ రత్నమును ఎంత మూర్ఖుడైనను అపహరింపగలడా ? ఆమె పాండు పుత్రుల బహిః ప్రాణముగదా! తన పతులతో ఈ వనమునందామె యున్నదెవరికి తెలియదు? ఇట్టి అపరాధము చేసినవాని శరీరమునుండి దూసికొని

పోయి పాండవుల బాణములు భూమిలో దూరకుండునా? నీవు భయపడకుము. ద్రౌపది కొంతసేపు దుఃఖ పడకుము ఇప్పుడే పాండవులు ఈ శత్రువులందరిని సంహరించి ద్రౌపదిని తప్పక యిక్కడికి తెచ్చెదరు." ఆ మాటలు విని దాది కన్నీళ్లను తుడుచుకొని సారథి యింద్రసేనునితో నిట్లనెను :—

"ఇంద్ర సమానులైన యీ పంచ పాండవులకు అవమానము చేయుచు జయద్రథుడు బలాత్కారముగా ద్రౌపదిని అపహరించి తీసికొనిపోయెను. అతడు సైన్యముతో పోవగా ఏర్పడిన యీ నూతన మార్గము చెదరక అట్లేయున్నది, ఇప్పుడిప్పుడే విరిగి పడిన చెట్లు అట్లేవాడిపోకున్నవి చూడుము" తరువాత ఆ దాది పాండవుల దిక్కు చూచి యిట్లనెను :—

"పాండు పుత్రులారా! మీ రథములను వెనుకకు మరలింపుడు. ఈ శత్రువులను శీఘ్రముగా వెన్నంటి పట్టుకొనుడు. ద్రౌపది యిప్పుడు ఎంతో దూరము పోయియుండదు. త్వరగా మీరు ఎపుడు ధరించు అమూల్య ధనుస్సులు, బాణములు తీసికొని శత్రువులను వెన్నంటుడు. మీరు జాగుచేసినచో ఆమెను శత్రువులు బెదరించి దండించి ఎక్కువ బాధించినచో ఆమె దిక్కులేక శుష్కించిన ముఖముగలదై, తన దేహమును అనర్హుడైన పాపికి ఒకవేళ అర్పించినను అర్పించవచ్చును. అట్లు సంభవించకముందే మీరు అక్కడికి పొండు.

"ఒకవేళ ద్రౌపది పాపాత్ముని చేతిలో చిక్కినచో అప్పుడు పవిత్రమైన నేయితో నిండిన 'స్రుక' (యజ్ఞములో హోమసాధనమైన కొయ్యగరిటె)ను బూడిదలో విడిచినట్లగును; హవిస్సును, పొట్టులో రాజుచున్న అగ్నిలో వేసినట్లు నిష్ఫలమగును; దేవతా పూజకై కూర్చబడిన పుష్పమాలికను శ్మశానములో వేసినట్లగును; యజ్ఞశాలలో హోమము కొరకు ఉంచబడిన పవిత్ర సోమలతారసమును, అట్టి ఋత్విక్కుల అజాగ్రత్తచేత ఒక కుక్క నాకినట్లగును; కారడవిలో తిరుగుచు అపవిత్రమైన క్షుద్ర జంబుకము (నక్క), ఒక పవిత్రమైన తామర కొలనులో మునిగి ఆ సరస్సును అపవిత్రము చేసినట్లగును. కనుక మీరు అత్యంత దురంతమైన సంకటము ఆమెకు సంభవించక మునుపే అక్కడికి వేగముగా చేరుకొనుడు.

"అతి సుందరము, చంద్రబింబ సమానమునగు మీ ప్రియురాలి ప్రసన్న వదనమును, నీచమైనకుక్క 'పురోడాశము' (యజ్ఞములో హోమార్థము ఉంచబడిన రొట్టె)ను ముట్టినట్లు, ఎవడైన పాపిష్ఠుడు స్పృశించగలడు సుమా! కనుక మీరు ఈ మార్గము గుండానే పోయి శత్రువులను వెన్నంటిపొండు. మీ అమూల్యమైన సమయమును ఇక్కడ వ్యర్థము చేయగూడదు." ఆ మాటలు విని యుధిష్ఠిరుడిట్లనెను :—

"మంగళకరురాలా! ఇక్కడి నుండి తొలగిపొమ్ము. నోరు మూయుము. మా యెదుట నీవు ద్రౌపది విషయమునందు ఇట్టి కఠోరములు, అనుచితములైన మాటలు మాట్లాడకుము. తన బలదర్పముచేత ఇట్టి నీచ కార్యమును చేసినవాడు రాజైనను, రాజ కుమారుడైనను సరే వాడు తన మాన ప్రాణములను అవశ్యముగా పోగొట్టుకొనగలడు."

ఇట్లు చెప్పిన ధర్మరాజును అనుసరించి పాండవులు సర్పములవలె బుసకొట్టుచు, తమ ధనుస్సులను భూమిపైన మాటిమాటికి పొడుచుచు ఆ మార్గముగుండానే బహువేగముగా ముందుకు సాగిపోయిరి.

సైంధవ పరాభవము

అప్పుడు వారికి సైంధవుని అశ్వ సేన యొక్క గిట్టల తాకిడిచే రేగిన దుమ్ము కనబడెను. దానితో పాటు కాల్బలము మధ్యలో నడచుచున్న ధౌమ్యాచార్యులు కనబడెను. ఆయన మాటిమాటికి 'భీమసేనా! పరుగెత్తుము' అని అరచుచుండెను అది విని పాండవులు ధౌమ్యాచార్యులను ఊరడించుచు. 'మీరు నిశ్చింతగా పోవుచుండుడు, మేము వచ్చి చేరినాము' అని చెప్పిరి. తరువాత వారలు డేగ పక్షిమాంసము పైకి పరుగెత్తునట్లు సైంధవుని సేన పైకి వేగముగా పరుగెత్తిరి.

'జయద్రథుడు ద్రౌపదిని హరించి తీసుకొని పోయినాడు.' అను మాట విన్నంత మాత్రముననే క్రోధావిష్టులైన పాండవులు ప్రత్యక్షముగా ద్రౌపది సైంధవుని రథమునందు కూర్చొనియుండుట చూచిన వెంటనే వారి కోపాగ్ని భగ్గున మండి ఆకాశమునకు జ్వాలలు ఎగసెను. అప్పుడు ఏక కంఠముతో బిగ్గరగా వారు అరచుచుండిరి. ఆ ధ్వని వినుచున్న శత్రుసైనికులు దిక్కుతోచక బెదరుచు చెదరుచుండిరి.

తరువాత ఆ యడవిలో భీమార్జునులను చూచిన క్షత్రియ వీరులలో పెద్ద కోలాహలము బయలుదేరెను. భీమార్జునుల ధ్వని వినిన జయద్రథునకు ఉత్సాహము పోయి ద్రౌపదితో, ఈ వెనుక వచ్చుచున్న ఐదు రథములను నీవు చూచుచున్నావుగదా! అవి నీ పతుల రథములే అయియుండవచ్చును. వారిలో ఒక్కొక్కరిని గూర్చి నాకు తెలుపుము. అని యడిగెను. ఆ మాట విని ఆమె యిట్లనెను.

"మూర్ఖుడా! నీ ఆయువును నశింపజేయు క్రూరకార్యమును చేసి యిప్పుడు ఈ పాండవులను గూర్చిన పరిచయ వాక్యములతో నీకేమి పని. మహావీరులైన వీరందరు నా పతులే. వీరితో యుద్ధము చేయునట్టి నీ వీరులందరు ఒక్కడు గూడ మిగులకుండ నశించి పోగలరు. నేనిప్పుడు సోదరసహితుడైన ధర్మరాజును నా యెదుట చూచుచున్నాను. కనుక నాకు దుఃఖముగాని, నీ భయముగాని లేదు. ఇప్పుడు త్వరగా చావబోవుచున్నావు. గనుక ఇట్టిసమయములో నీవు నన్ను అడిగిన ప్రశ్నమునకు బదులు చెప్పుట ఉచితమైన ధర్మము. కనుక నేను నా పతుల పరిచయమును చెప్పెదను". అనియిట్లు ద్రౌపది చెప్పదొడగెను,

[సశేషము]

జిల్లాలు

నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు విక్రయించడానికి గుంటూరు మిల్లర్ల అంగీకారం

గుంటూరు జిల్లా కలెక్టరు, శ్రీ కె. జయభారతరెడ్డి, సెప్టెంబరు 1 న గుంటూరులో నూనెమిల్లర్లు, నూనె టోకు వ్యాపారస్థులు, పప్పు మిల్లర్లు, టోకు వ్యాపారస్థుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేరుశెనగనూనె కిలో రు. 7.90, అవిశెనూనె కిలో రు. 7.90 కందులు కిలో రు. 1, మినుములు రు. 1.60 ల చొప్పున విక్రయించడానికి మిల్లర్లు, డీలర్లు అంగీకరించారు.

5 ఆశ్రమ పాఠశాలలకు రూ. 1.20 లక్షలు మంజూరు

ఖమ్మం జిల్లా అశ్వారావుపేట పంచాయతీ సమితి సమావేశం యిటీవల జరిగింది. సమితి అధ్యక్షులు శ్రీ కె. వి. రామారావు అధ్యక్షత వహించారు. కొత్తూరు, గుట్టుగూడెం గ్రామాలలో రు. 18,000ల చొప్పున ఖర్చుతో రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను వాణిజ్య పంట పర్టినియా పెంపకానికి రు. 14,000లు, 5 ఆశ్రమ పాఠశాలల నిర్వహణకు రు. 1.20 లక్షలు, సమితి ప్రాంతంలో 42 చిన్నతరహా నీటి వనరుల నిర్వహణకు రు. 18,000 మంజూరుచేశారు.

ప్రకాశం పంతులుగారి కోడలుకు నెలసరి భత్యం

ప్రకాశం జిల్లా కలెక్టరు, శ్రీ టి.ఆర్. ప్రసాద్ యిటీవల ఒంగోలులో జరిగిన ఒక ఉత్సవంలో కీ. శే. టంగుటూరి ప్రకాశం పంతులుగారి కోడలు శ్రీమతి టంగుటూరి అన్నపూర్ణాదేవికి మొదటి విడతగా మంజూరైన నెలసరి భత్యం రు. 200లను అందజేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శాసన సభ్యులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు.

క్రీడా సంస్థలకు ఆర్థిక సహాయం

నెల్లూరు జిల్లా కలెక్టరు, శ్రీ కె. ఓబయ్య, యిటీవల నెల్లూరులో క్రీడా వారోత్సవాల ముగింపు సమావేశానికి అధ్యక్షత వహిస్తూ జిల్లాలో వివిధ క్రీడా సంస్థలు చూపుతున్న ఉత్సాహానికి శ్రద్ధకు తమ హర్షాన్ని వ్యక్తంచేశారు. ఈ సంస్థ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి సాధ్యమైన సహాయం అందజేస్తామని ఆయన హామీ యిచ్చారు. ఆ తర్వాత వివిధ ఆటల పోటీలలో నెగ్గిన విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతకు ముందు జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీ ఎస్. వెంకటస్వామి ప్రసంగించారు.

మెదక్ జిల్లాపరిషత్తు సమావేశంలో శ్రీ నరీన్ ప్రసంగం

గవర్నరు సలహాదారు, శ్రీ హెచ్.సి. సరీన్, యిటీవల సంగారెడ్డిలో జిల్లా పరిషత్తు సమావేశంలో ప్రసంగిస్తూ నాగార్జున సాగర్, పోచంపాడు, శ్రీశైలం వంటి పెద్ద ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తున్నదని అన్నారు. ఈ దృష్టితోనే కరువు సహాయక నిధి నుండి పోచంపాడు ప్రాజెక్టు పనికి రూ. 180 లక్షలు ఖర్చు చేస్తారు. హరిజన ఇండ్ల కాలనీలను గూర్చి శ్రీ సరీన్ ప్రస్తావిస్తూ యీ సంవత్సరం 600,000 యిండ్లు నిర్మించడానికి మరో రూ. 10 కోట్లు మేరకు ఋణం పొందడానికి ఎల్.ఐ.సి తో సంప్రదింపులు జరుపుతూ వున్నామని అన్నారు. సర్వీసు విషయాలను ప్రస్తావిస్తూ అక్టోబరు 15 నాటికి 90 శాతం కేసులను పరిష్కరించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. మెదకు జిల్లాలో త్వరలోనే ప్రత్యేకంగా వాణిజ్య పన్నుల కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారని హామీ యిచ్చారు.

తాగరపల్లిలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

గవర్నరు సలహాదారు, శ్రీ హెచ్ సి. సరీన్ మెదకు జిల్లా రాగరపల్లి గ్రామంలో యిటీవల 40 యిండ్లతో కూడిన హరిజన యిండ్ల కాలనీకి ప్రారంభోత్సవం చేస్తూ, హరిజన, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు జరుపుతున్నదని అన్నారు. ప్రయోజనం పొందిన హరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

మెదకుజిల్లా కలెక్టరు, శ్రీ ఎస్. వేములు ప్రసంగిస్తూ జిల్లాలో బడుగు వర్గాల సంక్షేమానికి చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలను గూర్చి వివరించారు.

అంతకు ముందు గవర్నరు సలహాదారు సంగారెడ్డి పండ్ల పరిశోధన లేబరెటరీకి ప్రారంభోత్సవం చేశారు. ఈ పరిశోధనాలయంలో 310 మామిడి రకాల చెట్లను పెంచుతున్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన శాసన సభ్యులు, శ్రీ పి. రామచంద్రారెడ్డి ప్రసంగిస్తూ పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మంజీరా నీటి సరఫరా పథకానికి శ్రీ సరీన్ శంకుస్థాపన

శ్రీ హెచ్. సి. సరీన్, యిటీవల మంజీరా నీటి సరఫరా పథకం రెండవ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ

పథకం అమలుకు రూ. 12 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. 1975వ సంవత్సరం నాటికి యీ పని పూర్తి అవుతుంది.

671 ఋణాల మంజూరీ పత్రాల పంపిణీ

శ్రీ హెచ్.సి. సరీన్, యిటీవల సంగారెడ్డిలో నిరుద్యోగులైన విద్యావంతులకు స్వయం ఉపాధికల్పన పథకం క్రింద 671 ఋణాల మంజూరీ పత్రాలను పంపిణీచేశారు. రిక్షా డ్రైవర్ల సంఘానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. రిక్షా డ్రైవర్లకు 21 సైకిల్ రిక్షాలను పంపిణీచేశారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టరు శ్రీ నరేంద్రలూథర్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

పోలీసు గృహాలకు శంకుస్థాపన

పోలీసు ఇనస్పెక్టరు జనరల్, శ్రీ అబ్దుల్‌స్సలామ్ ఖాన్, యిటీవల తిరుపతిలో రు.5 లక్షల ఖర్చుతో నిర్మించే పోలీసుల గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ పోలీసులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించడానికి వీలుగా వారికి ఆరోగ్యకరమైన నివాస పరిస్థితులు కల్పించడానికి పోలీసుల గృహనిర్మాణ కార్పొరేషన్ బృహత్తర పథకాన్ని ప్రారంభించినదని అన్నారు.

నిరుద్యోగ పశువైద్య పట్టభద్రులకు ఆర్థిక సహాయక పథకాలు

గుంటూరుజిల్లా పశువైద్యశాఖాధికారి, శ్రీ పి.వి. కామేశ్వరరావు యిటీవల గుంటూరులో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశువైద్య శాలలను ప్రారంభించడానికి షెడ్యూలు బ్యాంకుల నుండి నిరుద్యోగ పశువైద్య పట్టభద్రులకు రు.5,000 ల మేరకు ఆర్థిక సహాయం యిస్తారని తెలియజేశారు. అభ్యర్థులకు నెలకు రు. 250 ల చొప్పున స్టయిపండు యిస్తూ మూడు నెలల పాటు శిక్షణ యివ్వడం జరుగుతుంది.

వర్కింగ్ జర్నలిస్టుల వార్షిక సమావేశం

కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ కె. రఘునాథరెడ్డి యిటీవల కొత్తగూడెంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ 18వ వార్షిక సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ మూడవ వేతన నిర్ణయిక సంఘాన్ని ఏర్పాటుచేసే విషయాన్ని ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నదని, నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తారని అన్నారు. వార్తా పత్రికల అభివృద్ధికి కారకులైన వర్కింగ్ జర్నలిస్టులను తొలగించవద్దని వార్తా పత్రికల మేనేజిమెంటుకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సింగరేణి బొగ్గు గనుల సంస్థ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ కె. విద్యాసాగర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శ్రీ బి. నాగేశ్వరరావు ప్రసంగించారు.

32 చెంచు కుటుంబాలకు రూ. 3200- ల సహాయం

మహబూబ్‌నగర్ జిల్లా, కొల్లాపూర్ శాసన సభ్యులు శ్రీ కె.రంగదాసు, యిటీవల కొల్లాపూర్ సమితిలోని మాలచింత పల్లికి చెందిన 32 చెంచు కుటుంబాలకు గుడిసెలు వేసుకోడానికి రూ. 3,000/- ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కుటుంబాలకు యిదివరకే యిండ్ల స్థలాలను ఉచితంగా కేటాయించారు.

సింహాచలంలో రు. 6.8 లక్షల ఖర్చుతో మార్కెటు అభివృద్ధి పథకం

దేవాదాయ, ధర్మాదాయశాఖ కమీషనరు శ్రీ కె. వాసుదేవరావు యిటీవల సింహాచలంలో రు. 6.8 లక్షల ఖర్చుతో కూడిన మార్కెట్ అభివృద్ధి పథకం అమలుకు శంకుస్థాపనచేస్తూ యాత్రిక కేంద్రం అభివృద్ధికి పథకాలు చేపట్టాలని సింహాచలం దేవస్థానం ట్రస్టీల బోర్డు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం క్రింద 40 దుకాణాలు 20 సత్రపు గదులతో కూడిన మూడు బ్లాకులను నిర్మిస్తారు. వచ్చే సంవత్సరం మార్చి ఆఖరునాటికి నిర్మాణం పని పూర్తి అవుతుంది.

విశాఖపట్నం పోర్ట్‌ట్రస్ట్ అధ్యక్షులు, శ్రీ బి.కె. రావు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ సింహాచలం అభివృద్ధికి కలక్టరు సాధ్యమైన కృషిని చేస్తున్నారని అన్నారు.

కలక్టరు శ్రీ అచంట ప్రసంగిస్తూ విశాఖపట్నం నగరం మధ్యభాగంలో నిర్మిస్తున్న ప్రార్థన—సమాచార కేంద్ర భవనాన్ని వెంటనే దేవస్థానానికి యిస్తున్నారని అన్నారు. ప్రహ్లాద ప్రార్థనా మందిరంగా పిలువబడే యీ భవనం రు. 5 లక్షలు విలువ చేస్తుంది.

హరిజనుడు సర్పంచ్‌గా ఎన్నిక

కృష్ణా జిల్లా గండేపల్లి గ్రామపంచాయతీ సమితి హరిజన సభ్యులు శ్రీ తలమల చిన్నప్ప సెప్టెంబరు 18 న గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

కడప, కరీంనగర్‌లలో మహిళా కళాశాలలు

కడప, కరీంనగర్ జిల్లాల్లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించ దలచుకొన్న విద్యార్థినుల సంఖ్య హెచ్చుగా వున్నందున, వారికొరకు ప్రత్యేకంగా మహిళా డిగ్రీ కళాశాలలు తెరవవలసిన అవసరం ఎంతైనా వున్నదని ఆ జిల్లా ప్రజలు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశారు. ఈ రెండు జిల్లాల్లోనూ ప్రస్తుతం మహిళలకొరకు డిగ్రీ కళాశాలలు ఆరంభించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో ఉన్నత విద్యనభ్యసించదలచిన విద్యార్థినుల అవసరాలను యీ రెండు కళాశాలలు తీర్చగలవని ప్రభుత్వం ఆశిస్తున్నది.

రాష్ట్రీ కార్పొరేషన్‌కు రూ. 7½ కోట్లు కాంట్రాక్టు లభ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నిర్మాణాల సంస్థ అనే పేరుతో ప్రభుత్వ రంగంలో 1973 జులై 5 వ తేదీన ఒక కార్పొరేషన్‌ను స్థాపించింది. కొత్తగా ఏర్పాటైన కార్పొరేషన్ అప్పుడే రూ 760 85 ల విలువగల కాంట్రాక్టును సంపాదించింది పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణంలో సహాయం అందజేస్తున్న ప్రపంచ బ్యాంకు పోచంపాడు ప్రాజెక్టు కాలవకు లైనింగు పనిని ఆరంభించడానికి యీ కార్పొరేషన్‌ను ఎంపిక చేసింది. మూడవ సారిగా పిలిచిన టెండర్లలో అయిదు టెండర్లు వచ్చాయి ఈ కార్పొరేషన్ అందజేసిన టెండరు మిగిలిన వాటికంటె తక్కువగా వుంది.

నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ఇతర ప్రముఖసంస్థలను భవనాలనుండి లాభం పొందేవుద్దేశంతోను యీ సంస్థ కలకత్తాలోని హిందూస్థాన్ స్టీల్‌వర్క్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కలిపి ఉమ్మడిగా యీ టెండరును చేపట్టింది. ఈ కలకత్తా సంస్థ భారత దేశంలో అనేక భారీపనులను నిర్వహించిన సంస్థ. టెండరు ప్రకారం ఇప్పటి పోచంపాడు ప్రాజెక్టు పనిలో దీనివాటా 10 శాతం వుంది.

క్రమ శిక్షణ నేర్పాలని ఉపాధ్యాయులకు ఉద్బోధ

ప్రకాశం జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల హెడ్ మాస్టర్ల మూడు రోజుల రాష్ట్ర వ్యాప్త విద్యా విషయిక సమావేశాలు ఒంగోలులో సెప్టెంబరు 16 న ముగిశాయి. జిల్లా కలక్టరు శ్రీ టి. బి. ప్రసాద్ సమావేశంలో ప్రసంగిస్తూ విద్యార్థులలో క్రమ శిక్షణ అలవడేవిధంగా చూడాలని హెడ్ మాస్టర్లను కోరారు.

3 కల్యాణమండపాలు, ఓరియంటల్ కళాశాల భవనాలకు రూ. 20 లక్షల మంజూరు

తిరుమల-తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు సమావేశం యిటీవల తిరుమలలో జరిగింది. చిత్తూరు జిల్లా కలక్టరు శ్రీ ఎం. వల్లియప్పన్ అధ్యక్షత వహించారు. తిరువానూరు కాళహస్తిలలో రెండు కల్యాణ మండపాల నిర్మాణానికి రూ 5 లక్షలు మంజూరు చేశారు. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఓరియంటల్ కళాశాల భవనాల నిర్మాణానికి బోర్డు రూ 15/-లక్షలు మంజూరు చేసింది.

మువ్వ పంచాయతీ సమితి సమావేశము

కృష్ణా జిల్లా మువ్వ పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశం సెప్టెంబరు 20 న మువ్వలో జరిగింది. పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ తుమ్మల వెంకట సుబ్బయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమావేశంలో సమీక్షించారు. 1972–73 వ సం. సమితి పరిపాలనా నివేదికను ఆమోదించారు. రామనగరం సమీపంలో దిల్లల వాగుపై రు. 19,000 ల ఖర్చుతో వంతెన నిర్మించాలని తీర్మానించారు.

డి. ఇ. ఒ. శ్రీ కె. సత్యనారాయణ ప్రసంగిస్తూ యిటీవలి సంవత్సరాలలో విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణలనుగూర్చి వివరించారు.

కేరళ కవుల ప్రతినిధివర్గం తిరుపతి సందర్శన

కేరళకు చెందిన ప్రముఖ కవులతో కూడిన ప్రతినిధివర్గం తిరుపతి సందర్శించి ప్రాచ్యభాషా ప్రొఫెసర్లను, స్థానిక కవులను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కళాశాలలో కలుసుకున్నారు. తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య జి ఎన్. రెడ్డి ప్రతినిధులకు స్వాగతం చెబుతూ యీ విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేటు స్థాయిలో దక్షిణ భారత భాషల అధ్యయనాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు.

కాలికట్ విశ్వవిద్యాలయం మలయాళభాషా శాఖ అధ్యక్షుడు ఆచార్య సుకుమార్ ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుభాష అభివృద్ధికి తెలుగు అకాడమీ క్రమపద్ధతిలో కృషిచేస్తున్నందుకు ఆయన ప్రతినిధుల తరఫున జోహారు లర్పించారు. డిగ్రీస్థాయిలో తెలుగును ప్రవేశపెట్టి ఆంధ్రప్రదేశ్, కేరళకన్నా చాలా ముందడుగు వేసిందని ఆయన అన్నారు. కేరళలో డిగ్రీస్థాయి వరకు మాత్రమే మలయాళ భాషను ప్రవేశ పెట్టారని అన్నారు.

మధిరలో స్వయం ఉపాధి పథకానికి ప్రారంభోత్సవం

ఖమ్మం జిల్లా కలక్టరు శ్రీ గులామ్ జిల్లానీ, గత సోమవారం నాడు మధిరలో విద్యావంతులయిన నిరుద్యోగులు ప్రారంభించిన స్వయం ఉపాధి పథకానికి ప్రారంభోత్సవం చేశారు.

ఈ పథకంక్రింద ఒక బుక్‌స్టాల్, సైకిల్‌స్టోర్స్, నూలు అద్దకం విక్రయశాల, కిరాణా దుకాణం, ఫ్యాన్సీ స్టోర్, సైకిల్ విడిభాగాల దుకాణం, ఏర్పాటు చేశారు. లంబాడా మెట్రిక్యులేట్లు యీ కార్యక్రమంచేపట్టారు. వాటికి మొత్తం పెట్టుబడి రూ. 37,000 మధిరలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు వారు రూ. 30,600 లు మంజూరు చేయగా, పరిశ్రమల శాఖ రూ. 3,200 లు మంజూరు చేసింది. దరఖాస్తుదారులు రూ. 3,200 లు తమవాటాగా పెట్టుబడి పెట్టారు.

మధిర పంచాయతీ సమితిలో రు. 100 లక్షల పెట్టుబడితో 52 స్వయం ఉపాధి పథకాలను అమలు జరుపుతున్నారు.

ఖమ్మంలో శాస్త్ర విజ్ఞాన ప్రదర్శన

రిటైర్డ్ జిల్లా కలక్టరు శ్రీ పి వెంకటేశ్వరరావు ఖమ్మంలో యిటీవల మూడురోజులపాటు జరిగే శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనకు ప్రారంభోత్సవంచేస్తూ యిటువంటి ప్రదర్శనవల్ల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన డి. ఇ. ఒ శ్రీ ఎం శ్రీకాంతం ప్రసంగిస్తూ విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంలో ప్రోత్సాహం కల్పించడానికి యివి ఏర్పాటు చేయబడినాయని అన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి రూ. 14,0000/-లు మంజూరు

కడపజిల్లా పులివెందుల పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశం యిటీవల జరిగింది. సమితి ఉపాధ్యక్షులు శ్రీ డి రంగారెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. ముద్దనూర్లోని కాలనీలో పాఠశాల భవన నిర్మాణానికి రూ 14,000/-లు. బ్రాహ్మణపల్లి నుండి కొత్తపల్లివరకు రోడ్డు నిర్మాణానికి రూ. 20,000 లు సమావేశంలో మంజూరు చేశారు. 1972-73 వ సం పరిపాలనా నివేదికను సమావేశంలో ఆమోదించారు

గోదావరిఖనిలో అభివృద్ధి కార్యక్రమాలు

కరీంనగర్ జిల్లా మంథెన పంచాయతీ సమితిలోని గోదావరి ఖని జన్నారంలో సెప్టెంబర్ 19న అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లా కలెక్టరు శ్రీ వి కె. శ్రీనివాస్ గ్రామములో క్లినిక్కు, కుమారిమంగళం చౌకుకు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ వై. పంతారెడ్డి స్థానిక గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. మంథెన పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ పి. కిషన్‌రావు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు.

సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఏజంటు, శ్రీ ఎం. వి రామమూర్తి విద్యానగర్ ప్రాథమిక పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. వాసిరెడ్డి సీతాదేవి బాల్వాడి కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. పెదపల్లి ఆర్. డి. ఒ శ్రీ పి మురళీధర రావు గ్రామంలోని 23 మంది హరిజనులకు యిండ్ల పట్టాలను పంపిణీ చేశారు.

అదేరోజు మంథెన పంచాయతీ సమితి సర్వ సభ్య సమావేశం జరిగింది.

తమ పిల్లలకు చదువు నేర్పించాలని గిరిజనులకు ఉద్బోధ

విశాఖపట్నం జిల్లా అనంతగిరి గిరిజన పంచాయతీ సమితి లోని బొర్రి గ్రామంలోనున్న ఆశ్రమ పాఠశాలలోని పది మంది గిరిజన బాలబాలికలకు ఇటీవల 400 రు. విలువచేసే 20 దిన్ని బ్లాంకెట్లు 20 జంపఖానాలు సరఫరా చేశారు. సమితి అధ్యక్షుడు శ్రీ డి. సన్యాసి దొర దుస్తులు పంపిణీ చేస్తూ ప్రభుత్వం సమకూర్చే సౌకర్యాలను వినియోగించుకొని, తమ పిల్లలకు చదువు నేర్పించాలని ఉద్బోధించారు.

కొబ్బరి తోటల అభివృద్ధి పథకం క్రింద ఉత్తమ కృషికి బహుమతి

విశాఖపట్నం జిల్లాలో ప్రారంభించబడిన కొబ్బరి తోటల అభివృద్ధి పథకం క్రింద వెండితో చేసిన పూర్ణ కలశం బహుమతిని జిల్లా కలెక్టరు శ్రీ యస్ యిన్. ఆచారి ఏర్పాటు చేశారు. కొబ్బరి తోటల అభివృద్ధి పథకం క్రింద కృషిచేస్తున్న అనధికార, అధికార సభ్యులందరు యీ బహుమతి పొందడానికి అర్హులౌతారు.

అన్నవరం పంచాయతీ సమితిస్థాయీ సంఘాల సమావేశాలు సమితి ప్రెసిడెంటు శ్రీ దంతులూరి వెంకట జగన్నాథ రాజుగారి అధ్యక్షతను బెండపూడిలో అక్టోబరు 9 వ తేదీన జరిగాయి

దానాయిపేట ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చడానికి ఈ స్థాయీ సంఘాలు ఒక తీర్మానంలో అంగీకరించాయి.

అప్పలపురం, కొత్త పెదమల్లాపురం ప్రాథమిక పాఠశాలలను కలిపి ఒకే పాఠశాలగా నిర్వహించడానికి కూడా ఈ కమిటీలు ఆమోదించాయి

సమావేశాల అనంతరం, అన్నవరం సమితి అధ్యక్షులు శ్రీ డి వి జగన్నాథరాజుగారు మాట్లాడుతూ దానాయిపేట ప్రజలు ప్రాథమికపాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చడానికిగాను మూడు ఎకరాల పొలాన్ని, మూడువేల రూపాయిల విరాళాన్ని యివ్వడానికి అంగీకరించినట్లు తెలియజేశారు. ఈ విధంగా విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినందుకు ప్రజలను శ్రీ జగన్నాథరాజుగారు అభినందించారు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బంది అసోసియేషన్ బెండపూడి విభాగం

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బంది అసోసియేషన్ బెండపూడి విభాగం సర్వసభ్య సమావేశం శ్రీ యన్. మరిడయ్య అధ్యక్షతన అక్టోబరు 8 వ తేదీన జరిగింది

ఈ సంఘానికి జరిగిన ఎన్నికలలో శ్రీ యన్. మరిడయ్య అధ్యక్షులుగా, శ్రీ ఎం. ఎస్. సాంబశివరావు ఉపాధ్యక్షులుగా, శ్రీ కె జి. శంకరశర్మ కార్యదర్శిగా, శ్రీ సి. హెచ్. రాజరత్నం సంయుక్త కార్యదర్శిగా, శ్రీ జి. సుబ్బారావు కోశాధికారిగా, శ్రీ ఎస్. నారాయుడు, శ్రీ కె. నరసింహమూర్తి కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

1972-73 సంవత్సరం రివైజ్డు బడ్జెట్టును, 1973-74 బడ్జెట్టు అంచనాలను, 1972-73 సంవత్సరం ఆడిట్టు రిపోర్టు, వార్షిక నివేదికను కూడా సభ ఆమోదించింది.

చేనేత కార్మికుల సహకార సంఘం

నెల్లూరు జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య అక్టోబరు 7 వ, తేదీన సౌత్ మోపూరు గ్రామములోని చేనేత కార్మికుల సహకార సంఘ నూతన భవనప్రారంభోత్సవం చేశారు.

సమావేశానికి సమితి అధ్యక్షులు శ్రీ రాచూరెడ్డి దశరథరామరెడ్డి అధ్యక్షత వహించారు.

సమావేశములో మాట్లాడుతూ కలెక్టరు గ్రామములో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామస్థులను అభినందించి స్వయం కృషి ద్వారా ఇంకను ఇతోధిక సౌకర్యములను ఏర్పాటు చేసికొనవచ్చునని ఉద్బోధించారు.

1961 సం॥ నుండి పని జరుగుచున్న కనుపూరు కాలువ పథకమును వెంటనే పూర్తిచేయించి కాలువ ప్రాంతపు రైతుల పొలములకు నీరు లభ్యమగునట్లు సహాయపడవలసిందిగా శ్రీ దశరథ రామ రెడ్డిగారు తన అధ్యక్షోపన్యాసములో కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు

రైతు సమ్మేళనం

అక్టోబరు 9వ తేదీన నెల్లూరుజిల్లా వెంకటాచలం సమితి రైతు సమ్మేళనము వెంకటాచలంలో స్థానిక ప్రాథమిక పాఠశాల భవనములో జరిగింది.

సమితి ప్రాంతములోని గ్రామములనుండి పంచాయతీల అధ్యక్షులు రైతులు అధికసంఖ్యలో సమ్మేళనములో పాల్గొన్నారు.

సమ్మేళనానికి శ్రీ దశరథరామిరెడ్డి అధ్యక్షత వహించారు.


శ్రీ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ, సమితిలో ఇప్పుడు సాగుచేసిన విస్తీర్ణములో దాదాపు 80 శాతము పొలాలలో మొలగొలుకులు వరి పైరు నాటినారనీ మొలగొలుకులు వరి పైరువేసిన పొలాలకు గూడా వెంటనే రసాయనిక ఎరువులను సరఫరా చేయించాలి అని అన్నారు

రైతుల యిబ్బందులను గురించి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టరు సానుభూతితో విన్నారు సాధ్యమైన మేరకు సహాయ పడతామన్నారు.

ఈ సంచికలోని రచయితలు

శ్రీయుతులు......

ఎస్. భగవాన్‌దాస్, ప్రధాన కార్యదర్శి, సచివాలయం, హైదరాబాదు
కె. వీరాస్వామి, ఎ. పి. పి. ఎస్. సి., హైదరాబాద్.
వావిలాల గోపాలకృష్ణయ్య, సత్తెనపల్లి, గుంటూరుజిల్లా.
జి. సురమౌళి, 2-2-186/3, అంబర్‌పేట, హైదరాబాద్.
బోయి భీమన్న, ఐ సి 85, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాద్.
కిర్లపాలెం కుటుంబశాస్త్రి, సెయింట్ అన్నెస్ పాఠశాల ఎదురుగా, రామచంద్రపురం, హైదరాబాద్-32
మాధవరావు దేశ్‌పాండే, కోటగిరి(పోస్ట్), నిజామాబాద్ జిల్లా
సిద్దాని నాగభూషణం, బి. ఎ. పి. ఆర్. ఒ, అన్నవరం, తూ. గో. జిల్లా.
ఎ. పండరీనాథ్, ఉపాధ్యాయుడు, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ జిల్లా.
కామఋషి సత్యనారాయణ వర్మ, పేర్రాజుపేట, కాకినాడ, తూ. గో. జిల్లా.
ముదిగొండ వీరభద్రమూర్తి, 13-6-675, కార్వాన్‌సాహు, హైదరాబాద్-6.
ఎం. చంద్రశేఖరయ్య, డి. పి. ఆర్. ఒ., చిత్తూరు.
బి. వెంకటరామారావు, ప్రధానోపాధ్యాయుడు, జడ్. పి. హైస్కూల్, ఉప్పల్ (కలాన్), హైదరాబాద్-39
కె. ఎస్. ఎస్. శేషన్, లెక్చరర్, బీసెంట్ థియోసాఫికల్ కాలేజి, మదనపల్లె.
యర్రమిల్లి చలపతిరావు 'శ్రీవత్సవ' చౌదువాడ. (వయా) గోవాడ, వైజాగ్ జిల్లా.
శ్రీమతి కె. రామలక్ష్మి, 1, శివప్రకాశ్ మొదలి స్ట్రీట్, మద్రాస్-17
శ్రీమతి వేదవతీదేవి, 122-826/1/15, ఎల్. ఐ. సి. కాలనీ, మెహదీపట్నం, హైదరాబాద్-28
జ్యోతిర్మయి, 127/2 ఆర్. టి, విజయనగర్ కాలనీ, హైదరాబాద్-28.
ఎ. సూర్యప్రకాశ్, ఎమ్. ఎ. బి. ఇడి., లెక్చరర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి, ఆర్మూరు, నిజామాబాద్ జిల్లా.
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాద్-4.
కోట కమలాదేవి, 3-4-526/12 బర్కత్‌పురా హైదరాబాద్.
జి. వి. రామమూర్తి, 177/2 ఆర్. టి., విజయనగర్ కాలనీ, హైదరాబాద్-28.
బండి సుదర్శనం, బి. ఎ. పి. ఆర్. ఒ, నరసంపేట, వరంగల్లు
పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, లెక్చరర్, గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి, ఖమ్మం.


SEEDS
వ్యవసాయదారులు
బ్యాంక్ ఆఫ్ బరోడాలో
మీకు అన్ని రకముల
అప్పులు లభిస్తాయి
బ్యాంక్ ఆఫ్ బరోడా మీకు వీటికి డబ్బు అప్పు యిస్తుంది: విత్తనములు, ఎరువులు, పనిముట్లు, ఉపకరణములు, గొట్టపునూతులు, పంప్‌సెట్లు, పంట కాలవల అభివృద్ధి, పొలముల అభివృద్ధి, తొట్టిలలో యిళ్లు, పాల అభివృద్ధి కేంద్రము, కోళ్ల పెంపకము, మత్స్య కేంద్రము మరియు పందుల పెంపకపు యూనిట్లు మొదలైన వాటికి. మీ రాబడిని అధికము చేసుకోగలరు!
• సరసమైన వడ్డీ రేట్లు।
• తేలికైన అప్పు తీర్చే ఒప్పందములు
సహకార సంఘముగా ఏర్పడిన వ్యవసాయ దారుల సమూహము కూడ బ్యాంక్ అఫ్ బరోడా వ్యవసాయ అప్పులను తీసుకోగలరు.
BANK OF BARODA
సిరిసంపదలకు అక్షయపాత్ర
బ్యాంక్ ఆఫ్ బరోడా
(జాతీయము చేయబడిన ఒక ఘనమైన బ్యాంకు)
భారతదేశములో మరియు విదేశములలో— యు.కె., తూర్పు ఆఫ్రికా, మారిషస్, ఫిజీ ద్వీపములు మరియు గయానాలో—700 పైగా బ్రాంచీలు కలవు.
Shilpi BOB 20/73 Tel

